## షెర్లక్ హోమ్స్ పరిశోధనలు

# అడ్వెంచర్స్ ఆఫ్ షెర్లక్ హోమ్స్-1

### సర్ ఆర్తర్ కానన్ డాయ్ల్




అనువాదం : కె.బి.గోపాలం

సర్ ఆర్థర్ కానన్ డాయ్ల్

రచన

# ద అడ్వెంచర్స్ ఆఫ్ షెర్లక్ హోమ్స్

## మొదటి భాగం





# ద అడ్వెంచర్స్ ఆఫ్ షెర్లక్ హెూమ్స్

## మొదటి భాగం

రచన

సర్ ఆర్తర్ కానన్ డాయ్ల్

అనువాదం

కె.బి.గోపాలం

క్రియేటివ్ లింక్స్ పబ్లికేషన్స్

హైదరాబాద్

**The Adventures of Sherlock Holmes-1**
**Sir Arthur Conan Doyle**

*Translation*
**K.B.Gopalam**
vijayagopalk@gmail.com

*First Edition:* **June, 2016**

Copies : 1000

Price : **Rs. 100/-**

*Cover Page, Layout :*
**AVM Graphics**

*Published by :*
**CREATIVE LINKS PUBLICATIONS**
1-8-725/A/1, 103C, Balaji Bhagyanagar Apartments,
Nallakunta, Hyderabad - 500044.
Ph: 9848065658, 9848506964.



# రచయిత గురించి

సర్ ఆర్తర్ కానన్ డాయ్‌ల్ (1859 నుంచి 1930) స్కాట్లాండ్‌లోని ఎడిన్‌బరోలో పుట్టారు. అక్కడే వైద్య విద్యను అభ్యసించారు. 1882 ప్రాంతంలో వైద్యంతో పాటు ఆయన రచనలను కూడా మొదలుపెట్టారు.

1887లో సర్ డాయ్‌ల్ ప్రఖ్యాత డిటెక్టివ్ షెర్లక్ హోమ్స్, అతని మిత్రుడు, మార్గదర్శి అయిన డాక్టర్ వాట్సన్ పాత్రలను ప్రపంచానికి పరిచయం చేశారు. ఆ పాత్రలు చిరస్థాయిగా ప్రపంచమంతటా పాఠకుల మనస్సులలో నిలిచిపోయాయి.

డాయ్‌ల్, 'ద ఫైనల్ ప్రాబ్లమ్' అన్న రచనలో షెర్లక్ హోమ్స్ చనిపోయినట్టు రాశారు. కానీ ప్రపంచమంతటా పాఠకులు విపరీతంగా విమర్శలు చేసిన కారణంగా ఆ పాత్రను రచయిత తిరిగి బతికించి మరెన్నో కథలను కొనసాగించారు.

షెర్లక్ హోమ్స్ పరిశోధనల క్రమంలో నాలుగు నవలలు, 65కు పైగా కథలు ఉన్నాయి. ఈ కథలు నాలుగు సంపుటాలుగా వచ్చాయి. మొదటి సంపుటం, అడ్వెంచర్స్ ఆఫ్ షెర్లక్ హోమ్స్‌లోని మొత్తం 12 కథలలోని మొదటి ఆరు కథలు ఈ సంపుటంలో ఉన్నాయి.

## ఈ సంపుటంలో..


| | | | |
|---|---|---|---|
| 1. | ఎ స్కాండల్ ఇన్ బొహీమియా | .... | 1 |
| 2. | ఎర్ర తలల సంఘం | .... | 43 |
| 3. | ఎ కేస్ ఆఫ్ ఐడెంటిటి | .... | 77 |
| 4. | ద బోస్కోంబ్ వాలీ మిస్టరీ | .... | 102 |
| 5. | ద ఫైవ్ ఆరెంజ్ పిప్స్ | .... | 140 |
| 6. | వంకర పెదవి మనిషి | .... | 170 |

అడ్వెంచర్స్ ఆఫ్ షెర్లక్ హొమ్స్

# మొదటి భాగం

# ఎ స్కాండల్ ఇన్ బొహీమియా

షెర్లక్ హొమ్స్ దృష్టిలో ఆమె ఒక ఆడమనిషి మాత్రమే. అతను ఆమెను గురించి మరొక మాటతో చెప్పడం నేను వినలేదు. అతని దృష్టిలో ఆమె స్త్రీజాతికంతటికీ ప్రతీక. అట్లాగని ఐరీన్ ఆడ్లర్ పట్ల అతనికి ప్రేమలాంటి భావం ఉందనుకుంటే తప్పే. భావాలు, అందునా ప్రేమలాంటివి అతనికి అస్సలు పట్టవు. అతని మెదడు చాలా సమతూకం రకం. ఈ ప్రపంచంలో పరిశీలనకు, కార్యకారణాలను వెతకడానికి ఒక యంత్రమంటూ ఉంటే, అందులో అన్నిటికంటే గొప్పది అతని రూపంలో ఉందనవచ్చు. ప్రేమ విషయంలో మాత్రం అతని పరిస్థితి మరొకరకంగా ఉంటుంది. మెత్తని భావాలను గురించి అతను వెటకారంగా తప్ప మాట్లాడి ఎరుగడు. పరిశీలనలో మాత్రం భావాలకు చోటు ఉంటుంది. ఎదుటివారి పనులకు వారి మనసులోని సంగతులకు అవి మంచి సూచనలుగా ఉపకరిస్తాయి. కానీ, శిక్షణ పొందిన కార్యకారణ విశ్లేషకుడుగా తన భావాలను బయటపెట్టకుండా ఉండడం అతనిలోని గొప్ప లక్షణం. అతని మెదడులోనికి మరెవరయినా తొంగి చూడగలిగితే, అంతకన్నా అవమానకరమయిన విషయం మరొకటి ఉండదని అనుకుంటాడేమో. ఇన్ని జరిగినా, అతని జీవితంలో ఒక స్త్రీకి చోటు దొరికింది. ఆమే ఐరీన్ ఆడ్లర్!

ఈమధ్యన నేను హొమ్స్‌ని కలవలేదు. నా పెళ్లి కారణంగా మా

ఇద్దరి మధ్యన దూరం పెరిగింది. నేను పూర్తి ఆనందంగా ఇంటినే పట్టించుకుంటూ బతుకుతున్నాను. నాకంటూ ఒక ఇల్లు, కుటుంబం వచ్చినందుకు నా ధ్యాసంతా వాటి చుట్టే తిరుగుతున్నది. హెూమ్స్ విషయంలోమాత్రం అతని బొహీమియన్ ఆత్మ ఇటువంటి విషయాలను దూరంగా పెడుతుంది. కనుకనే అతను బేకర్ స్ట్రీట్‌లోని మా లాడ్జింగ్‌లో పుస్తకాలలో మునిగి బతుకుతున్నాడు. కోకెయిన్ మత్తులో తేలి యాడుతున్నాడు. అతనికింకా నేరపరిశోధనపట్ల ఆకర్షణ తగ్గనే లేదు. తనలోని శక్తియుక్తులను, విశేషమయిన పరిశీలనాశక్తిని క్లూలను వెదకడంలోనే వాడుతున్నాడు. పోలీసువారు తమకు అంతుచిక్కక వదిలిన రహస్యాలను అతను ఛేదిస్తున్నాడు. అప్పుడప్పుడూ అతని విజయాలను గురించి తెలుస్తూ ఉంటుంది. ట్రెపాఫ్ హత్యకేసు విషయంలో, ట్రింకోమలీలో అట్కిన్‌సన్ బ్రదర్స్ గురయిన దురంతం విషయంలో అతను చూపించిన సునిశిత మేధాశక్తి తెలియవచ్చింది. హాలండ్ రాజదంపతుల విషయంలోనూ అతనలాగే చేయగలిగాడు. అతని గురించి అందరిలాగే దినపత్రికలలో, ఇటువంటి విషయాలు చదవడంతప్ప నా ఒకప్పటి మిత్రుడు, సహజీవి గురించి ఏమీ తెలుసుకోవడం లేదనే చెప్పాలి.

ఒకరాత్రి - 1888, మార్చి 12వ తేదీ అది - నేను ఒక పేషెంట్‌ను చూడడానికి వెళ్లి తిరిగి వస్తున్నాను. అంటే నేను నా వైద్యవృత్తిని తిరిగి మొదలుపెట్టానని. దారిలో బేకర్ స్ట్రీట్ గుండా రావలసివచ్చింది. బాగా తెలిసిన ఆ తలుపు ముందుగా వస్తుంటే, నా మెదడులోకి స్టడీ ఇన్ స్కార్లెట్‌లోని సంఘటనలు దూసుకుని వచ్చాయి. హెూమ్స్‌ని పలకరించాలని బల మయిన భావం కలిగింది. అతని మహత్తరమయిన శక్తియుక్తులను వాడుతున్న సందర్భాలను గురించి వినాలనిపించింది. అతని గదిలో వెలుగు నిండి ఉంది. పైకి చూచాను. అతని నీడ అటు ఇటూ తిరుగుతూ కనిపించింది. అతని గదిలో ఆత్రంగానూ, వేగంగానూ తిరుగుతున్నాడు. తలముందుకు



వాల్చి చేతులను వెనక పట్టుకుని తిరుగుతున్నాడు. అతని మానసిక పరిస్థితులను గురించి బాగా తెలిసిన నాకు విషయం అర్థమయింది. అతను మళ్లీ ఏదో కేసులో మునిగాడని తెలుసు. కొకెయిన్ మత్తులోనుంచి మేల్కొని అతను కొత్త సమస్యను గురించి ఆలోచిస్తున్నాడు. నేను బెల్ మోగించాను. వెంటనే ఒకప్పుడు నా నివాసం కూడా అయిన ఛాంబర్‌లోకి కాలుపెట్టాను.

అతని తీరు అదోరకంగా ఉంది. మామూలుగా అట్లా ఉండడు. అయినా అతనిలో నన్ను చూచినందుకు కలిగిన సంతోషం అర్థమయింది. ఒక్కమాట కూడా అనకుండా కంటి సైగతో నన్నతను కుర్చీలో కూచోమన్నాడు. సిగర్‌ల పెట్టెను నా ముందుకు తోసాడు. అవసరమయిన స్పిరిట్‌కేస్‌లాంటి వాటివేపు సైగ చేశాడు. ఆ తరువాత అతను మంటముందు వెళ్లి నిలబడి, సహజమయిన తన ధోరణిలో నా వేపు పరిశీలనగా గమనించసాగాడు.

"నీకు పెళ్ళి జరగడం బాగా నప్పింది. ఏమంటావ్ వాట్సన్? ఏడున్నర పౌండ్లు బరువు పెరిగావు" అన్నాడు అతను.

"ఏడే!" నేను జవాబిచ్చాను.

"అవునవును. నేను ఇంకొంచెం ఆలోచించవలసింది. కొంచెమంటే కొంచెమే. మళ్లీ మన పద్ధతులు ఉన్నాయిగా. నీవు వృత్తిలోకి తిరిగి దిగుతున్నానని నాతో అననే లేదు."

"అది నీకెలా తెలిసింది?"

"కనబడుతూనే ఉంది. మన పద్దతి ఉందిగదా! ఈ మధ్యన బాగా తడుస్తున్నావు. ఇక మీ యింట్లో పనిచేసే అమ్మాయి చాలా ముతక, నిర్లక్ష్యం రకమని కూడా."

"మైడియర్ హోమ్స్, ఇది విపరీతంగా ఉంది. నీవుగాని కొన్ని శతాబ్దాల ముందు పుట్టి ఉంటే నిన్ను కాల్చి చంపేవారు. నేను గురువారంనాడు ఊరిబయటి ప్రాంతాలలో నడిచి తిరిగినమాట నిజమే. అక్కడ చాలా చితచితగా ఉంది. దుస్తులు మార్చుకున్నాను.అయినా నీవు పట్టేశావు. ఎట్లాగో తెలియదు. ఇక మేరీ జేన్ సంగతి. ఆమె నిజంగా విచిత్రమయిన మనిషి. మా ఆవిడ అప్పుడే ఆమెకు నోటీసు ఇచ్చింది కూడా అయినా మళ్లీ అదే ప్రశ్న. ఇదంతా నీకు ఎట్లా అర్థమయింది?"



అతను తనలో తాను నవ్వుకున్నాడు. పొడుగాటి చేతులను తన పద్ధతిలో రుద్దు కున్నాడు.

"ఇదంతా సింపుల్. నా కళ్లు పరిశీలించాయి. నీ ఎడమకాలిజోడు మీద, ఆరుగాట్లు మంట వెలుగులో కనిపించాయి. అంటే జోళ్లకు అంటుకున్న మట్టిని తొలగించడానికి ప్రయత్నం చేసిన మనుషులు మరీ మొరటురకం అని అర్థం. ఒక విషయంలోనుంచి

మరిన్ని విషయాలను లాగే మన డిడక్షన్ పద్ధతి ఉందిగదా. దాని ప్రకారం చూస్తే నీవు వాన వాతావరణంలోకి వెళ్లావని తెలిసింది. ఇక మీ యింట్లో బూట్లను గోకే రకం పనిమనుషులు ఉన్నారని కూడా అర్థమయింది. ఇక నీ ప్రాక్టీస్ సంగతి అంటావా, ఇంట్లోకి వచ్చిన పెద్దమనిషి అయోడోఫామ్ వాసన కొడుతున్నాడంటే, కుడిచేతి చూపుడువేలిమీద నైట్రేట్ ఆఫ్ సిల్వర్ వల్ల పడిన నల్లని మచ్చ ఉందంటే, ఇంకా తలమీద టోపీలో స్టెతస్కోప్‌ను రహస్యంగా దాచినచోట అంటే కుడివేపున ఉబ్బెత్తుగా కనపడుతున్నదంటే, నిన్ను ప్రాక్టీస్‌చేస్తున్న వైద్యుడుగా గుర్తించకపోతే నేను పనికిరానివాడి కింద లెక్కవుతాను" అన్నాడు అతను.

అతను సంగతులను పసిగట్టిన తీరూ, వాటిని వర్ణించిన పద్ధతి గమనించిన తరువాత నవ్వకుండా ఉండలేకపోయాను. "కారణాలను నీవు వివరిస్తున్నప్పుడు వింటూ ఉంటే, అంతా చాలా సింపుల్ అనే అనిపిస్తుంది. నేను కూడా ఈ సంగతులను చెప్పగలను అనిపిస్తుంది. కానీ, వాటిని నీవు వివరించిన తరువాత ఆలోచన మరోరకంగా ఉంటుంది. అయినాసరే, నా కళ్లు కూడా నీ కళ్లకు సాటిగా వస్తాయనే అనుకుంటాను" అన్నాను.

"నిజమే" అతను జవాబుగా అన్నాడు, ఒక చుట్ట వెలిగించుకుని ఆర్మ్‌చైర్‌లో కూలబడ్డాడు. "ఒకటే బాధ. నీకు పరిశీలన తక్కువ. అదే తేడా. ఉదాహరణకు మన హాలులోనుంచి గదిలోకి రావడానికి వచ్చే మెట్లను ఎన్నిసార్లు చూచి ఉంటావో లెక్కలేదు కదూ?" అన్నాడు.

"చాలాసార్లు."

"అంటే ఎన్నిసార్లు?"

"కొన్ని వందలసార్లు కనీసం."

"ఎన్ని మెట్లున్నాయి చెప్పు."

"ఎన్ని మెట్లా? నేను గమనించలేదు."

"అదే మరి! నీవు పరిశీలించలేదు. కేవలం చూచావు అంతే. నేను చెపుతున్నది అదే. పదిహేడు మెట్లున్నాయని నేను గట్టిగా చెప్పగలను. ఎందుకంటే, నేను చూడడమేకాదు. పరిశీలించాను కూడా. సరేగాని, నీకు ఇటువంటి విషయాలలో మంచి ఆసక్తి ఉందిగదా. పైగా నా అనుభవాలను మామూలువయినా సరే, కొన్నింటిని రాశావు కూడా. ఇదేమయినా నీకు ఆసక్తికరంగా ఉంటుందేమో?" అంటూ బల్లమీద పడి ఉన్న పింక్ కలర్ కాగితాన్ని ఒకదాన్ని నా మీదకు పడేశాడు. "ఇప్పుడే పోస్ట్‌లో వచ్చింది. ఏదీ గట్టిగా చదువు" అన్నాడు.

నోట్ మీద తేదీ లేదు. ఒక సంతకము, చిరునామా కూడా లేవు.

> *"నేటి రాత్రి, అనగా ఎనిమిది గంటలకు పావు ముందు, మీముందుకు ఒక పెద్దమనిషి రానున్నాడు. ముఖ్యమయిన, చాలా లోతయిన ఒక విషయము గురించి అతను సంప్రదించాలని భావిస్తున్నాడు. యూరోపులోని ఒకానొకటయిన రాజకుటుంబాలకు తమరు ఈమధ్యచేసిన సేవల కారణంగా తమరి మీద ఒక ముఖ్యమయిన విషయంలో సంప్రదించడానికి నమ్మకం కలిగిందనడంలో అతిశయోక్తి ఎంతమాత్రమూ లేదు. మిమ్ము గురించిన విశేషాలు, మరిన్ని రకాలుగా మాకు అందియున్నాయి. ఆ సమయానికి మీ ఛాంబర్‌లో ఉండగలరని వచ్చిన వ్యక్తి తన ముఖం మీకు కనబరచకున్నా, మీరు అర్థం చేసుకుంటారని భావిస్తున్నాము."*

"వింతగా ఉంది. ఇదంతా ఏమిటంటావు?" అడిగాను.

"నా దగ్గర వివరాలు లేవు. సమాచారం లేకుండా సిద్ధాంతాలు చేయడం చాలా పెద్ద తప్పు. అట్లా చేస్తే వాస్తవాలను సిద్ధాంతాలకు అనువుగా మలచవలసి వస్తుంది. నిజానికి సిద్ధాంతాలను వాస్తవాల మీద ఆధారపడి

మలుచుకోవాలి. పోనీగానీ, నోట్ సంగతి చూడు. దాన్ని గురించి ఏమి అర్థమయింది?"

నేను చేతిరాతను, కాగితాన్ని కూడా జాగ్రత్తగా పరీక్షించాను.

"ఈ అక్షరాలను రాసిన మనిషి బాగా కలిగినవాడని అనిపిస్తున్నది. ఈ కాగితాన్ని క్రౌన్‌కు ప్యాకెట్‌వంతున కొనడం కుదిరేది కాదు. ఇది వింతగా ఉన్న రకం" అన్నాను నా మిత్రుని పద్ధతులను అనుసరించే ప్రయత్నంగా.

"వింత అన్నావు కదూ. అది సరయిన మాట. కాగితం ఇంగ్లీషు రకం కాదు. ఎత్తి వెలుగుకుపట్టి చూడు" అన్నాడు హోమ్స్.

నేను అదే పని చేశాను. ఒక పెద్ద 'ఇ' అన్న అక్షరం తరువాత చిన్న 'జి', ఒక 'పి', ఆ తరువాత ఒక పెద్ద 'జి' మరొక చిన్న 'టి' కాగితం లోపలే దాగి ఉండడం కనిపించింది.

"అంటే ఏమర్థమయింది నీకు?" అడిగాడు హోమ్స్.

"కాగితం తయారుచేసినవారి పేరు. సందేహం లేదు. లేదంటే, వారి మోనోగ్రామ్ అయినా అయి ఉండాలి."

"కానే కాదు. పెద్ద 'జి' చిన్న 'టి' కలిసి ఉంటే, గెజెల్‌షాఫ్ట్ అని అర్థం. జెర్మన్‌భాషలో కంపెనీ అన్నమాట. సాధారణంగా పెద్ద 'సి', చిన్న 'ఓ' రాస్తారే, అది! ఇక 'పి' అంటే పపియేర్ అంటే కాగితం. ఇక 'ఇ', 'జి' గురించి.. తెలియలేదు గనుక కాంటినెంటల్ గెజెటియర్ లో చూద్దాం" అంటూ అతను ఒక పెద్ద బ్రౌన్ వాల్యూమ్‌ను అరలోనుంచి బయటకు తీశాడు. "ఈగ్లో, ఇగ్లోనిడ్స్– ఆ, ఇక్కడ. ఎగ్రియా. అది బొహీమియా అనే జెర్మన్ ప్రాంతంలో ఉంది. కార్ల్స్‌బాడ్ కు దగ్గరలోనే. వాలెన్‌స్టయిన్ మరణం కారణంగా, ఎన్నో గాజు కర్మాగారాలు, పేపర్‌మిల్లుల కారణంగా పేరుగల చోటు. 'అదీ, ఇప్పుడర్థమయింది" అన్నాడతను. అతని కళ్లు మెరుస్తున్నాయి.

సిగెరెట్‌ను గట్టిగా పీల్చి ఒక నీలి పొగమేఘాన్ని గాలిలోకి గట్టిగా ఊదాడతను.



"కాగితం బొహీమియాలో తయారయింది" అన్నాను నేను.

"సరిగా చెప్పావు. అక్షరాలు రాసిన మనిషి ఒక జెర్మన్. అతని వాక్య నిర్మాణం గమనించావో లేదో. కర్త, కర్మ, క్రియల క్రమం వారి పద్ధతిలో ఉంది. ఒక ఫ్రెంచ్ లేదా రష్యన్ మనిషి అటువంటి వాక్యం రాసి ఉండేవాడు కాదు. జెర్మన్ తనదయిన పద్ధతిలో రాశాడు. బొహీమియన్ కాగితం మీద రాసిన ఈ వ్యక్తి తన ముఖం మనకు చూపించడానికి అనుమానపడుతున్నాడు. అతనికి ఏమి అవసరమో మనం కనుగొనాలి. అదుగో, రానే వస్తున్నట్టున్నాడు. మన అనుమానాలు ఇక సులభంగా తీరిపోతాయి."

అతనలా అంటుండగానే కింద గుర్రాల గిట్టల చప్పుడయింది. బండిచక్రం రాళ్లమీద ఒరుసుకున్నది. వెంటనే గంట మోగింది. హోమ్స్ ఈలవేశాడు.

"ఒక జంట, ధ్వనినిబట్టీ చూస్తే, జంట. అందమయిన జోడు గుర్రాలున్న బ్రౌహామ్ బండి అది. అంతా వెలగల వ్యవహారం. వాట్సన్, ఈ కేసులో బాగా డబ్బులున్నాయి. మిగతావి ఉన్నా లేకున్నా" అన్నాడతను.

"హోమ్స్, అయితే నేను వెళ్లిరానా?"

"లేదు లేదు, డాక్టర్. ఉన్నచోటే ఉండు. బోస్వెల్ లేకుంటే నాకు దారి తోచదు. ఇదేదో ఆసక్తికరమయిన వ్యవహారంలా ఉంది. వదులుకుంటే అన్యాయమే అవుతుంది."

"కానీ నీ క్లయింట్ .... "

"పట్టించుకోకు. నీ సాయం అవసరమవుతుందేమో, అతనికి కూడా. అదుగో వస్తున్నాడు. డాక్టర్, నీవు ఆ కుర్చీలో కూర్చో. మమ్మల్ని బాగా గమనిస్తూ ఉండు."

అడుగులు బరువుగానూ, నెమ్మదిగాను వినిపించాయి. అవి మెట్ల మీదుగా వచ్చాయి. తలుపు ముందు నిలిచాయి. వెంటనే బరువుగా, సాధికారంగా తలుపు తట్టిన చప్పుడయింది.

"కమ్ ఇన్!" అన్నాడు హోమ్స్.

లోపలికి ఒక వ్యక్తి వచ్చాడు. ఆరడుగుల ఆరంగుళాలకు ఏమాత్రం తక్కువ ఉండడు. ఛాతీ, కాళ్లూ చేతులు మొత్తం హెర్క్యులెస్ పద్ధతిలో ఉన్నాయి. దుస్తులు చాలా వెలగలవి. ఇంగ్లాండ్‌లో నిజానికి ఈ రకమయిన దుస్తులు వేసుకుంటే, ధనికులకు కూడా నచ్చదు. కోటు చేతులమీద అస్త్రఖాన్ అలంకారాలు ఆడంబరంగా ఉన్నాయి. భుజాలమీద వేసుకున్న క్లోక్ కూడా సిల్క్, జరీతో నిండి ఉంది. మెడపక్కన ఉన్న బ్రూచ్‌లో మెరిసిపోతూ ఒక బెరిల్ ఉంది. పిక్కలలో సగం దాకా కనపడకుండా ఉన్న బూట్లు గొప్ప వెలగల చర్మంతో చేసి ఉన్నాయి. అతని వాలకం మొత్తం చూస్తూ ఉంటే అలవిమాలిన ధన దర్పం కనపడుతూ ఉన్నది. చేతిలో పెద్ద అంచుగల హ్యాట్ ఒకటి ఉంది. ఆ వ్యక్తి ముఖం మీద కళ్ల కింది వరకూ ఒక నల్లని మాస్క్ వేసి ఉంది. అతను దాన్ని అప్పుడప్పుడే సర్దుకున్నట్టున్నాడు. అతని చెయ్యి ఇంకా ఆ ఎత్తులోనే ఉంది. మొత్తంమీద అతను గొప్ప వ్యక్తిత్వం గల మనిషి లాగా కనిపించాడు. కింది పెదవి కాస్త వేలాడుతున్నది. దవడలు చాలా బలంగా ఉన్నాయి.



"నా నోట్ అందిందా?" అతను మొరటు గొంతుకతో అడిగాడు. మాటలో జెర్మన్ యాస వినిపించింది. "నేను వస్తున్నానని తెలియజేశాను" అతను మా ఇద్దరి వేపు మార్చి మార్చి చూస్తున్నాడు. ఎవరితో మాట్లాడాలో అర్థంకానట్టు.

"దయచేసి కూచోండి. ఇతను నా మిత్రుడు, సహచరుడు. పేరు డాక్టర్ వాట్సన్. కేసులలో నాకు తరచుగా సాయం చేస్తుంటాడు. నేను ఎవరితో సంభాషిస్తున్నానో తెలుసుకునే గౌరవం సంభవమేనా?"

"తమరు నన్ను కౌంట్ ఫన్ క్రమ్ అని సంబోధించవచ్చు. నేను బొహీమియన్ రాచకుటుంబం సభ్యుడిని. ఈ మీ మిత్రులు ఆదరణీయులు అన్న సంగతి అర్థమవుతున్నది. నేను చెప్పబోయేది చాలా ముఖ్యమయిన విషయం. మీకు అభ్యంతరం లేకుంటే, మీ ఒక్కరితోనే మాట్లాడడం మంచిదని నా భావన."

నేను వెళ్లే ప్రయత్నంగా లేచి నిలుచున్నాను. కానీ, హోమ్స్ నా మణికట్టును పట్టుకున్నాడు. నన్ను కుర్చీలోకి తోశాడు. "ఉంటే ఇద్దరమూ, లేకుంటే ఎవరూ లేరు. మీరు నాకు చెప్పదలచుకున్నవన్నీ ఈ పెద్దమనిషి ముందుకూడా చెప్పవచ్చు" అన్నాడు.

కౌంట్ తన విశాలమయిన భుజాలను ఎగరేశాడు. "అయితే

మొదలుపెడతాను. రెండు సంవత్సరాలవరకు ఈ సంగతులను బయటపెట్ట కూడదని మీమీద ప్రతిబంధకం పెడుతున్నాను. ఆ తరువాత ఈ సంగతులకు ప్రాముఖ్యత ఉండదు. ప్రస్తుతం మాత్రం ప్రభావం మొత్తం యూరోపు చరిత్రమీద ఉంటుందంటే అందులో అనుమానం లేదు" అన్నాడతను.

"మీకు మాట ఇస్తున్నాను" అన్నాడు హెూమ్స్.

"నేను కూడా."



"మాస్క్ వేసుకున్నందుకు క్షమించండి. నన్ను మీవద్దకు పంపిన గౌరవనీయవ్యక్తి అతని అనుచరులు కూడా ఎవరికంటా పడకుండా ఉండడం మేలని అనుకుంటున్నారు. నేను మీకు చెప్పిన నా హెూదా కూడా నిజంకాదు" వచ్చిన మనిషి చెప్పసాగాడు.

"నాకు విషయం తెలుసు," అన్నాడు హెూమ్స్ పొడిగా.

"వ్యవహారం గొప్ప నాజూకయినది. ఇది ముదిరి గొప్ప స్కాండల్‌గా మారి యూరోపులోని ఒకానొక రాచకుటుంబానికి అమర్యాద కలిగే ఆపద రాకుండా చేయగలిగినదంతా చేయవలసి ఉంది. ఒక్కమాటలో చెప్పాలంటే, బొహీమియా పరంపరాగత రాజకుటుంబం, గ్రేట్ హౌజ్ ఆఫ్ ఓర్మ్‌స్టయిన్ లకు సంబంధించిన విశేషమిది."

"నాకు ఆ విషయం కూడా తెలుసు, " హెూమ్స్ గొణిగాడు. అతను తన కుర్చీలో సర్దుకుని కూచుని కళ్లు మూసుకున్నాడు.

వచ్చిన పెద్దమనిషి హెూమ్స్‌వేపు ఆశ్చర్యంగా చూడసాగాడు. యూరోపులో ఇటువంటి వ్యవహారాలలో హెూమ్స్‌కి ఎవరూ సాటిరారని విని ఉన్నాడు. కానీ, ఇతనేమో చాలా వింతగా కుర్చీలో జేరబడి ఉన్నాడు. కనుకనే ఆశ్చర్యం. హెూమ్స్ కళ్లు తెరిచాడు. వచ్చిన ఆ నిజమయిన పెద్ద మనిషి వేపు కాస్త ఓపికలేకుండా చూచాడు.

"ప్రభువులు దయదలిచి వివరాలు అందచేస్తే, సలహా ఇవ్వడం నాకు వీలవుతుంది"అన్నాడు.

వచ్చిన పెద్ద మనిషి ఒక్క ఊపుతో కుర్చీలోనుంచి లేచి నిలబడ్డాడు. గదిలో చాలా వేగంగా అటు ఇటూ తిరగసాగాడు. కలతలోనుంచి తేరుకుంటున్నట్టు ఒక్కసారి కదిలి ముఖం మీదినుంచి ముసుగును లాగి నేల మీద విసిరివేశాడు. "మీరు చెప్పింది నిజమే. నేనే ప్రభువును. ఆ సంగతి దాచినందువల్ల ప్రయోజనమేమి?" అన్నాడాయన గట్టిగా.

"నిజమే. ఎందుకు దాచాలి? నేను బొహీమియా పరంపరాగత ప్రభువు, గ్రాండ్ డ్యూక్ ఆఫ్ కాసెల్-ఫెల్‌స్టయిన్, విల్‌హెల్మ్ గోట్స్ రయిష్ సిగిస్మాండ్ ఫన్ ఒర్మ్‌స్టయిన్ ప్రభువులను సంభోదిస్తున్నానని నాకు తెలియకముందు తమరు పల్లెత్తుమాట కూడా అనలేదు గదా" మంద్ర స్వరంతో అన్నాడు హెూమ్స్.

"తమరు అర్థం చేసుకునే ఉంటారు. మేము స్వయంగా ఇటువంటి పనులు చేయడం అలవాటులేని వారమని అర్థమయే ఉంటుంది. అయినా, వ్యవహారం నాజూకయినది. మరొకరితో చెప్పి పంపించవలసినది కాదు. అందుకే మారువేషంలో ప్రాగ్‌నగరం నుంచి బయలుదేరి వచ్చాము.



తమరితో ముచ్చటించి సలహా పొందడమే పని” అన్నాడు ఆగంతకుడు, కుర్చీలో కూచుంటూ. ఆయన తన చేతులతో ముఖాన్ని నిమురుకుంటున్నాడు.

“మరి ఆలస్యం అవసరం లేదు” అన్నాడు హెూమ్స్ మళ్లీ కళ్లు మూసుకుంటూ.

“సూక్ష్మంగా ఇవీ వాస్తవాలు. సుమారు అయిదు సంవత్సరాల క్రితం కొంతకాలం వర్సావాలో ఉన్నాము. అక్కడనే, ఐరీన్ ఆడ్లర్ అనే సాహస యువతితో పరిచయమయింది. ఆ పేరు మీకు తప్పక తెలిసే ఉంటుంది.”

“డాక్టర్, మన ఇండెక్స్‌లో ఆవిడ పేరు వెతికిచూడు” నెమ్మదిగా అన్నాడు హెూమ్స్ కళ్లు తెరుస్తూ. చాలా సంవత్సరాలుగా అతను ముఖ్యమయిన వ్యక్తులు, విషయాలను గురించి వివరాలు సేకరించి అవసరమయినపుడు అందుబాటులో ఉండేరకంగా ఏర్పాటు చేసుకుంటు న్నాడు. అందులో ఐరీన్ జీవిత విశేషాలు అటు ఒక హీబ్రూ రాబై, మరొకవేపు ఒక సైన్యాధికారి వివరాల మధ్యన కనిపించింది. ఆ సైన్యాధికారి సముద్రపు లోతులలోని చేపల గురించి ఒక మోనోగ్రాఫ్ రాశాడు.

“ఏదీ నన్ను చూడనీ!” అన్నాడు హెూమ్స్. “సరే! 1858లో న్యూజెర్సీలో జననం. కాంట్రాల్టో .... ఆహా.! లా స్కాలా, ఓ! వర్సావాలో ప్రిమాడోనా ఇంపీరియల్ ఓపరా... అదీ.! నాట్యరంగం నుంచి రిటైర్మెంట్ ... ఆహా.! లండన్‌లో నివాసం... అవునవును.! ప్రభువులు ఈ యువతితో వ్యవహారంలో పడ్డారని అర్థమవుతూనే ఉన్నది. కొన్ని ఉత్తరాలు రాశారు. ఇప్పుడు వాటిని తిరిగి సంపాదించాలి” అన్నాడు హెూమ్స్.

“సరిగ్గా. కానీ, విషయం...”

“రహస్య వివాహంగాని జరిగిందా?”

“లేదు లేదు.”

“ప్రమాణపత్రాలు వగైరా?”

"ఏమీ లేవు."

"మరి ప్రభువుల మనసు నాకు అందడం లేదు. ఈ యువతి తన దగ్గర ఉన్న ఉత్తరాలను బయటపెట్టి బ్లాక్‌మెయిల్ చేస్తే లేదా మరొక మార్గం చూస్తే, అవి ప్రభువులు వ్రాసినవేనని ఏరకంగా నిరూపణ కుదురుతుంది?"

"చేతివ్రాత ఉందిగదా?"

"అదేమంత గొప్పవిషయం? మరెవరో నకలు చేశారు."

"మరి మా స్వంత నోట్ కాగితాలు."

"దొంగిలింపబడ్డాయి."

"మా స్వంత రాజముద్ర."

"అది కూడా నకలే."

"మా ఫొటోగ్రాఫ్."

"కొన్నది కావచ్చు."

"ఫొటోలో యిద్దరమూ ఉన్నాము."

"ఓహ్, డియర్! అదీ బాధ. ప్రభువులవారు పొరపాటు చేశారు."

"మేము పిచ్చిగా వ్యవహరించాము. మరీ పిచ్చిగా."

"తమరు తమ భద్రతనే పణంగా పెట్టారు."

"అప్పటికి మేము యువరాజులము మాత్రమే. పిన్నవయసు. ఇప్పుడు కూడా మా వయసు ముప్ఫయి దాటలేదు."

"ఫొటోను సంపాదించక తప్పదు."

"ప్రయత్నించాము. భంగపడ్డాము."

"ప్రభువులు వెల చెల్లించి దాన్ని కొనవచ్చు."

"ఆమె అమ్మదు."

"అయితే దొంగిలించాలి."

"అయిదు ప్రయత్నాలు జరిగాయి. మేము పంపిన దొంగలు రెండుసార్లు ఆమె ఇంటినంతా కలియబెట్టారు. ఒకసారి ఆమె ప్రయాణంలో ఉండగా, ఆమె సరుకులను దారి మళ్లించారు. రెండుసార్లు దారిలో అడ్డగించి దోపిడీ చేశారు. అయినా లాభం లేకపోయింది."

"దాని జాడ తెలియలేదా?"

"లేదుగాక లేదు."

హోమ్స్ నవ్వాడు. "సమస్య చిన్నదయినా, చిత్రమయినది" అన్నాడు.

''మాకది చాలా మహత్తరమయినది'' రాజు ప్రశాంతంగా బదులిచ్చాడు.

"నిజమే. ఇంతకూ ఆమె ఫొటోగ్రాఫ్‌తో ఏం చేస్తానంటుంది?"

"నన్ను నాశనం చేస్తానంటుంది."

"అది ఏరకంగా?"

"మేము వివాహమాడబోతున్నాము."

"ఆ విషయం విన్నాను."

"స్కాండినేవియా మహాప్రభువులవారి రెండవ కుమార్తె క్లోటిల్డ్ లోత్మన్ ఫన్ సాక్స్-మెనింజన్‌గారు వధువు. వారి కుటుంబపు రాచమర్యాదలు గురించి మీరు వినే ఉంటారు. స్వయంగా ఆవిడ ఎంతో మృదువయిన వ్యక్తి. నా వ్యక్తిత్వం గురించి ఛాయామాత్రంగా అయినా సరే అనుమానం కలిగితే, వ్యవహారం తలకిందులవుతుంది."

"మరి ఐరీన్ ఆడ్లర్?"

"ఫొటోగ్రాఫ్‌ను వారికి పంపుతానంటుంది. అంతపని చేస్తుంది కూడా. ఆమె ఆ పని చేస్తుందని నాకు తెలుసు. మీకు ఆమె గురించి తెలియదు.

ఇనుపమనసు మనిషి. ముఖం చాలా చాలా అందమయిన స్త్రీదయితే మెదడు మాత్రం బలంగల మగవారి కన్నా బలం గలది. నేను మరేదో దారి వెదుక్కోవాలి. ఆమె ఎంతకయినా తెగించిన మనిషి."

"ఆమె ఇప్పటికే పంపలేదని తమకు గట్టిగా తెలుసునా?'

"నిశ్చయంగా."

"ఎందుకు పంపలేదు?"

"సరిగ్గా మా నిశ్చితార్థం గురించి బాహాటంగా ప్రకటన జరిగిననాడు పంపుతానని ఆమే చెప్పింది. అది వచ్చే సోమవారం జరగనుంది."

"ఓహో! మనకు మూడునాళ్లే వ్యవధి ఉంది. అది చాలా అదృష్టం. ప్రస్తుతం నా చేతిలో రెండు మూడు ముఖ్యమయిన వ్యవహారాలున్నాయి. అంతవరకూ ప్రభువులు లండన్‌లోనే ఉంటారని విశ్వసిస్తున్నాను" అన్నాడు హోమ్స్ ఆవులిస్తూ.

"అవశ్యంగా. మమ్మల్ని కౌంట్ ఫన్ క్రమ్ అనే పేరుతో లాంగ్‌హామ్‌లో కనుగొనవచ్చు."

"ప్రగతి గురించి తమకు ఎప్పటికప్పుడు వార్త పంపుతుంటాను."

"అదే మా అభ్యర్థన కూడా. మాకెంతో ఆత్రంగా ఉంది మరి."

"మరి, డబ్బు సంగతి."

"కార్టె బ్లాంష్ అంటే మీరెంతంటే అంత."

"నిజంగానా?"

"ఆ ఫొటోగ్రాఫ్ దొరికితే మా రాజ్యంలోని కొంత భాగాన్ని ఇవ్వడానికి కూడా మేము సిద్ధంగా ఉన్నామని మాట ఇస్తున్నాము."

"మరి ప్రస్తుతపు ఖర్చుల సంగతి?"

రాజుగారు తమ పైనున్న క్లోక్‌లో నుంచి, జింక చర్మంతో చేసిన ఒక

సంచీని బయటకు తీసి బల్లమీద పెట్టారు.

"అందులో మూడు వందల పౌండ్ల బంగారం, ఏడువందల పౌండ్లు నోట్స్ రూపంలో ఉన్నాయి."

హోమ్స్ తన నోట్‌బుక్‌లో నుంచి ఒక కాగితం తీసి రసీదు రాసి రాజుగారికి అందించాడు. "మరి ఆవిడగారి చిరునామా?" అన్నాడు.

"బ్రయోనీ లాడ్జ్, సర్పెంటయిన్ అవెన్యూ, సెయింట్ జాన్స్ వుడ్."

హోమ్స్ వివరం రాసుకున్నాడు. "మరొక్క ప్రశ్న. ఫొటోగ్రాఫ్ కాబినెట్ సైజులో ఉందా?"

"అవును."

"ఇక మహాప్రభువుల నుంచి శెలవు తీసుకుంటాము. త్వరలోనే మంచి వార్త అందుతుందని అనుకుంటున్నాను. వాట్సన్, నీకూ గుడ్‌నైట్" అన్నాడతను. కింద వీధిలో రాజవాహనం కదిలిన చప్పుడయింది. "దయతలచి రేపు మధ్యాహ్నం మూడు గంటలకు వచ్చావంటే ఈ వ్యవహారం గురించి నీతో కొంత ముచ్చటించవలసి ఉంది" అన్నాడతను.

# 2

సరిగ్గా మూడుగంటలకు నేను బేకర్ స్ట్రీట్ చేరుకున్నాను. హోమ్స్ మాత్రం తిరిగి రాలేదు. అతను ఉదయాన ఎనిమిదిగంటల తరువాత బయటకు వెళ్లాడని యింటి యజమానురాలు చెప్పింది. నేను ఎంతసేపయినా వేచి చూచే ప్రయత్నంగా, మంట పక్కన కూచున్నాను.  నాకు ఇప్పటికే ఈ వ్యవహారంలో ఆసక్తి మొదలయింది.

ఇంతకు ముందు నేను గమనించి వివరించిన కేసులలాగా ఇక్కడ ఘాతుకాలు, హత్యలూ ఏవీ లేవు. అయినా, వ్యవహారం నిజంగా పెద్ద స్థాయివారిది. కనుక అసక్తికర మయినది. నా మిత్రుని చేతిలో ఉన్న కేసు తీరు దానినతను పరిశోధించే తీరు, గొప్పగా ఉంటాయి. అతను సందర్భాలను చేజిక్కించుకునే తీరు, కార్య కారణాలను వెంబడించే తీరు చూస్తుంటే నాకు ఎంతో సరదాగా ఉంటుంది. వేగంగా, విచిత్రంగా అతను చిక్కులు విప్పుతూ ఉంటే, గొప్ప ఆశ్చర్యంగా ఉంటుంది.



అతను విజయం సాధిస్తాడన్నది అలవాటుగా మారిపోయింది. అతని విషయంలో అపజయం అన్న మాట నా ఆలోచనకే అందదు.

నాలుగు గంటలు అవుతుండగా, తలుపు తెరుచుకున్నది. తూలుతూ ఒక మనిషి లోపలికి వచ్చాడు. వెంట్రుకలు విచిత్రంగా పెరిగి ఉన్నాయి. ముఖం కంది ఉన్నది. దుస్తులు చాలా నాసిగా ఉన్నాయి. నా మిత్రుడు వేసుకునే మారువేషాల పద్ధతి నాకు బాగా పరిచయమే. అయినా అతనేనని నిశ్చయించుకోవడానికి నాలుగుసార్లు చూడవలసివచ్చింది. ఒక్కసారి తల పంకించి, అతను పడకగదిలోకి వెళ్లిపోయాడు. అయిదు నిమిషాల తరువాత పాతపద్ధతిలో గౌరవకరంగా ట్వీడ్ సూట్ వేసుకుని బయటకు వచ్చాడు. చేతులు కోటు జేబుల్లో దూర్చి కాళ్లను మంటవేపు జాచి అతను అదే పనిగా నవ్వసాగాడు.

"చాలా బాగుంది!" అని గట్టిగా అన్నాడు. గొంతు పొరబేయేదాకా నవ్వి నవ్వి నిస్సహాయంగా కుర్చీలో వెనుకకు వాలాడు.

"ఏమిటిదంతా?"

"వింతగా ఉందయ్యా. నేను ఈ ఉదయమంతా ఏం చేశానని, ఫలితంగా ఏం జరిగిందని నీవు ఊహించనుకూడా లేవు."

"నేను ఊహించలేను. నీవు మిస్ ఐరీన్ ఆడ్లర్ గారి అలవాట్లను, బహుశా ఆమె ఇంటిని కూడా కాపుకాసి చూచి ఉంటావని అనుకుంటున్నాను."

"నిజంగా. కానీ, ఆ తరువాత జరిగిందే అసాధారణం. ఎలాగూ నీకు చెప్తాను. ఈ ఉదయాన నేను ఎనిమిది గంటలకు కొంచెం తరువాత, పని వెతుకుతున్న ఒక సర్వెంట్ వేషంలో బయలుదేరాను. పనిమనుషులకు తమరకం మనుషులతో సులభంగా నేస్తం కుదురుతుంది. వాళ్ల మధ్యన ఒకరుగా చేరావంటే తెలియవలసినదంతా తెలియవస్తుంది. బ్రయోనీ లాడ్జ్ దొరికింది. అది పెద్ద విల్లా. వెనుక పెద్దతోట ఉంది. ముందు మాత్రం రోడ్డు మీదిదాకా భవనమే ఉంది. తలుపుమీద పెద్ద తాళం వేలాడుతున్నది.

కుడిపక్కన పెద్ద సిటింగ్ రూమ్ ఉంది. అందులో మంచి ఫర్నీచర్ ఉంది. కిటికీలు చాలా పెద్దవి. నేల దాకా ఉన్నాయి. వాటికి ఉన్న కొక్కేలు చిన్న పిల్లవాడు కూడా తప్పించగలిగే రకం. ఆ వెనుక అసాధారణమయినవేవీ కనిపించలేదు. లోపలికి వెళ్లడానికి నడవ మాత్రం కోచ్ హౌజ్ పక్కగా ఉన్నది. నేనింటి చుట్టూ తిరిగి పరిశీలించాను. ఆసక్తికరంగా ఏమీ కనిపించలేదు.

"వీధిలో అటూఇటూ తిరిగాను. అనుకున్నట్టే సందులో ఇంటిగోడ వెంట ఒక దారి కనిపించింది. ఆ పక్కనే నిలబడి ఉన్న గుర్రంబండి వాళ్ల గుర్రాలను తోముతూ వాళ్లను మచ్చికచేశాను. పనికిగాను కాసులు కూడా దొరికాయి. తాగడానికి పానీయమూ దొరికింది, పొగాకుతుంపు కూడా దొరికింది. మిస్ ఆడ్లర్ గురించి కావలసినంత సమాచారమూ దొరికింది. చుట్టుపక్కల ఇళ్లలోని మరో అరడజనుమంది గురించి కూడా వినవలసి వచ్చింది. అయితే వాళ్లపట్ల నాకు ఆసక్తి లేదు."

"ఇంతకూ ఐరీన్ ఆడ్లర్ సంగతేమిటి?" నేను అడిగాను.

"ఒహో! ఆమె చుట్టుపక్కలనున్న మగవాళ్లనందరినీ తలకిందులు చేసింది. ఈ భూగ్రహం మీదే అందమయిన వాళ్లలో ఆవిడ ఒకర్తె. మగవాళ్లకు మంత్రంవేసే మనిషి. ప్రశాంతంగా బతుకుతుంది. కన్సర్ట్స్ పాడుతుంది. ప్రతిరోజూ సాయంత్రం అయిదుగంటలకు బయలుదేరుతుంది. సరిగ్గా ఏడింటికి డిన్నర్ సమయానికి తప్పకుండా వచ్చేస్తుంది. మిగతా సమయాల్లో, పాటకచేరీ ఉంటేతప్ప బయటకు రాదు. ఆమె కోసం ఒక్క మగమనిషి మాత్రం వస్తుంటాడు. అయితే, చాలాసార్లు వస్తాడు. అతను అందగాడు. మంచి గడుసరి. రోజుకు కనీసం ఒకసారయినా వస్తాడు. రెండు సార్లు రావడమూ ఉంది. అతని పేరు మిస్టర్ గాడ్‌ఫ్రే నార్టన్. ఇన్నర్‌టెంపుల్ వాసి. బండినడిపేవారు మనకు నేస్తాలుగా దొరికితే ఎటువంటి లాభం కలుగుతుందో గమనించే ఉంటావు. వీళ్లు అతగాడిని ఎన్నోసార్లు తమ బండిలో ఎక్కించుకుని వచ్చారు. కనుక ఎన్నో వివరాలు తెలుసుకున్నారు.

వాళ్లు చెప్పగలిగినదంతా విన్న తరువాత నేను మరోసారి బ్రయోనీ లాడ్జ్ దగ్గర అటూ ఇటూ తిరగసాగాను. చేయవలసిన కార్యక్రమం గురించి ఆలోచిస్తున్నాను.

“వ్యవహారంలో గాడ్ఫ్రే నార్టన్కు గట్టిపాత్ర ఉన్నది. అతనొక లాయరు. అది నాకు ముఖ్యంగా తోచింది. వాళ్లు ఇద్దరి మధ్యనా సంబంధం ఏమిటి? అతను ఎందుకు అంత తరచుగా వస్తున్నాడు? ఆమె అతనికి క్లయంటా, నేస్తమా, లేక మరింతలోతా? మొదటిదయితే బహుశా ఫొటోగ్రాఫ్ అతని వద్ద ఉండి ఉండవచ్చు. తరువాతిదయితే, ఆ అవకాశం లేదు. ఈ ప్రశ్నకు జవాబు దొరికితే నేను కాపు కాయవలసింది బ్రయోనీ లాడ్జ్ మీదనా, లేక టెంపుల్లో ఉండే అతగాని ఇంటిమీదనా అన్నది తేలుతుంది. ఇది చాలా సున్నితమయిన విషయం. దీనితో వ్యవహారం పరిధి పెరిగింది. ఇవన్నీ చెప్పి నిన్ను విసిగించినట్టున్నాను. నా కష్టాలు నీకు తెలిస్తే బాగుంటుంది. అప్పుడు పరిస్థితి నీకు అర్థమవుతుంది” అన్నాడు.

“నేను శ్రద్ధగా వింటున్నాను” జవాబు ఇచ్చాను.

“నేను వ్యవహారం గురించి నిర్ణయం చేసుకునే ముందే వీధిలోకి ఒక చిన్న గుర్రంబండి వచ్చింది. బ్రయోనీ లాడ్జ్ ముందు ఆగింది. ఆ పెద్ద మనిషి బండిలోంచి కిందికి దూకాడు. అతను చాలా అందమయిన మనిషి. మంచి దారుఢ్యం గల శరీరం. మీసాలు మరింత అందంగా ఉన్నాయి. తప్పకుండా అతనే నేను విన్న మనిషి. అతను చాలా తొందరలో ఉన్నట్టున్నాడు. బండి మనిషిని కాసేపు ఆగమని గట్టిగా అరిచి చెప్పాడు. తలుపు తెరిచిన మెయిడ్ పక్కగా దూసుకుంటూ, ఇంటిగురించి బాగా తెలిసిన మనిషిలా లోపలికి వేగంగా వెళ్లిపోయాడు.

“అతను ఇంట్లో సుమారు ఒక అరగంట ఉన్నాడు. సిటింగ్రూమ్ కిటికీ లోంచి అతను అటూ ఇటూ తిరుగుతున్నట్టు కనబడింది. ఏదో తీవ్రంగా మాట్లాడుతున్నాడు. చేతులను ఆడిస్తున్నాడు. ఆమె మాత్రం

కనిపించలేదు. అంతలో అతను మరింత ఆత్రంగా బయటకువచ్చాడు. బండి వద్దకు వస్తూ, జేబులోనుంచి బంగారు గడియారం తీసి చూచాడు. 'వీలయినంత వేగంగా వెళ్లాలి. ముందు రీజెంట్ వీధిలో గ్రాస్ అండ్ హాంకీస్‌కు, ఆ తరువాత ఎడ్జ్‌వేర్ రోడ్డులోని సెయింట్ మోనికా చర్చ్‌కు. ఇరవయి నిమిషాల్లో చేరగలిగామంటే అర గినీ ఇస్తాను!' అరిచాడతాను.

"అతను వెళిపోయాడు. వెంబడిస్తే మంచిదేమోనని నేను ఆలోచిస్తున్నాను. అంతలో వీధిలోకి వెలగల చిన్న లాండౌ బండి వచ్చింది. కోచ్‌మన్ కోటు బొత్తాలు సగంవరకే పెట్టుకున్నాడు. అతని టై భుజంమీద ఉంది. పగ్గాలు కూడా చేతిలో లేవు. బండి ఆగిందోలేదో ఆమె ఇంట్లో నుంచి దూసుకువచ్చి ఎక్కింది. నాకు ఒక క్షణం మాత్రమే కనిపించింది. అయినా ఆమె చాలా అందగత్తె అని చూడగలిగాను. మగవాళ్లు ఆమె పొందుకోసం పడిఛస్తారు అనిపించింది.

" 'జాన్, సెయింట్ మోనికా చర్చ్‌కి ఇరవయి నిమిషాల్లో చేరగలిగావంటే, అర సవరను అందుకుంటావు' అన్నదామె గట్టిగా.

"వాట్సన్, అది నాకు చక్కని అవకాశంగా కనిపించింది. పరుగెత్తాలా, లేక ఆమె బండి వీధిలోకి వచ్చినపుడు దానివెనక ఎక్కాలా? అని ఆలోచిస్తున్నాను. బండిమనిషి నా వేపు అసహ్యంగా చూచాడు. అతను కాదనేలోగానే నేను ఎక్కేశాను. 'సెయింట్ మోనికా చర్చ్‌కి వెళ్లాలి. ఇరవయి నిమిషాల్లో చేరగలిగామంటే అర సవరను బహుమతి' అన్నాను. పన్నెండు గంటలకు ఇరవయి అయిదు నిమిషాలు తక్కువగా ఉంది. నాకు విషయం కొంత అర్థమయింది అనిపించింది.

"నేనెక్కిన బండిమనిషి బాగా వేగంగా నడిపించాడు. అంత వేగంగా ఇంతకుముందెప్పుడూ బండినడిచిన గుర్తులేదని అనిపించింది. అయినా, మిగతా వాళ్లిద్దరూ నాకంటే ముందే అక్కడికి చేరి ఉన్నారు. నేను అక్కడికి వెళ్లేసరికి కిరాయి బండి, లాండౌ రెండూ ద్వారం ముందు నిలబడి

ఉన్నాయి. గుర్రాలు గసపోస్తున్నాయి. నేను కూడా బండిమనిషికి డబ్బులిచ్చి వేగంగా చర్చ్ లోపలికి వెళ్లాను. లోపల ఒక్క పురుగు కూడా లేదు. నాకంటే ముందు వచ్చిన ఇద్దరు, అక్కడి ఫాదరీ మాత్రమే ఉన్నారు. వాళ్లంతా మాట్లాడుకుంటున్నారు. ముగ్గురూ పీఠం ముందు గుంపుగా నిలబడి ఉన్నారు. పనిలేక చర్చ్‌లోకి వచ్చిన మనిషివలె నేను ఏదో ఒక బెంచి మీద కూచున్నాను. అంతలో ఆశ్చర్యంగా ఆ ముగ్గురూ నావేపు మళ్లారు. గాడ్‌ఫ్రే నార్టన్ చేతనయినంత వేగంగా నా వద్దకు వచ్చాడు.

“ ‘థాంక్ గాడ్. నీతో పని జరుగుతుంది!’

“ ‘ఏమిటి సంగతి?’ నేను అడిగాను.

“ ‘బాబూ రా రా! మూడు నిమిషాలు మాత్రమే. లేకుంటే ఈ పని చట్టబద్ధం కాదట.’



“ నన్ను ఇంచుమించు పీఠం ముందుకు లాగినంత పనిచేశారు. ఏం జరుగుతున్నదో అర్థమయ్యేలోగా నా చేత ఏవో మాటలు పలికించారు. నాకు సంగతి తెలియకుండానే చెవిలో చెప్పిన మాటలను అప్పజెప్పించారు. మొత్తానికి బ్రహ్మచారిణి ఐరీన్ ఆడ్లర్, బ్రహ్మచారి గాడ్‌ఫ్రే నార్టన్‌లకు వివాహబంధం పడింది. అంతా ఒక క్షణంలో జరిగింది. ఒకరి తర్వాత ఒకరుగా వాళ్లు ముగ్గురూ నాకు ధన్యవాదాలు

చెప్పారు. జీవితంలో ఇటువంటి పరిస్థితులలో నేను ఎప్పుడూ పడి ఉండలేదు. తలుచుకుంటే నాకు ఇప్పుడు నవ్వుపుడుతున్నది. క్లెర్జిమన్ వాళ్లకు సాక్ష్యం లేకుండా పెళ్లి చేయనుగాక చెయ్యనని గట్టిగా చెప్పినట్టున్నాడు. అంతలో నేను అక్కడికి రావడంతో వాళ్లకు బెస్ట్‌మన్ కొరకు వెతకవలసిన అవసరం లేకుండాపోయింది. పెళ్లికూతురు నాకొక సవరను ఇచ్చింది. సందర్భానికి గుర్తుగా నేను దాన్ని నా గడియారం చెయిన్‌కు బిగించి పెట్టాను."

"అంతా అనుకోకుండా జరిగినట్టుంది. ఆ తరువాత ఏమయింది?" అడిగాను నేను.

"ఏముంది. నా పథకాలు తారుమారయ్యాయి. వాళ్లిద్దరూ ఎక్కడికో వెళ్లిపోయే ప్రయత్నంలో ఉన్నారు. అంటే నా కదలికలు చేతనయినంత వేగంగా ఉండాలి. ద్వారం దగ్గర, వాళ్లు విడిపోయారు. ఎవరిదారిన వారు వెళుతు న్నారు. 'మామూలుగానే అయిదుగంటలకు బయలుదేరతాను' వెళుతూ అన్నది ఆమె. ఆ తరువాత మాటలు వినిపించలేదు. ఇద్దరూ చెరొకవేపు వెళ్లి పోయారు. నా ఏర్పాట్లకోసం నేనూ వెళ్లాను."



"ఏర్పాట్లా?"

"కాసింత తిండి, ఒక గ్లాస్ బియెర్. అసలు తిండి గురించి ఆలోచనే లేదు మరి. తరువాత చాలా పని ఉన్న దాయె. అసలు సంగతి డాక్టర్, నాకు నీ సాయం కావాలి" జవాబుగా అన్నాడతను బెల్ మోగిస్తూ.

"సంతోషంగా వస్తాను."

"చట్టవిరుద్ధంగా పనిచేయడం సమ్మతమేనా?"

"ఏమాత్రం సమ్మతించను."

"అరెస్టు అయ్యే సందర్భం వస్తే?"

"మంచి పనికోసం అయితే."

"అదా, పని చాలా చాలా మంచిది!"

"అయితే అభ్యంతరం లేదు."

"నీవు ఆ మాట అంటావని నాకు తెలుసు."

"ఇంతకూ ఏమిటంటున్నావు?"

"మిసెస్ టర్నర్‌ని తిండి తీసుకురానివ్వు. అప్పుడు చెపుతాను" అన్నాడతను. అంతలో ఇంటి యజమానురాలు తిండితో వచ్చింది. "తింటూ మాట్లాడుకుందాం. ఎక్కువగా టైమ్ లేదు. సుమారు అయిదు అవుతున్నది. రెండు గంటలలోపల స్థలానికి వెళ్లాలి. మిస్ ఐరీన్, కాదు కాదు మేడమ్, బయటినుంచి ఏడుగంటలకు తిరిగి వస్తారు. సమయానికి బ్రయోనీ లాడ్జ్‌లో ఉండి ఆమెను కలవాలి."

"ఆ తరువాత ఏమిటి?"

"అవన్నీ నాకు వదిలేయ్. జరగవలసింది మొత్తమంతా ఏర్పాటు చేశాను. ఒక్కటి మాత్రం ఇప్పుడే చెపుతున్నాను. నువ్వు దేనికీ అడ్డురాకూడదు. ఏం జరిగినా సరే. అర్థమయిందా?"

"అయితే చూస్తూ ఉండాలన్నమాట."

"నిజంగా ఏమీ చేయకూడదు. కొంచెం అసౌకర్యాలు కూడా జరగవచ్చు. నీవు మాత్రం ఏమీ చేయవద్దు. నేను ఇంట్లోకి వెళ్లడానికి వీలు కలుగుతుంది. నాలుగయిదు నిమిషాల తరువాత సిటింగ్ రూమ్ కిటికీ తెరుచుకుంటుంది. నీవా కిటికీకి దగ్గరగా నిలబడాలి."

"సరే."

"నన్ను గమనిస్తూ ఉండాలి. నేను నీకు కనపడుతూనే ఉంటాను."

"సరే."

"నేను చేయి ఎత్తగానే - ఇలాగా - నేను ఇచ్చిన వస్తువును నువ్వు గదిలోకి విసరాలి. మంటలు, మంటలు అంటూ గట్టిగా అరవాలి. అర్థమయింది కదూ?"

"మొత్తంగానూ."

"కొంపమునిగేదేమీ ఉండదు" అన్నాడతను జేబులోనుంచి సిగర్‌లాగా చుట్టిన ఒక వస్తువును తీస్తూ. "ఇది ప్లంబర్‌లు వాడే పొగ రాకెట్. రెండు చివరల మూతలు ఉంటాయి. నీవు చేయవలసింది ఎక్కువగా ఏమీ లేదు. మంటల గురించి నీవు అరుస్తావు. చాలా మంది దృష్టి ఇంటివేపు మళ్లుతుంది. నీవు మాత్రం తాపీగా వీధి చివరివరకూ నడువు. పది నిమిషాల్లో నేను వచ్చి చేరుకుంటాను. అనుమానం ఏమీ లేదనే అనుకుంటున్నాను?"

"ఇందులో నేను చేయవలసిందేమీ లేదు. కిటికీ దగ్గరకు రావాలి. నిన్ను గమనించాలి. సైగ చూచి ఈ వస్తువును లోపలికి విసరాలి. తరువాత అరవాలి. వీధి చివరకువెళ్లి నీ కొరకు వేచిచూడాలి."

"సరిగ్గా చెప్పావు."

"అయితే నీవు చెప్పినట్టే చేస్తానులే."

"బాగుంది. ఇక మనం నాటకంలో పాత్రలు నిర్వహించడానికి వెళ్లవలసిన సమయం వచ్చినట్టే ఉంది."

అతను బెడ్‌రూమ్‌లోకి మాయమయ్యాడు. కొన్ని నిమిషాల తరువాత చాలా మామూలుగా కనిపించే ఒక చర్చ్ ఫాదరీ వేషంలో బయటకు వచ్చాడు. పెద్ద నల్లని టోపీ, వదులయిన పంట్లాము, తెల్లని టై, ముఖం మీద చిరునవ్వు,

ఫాదరీలకు మామూలయిన మెత్తని చూపులు, అన్నీ కలిస్తే అందరికన్నా గొప్ప ఫాదరీ కూడా అతని ముందు బలాదూరే అనిపించింది. హెూమ్స్ మార్చుకున్నది దుస్తులు మాత్రమే కాదు, ముఖం మీద భావాలు, తీరు, అసలు మొత్తం మనిషే మారిపోయి పాత్రలో లీనమయ్యాడు. అతను నేర పరిశోధన రంగంలోకి దిగడంతో, రంగస్థలం ఒక గొప్ప నటుడిని, శాస్త్ర విజ్ఞాన రంగం ఒక గొప్ప పరిశోధకుడిని పోగొట్టుకున్నదని అనవచ్చు.



మేం బేకర్ స్ట్రీట్ నుంచి ఆరుంపావు ప్రాంతాల బయలుదేరాము. తరువాతి గంటకు పదినిమిషాలు ఉండగానే సర్పెంటైన్ అవెన్యూలో ప్రవేశించాము. అప్పటికే చీకటి పడుతున్నది. దీపాలు వెలిగిస్తున్నారు. మేము బ్రయోనీ లాడ్జ్ ముందు అటూ ఇటూ తిరుగుతున్నాము. ఆ యింటి స్వంతదారు ఇంకా రాలేదు. షెర్లక్ హెూమ్స్ వివరించినట్టుగానే ఉంది ఆ యిల్లు. అతను అన్ని వివరాలూ చెప్పాడు. కానీ ఆ ప్రాంతం నేననుకున్నంత ప్రశాంతంగా, ఒంటరితనంగా లేదు.

ప్రశాంతమయిన వాతావరణంలోనే ఒక చిన్న వీధి అది. చాలామంది తిరుగుతున్నారు అక్కడ. ఒక మూలన మురికి దుస్తుల మనుషులు కొంతమంది కూచుని పొగపీలుస్తూ, నవ్వులతో మాట్లాడుకుంటున్నారు. అక్కడే కత్తులు సానబట్టే మనిషి ఒకతను పనిలో ఉన్నాడు. ఇద్దరు పహారా మనుషులు ఒక అమ్మాయితో సరదాగా సరసమాడుతున్నారు. చుట్టలు కాలుస్తూ కొంతమంది కుర్రవాళ్లు పనిలేక తిరుగుతున్నారు.

"చూచావా, ఈ పెళ్లితో వ్యవహారం చిక్కు విడినట్టుంది. ఫొటోగ్రాఫ్ ఇపుడు రెండువేపులా పదునున్న కత్తిగా మారింది. దాన్ని గాడ్‌ఫ్రే నార్టన్ చూడడం కూడా మంచిదికాదని ఆమె అనుకోక తప్పదు. ఇక మన క్లయింట్, రాజకుమారుడుగారి సంగతి ఉండనే ఉంది. ఇపుడు ప్రశ్నంతా ఆ ఫొటోగ్రాఫ్ ఎక్కడ ఉంది, అని" అన్నాడు హెూమ్స్ మేము అక్కడే తిరుగుతుండగా.

"ఎక్కడ ఉంటుంది?"

"నాకు తోచినంత మటుకూ ఆమె దాన్ని వెంటపెట్టుకునే తిరుగుతుందని అనిపిస్తుంది. అది కేబినెట్ సైజ్ ఫొటో. ఆడమనిషి దుస్తులలో దాన్ని దాచుకోవడం అంత సులభం కాదు. రాజుగారు ఎక్కడో దాడిచేసి దాన్ని లాక్కునే ప్రయత్నం చేస్తాడని తెలుసు. అటువంటి సందర్భాలు ఇప్పటికే రెండుసార్లు జరిగినయి. అంటే అది ఆమెవెంట ఉండదని అనుకోవాలేమో"

"మరింక ఎక్కడుంటుంది?"

"ఆ బ్యాంకర్, లేదా లాయర్ ఉన్నాడే, అతని దగ్గర ఉందేమో? అది కూడా కాదనిపిస్తుంది. ఆడవాళ్లు రహస్యాలను బాగా దాచుకుంటారు. అది కూడా ఎవరి మీదా ఆధారపడకుండా. దాన్ని ఆమె ఎవరికయినా ఎందుకివ్వాలి? తానే జాగ్రత్త చేస్తే పోతుంది. ఒక వ్యాపారి చేతిలో పెడితే ఏమవుతుందో చెప్పలేము. పైగా దాన్ని మరో కొన్ని రోజుల్లో వాడవలసి ఉంది కూడా. అంటే అది సులభంగా అందుబాటులో ఉండాలన్నమాట. అంటే ఇంటిలోనే ఉండాలి."

"ఇంట్లో రెండుసార్లు దొంగలు దూరి చూచారు."

"అదే. వాళ్లకు ఎక్కడ చూడాలో తెలియదు."

"నీకు తెలుసా?"

"తెలియదు. కానీ తెలుసుకుంటాను."

"అదెట్లాగా?"

"ఆవిడే చూపేట్లు చేస్తాను."

"ఆమె అంత సులభంగా చూపనంటుంది."

"చూపేట్టు చేస్తాను. బండి చప్పుడవుతున్నది. ఆమె బండే! నేను చెప్పింది గుర్తుంది గదా?"

అతను ఆ మాటలు అంటుండగా, వీధి మలుపుమీద, బండిపక్కన ఉండే దీపాల వెలుగు కనిపించింది. అది చాలా అందమయిన లాండౌ బండి. చప్పుడుచేస్తూ బ్రయోనీ లాడ్జ ముందుకు వచ్చింది. బండి ఆగుతుంటే పనిలేక తిరుగుతున్న ఒక మనిషి తలుపు తీయడానికి పరుగుతో వచ్చాడు. బహుమతి అందుతుందని వాని ఆశ. కానీ మరొకడు వచ్చి మొదటివాడిని తోశాడు. వాడిదీ అదే ఆశ. వాళ్లిద్దరూ పోట్లాడుకుంటున్నారు. ఇద్దరు పహారాదారులు రావడంతో గుంపు మొదలయింది. కత్తెరల మనిషి కూడా వచ్చిచేరాడు. పోట్లాట సాగింది. వాళ్లు గుద్దులాడుకుంటున్నారు. బండిలోనుంచి ఇల్లుగలావిడ దిగింది. ఆమె సరిగ్గా ఆ మనుషుల మధ్యకు రావలసివచ్చింది. హెూమ్స్ ఆమెను చికాకునుంచి తప్పించే ప్రయత్నంలో వచ్చాడు. దగ్గరకు వస్తుండగానే అతను గట్టిగా అరిచి కిందపడ్డాడు. అతని ముఖంలో గాయమయి రక్తం కారుతున్నది. అది చూచిన పహారాదారులు లేచి పరుగెత్తారు. కీచులాడుకుంటున్నవాళ్లు కూడా పారిపోయారు. గమనిస్తున్నాసరే గుంపులో చేరని కొందరు పెద్ద మనుషులు దగ్గరగా వచ్చి ఆడమనిషికి, గాయపడిన మనిషికి సాయం చేసే ప్రయత్నంలో పడ్డారు.



ఐరీన్ ఆడ్లర్, ఇంకా ఆ పేరుతోనే ఆమె గురించి చెపుతున్నాను, వేగంగా మెట్లమీదుగా వెళ్లింది. అందమయిన ఆమె రూపం, హాలు దీపాల వెలుగులో కనపడుతుండగా, అక్కడే నిలబడింది. ఆమె వీధిలోకి చూస్తున్నది.

"పెద్దమనిషికి బాగా దెబ్బతగిలిందా?" అడిగిందామె.

"చనిపోయినట్టున్నాడు" చాలా గొంతులు చెప్పాయి.

"లేదు లేదు, ఇంకా ప్రాణం ఉంది. కానీ ఆసుపత్రికి చేర్చేలోగా పోయేట్టున్నాడు" అన్నది మరో గొంతు.

"చాలా ధైర్యంగల మనిషి. అతనే లేకుంటే, భడవలు అమ్మగారి

పర్స్ అందుకుని పారిపోయి ఉండేవారు. వాళ్లంతా ముందే పథకం వేసుకుని ఈ పనులు చేస్తారు. ఓహో, ఈయనగారు ఊపిరిపీలుస్తున్నట్టున్నారు" అన్నది ఒక ఆడమనిషి.

"ఇతనిలా వీధిలో ఉంటే బాగుండదు. ఇంటిలోకి తీసుకురామా, అమ్మా?"

"తప్పకుండానూ. సిటింగ్ రూమ్‌లోకి తీసుకురండి. మంచి సోఫా ఉందక్కడ. ఇటువేపు!"

"నెమ్మదిగా ఎత్తి అతడిని బ్రయోనీ లాడ్జ్‌లోకి చేర్చారు. పెద్దగదిలో పడుకోబెట్టారు. నేను కిటికీ పక్కనుంచి లోపలికి చూస్తున్నాను. దీపాలు వెలిగించారు. కిటికీ తెరలు మాత్రం తీయలేదు. హోమ్స్ అక్కడ సోఫామీద



పడుకుని ఉండడం కనపడుతున్నది. ప్రయత్నంగా నటిస్తున్నాడు కాబట్టి హోమ్స్, అంత నిర్లిప్తంగా ఉన్నాడని నాకు తోచింది. ఆ అందగత్తె మీద మేము కుట్రపన్నుతున్నట్టున్నాము. ఆవెు చాలా దయగల మనిషి, గాయపడిన మనిషి పట్ల ఆమె చూపిన ఆదరణ అసాధారణం. నాకు మాత్రం ఈ విషయంలో మనసులో కొంచెం అవమానం తోచసాగింది. కానీ ఇప్పుడు నేను వెనకాడితే, హోమ్స్ నా మీద పెట్టిన నమ్మకానికి

ద్రోహం చేసినట్టవుతుంది. గుండె దిటవు చేసుకున్నాను. కోటులోనుంచి స్మోక్ రాకెట్‌ని చేతిలోకి తీసుకున్నాను. దానివల్ల ఆమెకు హాని జరిగేది లేదు. పైగా ఆమె మరొకరికి హాని చేయకుండా ఆపుతున్నాము అంతే.

హోమ్స్ లేచి కూచున్నాడు. అతను ఏదో గాలికోసం కష్టపడుతున్న మనిషిలాగ కనిపించాడు. ఒక పనిమనిషి వేగంగా వచ్చి కిటికీ తెరిచింది. సరిగ్గా అదే క్షణంలో అతను సైగగా చెయ్యెత్తాడు. అది చూడగానే నేను రాకెట్‌ను గదిలోకి విసిరి 'మంటలు, మంటలు' అని అరిచాను. నా అరుపు విన్న వెంటనే, ఆ చుట్టుపక్కలవాళ్లు, పెద్ద మనుషులూ, పనిలేనివాళ్లూ, ఆడంగులూ అందరూ 'మంటలు' అని గట్టిగా అరవసాగారు. గదిలో దట్టమయిన పొగ నిండుకుని కిటికీలోనుంచి బయటకు వస్తున్నది. లోపల అందరూ వేగంగా కదులుతున్నారు. మంటలు లేవని హామీ ఇస్తూ, హోమ్స్ గొంతు వినిపించింది. అరుస్తున్న మనుషుల మధ్యగా దారిచేసుకుంటూ నేను వీధి చివరకు చేరాను. పదినిమిషాలలో నా మిత్రుడు వచ్చి చేరడంతో ఆనందం కలిగింది. మేము అక్కడినుంచి వెళిపోయాము. అతను కొన్ని నిమిషాలపాటు చాలా వేగంగా నడిచాడు. ఎడ్జ్‌వేర్ రోడ్ చేరుతున్నాము.

"డాక్టర్, చెప్పిందంతా సరిగా చేశావు. అంతా సవ్యంగా నడిచింది" అన్నాడు అతను.

"ఫొటోగ్రాఫ్ దొరికిందా?"

"అది ఎక్కడ ఉందో తెలిసింది."

"ఎట్లా తెలిసింది?"

"ఆమే చూపించింది. చూపుతుందని చెప్పానుగదా?"

"నాకు అర్థం కాలేదు."

"ఇందులో పెద్ద రహస్యం లేదయ్యా. అంతా సింపుల్. అయితే అందుకు వీధిలోవాళ్లంతా సాయం చేశారనవచ్చు. వాళ్లందరికీ నేను ముందే

చెప్పి ఉంచాను.”

“నేను అనుకుంటూనే ఉన్నాను.”

“సరే. కీచులాట మొదలయిందా? నేను చేతిలో ఎర్రని పెయింట్ పట్టుకుని ముందుకువెళ్లాను. పడిపోయాను. చేతిని ముఖానికి పూసుకున్నాను. దయనీయంగా కనిపించాను. ఇదంతా పాత ట్రిక్కులే!”

“అదికూడా నాకు అర్థమయింది.”

“వాళ్లు నన్ను లోపలికి తీసుకుపోయారు. ఆమెకు అలా చేయక తప్పలేదు. మరింకేం చేస్తుంది పాపం? నాకు అనుమానం ఉన్న సిటింగ్ రూమ్‌లోకి చేరుకున్నాను. ఆ గది ఆమె బెడ్‌రూమ్ పక్కనే ఉంది. నాకు అక్కడనుంచి పక్క గదులు కూడా కనిపిస్తున్నాయి. నన్ను సోఫామీద పడుకోబెట్టారు. గాలి కావాలన్నట్టు నటించాను. కిటికీ తెరవక తప్పలేదు. నీకు అవకాశం దొరికింది.”

“అయితే ఏం జరిగింది?”

“అదే అసలు సంగతి. ఇల్లు తగలబడుతున్నదంటే ఏ ఆడమనిషయినా తనకు చెందిన ముఖ్యమయిన వస్తువులను కాపాడాలని అనుకుంటుంది. ఈ స్వభావం అందరిలోనూ తప్పకుండా ఉంటుంది. నేను దాన్ని ఇప్పటికే ఒకటి రెండుసార్లు వాడుకున్నాను. డార్లింగ్‌టన్ కేసులో ఇలాగే జరిగింది. ఆర్న్స్‌వర్త్ వ్యవహారంలోనూ జరిగింది. తల్లి తన పిల్లను అక్కున చేర్చుకుంటుంది. పెళ్లికాని ఆడకూతురు తన నగల పెట్టెను అందుకుంటుంది. ప్రస్తుతం మనం గమనిస్తున్న ఈ స్త్రీ ఇంట్లో మనం వెతుకుతున్న వస్తువుకన్నా విలువయినది మరేమీ లేదని నాకు తెలుసు. ఆమె దాన్ని జాగ్రత్త చేయాలని పరుగుపెడుతుంది. మంటలు అనే కేకలు సరిగ్గా అదే చేశాయి. పొగపుట్టింది, అరుపులు వినిపించాయి. ఇక ఎంతటివారయినా భయపడకతప్పదు. ఆమె అనుకున్నట్టే కదిలింది. ఫొటోగ్రాఫ్‌ను తలుపు పక్కనే ఉన్న ఒక స్లయిడింగ్ పానల్ వెనుక



దాచిందామె. క్షణంలో ఆమె అక్కడకు చేరు కున్నది. ఆమె ఫొటోను సగం బయటకు లాగడం నేను చూడగలిగాను. వెంటనే ప్రమాదం ఏమీ లేదని హెచ్చరించాను. ఆమె ఫొటోను తిరిగి పానల్ లోపలికి నెట్టింది. గోలను గమనిస్తూ, గదిలోనుంచి బయటకు వచ్చింది. ఆ తరువాత ఆమె నాకు కనిపించ లేదు. నేను లేచి, క్షమా పణలు చెపుతూ ఇంటి లోనుంచి వచ్చేశాను. అప్పటికప్పుడు ఫొటో గ్రాఫ్‌ను చేజిక్కించుకుందామా అని కొంచెం జంకాను, ఈలోగా బండి మనిషి లోపలికి వచ్చాడు. అతను నన్నే చూస్తున్నాడు. కనుక అక్కడ ఉండడం మంచిది కాదు అనిపించింది. నిర్లక్ష్యం చేస్తే విషయం బయటపడుతుంది.”

“ఇప్పుడేం చేయాలి?”

“మన వెతుకులాట ముగిసినట్టే. నేను రాజుగారితోబాటు రేపు ఆ యింటికి వెళతాను. నీవు కూడా రావచ్చు. మనలను సిటింగ్ రూమ్‌లోకి వచ్చి వేచి ఉండమంటారు. ఆమె వచ్చే సమయానికి అక్కడ మనము ఉండము. ఫొటోగ్రాఫ్ కూడా ఉండదు. తన స్వంత చేతులతో ఫొటోను

తెచ్చుకోవడం రాజుగారికి సంతృప్తికరంగా ఉంటుందనుకుంటాను.”

“ఏ సమయానికి వెళ్లాలి?”

“ఉదయం ఎనిమిది గంటలకు. ఆ సమయానికి ఆమె లేచి ఉండదు. కనుక మనకు వ్యవధి దొరుకుతుంది. మనం సరిగ్గా సమయానికి వెళ్లాలి. పెళ్లి కారణంగా ఆమె బతుకుతీరు, అలవాట్లు మారే అవకాశం ఉంది. ఆలస్యంచేయకుండా రాజుగారికి వయర్ పంపించాలి.”

మేము బేకర్ స్ట్రీట్ చేరుకుని ద్వారం ముందు నిలబడ్డాము. తాళం చెవుల కొరకు జేబులు తడుము కుంటుంటే పక్కనుంచి ఎవరో వెళుతూ “గుడ్ నైట్, మిస్టర్ షెర్లక్ హెూమ్స్” అనడం వినిపించింది.

పేవ్‌మెంట్ మీద ఆ సమయానికి చాలా మందే ఉన్నారు. అయితే గుడ్‌నైట్ చెప్పిన వ్యక్తి బహుశా వేగంగా వెళుతున్న ఒక బక్కపలచని యువకుడిదయి ఉంటుందని అనిపించింది.

“ఆ గొంతు నేను ఇంతకుముందు విన్నాను. ఎవరయి ఉంటారు? ఆశ్చర్యంగా ఉంది” అన్నాడు హెూమ్స్ వీధిలో జనాలను చూస్తూ.

## 3

ఆ రాత్రి నేను బేకర్ స్ట్రీట్‌లోనే పడుకున్నాను. ఉదయం రొట్టె తింటూ, కాఫీ తాగుతుండగా, బొహీమియా ప్రభువులు వేగంగా గదిలోకి దూసుకువచ్చారు.

"నిజంగా దొరికిందా!" ఆయన షెర్లక్ హెూమ్స్‌ను ఆత్రంగా రెండు భుజాలూ పట్టుకుని కుదుపుతూ ముఖంలోకి చూస్తూ అడిగాడు.

"ఇంకా లేదు."

"నమ్మకంగా దొరుకుతుందా?"

"నమ్మకముంది."

"అయితే పదండి. నాకు ఓపిక ఏమాత్రం కుదరడం లేదు."

"బండి పిలవాలిగదా?"

"ఎందుకు, నా బ్రౌహామ్ ఉందిగదా?"

"అయితే పని సులభం." మేమందరమూ దిగి బ్రయోనీ లాడ్జ్‌వేపు బయలుదేరాము.

"ఐరీన్ అడ్లర్‌కి పెళ్లయింది" అన్నాడు హెూమ్స్.

"పెళ్లయిందా! ఎప్పుడు?"

"నిన్న."

"ఎవరితో?"

"నార్టన్ అనే పేరుగల ఒక ఇంగ్లీషు న్యాయవాదితో."

"ఆమె అతనిని ప్రేమించి ఉండదు."

"ప్రేమించిందనే నేను అనుకుంటున్నాను."

"ఎందుకలా నమ్ముతున్నారు?"

"ప్రభువులవారికి ఇక ముందు ఎటువంటి చికాకూ ఉండదు కనుక. ఆవిడగారు భర్త మీద ప్రేమ కలిగి ఉంటే, ఇక మిమ్మలిని ప్రేమించదు. మీమీద ప్రేమ లేదంటే, మీ పథకాలలో అడ్డు తగలవలసిన అవసరం ఆమెకు ఉండదు."

"నిజంగానే. అయినా.... సరే! ఆమె మా తాహతుకు తగిన మనిషి అయి ఉంటే ఎంత బాగుండేది! రాణిగా ఆమె బాగా రాణించి ఉండేది!" ఆ తరువాత ఆయన ఆలోచనలో మునిగినట్టు మౌనంగా ఉన్నాడు. సర్పెంటయిన్ అవెన్యూ చేరేవరకూ మౌనం సాగింది.

బ్రయోనీ లాడ్జ్ తలుపులు తీసే ఉన్నాయి. ఒక పెద్దవయసు ఆవిడ మెట్ల మీద నిలబడి ఉన్నది. మేము బ్రౌహామ్ లోనుంచి దిగడాన్ని ఆమె అనుమానంగా గమనిస్తున్నది.

"మిస్టర్ షెర్లక్ హోమ్స్ గారు అనుకుంటాను" అన్నది ఆమె.

"నేనే మిస్టర్ హోమ్స్" అన్నాడు నా మిత్రుడు. ఆమె వేపు ఆశ్చర్యంగానూ, ప్రశ్నార్థకంగానూ చూస్తూ.

"మంచిది. మా యజమానురాలు మీరు వస్తున్నారని చెప్పారు. ఆవిడ ఈ ఉదయమే చారింగ్‌క్రాస్ స్టేషన్ నుంచి 5:15 రైలుకి బయలుదేరి భర్తగారితోపాటు వెళ్లిపోయారు."

"ఏమిటి!" షెర్లక్ హోమ్స్ ఒక్క అడుగు వెనక్కువేశాడు. ఆశ్చర్యము, అసంతృప్తి కలిసి అతను తెల్లబోయాడు. "ఆవిడ ఇంగ్లండ్‌వదిలి వెళ్లిపోయారా?"

"తిరిగి రారు కూడా."

"కాగితాలేమయినాయి?" రాజుగారు బొంగురు గొంతుతో అడిగారు.

"మనమే చూద్దాం" అంటూ హోమ్స్ సర్వెంట్ పక్కనుండి దూరుతూ, డ్రాయింగ్ రూమ్‌లోకి వెళ్లాడు. రాజుగారు, నేనూ వెంట వెళ్లాము. ఫర్నిచర్

అస్తవ్యస్తంగా తోసి ఉంది. షెల్ఫ్‌లు, డ్రాలు తెరిచి ఉన్నాయి. వెళ్లి పోయేముందు ఆవిడ ఆత్రంగా వాటన్నిటినీ కెలికినట్టుంది. హోమ్స్ తలుపుపక్కన స్లయిడింగ్ షటర్ వద్దకు వెళ్లి దాన్ని కదిలించాడు. లోపల చెయ్యిపెట్టి ఒక పొటోగ్రాఫ్‌ను, ఒక ఉత్తరాన్ని బయటకు తీశాడు. ఫొటోగ్రాఫ్, ఈవినింగ్ డ్రస్‌లో అందంగా కనపడుతున్న ఐరీన్ ఆడ్లర్‌ది. ఉత్తరం మీద, గౌరవనీయులు షెర్లక్ హోమ్స్‌గారికి, ఆయనగారు వచ్చినప్పుడు అందించవలసినది, అని రాసి ఉంది. నా మిత్రుడు దాన్ని తెరిచాడు. ముగ్గురమూ ఏకంగా చదివాము. ముందు రాత్రి అర్ధరాత్రి సమయంలో రాసిన ఉత్తరం అది.

*ప్రియమైన, మిస్టర్ షెర్లక్ హోమ్స్ గారికి,*

*మీరు వ్యవహారం బాగా నడిపించారు. నన్ను బాగా మభ్యపెట్టారు. మంటల గురించి అరుపులు వినిపించేదాకా నాకు అనుమానవే కలగలేదు. నేను విషయం బయటపెట్టానని తెలిసిన తరువాత ఆలోచన మొదలయింది. మీ గురించి నన్ను నెలల క్రితమే హెచ్చరించారు. రాజుగారు పనికి ఎవరినయినా ఆశ్రయిస్తారంటే అది తప్పక మీరే అవుతారని చెప్పారు. మీ చిరునామా కూడా నాకు ఇచ్చారు. అయినా సరే మీరు నన్ను, మీకు కావలసిన సమాచారం బయటపెట్టేట్టు చేశారు. అనుమానం కలిగిన తరువాత కూడా, అంత దయామయుడయిన ఫాదరీ గురించి మరోలా అనుకోవడం నచ్చలేదు. కానీ, నటనలో నేను కూడా, శిక్షణ పొంది ఉన్నానని మీకు తెలుసును. మగ వేషం వేయడం నాకు తెలియనిది కాదు. అది నాకు అప్పుడప్పుడు అవసరమయిన సహాయాన్ని అందజేస్తుంది. నేను జాన్ అనే మా బండి*

*మనిషిని మిమ్మల్ని గమనించవలసిందిగా పంపాను. వేగంగా పై గదిలోకివెళ్లి వాకింగ్ దుస్తులలోకి బయలు దేరాను. మీరు వెళిపోయేలోగా కిందకు వచ్చాను.*

*సరే, ఇక మీవెంటనే మీ ఇంటిదాకా వచ్చాను. అంతగా పేరుపొందిన షెర్లక్ హెూమ్స్‌గారికి నాపట్ల ఆసక్తి ఉందని స్థిరంగా తెలుసుకోవడం సంతోషం. కానీ, కొంచెం మితిమీరి మీకు గుడ్‌నైట్ చెప్పాను. అక్కడి నుంచి టెంపుల్‌కు అంటే నా భర్త దగ్గరికి వెళ్లాను.*

*ఇద్దరమూ ఆలోచించి ఇక్కడినుంచి వెళ్లిపోవడమే మంచిదని అనుకున్నాము. ఎదురులేని ప్రత్యర్థితో పోటీ పడడం మంచిది కాదని నిర్ణయించుకున్నాము. మీరు రేపు వచ్చేసరికి గూడు ఖాళీగా ఎదురవుతుంది. ఇక ఫొటోగ్రాఫ్ విషయానికి వస్తే, మీ క్లయింట్‌గారిని నిశ్చింతగా ఉండమని చెప్పండి. ఆయనకన్నా ఎక్కువగా నన్ను ప్రేమించే, నేను ప్రేమించే వ్యక్తి దొరికారు. ఆయనవల్ల, తీవ్రంగా మోస పోయిన వ్యక్తి నుంచి ఎటువంటి అడ్డంకులూ రావని రాజుగారికి చెప్పండి. కానీ, ఆయన వేసే ఎత్తులకు వ్యతిరేకంగా, ఒక ఆయుధంగా నేను దాన్ని నా దగ్గరే ఉంచుకుంటాను. ఆయన కావాలనుకుంటే, నా ఫొటోగ్రాఫ్ ఒకదాన్ని ఇక్కడే వదులుతున్నాను. ప్రియమయిన మిస్టర్ షెర్లక్ హెూమ్స్ గారు*

*తమ విధేయురాలు,*

*ఐరీన్ నార్టన్, (ఆడ్లర్)*

“ఓహెూ, ఏం మనిషి! – ఏం మనిషి!” గట్టిగా అన్నాడు బొహీమియా ప్రభువు. “ఆమె చాలా చురుకయినదని, తెలివిగలదని చెప్పాను కదా?



రాణిగా నిజంగా ఆమె బాగా రాణించేది కదా? ఆమె మా తాహతుకు తగిన వ్యక్తి కాకపోవడం నిజంగా దయనీయం."

"నేను గమనించిన విషయాలను బట్టి చూస్తే, ఆమె ఏ రకంగా చూచినా, ప్రభువులకన్నా వేరుస్థాయిలోనే ఉంది. నా పనిని నేను విజయవంతంగా చేయలేకపోయానని మాత్రం చాలా బాధగా ఉంది" అన్నాడు హెూమ్స్ నిర్లిప్తంగా.

"అదేమీ లేదు. మైడియర్ సర్! ఇంతకంటే విజయం మరేం కావాలి? ఆమె ఆడినమాట తప్పదని మాకు బాగా తెలుసు. ఆ ఫొటోగ్రాఫ్‌ను తగలబెడితే ఎంతో ఇప్పుడూ అంతే" అన్నాడు మహారాజు.

"ప్రభువులు అలా అనడం సంతోషం."

"మేము మీకు ఎంతో రుణపడి ఉన్నాము. ఏరకంగా తీర్చుకోవాలో చెప్పమని ప్రార్థన. ఈ ఉంగరం..." అంటూ ఆయన చేతివేలి నుంచి ఎమరల్డ్ తాపిన స్నేక్ రింగ్‌ను తీసి అరచేతిలో పట్టుకుని ముందుకు చాపారు.

"ప్రభువుల దగ్గర దానికంటే విలువయిన వస్తువు మరొకటి ఉంది" అన్నాడు హోమ్స్.

"మీరు చెప్పడం ఒక్కటే తక్కువ."

"ఈ ఫొటోగ్రాఫ్!"

మహారాజు అతనివేపు ఆశ్చర్యంగా చూచాడు.

"ఐరీన్ ఫొటోనా?! కావాలంటే తప్పకుండా తీసుకోండి" గట్టిగా అన్నారాయన.

"ప్రభువులకు ధన్యవాదాలు. ఇక ఈ విషయంలో చేయగలిగిందేమీ లేదు. ప్రభువుల నుంచి సెలవు తీసుకునే గౌరవం మాకు కలిగించండి" అతను వంగి లేచి వెనకకు మళ్లాడు. రాజుగారు ముందుకు చాచిన చేతిని గమనించనే లేదు. నాతోబాటు నడవడం మొదలుపెట్టాడు.

బొహీమియా రాజ్యాన్ని ప్రభావితంచేయగల ఒక స్కాండల్ ఆ రకంగా అంతమయింది. మిస్టర్ షెర్లక్ హోమ్స్ వేసిన పథకాలను ఒక ఆడమనిషి తెలివిగా తిప్పికొట్టింది. అతను ఎప్పుడూ ఆమె తెలివిగురించి చెప్పి నవ్వుతుంటాడు. ఈ మధ్యన మాత్రం అటువంటి సందర్భం రాలేదు. ఐరీన్ ఆడ్లర్ గురించి చెప్పినా సరే, ఆ ఫొటోగ్రాఫ్ ప్రసక్తి వచ్చినా సరే, అతను కేవలం ఆ స్త్రీ అనే గౌరవవాచకాన్ని మాత్రమే ఎప్పుడూ వాడేవాడు.





2

# ఎర్ర తలల సంఘం

పోయిన సంవత్సరం ఆకురాలు కాలంలో ఒకానొక రోజు నేను మిత్రుడు షెర్లక్ హెూమ్స్ ఇంటికి వెళ్లాను. ఆ సమయానికి అతను ఒక లావుపాటి పెద్ద మనిషితో తీవ్రంగా మాట్లాడుతున్నాడు. ఆ పెద్దమనిషి జుట్టు ఎర్రని ఎరుపుగా ఉంది. వాళ్లకు అడ్డు వస్తున్నానేమో అనుకుని క్షమాపణలు చెబుతూ పక్కకు పోదామనుకుంటుండగా హెూమ్స్ నన్ను చెయ్యి పట్టుకొని గట్టిగా లోపలకి లాగి తలుపు వేసేశాడు.

"వాట్సన్, నువ్వు రావడానికి ఇంతకంటే మంచి సమయం మరోటి ఉండదు తెలుసా" అన్నాడు ఆదరంగా.

"మీరు పనిలో ఉన్నారనుకున్నాను"

"అవును! పనిలోనే ఉన్నాను"

"మరయితే నేను పక్క గదిలో వేచి ఉంటాను"

"కాదు.. కాదు.. విల్సన్ గారు, ఈ పెద్దమనిషి నా కేసులన్నింటిలోను నాకెంతో సాయంగా ఉంటూ వచ్చారు. ఈ మనకేసులో కూడా ఆయన తప్పకుండా సాయపడగలరని నాకు గట్టి నమ్మకం ఉంది"

లావుపాటి పెద్ద మనిషి కుర్చీలోనుంచి కొద్దిగా లేస్తూ నమ

స్కారపూర్వకంగా ముందుకు వంగాడు. కానీ అతని మిడిగుడ్లలో చిన్నపాటి ప్రశ్నలేవో నాకు కనిపించాయి.

"సెటి మీద కూర్చో" అన్నాడు హెూమ్స్.

తాను వెళ్లి తన కుర్చీలో కూర్చున్నాడు. రెండు చేతులవేళ్ల కొసలను తగిలేట్లు పట్టుకొని ఆలోచిస్తున్నాడు. నిజంగా ఆలోచిస్తున్నప్పుడు అతను అట్లాగే ఉంటాడు. "మై డియర్ వాట్సన్! విచిత్రంగాను, మామూలు కంటే వేరుగాను ఉండే విషయాలలో నాకెంత ఆసక్తి ఉందో నీకూ అంతే ఉంటుందని నాకు తెలుసు. ఆ విషయాన్ని నీవు నా కేసులను గురించి రాయడంలో చక్కగా వ్యక్తం చేశావు. అంతేకాదు నువ్వు ఒప్పుకుంటావో లేదోగానీ వాటి విలువను మరింత పెంచావు కూడా"

"నీ కేసులు నిజంగా చాలా ఆసక్తికరమయినవి" నేనన్నాను.

"మొన్నొకసారి మిస్ మేరీ సూదర్‌లాండ్ గారి కేసు గురించి మాట్లాడుతూ ఉండగా నేనన్న మాటలు నీకు తప్పక గుర్తుండి ఉంటాయి. చిత్రమయిన సందర్భాలు, అసాధారణమయిన విషయాలు మన బ్రతుకుల్లోనే ఉంటాయని ఆలోచనల్లో, ఊహల్లో అవి నిజంగా పండవని అన్నాను కదూ."

"మీ మాటను కాదనే సాహసం కూడా నేను చేశాను."

"అవును.. అవును డాక్టర్, కానీ ఎప్పుడో ఒకసారి నీవు నన్ను ఒప్పుకుంటావు. అప్పటివరకు నీకు నేను నిజాల మీద నిజాలను చెబుతూనే ఉంటాను. ఇక ఇప్పుడు జబేజ్ విల్సన్ గారు ఇవ్వాళ పొద్దున్నే వచ్చారు. ఆయన చెప్పిన విషయాలు నేను వింటూ ఉన్నాను. అన్నింటికన్నా వింత విషయాలు, సాటిలేని సంగతులు చిన్న చిన్న నేరాల్లోనే ఉంటాయని నేను అనే వాడిని కదూ. నిజంగానే అసలు అనుమానానికి తావులేదు అనిపించిన నేరాల్లో ఇలాంటివన్నీ దాగుంటాయి. నేను విన్నంతవరకు ఈయనగారు చెబుతున్న కేసు నిజంగా నేరమా కాదా చెప్పలేను. కానీ ఆ విషయాలు మాత్రం ఎంతో చిత్రంగా ఉన్నాయి. అయ్యా విల్సన్ గారు, దయచేసి మీరు

మళ్లీ మొదటినుంచి మీరు చెప్పిందంతా మరోసారి చెప్పాలి. డాక్టర్ వాట్సన్ వాటిని వినలేదని కాదు నేనంటున్నది. ఈ కథ చిత్రమయినది. ఇందులోని వివరాలన్నీ లోతుగా మీనోటి వెంట వినాలన్నది నా కోరిక. అలా వింటూ ఉంటే నాకిప్పటివరకూ జ్ఞాపకమున్న వేలాది కేసుల్లోనుంచి ఇలాంటి సంఘటనలన్నీ నాకు గుర్తుకొస్తాయి. ఈ మీ కేసులో మాత్రం నాకలా మరేవీ గుర్తుకు రాలేదని చెపితే నమ్మగలరా!"

లావుపాటి క్లయింటు తనకేదో గౌరవం జరిగినట్టు ఒకసారి ఎద పొంగించుకున్నాడు. గ్రేట్ కోట్ లోపలి జేబుల్లో నుంచి నలిగిపోయిన పాత న్యూస్ పేపర్ కాగితాన్ని ఒకదాన్ని బయటకు లాగాడు. తల బాగా ముందుకు వంచి కాగితాన్ని మోకాళ్లమీద చదును చేసి అందులోని ప్రకటనల కాలమ్‌లో ఏదో వెతుకుతూ ఉన్నాడు. నేను ఆయన్ని బాగా గమనిస్తూ ఉన్నాను. నా మిత్రుడు అలా గమనించి వాళ్ల దుస్తులు, రూపు రేఖలు ఆధారంగా ఎన్నెన్నో సంగతులు చెపుతాడు. నేనా పద్ధతిలో ఏదయినా పసిగట్టగలనేమోనని ప్రయత్నం.



అయితే నా పరిశీలనతో తెలిసిందేమీ లేదు. వచ్చిన పెద్దమనిషి చాలా మామూలు బ్రిటిషు వ్యాపారిలాగా లావుగా, మందకొడిగా ఉన్నాడంతే. వదులుగా ఉన్న పంట్లాము వేసుకున్నాడు. అంతగా శుభ్రంగా లేని నల్లని ఫ్రాక్ కోటు ముందు గుండీలు పెట్టుకోలేదు. లోపలి వేయిస్టు కోటు నుంచి

బరువయిన ఆల్బర్ట్ చైన్ వేలాడుతోంది. దాన్నుంచి ఒక నాలుగుమూలల పతకం వేలాడుతోంది. రంగు వెలిసిన టోపి, అలాంటిదే కోటు పక్కన పెట్టి ఉన్నాయి. కోటు కాలరు నలిగి ఉంది. అతడిని ఎంత గమనించినా ప్రత్యేకత ఏమీ కనిపించడం లేదు. తల జుట్టుమాత్రం ఎర్రని ఎరుపు. ముఖంమీద బాధ, అసంతృప్తి తప్ప.

షెర్లక్ హోమ్స్ చురుకు కళ్లు పనిలోకి దిగాయి. ఒక చిరునవ్వుతో అతను తల కదిలించాడు. నా ముఖం మీది ప్రశ్నలను గమనించాడు. "ఒకప్పుడు ఈయన లేబర్ పని చేశాడని, నశ్యం పీలుస్తాడని, ఫ్రీమేసన్ అని, చైనా వెళ్లివచ్చాడని, ఈ మధ్యనే చాలా రాశాడని తప్ప నాకు ఈయన గురించి ఎక్కువగా ఏమీ అందడం లేదు" అన్నాడతను.

జబేజ్ విల్సన్ ఒక్కసారిగా కుర్చీలో నిలువుగా కూర్చున్నాడు. అతని చూపుడువేలు పాత కాగితంమీద ఉంది. చూపులు మాత్రం మా నేస్తం కళ్లలోకి గుచ్చుకుంటున్నాయి.

"ఇవన్నీ మీకు ఎట్లా తెలిశాయి మిస్టర్ హోమ్స్. ఉదాహరణకు నేను కూలీగా పని చేశానని ఎలా చెప్పారు? నిజంగానే నేను ఒక ఓడలో కార్పెంటర్‌గా పని చేశానండీ బాబూ."

"అయ్యా మీ చేతులు. మీ ఎడమచెయ్యి కన్నా కుడిచెయ్యి ఒక నంబర్ పెద్దదిగా ఉంది. మీరా చేతితో బాగా పని చేశారు. అందుకే కండరాలు బాగా పెరిగాయి."

"మరి నశ్యమూ, ఫ్రీమేసన్రీల సంగతేమిటి?"

"ఆ సంగతులు చెప్పి మీ తెలివిని అవమానించదలుచుకోలేదు. మరి మీరేమో నియమాలకు వ్యతిరేకంగా బ్రెస్ట్‌పిన్ పెట్టుకున్నారాయె."

"అవునండీ! నేను మరిచే పోయాను. మరి రాత సంగతి?"

"మీ కుడిచేతి కఫ్‌ని గమనించారా? అయిదు అంగుళాల పాటు

మెరుస్తోంది. ఎడమ మోచేతి మీదేమో దాన్ని బల్లమీద ఆన్చిన చోట అరిగి ఉంది.”

“భలే! మరి చైనా?”

“మీ కుడి మణికట్టు మీద చేపబొమ్మ పచ్చ పొడిచి ఉందే, అది చైనాలో తప్ప మరోచోట వీలుకాదు. పచ్చబొట్లను గురించి నేను కొంత పరిశోధించాను. ఆ విషయం మీద కొన్ని పేపర్లూ రాశాను. చేప పొలుసులను పింక్ రంగుతో గీయడం ఒక్క చైనాలోనే ఉంది. ఇకపోతే మీ గడియారపు చైను చివరన ఒక చైనీస్ నాణెం వేలాడుతోంది. ఇవన్నీ ఏం చెపుతున్నాయి?”



జబేజ్ విల్సన్ గట్టిగా నవ్వాడు. "ఏమండీ, మీరేదో చాలా తెలివి ఉపయోగించారనుకున్నాను. కానీ అంతా మామూలుగా తెలుసుకున్నారే."

"వాట్సన్! నేను ఈ వివరణలను ఇచ్చి తప్పు చేస్తున్నానేమో అనిపిస్తుందయ్యా. నేను మరీ ఇంత అమాయకంగా చెప్పేస్తూ ఉంటే నాకు ఉన్న పేరు కాస్తా మునిగిపోయేట్లు ఉంది. అవును గానీ, విల్సన్ గారూ! ఇంతకూ ప్రకటన దొరికిందా లేదా?"

"అయ్యా! దొరికిందండి. ఇదిగో. అంతా దీంతోనే మొదలయ్యింది." తన లావుపాటి ఎర్రని వేలితో కాలమ్ మధ్యలో ప్రకటనను చూపిస్తూ "మీరిది చదువుతారా సర్" అన్నాడు.

నేనా పేపర్ అందుకుని చదవసాగాను.

*ఎర్ర తలల సంఘం వారికి:*

> *అమెరికాలోని పెన్సిల్వేనియా, లెబనన్ వాసి స్వర్గీయ ఎజెకియా హాప్‌కిన్స్ గారి వీలునామా మేరకు మరొక వేకెన్సీ వచ్చినది. ఇందుకు వారానికి నాలుగు పౌండ్లు ఇవ్వనవును. పని మాత్రం తేలికగానే ఉంటుంది. ఎర్రని జుట్టు కలిగి, శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యంగా ఉన్న, ఇరవై ఒక్క సంవత్సరాల వయస్సు పైబడిన వారందరూ అర్హులే. అప్లయ్ చేయదలచిన వారు వ్యక్తిగతంగా ఫ్లీట్ స్ట్రీట్, సెవెన్ పోప్స్ కోర్ట్‌లోని లీగ్ కార్యాలయానికి వచ్చి డంకన్ రాస్ గారిని సంప్రదించగలరు.*

"నేను ఆ విచిత్రమయిన ప్రకటనను రెండుసార్లు చదివిన తరువాత "ఇంతకూ ఏమిటిది, విచిత్రం" అని అడిగాను.

హోమ్స్ కొంచెం నవ్వాడు. కుర్చీలో కదిలాడు. తనకు మూడ్ బాగా కుదిరినప్పుడు అట్లా నవ్వుతుంటాడు. "ఇదంతా మామూలుగా మాత్రం

లేదుకదూ. ఇక మిస్టర్ విల్సన్, మళ్లీ మొదటికి వెళ్లిపొండి. మీ గురించి, మీపని గురించి, మీ ఇంటిని గురించి, ఈ ప్రకటన ప్రభావం గురించి సవివరంగా చెప్పండి. ఈలోగా డాక్టర్, ఆ పేపరు తేదీ నోట్ చేసుకో."

"ఇది ఏప్రిల్ 27, 1890 నాటి ద మార్నింగ్ క్రానికల్. సరిగ్గా రెండు నెలల కిందది.

"బాగుంది. ఇక మిస్టర్ విల్సన్, చెప్పండి."

"సరే. ఇందాక నేను చెపుతున్నదే, మిస్టర్ షెర్లక్ హెూమ్స్." జబేజ్ విల్సన్ నుదుటిని తుడుచుకున్నాడు: "కోబూర్గ్ స్క్వేర్‌లో నాకు పాన్ బ్రోకర్ వ్యాపారం, చిన్నది ఉంది. అంత గొప్పగా ఏమీ నడవడం లేదు. ఏదో నా బతుకు గడుస్తుంది అంతే. ఒకప్పుడు ఇద్దరు అసిస్టెంట్‌లు ఉండేవారు. ఇప్పుడు ఒకడే మిగిలాడు. అతనికి జీతమివ్వ డానికి నేను మరో కొలువు చెయ్యాల్సి వచ్చేదేమో. కానీ అతగాడు సగం డబ్బులకే పని చేస్తున్నాడు."

"అంతమంచి మనిషి ఎవరండీ ఆయన" అడిగాడు షెర్లక్ హెూమ్స్.

"అతడి పేరు విన్సెంట్ స్పాల్డింగ్. మరీ అంత కుర్రవాడేమీ కాదు. అతని వయసెంతో చెప్ప డం కష్టం. మరీ చురు కయిన అసిస్టెంట్లతో కష్టం మిస్టర్ హెూమ్స్. పైగా అతను మరెక్కడికి వెళ్లినా రెండంతలు సంపాదించు కోగలుగు తాడని ఎరుగు దును. కానీ అతనికే



సంతృప్తిగా ఉంటే, నేనెందుకూ లేనిపోని ఆలోచనలు పెట్టుకోవడం."

"అవునవును.. తక్కువ జీతానికే పనికి మనుషులు దొరకడం నిజంగా మీ అదృష్టం. ఈ కాలంలో ఎవరికీ అట్లా దొరకడం లేదు. మీ ప్రకటన లాగే, మీ అసిస్టెంట్ కూడా విచిత్రంగానే ఉన్నట్టున్నాడు."

"అతని బాధలు అతనికున్నాయి లెండి. ఫొటోగ్రఫీ వెర్రి ఉందతనికి. ఊరికే కెమేరాతో కుస్తీ పడుతుంటాడు. అదే పనిగా కుందేలులాగా సెల్లార్‌లోకి దూరతాడు. అక్కడ ఆ బొమ్మల్ని డెవలప్ చేస్తూ ఉంటాడు. అదొక్కటే అతనితో సమస్య. మొత్తంమీద మంచి పనిమంతుడే. మరే చెడ్డ అలవాట్లు లేవు."

"అతనింకా మీ దగ్గర పని చేస్తూనే ఉన్నాడనుకుంటాను?"

"అవునండి. అతనూ, మరో పద్నాలుగేళ్ల అమ్మాయి ఉన్నారు. అమ్మాయి వంట చేస్తుంది. ఇంటిని కాస్త శుభ్రంగా ఉంచుతుంది. ఇంట్లో ఉండేది వీళ్లిద్దరే. నా భార్య ఎప్పుడో పోయింది. కుటుంబమంటూ ఎవరూ లేరు. మేము గుట్టు చప్పుడుగా బతుకు తుంటాం. అంటే ఈ ముగ్గురమూ అన్న మాట. ఎవరి చేతా మాట పడకుండా కాలం గడుస్తున్నది. అంతకన్నా మరేమీ లేదు. మమ్మల్ని ఇదుగో, ఈ ప్రకటన బయటికి లాక్కు వచ్చింది. సరిగ్గా ఎనిమిది వారాల క్రితం ఇదే రోజున స్పాల్డింగ్ ఈ కాగితంతో ఆఫీసులోకి దూసుకు వచ్చాడు. అతను అనసాగాడు."



"విల్సన్ గారూ, దేవుడు నా జుట్టు ఎర్రగా పెడితే ఎంత బాగుండునండీ."

"అదేమిటి" అడిగాను నేను.

"ఏమిటా! ఇదిగో ఎర్రతలల సంఘంలో మరో ఖాళీ వచ్చిందండి. అందులో కుదిరిన వారికి అదృష్టం పట్టినట్టే. అక్కడ ఖాళీలు ఎక్కువ, అందుకునే వాళ్లు తక్కువగా ఉన్నట్టున్నారు. ట్రస్టీలకు డబ్బంతా ఏం చేయాలో అర్థం గావడం లేదు. నా జుట్టు రంగు మారగలిగితే నేను వెళ్లి అందులో కుదిరిపోయే వాడిని." అన్నాడతను."

"ఇంతకూ ఏమిటది? అని నేనడిగాను. నేనేమో ఇల్లు కదలని రకం. నా వ్యాపారమేదో నా దగ్గరికి నడచి వస్తుంది. నేనెక్కడికి వెళ్లనవసరం లేదు. కనుక వారాల పాటు నేను కడప దాటకుండా బతుకుతూ ఉంటాను. అందుకే నాకు బయటప్రపంచంలో ఏం జరుగుతున్నదీ తెలియనే తెలియదు. ఒక ముక్క తెలిస్తే సంతోషమవుతుంది."

" 'మీకు లీగ్ ఆఫ్ ద రెడ్ హెడెడ్ మెన్, ఎర్రతలల సంఘం గురించి తెలియదా?' అని అడిగాడతను. నేను తెలియదన్నాను. దానికతను ఆశ్చర్య పడుతూ ఈ ఖాళీకి మీరు సరిగ్గా కుదురుతారు తెలుసా, అన్నాడు."

"ఏం గిట్టుతుంది? అని అడిగాను."

"సులభంగా ఏడాదికి రెండు వందలు. పని చాలా సులువు. మనం మరోపని చేసుకున్నా అడిగేది లేదు."

"ఈ మాటలతో నాకేదో ఉత్సాహం పుట్టింది. నా వ్యాపారం నిజానికి అంత గొప్పగా సాగడంలేదని చెప్పనే చెప్పాను కదా. అదనంగా మరో రెండువందలు దొరికితే అంతకన్నా కావాల్సిందేముంది.

"వివరాలు చెప్పు" అన్నాను.

అతను నాకు ప్రకటన చూపించాడు. ఎర్ర తలల సంఘంలో వేకెన్సీ

ఉందని చూస్తూనే ఉన్నారు కదా. వాళ్ల చిరునామా, వివరాలు ఇందులో ఉన్నాయి. నాకు తెలిసినంత వరకూ ఎజెకియా హాప్‌కిన్స్ అనే అమెరికన్ కోటీశ్వరుడు దీన్ని ప్రారంభించాడు. ఆయన తల కూడా ఎర్రని ఎరుపు. అలాంటి జుట్టున్న వాళ్లంటే ఆయనకు బోలెడంత సానుభూతి. కనుక తన ఆస్తిలో కొంత భాగాన్ని ఎర్రజుట్టు వాళ్లకు అందించే ఏర్పాటు చేయాలని ఒక ట్రస్టు ప్రారంభించి పోయాడాయన. ఇక్కడ జీతం ఎక్కువ, పని తక్కువ.'

"కానీ నాలాగా ఎర్రజుట్టు ఉన్నవాళ్లు ఎంతోమంది ఉంటారు కదా"

" 'మీరనుకున్నంత మంది ఉండరులెండి.' అన్నాడతను. 'ఇందులో లండన్ వాసులకు మాత్రమే, అందునా కాస్త వయసున్న వాళ్లకు మాత్రమే పని. ఈ అమెరికన్ యువకుడిగా ఉండగా లండన్‌లోనే ఆస్తి సంపాదించాడు. కనుక ఇక్కడివాళ్లకు ఏదో చేయాలని తపన. పైగా తల జుట్టు ఎరుపుగా ఉన్నంత మాత్రాన ఈ ఉద్యోగం దొరికేది లేదు. అది నిజంగా ఎర్రని ఎరుపుగా మంటలాగుండాలి. మీరు గాని అప్లయ్ చేశారంటే మీకు ఉద్యోగం దొరికినట్టే. ఒకసారి ప్రయత్నించి చూస్తే తప్పేమిటండి.'

"అయ్యా, మీరు చూస్తున్నారుగదా. నా జుట్టు నిజమయిన ఎరుపు. కనుక నాకు ఈ ఉద్యోగం దొరికి తీరుతుందని నమ్మకం కలిగింది. చెప్పొద్దూ, విన్సెంట్ స్పాల్డింగ్‌కి దీన్ని గురించి తెలిసి ఉండడం మరో విషయం. కనుక నేను వెంటనే కొట్టు కట్టేసి, అతడిని నాతో రమ్మన్నాను. అతనికీ అది నచ్చింది. ఇద్దరమూ కలసి ప్రకటనలో ఇచ్చిన చిరునామాకేసి బయలుదేరాము."

"అక్కడ అలాంటి దృశ్యం కనబడుతుందని నేను అనుకోలేదు మిస్టర్ హోమ్స్. నాలుగు దిక్కుల నుంచి మనుషులు అందరూ అక్కడే చేరుకున్నారు. ఫ్లీట్ స్ట్రీట్ ఎర్రజుట్టు తలలతో నిండిపోయింది. అదంతా ఏదో ఎర్రని పంటలాగా కనిపించింది. ప్రకటన చూచి ఇంతమంది వస్తారని నేననుకోలేదు. గడ్డి ఎరుపు, ఆరెంజ్, ముదురు ఎరుపు, మట్టి ఎరుపు, రకరకాల తలలు. కానీ స్పాల్డింగ్ చెప్పినట్టు నిజంగా మంట ఎరుపు జుట్టున్న

వాళ్లు మాత్రం తక్కువే. అయినా ఆ గుంపును చూచి నేను వెనక్కు తగ్గి ఉండే వాడిని. స్పాల్డింగ్ పట్టుబట్టాడు. ఏం చేశాడో తెలియదుగానీ నన్ను గుంపులోనుంచి లాగుతూ నేరుగా ఆఫీసు తలుపు ముందుకు చేర్చాడు. అక్కడ లోనికి ఆశగా పోయేవాళ్లు ఒక వరుస అయితే నిరాశతో బయటకు వచ్చేవాళ్లు మరో వరుస. మొత్తానికి మేము లోపలికి దూరాము."

"మొత్తానికి అంతా సరదాగా జరిగింది, కదూ" అన్నాడు హెూమ్స్. ఈలోగా క్లయింటు ఓ నశ్యం పట్టుపట్టి కొంచెం ఊపిరి పీల్చుకున్నాడు. అతను మళ్లీ చెప్పసాగాడు.

"ఆఫీసంటూ హంగులేమీ లేవక్కడ. ఓ నాలుగు కర్ర కుర్చీలున్నాయి. ఓ మామూలు టేబుల్ ఉంది. దాని వెనుక కూర్చున్న మనిషి తల నా తలకన్నా ఎరుపు. వచ్చిన ప్రతి క్యాండిడేట్‌ను అతనేదో అడుగుతున్నాడు, ఉద్యోగం లేదు పొమ్మంటున్నాడు. ఉద్యోగం దొరకడం అంత సులభమేమీ కాదన్నమాట. కానీ నా వంతు వచ్చేసరికి అతనెందుకో మెత్తబడినట్టు అనిపించింది. లేచివెళ్లి తలుపు మూశాడు. ఏదో రహస్యం మాట్లాడుతాడు అన్నట్టు.

" 'ఈయనగారి పేరు జబేజ్ విల్సన్. వేకెన్సీలో చేరతామంటున్నారు' అన్నాడు నా అసిస్టెంట్.

"అందుకు నిజంగా తగినట్టున్నారే ఈయన, అన్నాడు ఆ మనిషి. ఇంత చక్కటి తలరంగు నేనీమధ్యన చూడలేదు అంటూ అతను నా జుట్టువేపు కళ్లప్పగించి చూడ సాగాడు. ఒక్కసారిగా ముందుకు వచ్చి నా చేతిని పట్టుకొని ఊపేస్తూ నన్ను అభినందించ సాగాడు.

"మీరు ఆలోచిస్తూ ఉంటే అన్యాయమవుతుంది. అయినా నేనొక పని చేయక తప్పడంలేదు, అంటూ అతను రెండు చేతులతో నా జుట్టును ఒడిసి పట్టుకొని గట్టిగా లాగసాగాడు. నాకు అరవక తప్పలేదు. 'మీ కళ్లలో నీళ్లు తిరిగాయి' అన్నాడతను వదులుతూ. 'అంతా సవ్యంగా జరుగుతుంది.



అయినా మా జాగ్రత్తలో వేమముండాలి గదండీ. విగ్గులు, రంగు పూతలతో మమ్మల్ని మోసగించిన వాళ్లున్నారు.' అంటూ అతను కిటికీ దగ్గరకు వెళ్లి గొంతు పెంచి బయట వాళ్లంతా వెళ్లి పోవచ్చునని ప్రకటించాడు. బయట అందరూ నిరాశగా నిట్టూర్చి తలో దిక్కు వెళ్లిపోయారు. నేనూ, ఆ మేనేజరు తప్ప అక్కడ ఎర్ర తలలు మిగలలేదు.

" 'నా పేరు డంకన్ రాస్. నేనూ మీలాగా ఒక పెన్షనర్‌నే. విల్సన్ గారూ, మీ కుటుంబం గురించి చెప్పండి' అన్నాడతను.

నాకెవరూ లేరన్నాను.

అతను ముఖం మాడ్చుకున్నాడు.

" 'అయ్యో, అదేమిటండీ! మన సంఘం ఇంకా పెరగాలని, మనలాంటి వాళ్లు మరింత మంది రావాలని పెద్దాయన కోరిక. అయితే మీరు బ్రహ్మచారులా' అన్నాడతను.

"దాంతో నేను ముఖం వేలవేశాను. ఉద్యోగం దొరకదేమో అనిపించింది. కాసేపు ఆలోచించి అతను 'ఫరవా లేదు" అన్నాడు.

" 'మరొకరైతే పెద్ద కష్టమే ఉండేది. కానీ మీ జుట్టు లాంటి ఎరుపున్న మనిషితో కొంచెం పట్టువిడుపులు ఉండాలి. ఇంతకూ మీరు పనిలో ఎప్పుడు చేరగలుగుతారు?'

“ ‘ఇది కొంచెం చికాకే. నాకు ఇప్పటికే ఒక వ్యాపారం ఉంది.’ అని నేనన్నాను.”

“ ‘విల్సన్‌గారూ! మీరేమి బెంగ పెట్టుకోకండి. ఆ సంగతి నేను చూచుకుంటాను’ అన్నాడు విన్సెంట్ స్పాల్డింగ్.

“ ‘ఇంతకూ పనివేళలు ఏమిటి?’ నేనడిగాను.

“ ‘పది నుంచి రెండు వరకు.’

“వస్తువులు తాకట్టు పెట్టుకునే బేరసారాలన్నీ మామూలుగా సాయంత్రాల్లోనే జరుగుతాయి. అందునా గురు, శుక్రవారాల్లో ఎక్కువగా. శనివారం నాడేకదా అందరికీ జీతాలు దొరికేది. కనుక మిస్టర్ హోమ్స్, నాకిదేదో బాగానే ఉన్నట్టు అనిపించింది. పైగా నా అసిస్టెంట్ మంచిమనిషని నాకు బాగా తెలుసు. తాను, నేను లేనప్పుడు వచ్చిన బేరాలను నిర్వహించగలడు.

“ ‘సరేనండి అయితే, మరి నాకు ఏమిస్తారు?” అడిగాను.

“ ‘వారానికి నాలుగు పౌండ్లు.’

“ ‘ఇంతకూ పనేమిటి?’

“ ‘చాలా మామూలు రకమేలెండి.’

“ ‘అంటే ఏమిటి అర్థం?’

“ ‘మీరు పనివేళలో ఆఫీసులో ఉండాలి. ఈ బిల్డింగ్‌లో అంతసేపూ ఉంటే చాలు. ముందే బయటికి వెళ్లారనుకోండి మీ ఉద్యోగం ఊడిపోతుంది. ఈ విషయం మాత్రం వీలునామాలో గట్టిగా చెప్పారు. మీరు కాలు బయట పెట్టారంటే నియమాలను దాటినట్టే.’

“ ‘నాలుగుగంటల సమయమే, బయటికి వెళ్లాల్సిన అవసరం ఏముంటుంది?’ అని నేనన్నాను.

“ ‘ఇక నాగాలు పెట్టే వీలే ఉండదు. జ్వరం వచ్చినా, మరో పని

వచ్చినా మీరిక్కడే ఉండాలి. లేదంటే ఉద్యోగం ఊడుతుంది.' అన్నాడు డంకన్ రాస్.

" 'ఏం పని చేయాలో చెప్పలేదు.'

" 'మీరు ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికాను తిరగరాయాలి. అదిగో అక్కడ మొదటి వాల్యూమ్ ఉంది. ఇంకు, పెన్ను, కాగితాలు, బ్లాటింగ్ పేపర్ వగైరా అన్నీ మీరే తెచ్చుకోవాలి. ఓ బల్ల, కుర్చీ మాత్రం మేమిస్తాము. మరి రేపటికి సిద్ధమవుతారా?'

" 'లక్షణంగా,' జవాబిచ్చాను.

" 'సరే మిస్టర్ విల్సన్, ఈ రోజుకి సెలవు. ఇంత చక్కని కొలువు దొరికినందుకు మీరు అదృష్టవంతులు. అందుకుగాను మిమ్మల్ని నేను మరోసారి అభినందిస్తున్నాను' అంటూ అతను గౌరవసూచకంగా వంగి వీడ్కోలు చేశాడు. నేను అసిస్టెంట్‌తో సహా ఇల్లు చేరుకున్నాను. ఏం చెయ్యాలో, ఏం అనాలో నాకు అర్థం కాలేదు. అంత సంతోషంగా ఉంది. ఇక దినమంతా దాన్ని గురించే ఆలోచించాను. సాయంత్రానికి ఎందుకో కొంచెం బెంగ అనిపించింది. ఇందులో ఏదో మోసం, దగా నిండి ఉందని నాకు తోచ సాగింది. ఎలాంటి మోసమో మాత్రం అర్థం కాలేదనుకోండి. ఎవరయినా ఇటువంటి వీలునామా చేయడం ఈ రకంగా, ఒక మామూలు పనికి జీతమివ్వడం నాకు అంతుపట్టలేదు. విన్సెంట్ స్పాల్డింగ్ మాత్రం నన్ను హుషారు చేస్తూనే ఉన్నాడు. అయినా రాత్రి పడుకునే సమయానికి ఈ పనిలోకి వెళ్లేదిలేదని నిశ్చయించుకున్నాను. కానీ పొద్దున్న నిద్ర లేచిన తరువాత ఒకసారి చూస్తే నష్టం లేదు, అనిపించింది. ఓ చిన్న సిరా బుడ్డీ, ఈక కలమూ, ఏడు కాగితాలు కొని పోప్స్ కోర్ట్ వేపు బయలుదేరాను.

"అక్కడ ఆశ్చర్యకరంగాను అంతా సవ్యంగా ఉంది. నాకోసం బల్ల సిద్ధంగా ఉంది. డంకన్ రాస్ నా సౌకర్యం చూడడానికి అక్కడే ఉన్నాడు. ఏ

అక్షరంతో మొదలు పెట్టి పని కొనసాగుతుంటే అతను వెళ్లిపోయాడు. కాని అప్పుడప్పుడు వచ్చి గమనిస్తూనే ఉన్నాడు. రెండు గంటలు అయిన తరువాత ఈ రోజుకి చాలునంటూ చాలానే రాశానని మెచ్చుకున్నాడు. నేను వెళ్లిపోయిన తరువాత ఆఫీసుకు తాళం పెట్టాడు.

"ఈ రకంగా రోజు తరువాత రోజు గడుస్తూనే ఉంది. శనివారం నాడు మేనేజర్ వచ్చి నాలుగు బంగారు సవరనులు నాకు ఇచ్చాడు. తరువాతి వారమూ అంతే. ఆ తరువాతా అంతే. ప్రతిరోజు పొద్దున్న పదికి వెళ్లడం మధ్యాహ్నం రెంటికి తిరిగి రావడం. రానురాను డంకన్ రాస్ వచ్చి చూడడం తగ్గింది. చివరికి ఒకసారి మాత్రం కనిపించే వాడు. అయినా నేను గది వదిలి ఒక్క క్షణం కూడా బయటకు వచ్చే ధైర్యం చెయ్యలేదు. అతనెప్పుడు వస్తాడో తెలియదు. ఎప్పుడు ఉద్యోగం ఊడుతుందో తెలియదు. ఇంత మంచి కొలువును నేను వదలదలుచుకోలేదు.



"ఈ రకంగా ఎనిమిది వారాలు గడిచాయి. నేను ఆబట్స్ ఇంకా ఆర్చరీ ఇంకా ఆర్మర్, ఆర్కిటెక్చర్ అలా ముందుకు సాగుతున్నాను. త్వరలోనే బి అక్షరానికి చేరుకుంటాను అని అనుకున్నాను. కాగితాలకు చాలానే ఖర్చు యింది. షెల్ఫ్ లో చాలా భాగం నిండింది.

ఇంతలో ఉన్నట్టుండి పని కొలిక్కి వచ్చింది.”

“అంటే ఏమిటి?”

“అవునండీ సరిగ్గా ఇవాళ పొద్దున పనిలోకి వెళ్లాను. కానీ తలుపులు వేసి తాళం పెట్టి ఉంది. ఒక అట్టముక్క మీద ఒక నోటీసు రాసి తలుపుకు మేకుతో కొట్టి ఉంది. ఇదిగో మీరే చదవండి.”

అతనొక తెల్లకార్డు బోర్డు ముక్కను నోట్ పేపర్ సైజు గలదాన్ని అందించాడు. దానిమీద

| |
|---|
| ఎఱ్ఱ తలల సంఘం<br>ఇవాళటి నుంచి<br>రద్దయినది.<br>అక్టోబర్ 9, 1890 |

నేనూ, షెర్లక్ హెూమ్స్ ఈ ప్రకటనను, దాన్ని చూపించిన ముఖాన్ని సీరియస్‌గా చూచాం. త్వరలోనే మాకు అందులోని విషయం తేలికగా తోచి ఇద్దరమూ గట్టిగా నవ్వసాగాము.

“ఇందులో నవ్వడానికి ఏముంది?” అని క్లయింటు గట్టిగా అరిచాడు. అతని ముఖంకూడా జుట్టులాగే ఎఱ్ఱబారింది. “నవ్వడంతప్ప మీరు ఏమీ చేయలేరంటే, నేనిక్కడి నుంచి వెళ్లిపోతాను.”

“ఆగండి” అన్నాడు హెూమ్స్. అతడిని పట్టుకొని మళ్లీ కుర్చీలో కూర్చోబెట్టాడు. “మీ వ్యవహారాన్ని వదిలేది లేనేలేదు. ఇది నిజంగా అసాధారణంగా ఉంది. నన్ను క్షమిస్తానంటే ఇందులో నాకు వింతదనం కనబడుతున్నది.

“ఇంతకూ మీరు ఈ కార్డు చూచిన తరువాత ఏం చేశారు?”

“ముందు ఆశ్చర్యపడ్డాను. ఏం చెయ్యాలో అర్థం కాలేదు. అక్కడ

పక్కనే ఉన్న ఆఫీసుల్లో అడిగి చూచాను. ఎవ్వరికీ ఏమీ తెలియదు. చివరికి ఆ భవనం యజమాని దగ్గరికి వెళ్లాను. ఎర్రతలల సంఘం ఏమయిందని అడిగాను. అలాంటి సంఘం ఒకటి ఉందని తెలియనే తెలియదన్నాడు. మరి డంకన్ రాస్ గురించి అడిగాను. ఆ పేరే తెలియదన్నాడు.

" 'మరి నంబర్ నాలుగులోని పెద్దమనిషి ఏమయ్యాడు?' అని అడిగాను.

" 'ఓ, ఆ ఎర్ర తల ఆయనా?'

" 'అవును'

" 'అతనూ, పేరు విలియమ్ మోరిస్. అతనొక లాయర్. తన ఆఫీసు తయారయ్యేదాకా నా గదిని వాడుకున్నాడు అంతే. అతను నిన్ననే వెళ్లిపోయాడు.'

" 'ఇప్పుడు ఎక్కడ దొరుకుతాడు?'

" 'అతని కొత్త ఆఫీసు దగ్గర. అడ్రస్సు కూడా చెప్పాడు. అదీ పదిహేడు కింగ్ ఎడ్వర్డ్ స్ట్రీట్, సెయింట్ పాల్ దగ్గర.'

"నేను బయలుదేరాను మిస్టర్ హోమ్స్, తీరా అక్కడికి వెళితే ఏదో చిన్న ఫ్యాక్టరీ ఉంది. అక్కడివాళ్లకు ఎవరికీ విలియమ్ మోరిస్ గురించీ డంకన్ రాస్ గురించీ తెలియనే తెలియదు."

"ఆ తరువాత ఏం చేశారు?" హోమ్స్ అడిగాడు.

"నేను తిరిగి ఇంటికి వెళ్లాను. నా అసిస్టెంట్‌ను సాయం అడిగాను. అతను ఏమీ చేయలేకపోయాడు. బహుశా పోస్టు ద్వారా ఏమన్నా తెలుస్తుందేమో అన్నాడు. అంత సులభంగా అంత మంచి ఉద్యోగం వదులుకోవడం నాకు నచ్చలేదు. మీరు నాలాంటి వాళ్లకు బాగా సాయం చేయగలరని విన్నాను మిస్టర్ హోమ్స్! కనుక చక్కగా మీ దగ్గరకు వచ్చాను."

"మంచి పని చేశారు. మీ వ్యవహారం నిజంగా ప్రత్యేకమయినది. నేను తప్పకుండా దీన్ని పట్టించుకుంటాను. మీరు చెప్పినదాన్ని బట్టి ఈ వ్యవహారం వెనుక ఏదో మతలబు ఉన్నట్టే ఉంది."

"గట్టి మతలబే. నాకు వారానికి నాలుగు పౌండ్లు నష్టం" అన్నాడు జబేజ్ విల్సన్.

"అది మీ వ్యక్తిగతమయిన సంగతి. మీకు ఈ సంఘం వాళ్ల పట్ల అనుమానాలు ఉండనవసరం లేదు. మీకు ఇప్పటికే 30 పౌండ్ల దాకా గిట్టనే గిట్టింది. ఇక కలిగిన జ్ఞానం సంగతి వేరే చెప్పనవసరం లేదు. నష్టం అసలే లేదు."

"అది కాదండీ, అసలు వాళ్ల సంగతి తెలుసుకోవాలి. ఎవరు వాళ్లు? ఎందుకీ పన్నాగం, అది పన్నాగమయితేనే లెండి, చేశారు తెలియాలి. సరదాకు చేసిందయితే వాళ్లు చాలానే నష్టపోయారు కూడా."

"ఈ వివరాలను మీ కొరకు కనుక్కునే ప్రయత్నం చేస్తాను. ముందు ఒకటి రెండు ప్రశ్నలు మిష్టర్ విల్సన్. మొట్టమొదట ఈ ప్రకటన వేపు మీ దృష్టిని మరలించిన మీ అసిస్టెంటు ఎంతకాలం నుంచి మీ దగ్గర ఉన్నాడు?"

"అప్పటికి ఒక నెలపైన అయి ఉంటుంది."

"అతనెలా వచ్చాడు?"

"పేపర్‌లో ప్రకటనను చూచి."

"అతనొక్కడే వచ్చాడా?"

"లేదండీ, ఓ డజనుమంది వచ్చి ఉంటారు."

"ఇతగాడినే ఎందుకు ఎంచుకున్నారు?"

"అతను తక్కువ జీతానికే కుదురుతానన్నాడు."

"నిజానికి సగం జీతం కదూ."

"అవునండీ."

"ఈ విన్సెంట్ స్పాల్డింగ్, ఎలాగుంటాడు?"

"పొట్టిమనిషి, బొద్దుగా ఉన్నా చలాకీగా ఉంటాడు. ముఖం మీద వెంట్రుకలు లేవు. వయస్సు మాత్రం 30 పైనే. నుదుటి మీద యాసిడ్ పడిన మచ్చ ఉంది."

హోమ్స్ ఒక్కసారిగా కుర్చీలో నిటారుగా కూర్చున్నాడు. "అను కున్నాను, అతని చెవులకు రంధ్రాలు ఉండడం ఏమయినా గమనించారా?" అన్నాడతను.

"అవునండీ. చిన్నప్పుడు జిప్సీలు ఎవరో అలా పొడిచారని చెప్పాడు."

"అది! అతనింకా మీ దగ్గరే ఉన్నాడా?"

కుర్చీలో చేరబడుతూ అడిగాడు హోమ్స్.

"ఉన్నాడున్నాడు, ఇప్పుడేగా అతడిని వదిలి వస్తున్నాను."

"మీరు లేనప్పుడు మీ వ్యాపారం బాగానే సాగిందా?"

"ఒక మాదిరి, అయినా ఉదయాల్లో ఎక్కువగా ఉండదన్నాను గదా."

"బాగుంది మిస్టర్ విల్సన్. ఈ విషయం గురించి ఒకటిరెండు రోజుల్లో మీకు అభిప్రాయం ఇవ్వగలను. ఇవ్వాళ ఏమిటి, శనివారం గదూ! సోమవారానికి మనకు సంగతి తెలుస్తుంది."

"ఇక వాట్సన్, నీకేమనిపించింది?" ఆగంతకుడు వెళ్లిపోయిన తరువాత హోమ్స్ నన్ను అడిగాడు.

"నాకు ముక్క అర్థం కాలేదు. అంతా మిస్టరీ." మొహమాటం లేకుండా చెప్పాను.

"విషయం ఎంత చికాకుగా ఉంటే అందులో తిరకాసు అంత తక్కువగా ఉంటుంది. చాలా మామూలుగా, సులభంగా కనిపించే సంగతుల వెనుక

బోలెడంత తికమక ఉంటుంది. అయినా ఈ సంగతి గురించి వెంటనే పట్టించుకోవాలి." అన్నాడు హెూమ్స్.

"ఏం చెయ్యబోతున్నావు, అయితే" అడిగాను.

"చుట్ట కాలుస్తాను" అన్నాడతను. "ఇది మూడు పైపులకు సరిపడా సమస్య. ఈ పదిహేను నిమిషాల్లో నీవు నన్ను పలకరించకుంటే మేలు" అంటూ అతను తన కుర్చీలో ముడుచుకు కూర్చున్నాడు. బక్క పలుచని మోకాళ్లు ముక్కుదాకా వచ్చాయి. కళ్లు మూసుకుని నల్లని క్లే పైప్‌ని పీలుస్తున్నాడు. అది ఏదో పక్షి ముక్కులాగా కనబడుతున్నది. అతను నిద్రలోకి జారుకున్నాడని నాకు అనిపించింది. అసలు నేను కునుకసాగాను. ఒక్కసారిగా అతను కుర్చీలోంచి లేచి మనసులో ఏదో నిశ్చయించుకున్న వాడిలాగా పైపును పక్కన పెట్టాడు.

"సెయింట్ జేమ్స్ హాల్లో ఇవ్వాళ కచేరీ ఉంది. వాట్సన్! ఒకటి రెండు గంటలు ఓపిక కుదురుతుందా?" అడిగాడు.

"నాకు ఇవ్వాళ పనేమీ లేదు. నా ప్రాక్టీస్ అంతంతేగా."

"అయితే టోపీపెట్టు కుని వచ్చేసెయ్. ముందుగా నగరంలో కొంచెం పని చూచు కుని తరువాత తిండి తిందాం. ఇవ్వాళిటి కచేరీలో కావలసినంత జెర్మన్ సంగీతం ఉందట. నాకు ఇటాలియన్, ఫ్రెంచ్ తరహా కన్నా జెర్మన్ సంగీతం నచ్చుతుంది. అది మనిషిని లోపలికి మరల్చుతుంది. ఇప్పుడు కావలసింది కూడా అదే కదా. మరి రా!"

మేమ అండర్‌గ్రౌండ్‌లో ఆల్డర్స్ గేట్ దాకా వెళ్లాము. కొంచెం దూరం నడిచి సాక్స్-కోబూర్గ్ స్క్వేర్ చేరాము. పొద్దున విన్న కథ నడిచింది అక్కడే. అదేమంత గొప్ప ప్రదేశం కాదు. నాలుగు వరసల్లో రెండంతస్తుల ఇళ్లు ఉన్నాయి. వాటిముందు పెరిగిన దుబ్బుగడ్డి, పొదలు చూస్తుంటే అదంతా అనుకూలమయిన వాతావరణం కాదని అర్థమయింది. ఒకచోట గిల్ట్



బంతులు, బ్రౌన్ బోర్డు కనిపించాయి. బోర్డు మీద జబేజ్ విల్సన్ అన్న పేరుంది. షెర్లక్ హెూమ్స్ అక్కడ ఆగాడు. తలను ఒకవైపు వంచి కళ్లు మిలమిల లాడుతుండగా ఆలోచిస్తున్నాడు. నెమ్మదిగా వీధిలోకి వచ్చి మళ్లీ మూల దాకా వెనక్కు వచ్చాడు. అంతసేపూ ఆ ఇంటివేపే చూస్తున్నాడు. చివ్వరికి తాకట్టుకొట్టు ముందుకు వచ్చి తన చేతికర్రతో నేల మీద రెండు మూడు సార్లు గట్టిగా కొట్టాడు. తరువాత తలుపు దాకా వెళ్లి తట్టాడు. వెంటనే చక్కగా గడ్డం గీసుకుని ఉన్న ఒకతను తలుపు తెరిచి లోనికి రానిచ్చాడు.

"థాంక్యూ. ఇక్కడి నుంచి స్ట్రాండ్‌కి వెళ్లడం ఎలాగని తెలియలేదు" అన్నాడు హెూమ్స్.

"థర్డ్ రైట్, ఫోర్త్ లెఫ్ట్" అని అతను తలుపు మూసు కున్నాడు.

"భలే మనిషి!" అంటూ హెూమ్స్ వచ్చేశాడు. "నా దృష్టిలో లండన్‌లో ఇతను తెలివైన వాళ్లలో నాలుగోవాడు. మూడో వాడు కూడా అవుతాడేమో. ఇతని గురించి నాకిప్పటికే తెలుసు" అన్నాడు హెూమ్స్.

"అర్థమయింది" అన్నాను నేను. "ఈ ఎర్రతలల సంఘం వ్యవహారంలో మిస్టర్ విల్సన్ పాత్ర ఎంతయినా ఉంది. అతడిని చూడాలని మాత్రమే నీవు దారి అడిగావు."

"అతడిని కాదు"

"మరింక దేన్ని?"

"అతని ప్యాంటు, మోకాళ్లను"

"అక్కడేముంది?"

"నేను చూడదలుచుకున్నదేదో ఉంది."

"ఇంతకూ పేవ్‌మెంట్‌ను ఎందుకు కొట్టావు?"

"మై డియర్ డాక్టర్, ఇది పరిశీలనకు సమయం, మాటలకు కాదు. మనం శత్రుదేశంలో గూఢచారులం. ఈ దేశంగురించి మనకు ఎంతో తెలుసు. ఇక వెనకవేపు ఏముందో చూద్దాం"




మలుపు తిరిగిన తరువాత చూస్తే సాక్స్ కోబూర్గ్ స్క్వేర్ పూర్తిగా మరోరకంగా ఉంది. అది నగరంలోని తూర్పు పడమరలను కలిపే ముఖ్యమయిన దారుల్లో ఒకటి. పెద్ద వ్యాపార కేంద్రం. ఫుట్‌పాత్‌ల మీద పరుగులు పెడుతూ మనుషులున్నారు. అంద మయిన అంగళ్లను, వ్యాపార సంస్థలను చూస్తూ ఉంటే వెనక వేపు గురించి తోచను

కూడా తోచదు.

"కాస్త చూద్దాం" అన్నాడు హోమ్స్. మలుపుమీద నిలబడి పరిశీలనగా చూస్తున్నాడు. "ఈ ఇళ్లవరుసను గుర్తుంచుకోవాలి. లండన్ వివరాలను తెలుసుకోవడం నా హాబీల్లో ఒకటి. అక్కడ మోర్టిమర్స్, తరువాత పొగాకు దుకాణం, చిన్న న్యూస్ పేపర్ బడ్డీ, ఆ తరువాత సిటీ అండ్ సబర్బన్ బ్యాంకు వారి బ్రాంచీ, ఆ పక్కన వెజిటేరియన్ రెస్టోరాంటు, ఇక చివరికి మెక్‌ఫార్లేన్ వారి డిపో. అక్కడితో బ్లాకు ముగుస్తుంది. ఇక డాక్టర్, మన పని చివరకు చేరింది. ఇప్పుడు సరదా మొదలవుతుంది. ఒక శాండ్‌విచ్, ఓ కప్పు కాఫీ, అక్కడి నుంచి వయోలిన్-లాండ్. అక్కడంతా ఆనందమే ఆనందం. ఎఱ్రతలల క్లయింటులు ఉండరు, మనలను విసిగించడానికి."

నా మిత్రుడు మంచి సంగీతం తెలిసిన మనిషి. స్వరకర్త కూడాను. మధ్యాహ్నం అంతా సంగీతంలో సంతోషంగా తాళం వేస్తూ మునిగి తేలాడు. అప్పుడతని కళ్లు డిటెక్టివ్ కళ్లు కావు. క్రిమినల్ ఏజెంటుగా అతని తీరు వేరు. ఒకే మనిషిలో రెండు ప్రవృత్తులు. ఒకటి మరీ నిక్కచ్చి అయితే, మరొకటి మరీ కవితాత్మకమయినది. ఎంత బద్ధకంగా కూర్చుని వేరే లోకాల్లో విహరిస్తాడో అంతగాను పరుగులు పెడతాడు. రోజుల తరబడి కుర్చీలో కూలబడి ఆలోచనలు, పుస్తకాలతో గడుపుతాడు. ఉన్నట్టుండి దేన్నో తరమాలన్న ఆలోచన కలు గుతుంది. అతని ఊహలు ఉరకలెత్తుతాయి. అతని తీరు తెలియని వాళ్లకు అంతా గజిబిజిగా కనబడుతుంది. ఆ మధ్యాహ్నం సెయింట్ జేమ్స్ హాల్లో అతను సంగీతంలో మునిగిన తీరు చూస్తే అతని శత్రువులకు ఇక మూడిందని అనిపించింది.

"ఇంటికి వెళ్లాలికదా డాక్టర్" బయటకు వస్తుండగా అన్నాడతను.

"అవును, అదే మరి"

"నాకు ఒకటిరెండు గంటలు పనుంది. ఈ కోబూర్గ్ స్క్వేర్ వ్యవహారం సీరియస్ విషయం."



"సీరియస్ ఎందుకు?"

"పెద్ద క్రైమ్ జరగబోతోంది. మనం సకాలంలో పూనుకుంటే దాన్ని ఆపగలుగుతామని నాకు అనిపించింది. ఇవాళ శనివారం. ఇదొక చిక్కు. రాత్రికి నీ సాయం కావాలి."

"ఏ సమయానికి?"

"పది గంటలకయితే చాలు."

"సరిగ్గా పదికి బేకర్స్ స్ట్రీట్‌లో ఉంటాను."

"మంచిది, అయితే డాక్టర్! కొంచెం అపాయం కూడా ఉండేట్టుంది. నీ ఆర్మీ రివాల్వర్ వెంట తెచ్చుకో" వీడ్కోలు చెపుతూ వెనుదిరిగి అతను గుంపులో కలిసిపోయాడు.

నేను గొప్ప తెలివిగలవాడినని నేనే ఎప్పుడూ అనుకోలేదు. కానీ షెర్లక్ హెూమ్స్ ముందు నా తెలివితక్కువతనం తెలిసిపోతూ ఉంటుంది. అతను విన్నదంతా నేనూ విన్నాను. చూచిందంతా చూచాను. కానీ అతని మాటలను వింటే నేను చూడనిదేదో అతను చూడగలిగాడు. నాకు మాత్రం గజిబిజి మిగిలింది. దారి అంతా నేను ఆలోచిస్తూనే ఉన్నాను. జరిగిందంతా కళ్ల ముందు తిరిగింది. చివరికి హెూమ్స్ వెళ్లిపోతూ అన్న మాటలు చెవిలో మోగాయి. ఈ రాత్రికి ఏం జరుగుతుంది? నాకు రివాల్వర్‌తో ఏం పని? ఇంతకూ ఎక్కడికి వెళుతున్నాము, ఏం చేయబోతున్నాము? హెూమ్స్ అన్న దాన్నిబట్టి పాన్ బ్రోకర్ దగ్గరి అసిస్టెంటు మామూలు మనిషి కాదు. అతనేదో

లోతయిన వ్యవహారంలో ఉన్నాడు. అదేమిటో తెలుసుకోవాలని ఆలో చించాను. ఏమీ తోచలేదు. ఎట్లాగూ రాత్రికి తెలుస్తుంది కదా అని ఊరుకున్నాను.

తొమ్మిదింపావు అయ్యింది. నేను ఇంటినుంచి బయలుదేరి పార్కు, ఆక్స్‌ఫర్డ్ స్ట్రీట్ మీదుగా బేకర్ స్ట్రీట్ వెళ్లాను. అక్కడ రెండు గుర్రం బండ్లు నిలబడి ఉన్నాయి. లోపలికి పోతుంటే పైనుంచి మాటలు వినిపించాయి. అతని గదిలోకి వెళ్లేసరికి హోమ్స్ మరో ఇద్దరితో మాట్లాడుతున్నాడు. వాళ్లలో ఒకతను పోలీసు ఏజెంట్, పీటర్ జోన్స్ నాకు తెలుసు. రెండవ మనిషి విషాదం ముఖంతో పొడుగ్గా ఉన్నాడు. వెలగల టోపీ, కోటు వేసుకుని ఉన్నాడు.

"హా! ఇప్పుడు పార్టీ పూర్తయింది" అన్నాడు హోమ్స్. తనూ కోటు వేసుకుని రాక్‌లోనుంచి చేతికర్రను ఎంచుకున్నాడు. "వాట్సన్! నీకు స్కాట్లాండ్ యార్డ్ ఆఫీసర్, మిస్టర్ జోన్స్ తెలుసు కదా? ఇక ఈయన గారు మిస్టర్ మెర్రీవెదర్. ఈ రాత్రికి మన సాహసయాత్రలో తోడుంటారు."

"అయితే మళ్లీ జంటలుగా వేటసాగుతుంది, డాక్టర్" అన్నాడు జోన్స్ మామూలుగా. "మనమిత్రుడు అద్భుతమయిన మనిషి. అతను బయలుదేరితే మామూలుగా ఉండదు. ముసలికుక్కలు అతని వెంటపడి పరుగెత్తుతూ ఉండాలి అంతే."

"ఇంతా పరుగెత్తితే చివరికి అంతా ఉత్తిదే అవుతుందా?" అన్నాడు మిస్టర్ మెర్రీవెదర్ నిరాశగా.

"మీరు మిస్టర్ హోమ్స్‌ని గట్టిగా నమ్మవచ్చండి. అతని పద్ధతులు వేరుగా ఉంటాయి. అంతా ఫాంటసీ లాగుంటాయి. కానీ అతను నిజమయిన డిటెక్టివ్. గొప్పకాదు గానీ అతను షోల్టో హత్య, ఆగ్రా నిధులులాంటి కేసుల్లో గొప్పతెలివి ప్రదర్శించారు. పోలీసువారికన్నా ఆయనే వాటిని ముందు ఛేదించారు.

"మిస్టర్ జోన్స్, మీ మాట వింటాను సరే" అన్నాడు కొత్తమనిషి. "అయినా నా ఆట మాత్రం ఇవాళ సాగడం లేదు. 27 సంవత్సరాల్లో ఏ శనివారం రాత్రి నేను పేకాడకుండా ఉండలేదు"

"ఇవాళటి ఆట పెద్దమొత్తాలతో సాగుతుంది, మీరే చూస్తారు. ఈ ఆటలో మరింత మజా ఉంటుంది. మిస్టర్ మెర్రీవెదర్, మీకిది ముప్పయివేల పౌండ్ల వ్యవహారం. ఇక జోన్స్, నీకేమో ఒక చక్కటి అరెస్టు అవకాశం" అన్నాడు షెర్లక్ హోమ్స్.

"జాన్ క్లే అంటే హంతకుడు, దొంగ, దుండగుడు, దొంగ సంతకాల వాడు. అతను కుర్రవాడే, అయినా వృత్తిలో ఆరితేరి పోయాడు. అతడిని పట్టుకోవడమంటే లండన్ నేర చరిత్రలోనే గొప్ప విషయం. ఈ జాన్ క్లే అనే మనిషి నిజంగా గొప్పవాడు. అతని తాతగారు రాయల్ డ్యూక్. అతనేమో ఈటన్, ఆక్స్‌ఫర్డ్‌లలో చదువుకున్నాడు. మెదడు, వేళ్లు రెండూ మెరుపు లాంటివే. ప్రతిచోటా కనబడతాడు. చేతికి మాత్రం చిక్కడు. ఓ వారం స్కాట్లాండ్‌లో లూటీ, మరోవారం కార్న్‌వాల్‌లో అనాథ శరణాలయం ప్రారంభోత్సవం. సంవత్సరాలుగా అతడిని వెంటాడుతూనే ఉన్నాను. కానీ పట్టుకున్నది లేదు."

"ఈ రాత్రికి అతడిని పరిచయం చేసే భాగ్యం నాకు కలుగుతుంది. ఒకటి ఒండు సార్లు మిస్టర్ జాన్ క్లేని చూచాను. అతను ఆరితేరిన దొంగ అన్నది అసలయిన సత్యం. పదిగంటలు దాటింది. మనం బయలుదేరితే మంచిది. మీరిద్దరూ మొదటి బండిలో ఎక్కండి. నేనూ, వాట్సన్ రెండవదాంట్లో వెంట వస్తాం."

ప్రయాణం చాలా దూరం. షెర్లక్ హోమ్స్ అంతసేపూ మాట్లాడలేదు. వెనుకకు వాలి మధ్యాహ్నం విన్న సంగీతాన్ని కూనిరాగాలు తీస్తున్నాడు. సందులు, గొందుల గుండా ముందుకు సాగి ఫ్యారింగ్టన్ వీధి చేరుకున్నాము.

"దగ్గరకు వచ్చేశాం," అన్నాడు నా మిత్రుడు. "ఈ మెర్రీవెదర్ బ్యాంకు డైరెక్టర్. కనుక అతనికి విషయంలో వ్యక్తిగతంగా ఆసక్తి. జోన్స్ కూడా వెంట ఉంటే మంచిదనుకున్నాను. అంతను అంత చెడ్డవాడేమీ కాదు. పనిలో మాత్రం పసలేని మనిషి. అయినా ఒక్క మంచిగుణం ఉంది. బుల్‌డాగ్ లాగా భయంలేని మనిషి. పీతలాగా పట్టుదలగల మనిషి. ఇదిగో వచ్చేశాం. వాళ్లూ అక్కడే ఉన్నారు."

పొద్దున్న గోలగా ఉండిన ఆ వీధిలోకే వచ్చాము. బండ్లను పంపించేసి మెర్రీవెదర్ దారి చూపుతుండగా ఒక సన్నని సందులో నడుస్తూ ఒక ద్వారం దగ్గరకు చేరుకున్నాము. అతను దాన్ని తెరిచాడు. ఆ లోపల ఒక సన్నని కారిడార్ ఉంది. చివరన పెద్ద ఇనుప గేటు ఉంది. దాన్నీ తెరిచాడు. మెట్లు దిగి కిందకు వెళితే మరోపెద్ద గేటు. మిస్టర్ మెర్రీవెదర్ ఆగి ఒక లాంతరు వెలిగించాడు. దాని వెలుగులో మట్టి వాసన కొడుతుండే ఒక సందులో ముందుకు వెళ్లి మరోతలుపు తెరిచి ఒక మాళిగలోకి వెళ్లాము. అక్కడ నిండా పెద్దపెద్ద క్రేట్స్, చెక్కపెట్టెలు ఉన్నాయి.

"పైనుంచి దాడి జరిగే వీలులేదు," అన్నాడు హోమ్స్ లాంతరును ఎత్తి పైకి చూస్తూ.

"కిందనుంచి కూడా," అన్నాడు మెర్రీవెదర్. చేతికర్రతో నేలమీద తాటించాడు. "బాబోయ్! ఇదేమిటి? బోలుగా వినపడుతుంది!" అన్నాడతను ఆశ్చర్యంగా పైకి చూస్తూ.

"కొంచెం నిశ్శబ్దంగా ఉండాలి మనమంతా!" అన్నాడు హోమ్స్ తీవ్రంగా. "మీరిప్పటికే మన ప్రయత్నాలకు కొంచెం భంగం వచ్చే పని చేశారు. వెళ్లి ప్రశాంతంగా ఆ పెట్టెల్లో ఒకదానిమీద కూర్చుంటారా దయచేసి. పనికి అడ్డుమాత్రం రాకండి."

గంభీరంగా మెర్రీవెదర్ వెళ్లి ఓ పెట్టెమీద ఎక్కి కూర్చున్నాడు. ముఖంలో



కొంచెం గాయపడిన తీరు కనబడింది. హెూమ్స్ మాత్రం మోకాళ్లమీద కూర్చుని లాంతరు వెలుగులో, భూతద్దం సాయంతో బండల మధ్య నెరియలను పరీక్షిస్తున్నాడు. కొన్ని క్షణాల్లోనే సంతృప్తిగా చూస్తూ లేచి నిలబడి భూతద్దాన్ని జేబులో వేసుకున్నాడు.

"మనకింకా గంట వ్యవధి ఉంది. పాన్ బ్రోకర్‌గారు హాయిగా పడుకున్న తరువాతగానీ వాళ్లు కదలరు. ఆ తరువాత మాత్రం ఒక్క నిమిషం

కూడా ఆగరు. ఎంతత్వరగా పని ముగించుకుంటే అంత త్వరగాను పారిపోగలుగుతారు కదా. డాక్టర్, నీవు అనుకుంటున్నట్టే, మనమిప్పుడు లండన్‌లోని ఒకానొక పెద్ద బ్యాంక్ సెల్లార్‌లో ఉన్నాము. మెర్రీవెదర్ ఆ బ్యాంక్ ఛైర్మన్. ఈ సెల్లార్ మీద నేరగాళ్ల దృష్టి ఎందుకు పడాలన్నది ఆయనే చెపుతారు."

"ఫ్రెంచ్ బంగారం! దీనిమీద దాడి జరుగుతుందని మాకు హెచ్చరికలు వస్తూనే ఉన్నాయి." ఛైర్మన్ గుసగుసలాడాడు.

"ఫ్రెంచ్ బంగారమా?"

"అవునండీ! కొన్నినెలల క్రితం మా బ్యాంకు ఫ్రాన్స్‌వారి బ్యాంక్ నుంచి ముప్ఫయివేల నెపోలియన్‌లను అరువు తెచ్చుకుంది. ఆ పెట్టెలను కూడా విప్పేందుకు సందర్భం రాలేదనీ, అవి సెల్లార్‌లోనే ఉన్నాయని తెలిసి పోయింది. నేను కూర్చున్న ఈ పెట్టెలో రెండు వేల నెపోలియన్ నాణాలు ప్యాక్ చేసి ఉన్నాయి. అంటే మా బంగారం నిధులు ఒక బ్రాంచ్ ఆఫీసులో మామూలుగా ఉండేకన్నా చాలా ఎక్కువగా ఉన్నాయని అర్థం. డైరెక్టర్లకేమో సంగతి అర్థం కావడం లేదు."

"అర్థం కాదు. అయినా, మనమిప్పుడు పథకంలోకి దిగాలి. మరో గంటలో వ్యవహారం పాకానికి వస్తుంది. ఈలోగా ఆ దీపాన్ని కొంచెం మూసెయ్యాలి."

"అంటే చీకట్లో కూర్చోవాలా?"

"అవుననుకుంటా! నా జేబులో పేకముక్కలున్నాయి. ఊరికే కూర్చునే కన్నా మీరిక్కడే మీ ఆట సాగించవచ్చు అనుకున్నాను. కానీ వెలుతురు ఉంటే కష్టంకదా. కనుక మనం మనమన స్థానాలను చూచుకోవాలి. వచ్చేవాళ్లు గుండెలుతీసిన మనుషులు. మనది ఎంత పైచేయి అయినా మన జాగ్రత్తలో మనముండాలి. నేను ఈ క్రేట్ వెనకాల నిలబడతాను. మీరు ఆ వెనుక ఉండండి. నేను వాళ్లమీద వెలుగుపడేట్టు చేయగానే, వెంటనే

వచ్చేసేయండి. వాట్సన్! వాళ్లుగానీ పిస్టల్ పేలిస్తే నీవుమాత్రం వెను కాడగూడదు, అర్ధమయిందా.”

నేను రివాల్వర్ని సిద్ధంగా పట్టుకొని చెక్కపెట్టె వెనుక నక్కి ఉన్నాను. హెూమ్స్ లాంతరుకి ఏదో అడ్డుపెట్టాడు. అంతా పూర్తిగా చీకటయింది. నాకు అలవాటులేని చీకటి. కానీ దీపం వాసన మాత్రం తెలుస్తూనే ఉన్నది. అవసరం వచ్చిందంటే చాలు వెలుగు వస్తుందని తెలుసు. నేను చాలా ఎక్సయిట్ అయి ఉన్నాను. చీకటి నాకు నచ్చదు. అందునా ఆ తేమ వాసన, అది అన్యాయం.

“వాళ్లకు ఒకే ఒక్క మార్గం ఉంది. మళ్లీ వెనక్కు ఆ ఇంట్లోకి వెళ్లడం. అక్కడ సరయిన ఏర్పాట్లు చేశావా జోన్స్?” గుసగుసగా అడిగాడు జోన్స్.

“ఒక ఇన్స్పెక్టర్, ఇద్దరు ఆఫీసర్లు ముందుతలుపు దగ్గర సిద్ధంగా ఉన్నారు.”

“అంటే అన్ని బొరియలు మూసినట్లే. ఇక నిశ్శబ్దంగా వేచిఉండాలి.”

నాకంతా చిత్రంగా ఉంది. గంటంపావు ఉన్నామని తరువాత లెక్క తేలింది. నాకేమో తెల్లవారుతుంది అనిపించింది. ఒళ్లంతా బిగ దీసుకుపోయింది. కదిలితే ఏమవుతుందో తెలియదు. కావలసినంత టెన్షన్. నా చెవులు మరీ వాడి. అందరి ఊపిరిచప్పుళ్లు, బ్యాంక్ డైరెక్టర్ నిట్టూర్పులు బలంగా వినిపిస్తున్నాయి. ఉన్నట్టుండి వెలుగు కనిపించింది. ముందుగా ఒక చిన్న రవ్వంత మాత్రమే. ఆ తరువాత అది పసుపురంగు లైన్ అయ్యింది. ఒక రంధ్రం పడి అందులోంచి ఒక చెయ్యి కనిపించింది. తెల్లగా ఇంచు మించు అమ్మాయి చేతిలా ఉందంది. ఓ నిమిషంపాటు ఆ చెయ్యి అక్కడే కదులుతూ ఉంది. చటుక్కున కనిపించినంత వేగంగా మాయమయ్యింది. మళ్లీ చీకటి.

ఒక్కక్షణం గడిచిందో లేదో ఒక పెద్దబండ పక్కకు జరిగి ఒక పెద్ద

రంధ్రం ఏర్పడింది. అందులోనుంచి లాంతరు వెళుతురు చిమ్ముకు వచ్చింది. లోపల ఒక కుర్రవాడి వంటి ముఖం. రంధ్రానికి అటు ఇటూ చేతులుపెట్టి నెమ్మదిగా శరీరం పైకి వచ్చింది. మోకాళ్లను అంచులమీద ఆనించి పైకి వచ్చింది. మరుక్షణంలో ఆ మనిషి నిటారుగా నిలబడి ఉన్నాడు. వెంట అతనిలాగే చిన్నకాయంగల మరొకతను కూడా ఒడుపుగా పైకి వచ్చాడు. ఆ రెండో మనిషికి ఎర్రని జుట్టు ఉంది.

“అంతా క్లియర్. ఉలి, సంచులు సిద్ధంగా ఉన్నాయా? ఆర్చీ! వచ్చేసెయ్... వచ్చేసెయ్” గొణిగాడతను.

షెర్లక్ హెూమ్స్ బయటకు దూకాడు. ఎదుటి మనిషి కాలర్‌ను ఒడిసి పట్టుకున్నాడు. రెండవ మనిషి రంధ్రంలోకి దూకబోతే చొక్కా చినిగిన చప్పుడు వినిపించింది. జోన్స్ అతగాడిని పట్టేశాడు. ఒక రివాల్వర్‌మీద వెలుతురు పడింది. హెూమ్స్ తన చేతికర్రతో ఆ మనిషి మణికట్టుమీద గట్టిగా కొట్టాడు. పిస్టల్ కిందపడింది.

“ఇక లాభం లేదు, జాన్ క్లే! తప్పించుకోలేవు.” అన్నాడు హెూమ్స్ నింపాదిగా.

“అలాగే ఉన్న ట్టుంది. మావాడు ఏమయ్యాడు? వాడి చొక్కా చినిగి నట్టుంది.” అన్నాడ తను అంత నింపాదిగాను.

“అయి పోయిందా? అంత సులభంగా ముగిసిందా? మీకు అభినందనలు చెప్పక తప్పదు.”

“నీకు కూడా. నీ ఎర్రతలల ఆలోచన మాత్రం భలే పని చేసింది కదూ” అన్నాడు హెూమ్స్.

“నీ మిత్రుడు కూడా ఉన్నాడు. అతను నాకంటే త్వరగా జారుకో గలిగాడు. నేనతడిని పట్టేసు కుంటాను.” అన్నాడు జోన్స్.

“నన్ను మాత్రం నీ మురికి చేతులతో ముట్టు కోకు. నా ఒంట్లో



రాజరికపు రక్తం పారుతున్నదని నీకు తెలియక పోవచ్చు. నన్ను సంబోధించేటప్పుడు గౌరవంగా ఉండాలి సుమా!"

"సరే.. సరే..! అయ్యా, తమరు మెట్లెక్కి పైకి వస్తారా? ప్రభువులను అక్కడి నుంచి బండిలో పోలీస్ స్టేషన్‌కి తరలిం చాలి మరి" తీవ్రంగా చూస్తూ, వెటకారంగా అన్నాడు జోన్స్.

''ఇది బాగుంది'' అన్నాడు జాన్ క్లే ప్రశాంతంగా.

అతను సగౌరవంగా వంగి వీడ్కోలు తీసుకుంటూ డిటెక్టివ్ వెనకాల బందీగా నడిచాడు.

మేము వెంట వెళుతుండగా మెర్రీవెదర్ మాట్లాడసాగాడు. "నిజంగా మిస్టర్ హోమ్స్, బ్యాంక్ మీకెలాగ ధన్యవాదాలు చెపుతుందో, గౌరవిస్తుందో చెప్పలేను. బ్యాంక్‌ను దోపిడీ చేయడానికి చేసిన గట్టి ప్రయత్నాన్ని మీరు సంపూర్తిగా తెలుసుకొని సకాలంలో ఎదుర్కొని దొంగలను పట్టేశారు. నా అనుభవంలో ఇలాంటి వ్యవహారం నేను చూడలేదు." అన్నాడతను.

"నాకుకూడా ఈ జాన్ క్లేతో కొన్ని లావాదేవీలు ఉన్నాయిలెండి. అతని పేరున కొంత కష్టపడ్డాను, ఖర్చుపెట్టాను. బ్యాంక్ ఆ లెక్కలు చెల్లిస్తే చాలు. అంతకుమించి నాకివాళ కలిగిన అనుభవం మరెంతో విలువయినది. అసలీ ఎర్రతలల సంఘం గురించి వినడమే చాలా బాగుంది" అన్నాడు హోమ్స్.

మరుసటి ఉదయం బేకర్ స్ట్రీట్‌లో హాయిగా కూర్చుని విస్కీ, సోడా

చప్పరిస్తూ ఉన్నప్పుడు హోమ్స్ వివరించసాగాడు. “చూశావా వాట్సన్, ఈ చిత్రమయిన ప్రకటన, సంఘం, ఎన్‌సైక్లోపీడియా తిరగరాయడం ఈ వ్యవహారమంతా చూస్తే మొదటినుంచి ఆ పాన్ బ్రోకర్‌ను రోజూ కొంతసేపు ఒకచోట బంధించడానికి వేసిన పథకమని నాకు ముందునుంచే అనుమానం వచ్చింది. నిజంగా విచిత్రంగా ఏర్పాటు చేశారు. క్లే జుట్టు ఎర్రగా ఉంది. దాంతోనే అతగాడికి ఈ ఆలోచన వచ్చి ఉంటుంది. వారానికి నాలుగు పౌండ్లు ఇస్తామంటే ఎవరయినా పడిపోతారు. వేలకువేలు దోచుకునే వాళ్లకి ఆ సొమ్ము ఒక లెక్కలోనిది కాదు. ప్రకటన ఇచ్చారు, ఓ భడవ, ఒక ఆఫీసు పెట్టాడు, మరొకడు ఈ మనిషిని ప్రోత్సహించాడు. ఈ రకంగా వారాల పాటు విల్సన్‌ని కట్టిపెట్టగలిగారు. అసిస్టెంట్ తక్కువ జీతానికే వచ్చాడు అనగానే అందులో ఏదో గూడుపుఠాణి ఉందని నాకు తోచింది.”

“కానీ ఏం జరగబోతున్నదని ఎట్లా ఊహించావు మరి?”

“ఇంట్లో ఒక ఆడపురుగు ఉంటే మరేదో తోచి ఉండేది. కానీ ఆ ప్రశ్నే లేదు. ఆ మనిషి వ్యాపారం చిన్నది. అక్కడ దొంగిలించడానికి కానీ, అంతగా ఖర్చుపెట్టడానికికానీ ఏమీ లేదు. అంటే ఉండేదేదో ఇంటి బయటన్నమాట. అదేమై ఉంటుంది? అసిస్టెంట్‌కు ఫొటోగ్రఫీ మీద ప్రేమ ఉందన్నారు. సెల్లార్ అన్నారు. అక్కడే చిక్కు విడిపోయింది. అసిస్టెంట్‌ను గురించి ఆరాతీస్తే అతను లండన్‌లోనే పెద్ద గుండెలు తీసిన నేరస్థుడని తెలిసింది. అతను సెల్లార్‌లో ఏదో చేస్తున్నాడు. అదీ, నెలలపాటు నిత్యం గంటలపాటు చేస్తున్నాడు. ఏం చేస్తున్నాడు? ఒక సొరంగం తవ్వుతున్నాడని తప్పితే నాకు మరోటి తోచలేదు.

“మనం ఆ స్థలానికి వెళ్లినప్పుడు నా ఆలోచన ఇంతవరకే ఉంది. నేను కర్రతో పేవ్‌మెంట్ మీద కొడితే నీవు ఆశ్చర్యపోయావు. సెల్లార్ ఇంటి ముందా, వెనుకా అని పరిశీలించాను. అప్పుడు బెల్ మోగించాను. అనుకున్నట్టే అసిస్టెంట్ కనిపించాడు. ఇంతకుముందు మేము ఎదురు

పడ్డాము. కానీ అంతగా పరిశీలించుకోలేదు. అతని ముఖం నేను గమనించింది లేదు. నేను చూడదలుచుకున్నది అతని మోకాళ్లను. అవి ముడతలుపడి, నలిగి, రంగువెలిసి ఉన్నాయని నీవే అన్నావు. అంటే సొరంగం సంగతి తేలింది. మిగిలిందల్లా సొరంగం దేనికోసమని. నేను మలుపు తిరిగి చూస్తే సరిగ్గా ఈ బిల్డింగ్ వెనుక సిటీ అండ్ సబర్బన్ బ్యాంక్ కని పించింది. ఇక నాకు సమాధానం దొరికింది. కచేరీ తరువాత నీవు ఇంటికి వెళ్లినప్పుడు నేను స్కాట్లాండ్ యార్డుకు, బ్యాంక్ ఛైర్మన్ దగ్గరికి వెళ్లాను. తరువాత సంగతి నీకు తెలిసిందే."

"ఈ రాత్రికే వాళ్లు లూటీ చేస్తారని ఎట్లా ఊహించగలిగావు?" నేను అడిగాను.

"భలే! లీగ్ ఆఫీస్ మూసేశారంటే ఇక జబేజ్ విల్సన్‌తో పని లేదనీ, అంటే సొరంగం పూర్తయిందనీ అర్థం కదా. దాన్నిక చేతనయినంత త్వరగా వాడుకోవాలి. లేకుంటే సొరంగం బయటపడవచ్చు. బంగారం చేజారి పోవచ్చు. శనివారం బాగా కుదురుతుంది. తరువాత పారిపోవడానికి సెలవు ఉంటుంది. అదీ సంగతి."

"చాలా చక్కగా ఊహించావు. ఒకదాని తరువాత ఒకటిగా ఎన్నో లింకులు. అన్నీ బాగా కుదిరాయి" ఆరాధనా భావంతో అన్నాను నేను.

"నాకు పెద్ద విసుగు తప్పింది. నేను నిజంగా బేజారెత్తుతూ ఉంటే ఈ కేసు దొరికింది. చక్కగా చిక్కును విడదీశాం" అన్నాడు హెూమ్స్.

"దేశానికి గొప్ప మంచి జరిగింది కదా" అన్నాను నేను.

అతను భుజాలు ఎగరేశాడు. "అవును. జరిగే ఉంటుంది. గుస్తావ్ ఫ్లాబర్ట్ అన్నట్టు, మనిషి సంగతి ఉట్టిదే, పని ఒకటే సర్వస్వమూనూ.." అన్నాడతను.





3

# ఏ కేస్ ఆఫ్ ఐడెంటిటి

బేకర్ స్ట్రీట్‌లోని లాడ్జింగ్‌లో మంటముందు అటొకరు, ఇటొకరు కూర్చున్నప్పుడు షెర్లక్ హెూమ్స్ చెప్పసాగాడు. "మనిషి ఊహించగలిగేదాని కన్నా జీవితం అంతులేని వింతలను ముందుకు తెస్తుంది. మామూలుగా ఉండే విషయాలను వదిలి ముందుకు ఊహించడం మనకు కుదరదు. మనమిద్దరమూ చేతులు పట్టుకుని ఆ కిటికీలోంచి బయటకు ఎగిరి నగరంమీద తిరుగుతూ ఇళ్ల పైకప్పులను తొలగించి తొంగిచూస్తే ఎన్నో అనుకోని సంఘటనలు, పథకాలు, కుట్రలు, కూహకాలు తరతరాలుగా సాగుతున్నవి మనకు కనబడతాయి. కథలన్నీ వాటిముందు తేలిపోతాయి."

"అదేదో నాకు అర్థం కావడం లేదు. పేపర్లలో కనిపించే కేసులన్నీ పసలేకుండా ఉంటాయి. నిజానికి చాలా బోడిగా, మొరటుగాను ఉంటాయి. మన పోలీస్ రిపోర్టులలో ఏ మాత్రం కళాత్మకత ఉండదని చెప్పవచ్చు" నేను జవాబిచ్చాను.

"కొంత తేడా చూడగలగాలి. అప్పుడు ఫలితం కనబడుతుంది. పోలీస్ రిపోర్టులలో మెజిస్ట్రేట్‌లను పొగడడం మీద ఉన్నంత శ్రద్ధ అందిరికీ ఆసక్తికరమయిన వివరాలను అందించడంలో ఉండదు. నిజానికి మామూలు సంగతుల్లోనే అసాధారణమయిన వివరాలు ఉంటాయి."



నేను చిరునవ్వి తల ఆడించాను. "నీవు అలా అనుకోవడం సరిగానే ఉందంటాను. నీవేమో ఆఫీసర్‌వి కాదు. వాళ్లంతా తికమక పడి నీవద్దకు వస్తారు. మూడు ఖండాల్లోని వారికి నీవు జవాబులందిస్తావు. అంతా వింతగా ఉంటుంది." అంటూ వార్తాపత్రికను చేతికి అందుకున్నాను. "ఒక చిన్న పరీక్ష చేద్దాం. పేపర్‌లో ఇదిగో ఇక్కడొక శీర్షిక ఉంది. భార్యపట్ల భర్త క్రూరత్వం అని. అరకాలం నిండా వివరాలున్నాయి. కానీ చదవకుండానే అందులో ఏముందో నేను చెప్పగలను. మరొక ఆడమనిషి, ఇతను తాగడం, పెళ్లాన్ని తోయడం, నాలుగు దెబ్బలు వేయడం, పక్కింటావిడ లేదా ఒక చెల్లెలు సాయం రావడం. ఏమీ తెలియని రచయితలు కూడా ఇంతకన్నా

అన్యాయంగా రాయరు.”

“అవును, నువ్వంటున్నది బాగానే ఉంది” అన్నాడు హెూమ్స్, పేపర్ అందుకుంటూ. “ఇది డుండాస్ విడాకుల కేసు. ఇందులో నేనూ కొంత వేలు పెట్టాను. ఆ మొగుడేమో టీ కూడా సరిగా తాగడు. మరో ఆడమనిషి మాటే లేదు. అతని గురించి చేసిన ఆరోపణలన్నీ ఉత్తివే. పాపం అతను భోజనం చివరలో కట్టుడు పళ్లు ఊడబీకి పెళ్లాం మీదికి విసిరేవాడట. ఇది కథలు రాసే ఎవరికన్నా అంతుపట్టే సంగతేనా? డాక్టర్, కావాలంటే నశ్యం ఓ పట్టుబట్టుకో. మొత్తానికి ఇక్కడ నేనే గెలిచానయ్యా” అతను ఒక బంగారు నశ్యం డబ్బీని నాకు అందించాడు. దానిమీద వెలగల రాయి ఒకటి పొదిగి ఉంది. ఇతని పద్ధతులు, మామూలు జీవితమూ తెలిసిన వారికి ఆ డబ్బీ విచిత్రంగా కనబడుతుంది. ఆ మాట చెప్పకుండా ఉండలేకపోయాను.

“ఆహా! మనం కలిసి కొన్ని వారాలయిందన్న సంగతి నేను మర్చిపోయాను. ఇది బొహీమియా రాజుగారు నాకు ఇచ్చిన కానుక. ఐరీన్ ఆడ్లర్ పేపర్స్ విషయంలో నేను ఆయనకు సాయం చేశాను”

“మరి ఆ ఉంగరం?” అతని వేలు మీద మెరిసిపోతున్న రవ్వల ఉంగరాన్ని చూపుతూ నేను అడిగాను.

“ఇది హాలండ్ రాజకుటుంబం వాళ్లు ఇచ్చినది. అక్కడి వ్యవహారం గురించి నీముందు కూడా చెప్పడానికి లేదు. నువ్వు నా గురించి నా కేసుల గురించి కొంత రాశావన్నది మరో విషయం.”

“మరి ఇప్పుడేమయినా కేసులు ఉన్నాయా?” ఆసక్తిగా నేనడిగాను.

“పది పన్నెండున్నాయి. కానీ ఏది పసగలది లేదు. అన్నీ ముఖ్యమయినవే, ఆసక్తికరమయినవి మాత్రం కావు. నాకొకటి తెలిసింది. మామూలుగా ముఖ్యం కావనిపించిన సంగతుల్లోనే పరిశీలించడానికి బోలెడుంటుంది. త్వరగా వివరం చూచి, కార్యకారణ సంబంధాలను

చూడగలిగితే పరిశోధన ముందుకు సాగుతుంది. పెద్ద నేరాలు మామూలుగా ఉంటాయి మరి. నేరం ఎంత పెద్దదయితే అందులో కారణం అంత మామూలయి ఉంటుందన్నది ఒక రూల్. ఈ కేసుల్లో ఒక్క విషయమేదో తప్పిస్తే గొప్ప ఆసక్తికరమయినది ఏదీ లేదు. మార్సేయిల్స్ నుంచి ఒక వ్యవహారం వచ్చింది. ఆ తరువాత మరో కొన్ని నిముషాల్లో మరోటి రాబోతోంది. నేనంటుకుంటున్నది పొరపాటన్నా కావాలి, లేదంటే ఆ వచ్చే ఆవిడ మన క్లయింట్ అయినా కావాలి" అతను కుర్చీలోంచి లేచాడు. కిటికీ పక్కకు వచ్చి బ్లయిండ్స్ సందుల్లోనుంచి వీధిలోకి చూడసాగాడు. అతని భుజంమీది నుంచి గమనిస్తే ఎదుటివేపు పేవ్‌మెంట్ మీద ఒక లావుపాటి ఆవిడ డాబుగల దుస్తులతో నిలబడి ఉంది. డచెస్ ఆఫ్ డివాన్‌షైర్ తీరులో ఉందామె. ఆత్రంగా ఆటూఇటూ చూస్తూ మా కిటికీకేసి కూడా చూచింది ఆమె. ఆవిడ వెనక్కూ ముందుకూ కదులుతున్నది. వేళ్లతో బొత్తాలను సవరిస్తున్నది. ఉన్నట్టుండి ముందుకు దూకి నీళ్లలో ఈదే మనిషిలాగా రోడ్డు దాటి ఇటువేపు వచ్చింది. మరుక్షణం గంటమోగింది.

"ఈ లక్షణాలన్నీ తెలిసినవే. అలా ఊగుతోందంటే అర్థమేమిటో తెలుసు. సలహా కావాలి. అయినా విషయం చెప్పాలా వద్దా అన్నది అనుమానం. ఒక ఆడమనిషి బాధపడుతున్నదంటే ఇక ఆ ఊగిసలాట ఉండదు. అలాంటి వారు బిగుసుకుపోతారు. ఈవిడ ఏదో ప్రేమ వ్యవహారంలో చిక్కింది. ఈవిడకు కోపం లేదు. తికమక మాత్రం ఉంది. అనుమానాలన్నీ తీర్చడానికి అదుగో, ఆవిడే వచ్చేస్తోంది."

అతను అలా అంటూ ఉండగానే తలుపు తట్టిన చప్పుడయింది. ఒక కుర్రవాడు మిస్ మేరీ సూదర్లాండ్ వచ్చారంటూ ముందుకు వచ్చాడు. చిన్న బోటు వెనుక వచ్చే పెద్ద ఓడలా వెనుక ఆవిడ నిలబడి ఉంది. షెర్లక్ హెూమ్స్ ఆవిడకు స్వాగతం పలికాడు. తనదయిన ధోరణిలో వందనం చేశాడు. తలుపు మూసి ఆ తరువాత ఆవిడను కుర్చీలో కూర్చోమన్నాడు.

ఆమెను నిశితంగా చూస్తున్నాడు. అది అతనికే చేతనయిన చూపు.

"ఏమండీ, కను చూపు అంతసరిగా లేకున్నా బోలెడు టైపింగ్ ఎలా చేయగలుగు తున్నారు?" అడిగాడు.

"మొదట్లో కష్టం గానే ఉండేది. ఇప్పుడు అక్షరాలు ఎక్కడున్నాయో తెలిసిపోయింది" ఆమె జవాబిచ్చింది. మరుక్షణం అతని మాటల సంగతి అర్థమయి ఒక్కసారిగా కుదిపినట్లు కదిలి భయమూ ఆశ్చర్యమూ కనబరుస్తూ పైకి చూచింది. అయినా ఆ ముఖం అందంగానే ఉంది. "నా గురించి మీరు విన్నట్టున్నారు మిస్టర్ హెూమ్స్. లేకుంటే ఈ సంగతులు మీకు ఎట్లా తెలుస్తాయి?"

"వదిలేయండి. సంగతులు తెలుసుకోవడమే నా పని మరి. అందరూ పట్టించుకోని విషయాలను గమనించడం నాకు అలవాటయింది. లేకుంటే మీరు నాదగ్గరకు ఎందుకు వస్తారు.?"



"మిసెస్ ఎతరీజ్‌గారు మీ గురించి చెప్పగా విని వచ్చాను సార్. వాళ్లాయన కనిపించనప్పుడు మీరెంతో సాయం చేశారట. పోలీసువాళ్లు ఆయన పోయాడని చెపుతుండగా, మీరాయన ఆచూకీ చెప్పారట. మిస్టర్ హెూమ్స్, మీరు నాకూ అలాంటి సాయమే చేయాలి. నేను ధనవంతురాలిని కాదు. అయినా ఏటా ఓ వంద సంపాదించుకుంటాను.

ఇక నా మెషీన్ ఉండనే ఉంది. మిస్టర్ హోస్మర్ ఏంజెల్ ఏమయ్యారో చెపితే మీకు ఎంతయినా ఇచ్చుకోగలను."

"మరి ఇంత ఆదరాబాదరాగా ఎందుకు వచ్చారు, నా దగ్గరికి" షెర్లక్ హోమ్స్ అడిగాడు. మామూలుగానే రెండు చేతుల వేళ్ల చివర్లను కలిపి పట్టుకుని, పైకప్పు వేపు చూస్తూ.

ఆవిడ ముఖం మీద మళ్లీ ఒకసారి ఆశ్చర్యం కనిపించింది. "నిజంగానే ఇంట్లోంచి పరుగున వచ్చేశాను. మిస్టర్ విండిబ్యాంక్–అంటే మా నాన్నగారు అందుకు కారణం. ఆయన పోలీసుల్ని పిలవరు. నన్ను మీ దగ్గరికి రానీయరు. అసలేదీ చేయనీయరు. దాంతో నాకు పిచ్చెత్తింది. అందుకే ఎవరికీ చెప్పకుండా పరుగుగా మీవద్దకు వచ్చాను."

"మీ నాన్నగారు అన్నారు మరి పేరేమో వేరుగా ఉంది" అన్నాడు హోమ్స్.

"మా కొత్త నాన్నగారు. నేను నాన్నగారూ అనే అంటాను. విచిత్రంగా ఉంటుందని తెలుసు. ఆయన నాకంటే ఐదు సంవత్సరాల రెండు నెలలు మాత్రమే పెద్దవారు."

"మీ అమ్మగారు బతికే ఉన్నారా?"

"లక్షణంగా బతికే ఉన్నారు. నాన్నగారు పోయిన కొన్నాళ్లకే ఆవిడ మళ్లీ పెళ్లి చేసుకోవడం అందునా తనకన్నా పదిహేను సంవత్సరాలు చిన్న వాడిని పెళ్లాడడం నాకేమంత నచ్చలేదు మిస్టర్ హోమ్స్. నాన్నగారు టోటెన్ హామ్ కోర్ట్ రోడ్‌లో ప్లంబర్‌గా పని చేసేవారు. తరువాత వ్యాపారాన్ని అమ్మ నడిపించింది. మిస్టర్ హార్డీ అనే ఫోర్‌మన్ సాయం చేసేవారు. మిస్టర్ విండిబ్యాంక్ వచ్చి అదంతా అమ్మేశారు. ఆయనేమో వైన్ వర్తకులు. మామూలు వ్యాపారం లోకువగా కనిపించింది. మొత్తానికి 4,700 పౌండ్లు గిట్టాయి."

ఆమె ఇలా సోది చెపుతుంటే షెర్లక్ హెూమ్స్‌కు నచ్చదని నాకు అనిపించింది. కానీ అతనుమాత్రం చాలా ధ్యాసతో వింటున్నాడు.

"మీ ఆదాయం, అది ఎక్కడి నుంచి వస్తుంది?" అడిగాడతను.

"అది, పూర్తి వేరే వ్యవహారం. మా అంకుల్ ఒకాయన నాకు కొంత ఆస్తి వదిలాడు. అదంతా న్యూజిలాండ్‌లో ఉంది. దానిమీద వడ్డీ మాత్రమే నాకు అందుతుంది."

"మీరు చెప్పేదంతా చాలా ఆసక్తికరంగా ఉంది. మీకు ఏటా వంద ఆదాయం ఉంది, దాన్ని ఖర్చు పెడుతూ తిరిగే పనిలేదు. అలవాట్లూ లేవు. ఒక ఒంటరి స్త్రీ నిజానికి అరవై పౌండ్లలోనే సుఖంగా బతకొచ్చునేమో!"

"మిస్టర్ హెూమ్స్ అంతకన్నా తక్కువలోనే బతకవచ్చు. కానీ నేను అమ్మతో ఉంటున్నంతకాలం వాళ్లమీద భారంగా ఉండదలచుకోలేదు. విండిబ్యాంక్ నా వడ్డీ వ్యవహారాన్ని మూడు నెలలకొకసారి చూస్తారు. వచ్చింది అమ్మకు ఇస్తారు. నా ఖర్చులేమో నా టైప్ రైటింగ్‌తో గడిచిపోతాయి. నాకు షీటుకు రెండు పెన్స్ గిట్టతాయి. రోజుకి పదిహేను నుంచి ఇరవై షీట్లు చేస్తాను."

"మీ సంగతులన్నీ నాకు అర్థమయ్యాయి. ఇక ఈయన గారు డాక్టర్ వాట్సన్. నా ముందు మాట్లాడినంత నిస్సందేహంగానూ ఆయన ముందు కూడా మాట్లాడ వచ్చు. ఇక దయచేసి మిస్టర్ హెూస్మర్ ఏంజెల్ గారితో మీ సంబంధం గురించి వివరిస్తారా?"

మిస్ సూదర్లాండ్ ముఖం మీద సిగ్గు తొణకి సలాడింది. ఆమె తన కోటు అంచులను పట్టుకున్నది. "ఆయనను నేను గ్యాస్ ఫిట్టర్స్ బాల్‌లో మొదట కలుసుకున్నాను. నాన్న బతికి ఉన్నప్పుడు వాళ్లు ఫ్రీ టిక్కెట్లు పంపేవారు. తరువాత అమ్మకు కూడా పంపుతున్నారు. విండిబ్యాంక్ గారికి ఇవన్నీ ఇష్టం ఉండవు. మమ్మల్ని కూడా ఎక్కడికీ పోవద్దంటారు. నేను ఏ సన్‌డే స్కూల్‌కో వెళతానన్నా ఒప్పుకోరు. కానీ ఈసారి మాత్రం నేను వెళ్లడానికి

నిశ్చయించుకున్నాను. నన్ను ఆపే హక్కు ఆయనకు ఎక్కడిది? అక్కడి మనుషులు మన స్థాయికి తగినవారు కాదంటారాయన. అక్కడ ఉండేది నాన్న స్నేహితులు. ఇక ఆయన నా దగ్గర సరయిన దుస్తులు కూడా లేవంటారు. అది నిజం కాదు. మొత్తానికి ఆయన వ్యాపారం పనిమీద ఫ్రాన్స్ వెళ్లారు. కనుక అమ్మ, నేను హార్డీగారితో, అంటే మాదగ్గర ఫోర్‌మన్‌గా ఉండేవారే, ఆయనతో బాల్‌కి వెళ్లాము. మిస్టర్ హొస్మర్ ఏంజెల్ గారిని అక్కడే కలిశాను."



"విండిబ్యాంక్ ఫ్రాన్స్ నుంచి వచ్చిన తరువాత చాలా గోల చేసి ఉంటారు" అన్నాడు హొమ్స్.

"చాలా. అది బాగా చేతనవుతుంది ఆయనకు. కానీ ఆయన గోల చేయలేదు. నవ్వేశారు. భుజాలు ఎగరేశారు. ఆడవారిని కట్టిపెట్టడం దండగన్నారు. వాళ్లు అనుకున్నది చేస్తారని కూడా అన్నారు."

"అయితే మీరు బాల్‌లో మిస్టర్ హొస్మర్ ఏంజెల్ అనే పెద్దమనిషిని కలిశారు."

"ఆ రాత్రి మొదటి సారిగా ఆయనను చూచాను. మరురోజు ఆయన కాల్ చేసి

ఇంటికి క్షేమంగా చేరారా అని అడిగారు. ఆ తరువాత కూడా ఒకటి రెండుసార్లు మేము కలిశాము. ఈలోగా నాన్నగారు వచ్చేశారు. ఏంజెల్‌ని కలవడం కుదరలేదు."

"ఎందుకని?"

"నాన్నగారికి ఇలాంటివి నచ్చవు. ఆయనకు వదిలితే అసలు ఇంటికి ఎవరినీ రానీయరు. ఆడవాళ్లు ఇంట్లోనే ఆనందంగా ఉండాలంటారు. కానీ నేనుమాత్రం అమ్మతో మరోలా అనేదాన్ని. నాకూ ఒక సర్కిల్ ఉండాలి, అది లేదూ అని."

"మరి హొూస్మర్ ఏంజెల్ మిమ్మల్ని కలవడానికి ప్రయత్నం చేయ లేదా?"

"నాన్నగారు మళ్లీ వారంలోపల ఫ్రాన్స్ వెళుతున్నారు. ఈలోగా కలవడం అంత మంచిది కాదని హొూస్మర్ రాశాడు. ఉత్తరాలు నిత్యమూ రాస్తూనే ఉన్నాడు. ఉదయాన్నే ఉత్తరాలు చూచేది నేనే కనుక అవి నాన్న కంట్లో పడే ప్రమాదం లేదు."

"ఈలోగా మీ ఇద్దరికీ ఎంగేజ్‌మెంట్ జరిగిందా?"

"జరిగింది మిస్టర్ హొూమ్స్. మొదటిసారి వాకింగ్‌లో కలిసిన తరువాత జరిగింది. హొూస్మర్ అంటే మిస్టర్ ఏంజెల్ లీడెన్ హాల్ వీధిలో అదేదో కంపెనీలో క్యాషియర్‌గా పని చేస్తున్నారు...."

"ఏ ఆఫీస్ అది?"

"అదే చిక్కు. నాకు తెలియదు."

"మరి అతను ఉండేదెక్కడ?"

"తాను ఆఫీస్‌లోనే పడుకునే వాడు."

"ఇంతకూ చిరునామా తెలియదు. అంతేనా?"

"లీడెన్‌హాల్ స్ట్రీట్ అని తప్ప నిజంగానే తెలియదు."

"మరి ఉత్తరాలు ఎక్కడికి పంపేవారు మీరు."

"లీడెన్‌హాల్ పోస్టాఫీస్‌కి. ఉత్తరాలను ఆఫీస్‌కి పంపితే అమ్మాయి దగ్గరనుంచి వస్తున్నాయని తోటి క్లర్క్‌లు ఆట పటిస్తారని ఆయన బాధ. అందుకే నేను ఉత్తరాలను అతనిలాగే టైప్ చేసి పంపేదాన్ని. కానీ ఒప్పుకోలేదు. చేత్తో రాయాలన్నారు. అప్పుడే నా ఉత్తరమని తెలుస్తుందట. మధ్యన మెషీన్ ఉండకూడదట. నేనంటే ఎంతగా ఇష్టపడ్డారో అర్థమయిందనుకుంటాను మిస్టర్ హోమ్స్. చిన్న సంగతిని కూడా పట్టించుకునే రకమన్నమాట."

"బాగుంది. కానీ చిన్న సంగతుల్లోనే అంతులేని లోతుంటుందని నాకు గట్టి అభిప్రాయం. హోస్మర్ ఏంజెల్ గురించి అలాంటి చిన్న సంగతులు మరేమైనా చెప్పగలరా?"

"అతను చాలా సిగ్గరి. పగటిపూట నాతో తిరగడానికి కూడా ఇష్టపడే వాడు కాదు. అందరిలో కనిపించడం నచ్చదట. గుప్‌చిప్‌గా ఉండే రకం. గొంతుకూడా అంతే. చిన్న వయస్సులో ఏదో జబ్బుచేసి గొంతు సన్నబడిందని చెప్పాడు. గుసగుసలాడినట్టు మాట్లాడేవాడు. చక్కగా దుస్తులు వేసుకుంటాడు. శుభ్రంగా ఉంటాడు. కళ్లకేదో సమస్య ఉందిలాగుంది. రంగుజోళ్లు పెట్టుకునే వాడు."

"మరి మీ కొత్త నాన్నగారు, మిస్టర్ విండిబ్యాంక్ ఫ్రాన్స్ నుంచి వచ్చిన తరువాత ఏం జరిగింది?"

"మిస్టర్ హోస్మర్ ఏంజెల్ ఇంటికి వచ్చారు. నాన్న వచ్చేలోగానే మనం పెళ్లి చేసుకోవాలన్నారు. పవిత్రగ్రంథం మీద ప్రమాణం చేసి, ఎన్ని జరిగినా నన్ను మాత్రం వదలను అని చెప్పించారు. అతను అలా చేయడం బాగానే ఉందని అమ్మకూడా అన్నది. అమ్మకు అతను బాగా నచ్చాడు.

నాకంటే ఆయనే ఎక్కువ నచ్చినట్టున్నాడు. వారంలోగా పెళ్లి అని వాళ్లు అంటూ ఉంటే నేను నాన్నగారి మాట ఎత్తాను. వాళ్లేమో ఫరవాలేదన్నారు. ఆయన వచ్చిన తరువాత చెప్పొచ్చు, ఏమీ అనరు అన్నారు. నాకది నచ్చలేదు మిస్టర్ హెూమ్స్. దొంగతనంగా ఏదీ చేయాలని నాకనిపించదు. నేను నాన్నగారికి బోర్డో అడ్రస్‌కి ఉత్తరం రాశాను. అది వాళ్ల ఫ్రెంచ్ ఆఫీస్. కానీ ఉత్తరం పెళ్లినాటి ఉదయమే తిరిగి వచ్చింది.”

“అంటే ఆయనకు అందలేదన్న మాట.”

“ఉత్తరం అందేలోగానే ఆయన ఇంటికి బయలుదేరారు మరి.”

“అయ్యో, మరి మీ పెళ్లి శుక్రవారానికి నిశ్చయమయింది. అది చర్చ్‌లో జరగాలనేనా?”

“అవును. కానీ పెద్ద తతంగం లేకుండా. సెయింట్ సేవియర్స్ చర్చ్‌లో. పెళ్లి తరువాత అందరమూ సెయింట్ ప్యాంక్రాస్ హెూటేల్‌లో బ్రేక్‌ఫాస్ట్ చేయాలని. హెూస్మర్ మా దగ్గరకు ఒక హ్యాన్సమ్ బండిలో వచ్చాడు. మేము ఇద్దరం ఉన్నాము గనుక మమ్మల్ని అందులో కూర్చోమన్నాడు. అతనేమో మరో నాలుగు చక్రాల బండిలో ఎక్కాడు. వీధిలో దొరికిన ఒకే ఒక్క బండి అదే. మేము చర్చ్‌కు ముందుగా చేరాము. నాలుగుచక్రాల బండి తరువాత వచ్చింది. అతను దిగుతాడని చూస్తే దిగలేదు. బండిమనిషి దిగి, పెట్టెలోకి తొంగిచూస్తే లోపల ఎవరూ లేరు. హెూస్మర్ పెట్టెలోకి ఎక్కడం బండి మనిషి కళ్లారా చూచాడు. ఇదంతా శుక్రవారం నాడు జరిగింది. ఆ తరువాత అతని సంగతి అసలే తెలియలేదు.”

“మీకిదంతా చాలా చికాకుగా ఉంది కదూ” అన్నాడు హెూమ్స్.

“అది కాదు సర్. అతను అలాంటి మనిషికాదు. అంత ఎందుకు? ఎన్నిజరిగినా మనం విడిపోయేది లేదని ఆ ఉదయం కూడా అంటూనే ఉన్నాడు. ఏదయినా జరిగి విడిపోవలసి వస్తే ఒకరిని ఒకరు మరవ




కూడదన్నాడు. పెళ్లిరోజు ఉదయం అలాంటి మాటలేమిటో నాకర్థం కాలేదు. కానీ జరిగింది చూస్తే, ఇప్పుడు అనుమానంగా ఉంది."

"నిజమే. అనుకోనిదేదో జరిగి ఉంటుందని మీరు అనుకుంటున్నారు. అంతేనా?"

"అవును సర్. అతను ఏదో జరుగుతుందని ముందే అనుమానించినట్టున్నాడు. లేకుంటే అట్లా మాట్లాడడు. అనుమానించింది నిజంగా జరిగినట్టుంది."

"అనుమానించిందేమిటో మీకేమయినా తోచిందా?"

"అస్సలు తోచలేదు."

"మరో ప్రశ్న. వ్యవహారం గురించి మీ అమ్మ ఏమంటున్నారు?"

"ఆమెకు కోపం వచ్చింది. ఆ సంగతి గురించి మళ్లీ మాట్లాడవద్దన్నది."

"మీ నాన్నగారు? ఆయనకు సంగతి చెప్పారా?"

"చెప్పాను. ఆయనకూడా అనుకోనిదేదో జరిగిందనే నా మాటనే బలపరిచారు. నాలుగునాళ్లు వేచి ఉంటే తేలుతుందన్నారు. చర్చ్‌దాకా తెచ్చి

నన్ను వదిలి వెళ్లాలని ఎందుకు ఉంటుంది? అతను నా డబ్బు ఏమయినా తీసుకుని ఉంటే లేదా పెళ్లయిన తరువాత నా డబ్బును కాజేసి ఉంటే, మాయమవడంలో అర్థం ఉంది. కానీ హొస్మర్ డబ్బు విషయంలో చాలా జాగ్రత్త మనిషి. నా దగ్గరనుంచి ఒక్క షిల్లింగ్ కూడా తీసుకోలేదు. మరప్పుడు అతను ఏమయినట్టు? ఉత్తరమయినా ఎందుకు రాయడం లేదు? నాకు పిచ్చెత్తుతోంది. క్షణం కూడా నిద్ర పట్టడం లేదు." ఆమె ఒక జేబురుమాలు తీసి ఏడుస్తూ కళ్లు తుడుచుకోసాగింది.

"నేను మీకేసులోకి జాగ్రత్తగా చూస్తాను." అన్నాడు హొమ్స్ పైకిలేస్తూ. "తొందరలోనే సంగతి తెలిసిపోతుంది. మీరు భారం నామీద వదిలేయండి. అంతా మరచి హాయిగా ఉండండి. ఆలోచనల్లోంచి హొస్మర్‌ని దూరం ఉంచండి" అన్నాడతను.

"అంటే ఇక అతను మళ్లీ కనిపించడంటారా?"

"అంతేనేమో!"

"ఇంతకూ అతనికి ఏమయి ఉండవచ్చు?"

"ఆ ప్రశ్న నాకు వదిలేయండి. ఒక్కసారి ఆయనని బాగా వర్ణించి చెప్పండి. ఉత్తరాలు నాకందించండి."

"గడిచిన శనివారం క్రానికిల్‌లో ఆయన గురించి ప్రకటన ఇచ్చాను. ఇదిగో. ఇక నాలుగు ఉత్తరాలు కూడా."

"థాంక్యూ. మరి మీ చిరునామా?"

"నంబర్ 31, లయ్యన్ ప్లేస్, క్యాంబర్‌వెల్."

"ఏంజెల్‌గారి చిరునామా ఎట్లాగూ తెలి యదంటున్నారు. మీ నాన్నగారి ఆఫీస్ ఎక్కడ?"

"ఆయన వెస్ట్‌హౌస్ & మార్‌బ్యాంక్ వాళ్ల తరఫున తిరుగుతూ ఉంటారు. ఆఫీస్ ఫెన్‌చర్చ్ స్ట్రీట్‌లో ఉంటుంది."



"థాంక్యూ. వివరాలన్నీ వచ్చాయి. కాగితాలను ఇక్కడే వదలండి. నేను చెప్పిన మాటలు గుర్తుంచుకోండి. జరిగిందంతా జరిగిపోయింది. అది మళ్లీ ముందుకు రాకూడదు."

"మిస్టర్ హోమ్స్, బాగానే ఉంది. కానీ నేనలా చేయలేను. నేను హోస్మర్‌ను మరవలేను. అతను తిరిగి వచ్చేదాకా వేచి ఉంటాను."

దుస్తుల సంగతి మరోలాగున్నా ఈ అమ్మాయి నిజంగా గొప్ప లక్షణాలు గలది. నాకు ఆవిడ మీద గౌరవం కలిగింది. కాగితాలను అక్కడే బల్లమీద పెట్టి, ఎప్పుడు కబురుపెడితే అప్పుడు తిరిగివస్తానంటూ ఆమె వెళ్లిపోయింది.

షెర్లక్ హోమ్స్ మామూలుగానే రెండు చేతుల వేళ్ల చివరలను ఒకదానికొకటి నొక్కుతూ కాళ్లు బారచాపి కూర్చుని ఆలోచించసాగాడు. చూపు పైకప్పు మీద ఉంది. స్టాండ్‌లోనుంచి జిడ్డు పట్టిన మట్టి పైపును తీసుకుని మళ్లీ కూర్చున్నాడు. అంటే ఇక ఆలోచనలోకి దిగుతాడని అర్థం. నీలం పొగలు వదులుతూ లోతుగా ఆలోచనలోకి జారుకున్నాడతను.

"నిజంగా ఆసక్తికరంగా ఉంది. కేసుకన్నా అమ్మాయి ఆసక్తికరంగా ఉంది. కేసుకూడా అంతే. నా ఇండెక్స్‌లో చూస్తే 77లో ఆండోవర్‌లో ఇలాంటిదే ఒకటి తగిలింది. ఆలోచన పాతదే. కానీ ఒకటి రెండు వివరాలు కొత్తగా ఉన్నాయి. అసలు ఈ అమ్మాయి గురించి తెలుసుకోవలసి ఉంది" అన్నాడతను.

"నాకు కనిపించని వివరాలేవో నీవు ఆమెలో గమనించినట్టున్నావు" అన్నాను నేను.

"కనిపించని కాదు వాట్సన్, గమనించనివి. ఎక్కడ చూడాలో నీకు తెలియలేదు. కనుక ముఖ్యమైన సంగతులన్నీ వదిలేశావు. ఆ కోటు చేతులు గమనించావా? వేలి గోళ్లను, బూటు లేసులను చూచావా? ఇంతకూ నీవు ఆ అమ్మాయిలో ఏం గమనించావు? చెప్పు చూద్దాం."

"నేనా! ఆమె పలకరంగు గల పెద్దటోపీ పెట్టుకుందనీ, అందులో ఓ ఎర్రని ఈక ఉందని చూచాను. ఆమె జాకెట్టు నల్లది. దానిమీద నల్లని పూసలు ఉన్నాయి. అలంకరణలు కూడా నల్లనివే. ఆమె డ్రెస్ రంగు బ్రౌన్. నిజానికి ముదురు కాఫీరంగు. మెడలదగ్గర మరో రంగు ఉంది. గ్లోవ్స్ గ్రేగా ఉన్నాయి. కుడి చూపుడువేలి చివర అరిగి ఉన్నాయి. నేను ఆవిడ బూట్లు చూడలేదు. చెవులకు మాత్రం బంగారు రింగులు ఉన్నాయి. అంటే బాగా కలిగి ఉండి అది తెలిసేలా సుఖజీవనమన్నమాట."

షెర్లక్ హెూమ్స్ చప్పట్లు చరిచాడు. నెమ్మదిగా నవ్వాడు.

"భలే.. భలే వాట్సన్. మంచి ప్రోగ్రెస్. బాగా గమనించావు. అయితే ముఖ్యమయిన సంగతులన్నీ వదిలేశావు. పద్ధతి పట్టుపడిందిలే. ఇక రంగుల గురించి నీకు బాగా పట్టుకుంది. ఇంతకూ కలిగిన మామూలు అభిప్రాయాలను పట్టుకోకూడదయ్యా. నేనేమో అమ్మాయిని చూస్తే ముందు చేతులను గమనిస్తాను. మగవాళ్లయితే పంట్లాము మోకాళ్లను చూడాలి. ఈ అమ్మాయి చేతుల మీద ప్లష్ ఉంది. అది ఎంతో చెపుతుంది. మణికట్టుపైన లైన్‌లు చూస్తే టైప్ రైటర్‌మీద టేబుల్ దగ్గర ఒత్తుకున్న సంగతి తెలుస్తుంది. అదే కుట్టుమిషన్ అయితే అలాంటి గుర్తులు ఎడమచేతి మీద మాత్రమే ఉంటాయి. ఇక ముఖం చూచాను. కళ్లజోడు పెట్టుకున్న గుంటలు ముక్కుమీద కనిపించాయి. అందుకనే చూపు ఆనదని, టైపింగ్ కష్టమని చెప్పి ఆమెను ఆశ్చర్యపరిచాను."

"నన్నూ ఆశ్చర్యపరిచావులే."

"అందులో ఆశ్చర్యం ఏముంది? కానీ కొంచెం కిందకు దృష్టిపోతే ఆవిడ బూట్లు కనిపించాయి. అవి నిజానికి విడిజోడు. ఒకదాని మీద కొంచెం అలంకరణలున్నాయి. ఒకదాని బొత్తాలు అయిదింటిలో రెండే పెట్టి ఉన్నాయి. మరోదాంట్లో ఒకటి, మూడు, ఐదు మాత్రమే పెట్టి ఉన్నాయి. ఒక చక్కని అమ్మాయి చక్కగా తయారయ్యి, బూట్లుమాత్రం బొత్తాలు సరిగా పెట్టకుండా బయలుదేరిందంటే ఆవిడ గొప్ప తొందరలో ఉందనికదా అర్థం."

"ఇంకా ఏం చూశావు?" నా ఆశ్చర్యం అవధులు దాటుతోంది. ఇతగాని పరిశీలన పద్ధతి అంతుపట్టడం లేదు.

"ఆమె బయలుదేరుతూ దుస్తులు వేసుకున్న తరువాత ఒక నోట్ రాసింది. నువ్వు గమనించి ఉంటే కుడి గ్లోవ్స్ వేళ్ల చివరన చిరిగి ఉన్నాయి. అది చూచావేమో గానీ వాటి మీద సిరా మరకలు చూచి ఉండవు. ఆమె తొందరలో కలాన్ని మరీ లోతుగా ముంచింది. అదీ ఎప్పుడో కాదు. ఇవాళ పొద్దున్నే. ఇదంతా చాలా మామూలుగా కనిపించవచ్చు గానీ సరదా కదూ. ఇక వ్యవహారం గురించి పట్టించుకుందాం, వాట్సన్. హోస్మర్ ఏంజెల్ గురించి ఇచ్చిన ప్రకటనను కొంచెం చదువుతావా?

నేను ఆ చిన్న అచ్చు కాగితాన్ని ఎత్తి వెలుతురుకు పట్టుకున్నాను.

*"కనబడుట లేదు. హోస్మర్ ఏంజెల్ అనే వ్యక్తి పద్నాలుగు ఉదయం నుంచి కనబడుట లేదు. అయిదు అడుగుల ఏడు అంగుళాల ఎత్తు, దృఢమైన చామనఛాయ శరీరం, నల్లని జుట్టు, కొంచెం బట్టతల, దుబ్బుగా సైడ్‌విష్కర్స్, మీసాలు ఉంటాయి, మాట కొంచెం జారుతుంది, రంగు కళ్లజోడు, మంచి దుస్తులు వేసుకుని ఉన్నారు, చివరగా కనిపించినప్పుడు నల్లని ఫ్రాక్‌కోట్, నల్లని వెయిస్ట్‌కోట్, బంగారు ఆల్బర్ట్ చైన్, గ్రే రంగు హారిస్,*

*ట్వీడ్ ట్రౌజర్స్ వేసుకుని ఉన్నారు. లీడెన్ హాల్ స్ట్రీట్‌లోని ఒక ఆఫీస్‌లో పని చేస్తారు. ఆచూకీ తెలిపిన----"*

''చాలు.. చాలు'' అన్నాడు హోమ్స్. ''ఈ ఉత్తరాలు చాలా మామూలుగా ఉన్నాయి. ఏంజెల్ గురించి ఒక ముక్క కూడా వాటిలోంచి తెలిసింది లేదు. ఎక్కడో ఒకచోట బాల్జాక్ గురించి రాశాడంతే. ఒక్క విషయం మాత్రం బాగా కనబడుతుంది. అదేమిటో నీకు తోచిందా?"

"అన్నీ టైప్ చేసి ఉన్నాయి" నేనన్నాను.

"అంతేకాదు, సంతకం కూడా టైప్ చేసి ఉంది. అడుగున హోస్మర్ ఏంజెల్ అన్న అక్షరాలను చూడు. తేదీ కూడా ఉంది. లీడెన్ హాల్ వీధి అన్న పొడిమాట తప్ప వివరాల్లేవు. ఆ సంతకం సంగతి చూస్తే ఒక సంగతి మాత్రం చెప్పవచ్చు."

"దేని గురించి?"

"మిత్రమా! కేసులో ఈ విషయం ఎంతముఖ్యమో నీకు తోచనే లేదా?"

"తోచిందని చెప్పలేను. సంతకం సాయంతో తనమీద కేసు వేస్తారని భయమా?"

"కాదు, అదికాదు సంగతి. అయితే నేనొక రెండు ఉత్తరాలు రాస్తాను. వాటితో సంగతి తేలిపోతుంది. ఒకటి నగరంలోని ఒక కంపెనీకి, రెండవది వచ్చిన అమ్మాయిగారి కొత్త తండ్రిగారు మిస్టర్ విండిబ్యాంక్‌కి. ఆయనను రేపు సాయంత్రం ఆరు గంటలకు ఇక్కడికి వచ్చి కలవగలరేమో అని అడుగుతాను. మనం బంధువులలో మగవాళ్లతో వ్యవహారం చేయడం మంచిది. ఇక డాక్టర్, ఈ రెండు ఉత్తరాలకు జవాబు వచ్చేలోగా చేయగలిగింది ఏమీలేదు."

నా మిత్రుని విశ్లేషణపద్ధతి గురించీ, పనిలో అతను చూపించే చురుకుదనం గరించీ గట్టి నమ్మకం నాకు ఉంది. అందుకు చాలా కారణాలున్నాయి. ఎదురయిన సమస్య గురించి అతనేదో గట్టి నిర్ణయానికి వచ్చాడన్న

నమ్మకం నాకు కలిగింది. అతని ఆలోచన తప్పుదారి పట్టడం ఐరీన్ ఆడ్లర్ ఫొటోగ్రాఫ్ విషయంలో ఒక్కసారి మాత్రం జరిగింది. కానీ, సైన్ ఆఫ్ ఫోర్ వ్యవహారంలో, ఏ స్టడీ ఇన్ స్కార్లెట్ కేసుల్లో అతను చూపిన పద్ధతులను గుర్తుకు తెచ్చుకుంటే, అతను విప్పలేని చిక్కుముడి లేదనిపిస్తుంది.

మట్టి పైప్‌లోనుంచి పొగ పీల్చి వదులుతుంటే అతడిని అట్లా వదిలి నేను వచ్చేశాను. రేపు సాయంత్రం మళ్లీ వచ్చే సమయానికి కేసు గురించి అన్ని క్లూలను పట్టేస్తాడని మిస్ మేరీ సూదర్లాండ్‌ని పెళ్లి చేసుకోకుండా పారిపోయిన వరుని వివరాలు చెప్పేస్తాడని నాకు నమ్మకం ఉంది.

సరిగ్గా ఆ సమయానికి నాకూ ఒక గట్టి కేసు తగిలింది. మరుసటి దినమంతా బాధపడుతున్న ఆ రోగి దగ్గరే గడపవలసి వచ్చింది. వెసులు బాటు కలిగేసరికి సాయంత్రం ఆరు అయ్యింది. వెంటనే నేను బండి పట్టుకుని బేకర్ స్ట్రీట్ చేరుకున్నాను. వివరాలు విప్పడంలో సాయం చేయడానికి నాకు అవకాశం చేజారిపోయిందేమోనని నా భయం. అయినా, షెర్లక్ హెూమ్స్ వంటిగా కునికిపాట్లు పడుతున్నాడు. అతని సన్నని శరీరం కుర్చీలో మెలికలు తిరిగి ఉంది. బోలెడన్ని సీసాల, నాళికలు, హైడ్రోక్లోరిక్ యాసిడ్ వాసన అక్కడ ఎదురయ్యాయి. అంటే అతనికి ఇష్టమయిన రసాయన ప్రయోగమేదో చేస్తున్నాడని అర్థం.

“ఏమిటి, సంగతి తేలిందా?” లోనికి వెళుతూ అడిగాను నేను.

“తేలింది, అది బెరైటా తాలూకు బైసల్ఫేట్.”

“అదికాదు, అమ్మాయి సంగతి.” గట్టిగా అన్నాను నేను.

“ఓ అదా! నేను నా రసాయనం గురించి చెపుతున్నాను. ఇక ఆ సంగతిలో మిస్టరీయే లేదు. నిన్ననే చెప్పినట్టు అందులో కొంచెం వింత ఉంది అంతే. అయితే అక్కడ చట్టంతో పనిలేదు. ఆ భడవను ఏ రకంగాను శిక్షించలేం.”

"ఇంతకూ ఎవరతను? మిస్ సూదర్లాండ్‌ని అట్లా వదలడంలో అతని ఉద్దేశమేమి?"

ప్రశ్న నా నోట్లోనుంచి వెలువడి జవాబుగా హెూమ్స్ పెదవి కదపకముందే బయట బలమయిన అడుగుల చప్పుడు వినిపించింది. ఎవరో తలుపు తట్టారు.

"అదిగో, ఆ అమ్మాయి గారి కొత్తతండ్రి మిస్టర్ జేమ్స్ వెండిబ్యాంక్. సాయంత్రం వస్తానని కబురు పెట్టాడు కూడా. రండి లోపలికి" అన్నాడు హెూమ్స్.

లోపలికి వచ్చిన పెద్దమనిషి మధ్యరకంగా ఉన్నాడు. ముప్ఫయేళ్ల వయస్సు ఉంటుంది. గడ్డం గీసి ఉంది. చామనఛాయ రంగు. ముఖం మీద భావాలేవీ లేవు. కానీ కళ్లుమాత్రం బాగా చురుకుగా ఉన్నాయి. అతను



ప్రశ్నగా మా ఇద్దరి వేపు చూశాడు. మెరుస్తున్న టోపీని తీసి బల్లమీద పెట్టాడు. నమస్కారంగా ముందుకు వంగి దగ్గరలోని కుర్చీలో కూర్చున్నాడు.

'గుడ్ ఈవినింగ్, మిస్టర్ జేమ్స్ విండిబ్యాంక్, ఈ టైప్ చేసిన ఉత్తరం మీరు పంపిందే కదా, ఆరు గంటలకు కలుస్తానంటూ?'

"అవును సర్. కొంచెం ఆలస్యమయినట్టున్నాను. అందుకు కారణాలున్నాయి. ఒక చిన్న సంగతి గురించి మిస్ సూదర్లాండ్ మిమ్మల్ని చికాకు పెట్టింది. వ్యవహారాన్ని ఇంత రట్టు చేయడం అనవసరం. నేను చెపుతున్నా సరే వినకుండా వచ్చింది. అమ్మాయి కదూ. ఒకసారి నిర్ణయించుకున్న తరువాత తానంతే. ఇంతకూ మీరు పోలీస్ కాకపోవడం నాకు తెలుసు. అయినా ఇంటి వ్యవహారం బయటపడడం ఇష్టంలేదు. దండగ ఖర్చుకూడా. మీరు హోస్మర్ ఏంజెల్‌ని ఏం చేసి పట్టుకోగలరు?"

"అదేంలేదు. నేను తప్పకుండా హోస్మర్ ఏంజెల్ ఆచూకీ తెలుసుకోగలనని నమ్మకంగా ఉన్నాను" ప్రశాంతంగా అన్నాడు హోమ్స్.

విండిబ్యాంక్ కదిలిపోయాడు. గ్లోవ్స్ చెయ్యిజారి పడ్డాయి. "ఈ మాట బాగుంది" అన్నాడతను.

"ఒక మనిషి చేతిరాతలాగే ఒక టైప్‌రైటర్ అక్షరాలు కూడా చాలా ప్రత్యేకంగా ఉంటాయన్నది విచిత్రమయిన విషయం. నిజంగా కొత్తవయితే తప్ప ఏ రెండూ మెషీన్‌లు ఒకేలా రాయవు. కొన్ని అక్షరాలు ఎక్కువగా అరుగుతాయి. కొన్ని ఒకపక్కనే అరుగుతాయి. విండిబ్యాంక్, మీరు పంపిన నోట్‌ని గమనిస్తే 'ఇ' అన్న అక్షరం ప్రతిచోటా మసకగా ఉంది. ఇక 'ఆర్'ల తోక అరిగిపోయి ఉంది. ఇలాంటి వివరాలు మరో పద్నాలుగు ఉన్నాయి. ఈ రెండు మాత్రం మరీ బాగా కనబడుతున్నాయి."

"మా టైపింగ్ అంతా ఈ మెషీన్ మీదే జరుగుతుంది. అరిగి ఉంటుంది మరి" అన్నాడు ఆగంతకుడు, హోమ్స్‌ని బాగా చూస్తూ.

"ఇక అంతకన్నా ఆసక్తికరమయిన సంగతి చూపిస్తాను మిస్టర్ విండిబ్యాంక్! నేరమూ, టైప్ రైటర్ల పాత్ర అనే విషయం గురించి ఒక చిన్న మోనోగ్రాఫ్ రాద్దామనుకుంటున్నాను. నేనీ వ్యవహారం గురించి కొంచెం పరిశోధించాను. కనిపించకుండా పోయిన ఒక మనిషి నుంచి వచ్చిన నాలుగు ఉత్తరాలు ఇక్కడ ఉన్నాయి. అవన్నీ టైప్ చేసి ఉన్నాయి. అన్నింటిలోను 'ఇ' అనే అక్షరం మసకగా ఉంది. 'ఆర్' మీది తోక అరిగి ఉంది. నా భూతద్దంలో నుంచి చూస్తే మరో పద్నాలుగు అక్షరాల్లోనూ తేడాలు కనబడతాయి."

విండిబ్యాంక్ కుర్చీలోనుంచి ఒక్కసారిగా లేచి టోపీ అందుకున్నాడు. "ఇలాంటి పిచ్చిమాటలు వింటూ కాలం గడపలేను. మీరు ఆ మనిషిని పట్టుకోగలిగితే పట్టుకోండి. ఆ పని జరిగిన తరువాత నాకు కబురు పెట్టండి."

"తప్పకుండా కబురు పెడతాను" అన్నాడు హెూమ్స్ లేచి తలుపులో తాళంచెవిని తిప్పుతూ.

"అదేమిటి?" అరిచాడు విండిబ్యాంక్. బోనులో చిక్కిన ఎలుకలాగా పాలి పోయాడు అతను.

"కుదరదు. ఇంక కుదరదు. తప్పించుకోలేవు విండిబ్యాంక్. అంతా తెలిసిపోయింది. ఇంత చిన్న విషయాన్ని నేను కనుగొనలేను అన్నావే. ఇక కూర్చో! కాసేపు వివరం మాట్లాడుకుందాం."

ఆగంతకుడు కుర్చీ లో కూలబడ్డాడు. అతని నుదుట చెమట పట్టింది. "నీవు నన్నేమీ చేయలేవు" గొణిగాడతను.

"చూద్దాం, కానీ విండిబ్యాంక్ నీవు చేసి ట్రిక్కు నిజంగా క్రూరమయినది. స్వార్థంతో నిండినది. నేచెప్పేది విను. తప్పుంటే చెప్పు."

ఆ మనిషి తల కిందకు దించుకుని కుప్పకూలినట్టు కూర్చు న్నాడు. హెూమ్స్ కాళ్లను చాపి వెనక్కు వాలి చేతులను జేబులో పెట్టుకుని తనలో



తాను గొణుగు తున్నట్టూ, మాతో కాదన్నట్టు చిన్నగా మాట్లాడసాగాడు.

"ఒక మనిషి డబ్బు కోసం తనకంటే పెద్దావిడను పెళ్లి చేసుకున్నాడు. ఆమె కూతురి డబ్బును కూడా వాడుకోసాగాడు. నిజానికి అదేమంత తక్కువ కాదు. ఆ అమ్మాయి వెళ్లిపోతే డబ్బు కూడా పోతుంది కనుక ఆమెను ఆపాలి. పాపం ఆ అమ్మాయి చాలా మంచిది, ప్రేమ స్వభావం కలది. అంత మంచి అమ్మాయి మరింతకాలం ఒంటరిగా ఉండబోదు. త్వరలోనే పెళ్లవుతుంది. అదే జరిగితే ఏడాదికి వంద నష్టం. మరి కొత్త నాన్నగారు దాన్ని ఆపాలి కదా. అందుకే అతను అమ్మాయిని ఎవరితోను కలవకుండా ఆపసాగాడు. కానీ అలా ఎంతకాలమో సాగదని అర్ధమయంది. అమ్మాయి తన హక్కుల గురించి మాట్లాడసాగింది. ఒక బాల్ నాట్యానికి వెళతానంది కూడా. మరిప్పుడు ఆ తండ్రిగాని తండ్రి ఏం చెయ్యాలి? అతనొక పథకం వేశాడు. అది అతనకే నచ్చింది. అందుకు అతని భార్య కూడా సాయంగా నిలిచింది. అతను మారువేషం వేసుకున్నాడు. తనకళ్లు తెలియకుండా రంగుజోడు పెట్టుకున్నాడు. ముఖానికి మీసం, దుబ్బు బర్న్స్ అతికించుకున్నాడు. గొంతు తగ్గించుకున్నాడు. మిస్టర్ హోస్మర్ ఏంజెల్ అనే అవతారం ఎత్తి తానే ప్రేమికుడుగా నాటకం మొదలు పెట్టాడు."

"అంతా సరదా కొరకే. ఆ అమ్మాయి అంతగా పడిపోతుందని అనుకోలేదు" గొణిగాడు ఆగంతకుడు.

"కాదు.. కాదు.. ఆ అమ్మాయి పూర్తిగా పడిపోయింది. కొత్త తండ్రిగారు ఫ్రాన్స్‌లో ఉన్నారనుకున్నది. మోసం అన్న ఆలోచనే ఆమెకు రాలేదు. కొత్త పెద్దమనిషి చూపిన అభిమానం ఆ విషయంలో తల్లి ప్రవర్తన ఆమెను మరింత ముందుకు నడిపాయి. పైగా ఏంజెల్ కాల్స్ చేస్తుండడంతో వ్యవహారం ముందుకు సాగింది. చాలాసార్లు కలిశారు, ఎంగేజ్‌మెంట్ జరిగింది. అమ్మాయి ఇక మరోవేపు చూచే ప్రసక్తి లేదు. ఈ నాటకానికి ఎక్కడో తెరపడాలి. ఇక ఆ మనిషి గురించి ఆలోచించకుండా ఉండాలి. పవిత్రగ్రంథంమీద ప్రమాణాలు. సరిగ్గా పెళ్లి రోజున ఏదో జరుగుతుందన్న సూచన మాటలు. అంతా నాటకం. మిస్ సూదర్లాండ్ హోస్మర్ మీద ప్రేమతో మరో పదేళ్ల దాకా, మరో మగాడివేపు చూడకుండా ఇంట్లో పడి ఉంటుందని విండ్‌బ్యాంక్ అనుకున్నాడు. కానీ పెళ్లి చర్చిదాకా వచ్చింది కనుక తాను మాయం కావాలి. బండిలోకి ఒకవేపు నుంచి ఎక్కి మరోవేపు నుంచి దూకి పారిపోయాడు. జరిగింది ఇంతేనంటారా, మిస్టర్ విండిబ్యాంక్!"

"హోమ్స్ మాట్లాడుతుంటే మా అతిథి కొంచెం కోలుకున్నాడు. పాలిపోయిన ముఖంమీద విచిత్రమయిన భావాలతో అతను లేచి నిలబడ్డాడు.

"కావచ్చు, కాకనూపోవచ్చు, మిస్టర్ హోమ్స్, మీరు తెలివిగల వారు. ఇక్కడ చట్టాన్ని దాటుతున్నది నేను కాదని, మీరేనని అర్థమయి ఉంటుంది. మొట్టమొదట నేను చేసిన నేరమేదీ లేదు. తలుపు తాళం తీయకపోతే నన్ను బంధించిన నేరం మీదవుతుంది."

"చట్టం నిన్ను ముట్టుకోజాలదు. అయినా ఒక మనిషికి శిక్ష పడవలసి ఉంది. ఆ అమ్మాయికి ఒక తమ్ముడో, మిత్రుడో ఉండి ఉంటే ఇప్పటికే నీ వీపు మీద కొరడా చారలు ఉండేవి" తలుపు తాళం తీస్తూ అన్నాడు హోమ్స్. "నా క్లయింటుతో చేసిన ఒప్పందంలో నిన్ను శిక్షించడం భాగంగా లేదు. అయినా అదుగో, కొరడా" అంటూ అతను అడుగులు ముందుకు వేసి కొరడా అందుకునేలోగా పెద్ద చప్పుడు అయ్యింది. కింద హాల్ ద్వారాలు



గట్టిగా మూశారెవరో. కిటికీలోంచి చూస్తే మిస్టర్ జేమ్స్ విండిబ్యాంక్ పారిపోతున్నాడు.

"జిత్తులమారి భడవ. కానీ ఇలాగే నేరం మీద నేరం చేస్తూ పోతాడు. చివరికి ఉరికంభం ఎక్కుతాడు. ఇంతకూ ఈ కేసు అనుకున్నంత పొడిగా ఏం ఉండలేదు" కుర్చీలో కూర్చుంటూ, నవ్వుతూ అన్నాడు హొమ్స్.

"నాకింకా వివరాలు అంతు పట్టలేదు" అన్నాను నేను.

"సరే, మొదటి నుంచి హొస్మర్ ఏంజెల్ ప్రవర్తన గురించి అనుమానంగా ఉంది. ఈ వ్యవహారంలో లాభం అంటూ ఎవరికన్నా ఉంటే అది కొత్త నాన్నగారికే ఉంది. పైగా మరొక విషయం ఈ ఇద్దరు మనుషులు ఎప్పుడూ కలిసి కనపడలేదు, ఒకరు లేనప్పుడు ఒకరు రావడం తప్ప. దీంతో కొన్ని ఆలోచనలు వచ్చాయి. రంగు కళ్లజోడు, వింతగొంతు ఇంకా దుబ్బు జుట్టు అన్నీ మారువేషాన్ని సూచిస్తున్నాయి. ఉత్తరం మీద

సంతకం కూడా టైప్ చేస్తున్నాడనేసరికి నాకు అనుమాన ఎక్కువయింది. అమ్మాయికి ఇతని చేతిరాత తెలుసు. నాలుగు అక్షరాలు కనిపించినా గుర్తిస్తుంది. ఇవన్నీ వేరువేరు నిజాలు. పెద్దవిగా కనిపించకపోవచ్చు. కలిపి చూస్తే మాత్రం గట్టి సూచనలు చేస్తున్నాయి.”

“మరి నీవు ఎలా ముందుకు సాగావు?”

“మనిషిని పట్టుకోవడమంటూ జరిగిన తరువాత వివరాలు తెలుసుకోవడం సులభమే. అతను పని చేస్తున్న కంపెనీ నాకు తెలుసు. అతని వర్ణనను ప్రకటనలోనుంచి తీసుకుని, అందులో మారువేషం లక్షణాలయిన వెంట్రుకలు, కళ్లజోడు, గొంతు మొదలయిన వాటిని తొలగించి మీ దగ్గర ఇలాంటి మనిషి ఎవరయినా ఉన్నారా అని ఆ కంపెనీవారిని అడిగాను. టైప్ రైటర్‌లోని విశేషాలను ఇప్పటికే గమనించాం కదా. ఇక ఆ కంపెనీ అడ్రస్సుకు ఒక ఉత్తరం రాశాను. ఆ మనిషిని నా దగ్గరకు రమ్మని అందులో కబురు పెట్టాను. అనుకున్నట్టే అతని జవాబు అదే టైప్ రైటర్ మీద టైప్ చేసి వచ్చింది. అందులో పాత లోపాలన్నీ కనిపించాయి. ఇక కంపెనీ వారు కూడా వాళ్ల దగ్గర పని చేసే జేమ్స్ విండిబ్యాంక్ నేను వర్ణించినట్టే ఉంటాడని మరో ఉత్తరం రాశారు. ఇంకేముంది, మనకు కావల్సింది దొరికింది.”

“మరి మిస్ సూదర్లాండ్ సంగతి?”

“నేను చెపితే ఆమె నమ్మదు. ఒక పాత పరిషయన్ సామెత ఉన్నది. పులి పిల్లను దొంగిలించిన వాడికి, అమ్మాయి మనస్సును దొంగిలించిన వాడికి ఆపద తప్పదని. అతనెవరో చెప్పింది చాలా నిజం. ప్రపంచ జ్ఞానం అంటే అదేమరి.”





# 4

# ది బోస్కోంబ్ వాలీ మిస్టరీ

మేము, అంటే నా భార్యా నేను బ్రేక్‌ఫాస్ట్ తింటున్నాము. అంతలో ఒక టెలిగ్రామ్ వచ్చింది. అది షెర్లక్ హోమ్స్ పంపించినది. అది ఇలాగుంది.

*రెండు రోజులు నాకై వెచ్చించగలవా? బోస్కోంబ్ వాలీలో జరిగిన ఒక దురంతం గురించి పిలుస్తున్నారు. నువ్వు నాతో ఉంటే బాగుంటుంది. అక్కడ వాతావరణం చాలా బాగుంటుంది. మనం 11:15కి పాడింగ్‌టన్ నుంచి బయలుదేరాలి.*

అది చూచి నా భార్య "ఏం డియర్, వెళుతున్నారా?" అని అడిగింది.

"అర్థం కావడం లేదు. ఇక్కడ బోలెడంత మంది పేషెంట్లు ఉన్నారు."

"అదేమిటి? మీ అసిస్టెంట్ అదంతా చూచుకుంటాడులెండి. ఈ మధ్యన మీరు కాస్త బలహీనంగా కనబడుతున్నారు కూడాను. ప్రయాణం చేస్తే మీకూ మంచిది. పైగా మీకు షెర్లక్ హోమ్స్ కేసులలో బోలెడంత ఆసక్తి కూడా ఉందాయె."

"ఆసక్తి లేదంటే అన్యాయం చేసినవాడి నవుతాను. అతనివల్లే కదా



నాకొక నిధి దొరికింది. కానీ వెళ్లదలుచుకుంటే వెంటనే బయలుదేరాలి. అరగంట మాత్రమే టైముంది.”

ఆఫ్ఘానిస్థాన్‌లో క్యాంప్‌ల అనుభవం వల్ల ప్రయాణాల విషయంలో నాకు మంచి చురుకుదనం అలవాటయింది. నా అవసరాలు చాలా తక్కువ. కనుక అనుకున్న దానికన్నా తక్కువ టైమ్‌లోనే పెట్టె సర్దుకుని క్యాబ్ ఎక్కాను. పాడింగ్‌టన్ స్టేషన్‌కు బయలుదేరాను. ప్లాట్‌ఫామ్ మీద షెర్లక్ హోమ్స్ అటూఇటూ తిరుగుతున్నాడు. ముందే పొడగరి. ప్రయాణం కోసం వేసుకున్న కోటు, టోపీల కారణంగా మరింత పొడుగ్గా కనబడుతున్నాడు.

“నీవు రావడం నిజంగా బాగుంది, వాట్సన్. నాకు నువ్వుంటే బాగుంటుంది. నమ్మకంగల వ్యక్తి తోడుంటే మరోలాగ ఉంటుంది. స్థానికంగా ఎవరో దొరికినా వాళ్లు పనికిరాని వాళ్లయినా అవుతారు, లేదా సొంత ఆలోచనలు చెపుతుంటారు. రైలు ఎక్కి రెండు సీట్లు పట్టు. నేను టికెట్లు తెస్తాను.” అంటూ కదిలాడు అతను.

మేమెక్కిన పెట్టెలో హోమ్స్ తెచ్చిన పత్రికల బొత్తులు తప్ప మరెవ్వరూ లేరు. హోమ్స్ పేపర్లను వెతికి తీవ్రంగా చదువుతున్నాడు. మధ్యలో నోట్స్ రాస్తూ ఆలోచిస్తున్నాడు. ఈలోగా రీడింగ్ దాటాము. అతను ఉన్నట్టుండి పత్రికలన్నింటినీ చుట్టచుట్టి ఒక రాక్‌మీదికి ఎక్కించాడు.

"కేసుగురించి నువ్వేమయినా చదివావా?" అడిగాడతను.

"ముక్క కూడా లేదు. నేను వార్తాపత్రిక చూచి కొన్ని రోజులయింది."

"లండన్ పత్రికలలో నిజానికి వివరాలు అంతగా రాలేదు. నేను వీల యినన్ని పత్రికలు సేకరించి గమనిస్తున్నాను. నాకు కనిపించినంత వరకూ ఇది చాలా సింపుల్ కేసు. అంటే విప్పడం చాలా కష్టమవుతుందని అర్థం."

"ఇందులో ఏదో తిరకాసు కనబడుతున్నది."

"అదేమరి నిజం. కేసు మరీ ప్రత్యేకంగా ఉందంటే అదే ఒక పెద్ద క్లూ. ఎంత మామూలుగా, ఎంత సులభమయిన నేరం జరిగి ఉంటే కేసు అంత జటిలంగా ఉంటుంది. ఇక్కడ పాపం మృతుని కుమారుడిని హంతకుడంటూ పట్టి పెట్టారు, అప్పుడే."

"అంటే హత్య కేసా?"

"అలాగే అనుకుంటున్నారు. నేను మాత్రం వ్యక్తిగతంగా పరిశీలించే దాకా ఏ నిర్ణయానికి రాను. ముందు నీకు వివరాలు చెపుతాను. నాకు అర్థమయిన సంగతులను చెపుతాను.

బోస్కోంబ్ వాలీ అంటే హియర్‌ఫోర్డ్‌షైర్‌కి దగ్గరలోని రాస్‌కు సంబంధించిన పల్లెప్రాంతం. అక్కడ అందరికంటే పెద్ద భూకామందు జాన్ టర్నర్. అతను ఆస్ట్రేలియాలో బాగా సంపాదించి కొన్ని సంవత్సరాల కిందే పల్లె ప్రాంతానికి వచ్చేశాడు. అక్కడ కొంత పొలాన్ని మిస్టర్ చార్లెస్ మెక్‌కార్తీ గారికి కౌలుకింద ఇచ్చాడు. ఇద్దరూ కలిసి ఆస్ట్రేలియాలో పనిచేసే వాళ్లు. అక్కడ కాలనీల్లో బాగా తెలిసినవాళ్లు గనుక ఇక్కడా కలిసి ఉండడంలో ఆశ్చర్యమేమీ లేదు. ఇద్దరికీ మంచి దోస్తీ కూడా ఉంది. అయితే టర్నర్ బాగా ధనవంతుడు. మెక్‌కార్తీ అంత ధనవంతుడు కాకున్నా ఇద్దరూ కలిసే ఉంటున్నారు. మెక్‌కార్తీకి పద్దెనిమిదేళ్ల కొడుకు ఉన్నాడు. టర్నర్‌కి ఇంచుమించు అదే వయస్సు గల కూతురు ఉంది. కానీ పెద్దవాళ్లిద్దరికీ

భార్యలు మాత్రం లేరు. వీళ్లు చుట్టుపక్కల ఉండే కుటుంబాలతో అంతగా కలవడం లేదు. తమంత తాము బతుకుతున్నారు. మెక్‌కార్తీ, కొడుకు మాత్రం అప్పుడప్పుడు రేసుల్లో కనబడుతుంటారు. వాళ్లింట్లో ఒక మనిషి, మరో అమ్మాయి పనివాళ్లుగా ఉన్నారు. టర్నర్ ఇంట్లో అరడజనుకు పైనే పనివాళ్లున్నారు. ఇది వాళ్లగురించి నేను సేకరించిన సమాచారం. ఇక కేసు నిజాలు.

“జూన్ 3, అంటే గడిచిన సోమవారం నాడు మధ్యాహ్నం మూడు గంటలకు మెక్‌కార్తీ, హాదర్లీలోని తన ఇంటినుంచి బయలుదేరి బోస్కోంబ్ పూల్ వేపు బయలుదేరాడు. బోస్కోంబ్ లోయలో ప్రవహిస్తున్న వాగు కారణంగా ఏర్పడిన చిన్న చెరువులాంటిది ఈ పూల్. మెక్‌కార్తీ తన ఇంట్లో ఉండే మనిషితో సహా ఉదయం రాస్‌కి వెళ్లాడు. త్వరగా తిరిగి రావాలని మధ్యాహ్నం మూడింటికి ఎవరినో జరూరుగా కలుసుకోవాలని ఆ మనిషితో అన్నాడట. అలా వెళ్లిన మనిషి తిరిగి రాలేదు.

“హాదర్లీ ఫామ్‌హౌస్ నుంచి బోస్కోంబ్ పూల్ దాకా పావుమైలు దూరం ఉంటుంది. అతను నడిచి వెళుతుండగా ఇద్దరు చూచారు. ఒకరు ఆడమనిషి, పేరు తెలియదు. రెండవ అతను టర్నర్ దగ్గర పనిచేసే విలియమ్ క్రౌడర్. వీళ్లిద్దరూ మెక్‌కార్తీ ఒంటరిగా నడిచి వెళ్లాడని చెప్పారు. కొన్ని నిమిషాల తరువాత అతని కొడుకు కూడా అంటే జేమ్స్ మెక్‌కార్తీ కూడా వెంట వచ్చాడని, అతని చేతిలో ఒక తుపాకీ ఉందని క్రౌడర్ చెప్పాడు. కొడుకు తండ్రిని వెంబడించినట్టు కనబడిందని నేను అనుకుంటున్నాను. ఆ తరువాత క్రౌడర్ సంగతిని పట్టించుకోలేదు. సాయంత్రం దుర్వార్త తెలిసింది.

“తండ్రీకొడుకులిద్దరూ తరువాత కలిశారు. ఆ నీటిమడుగు చుట్టూ దట్టంగా చెట్లు ఉంటాయి. మడుగు అంచున తుంగ, గడ్డి బాగా పెరిగి ఉంటాయి. పేషన్స్ మోరాన్ అనే పద్నాలుగేళ్ల అమ్మాయి వాళ్లిద్దరినీ చూచింది. ఆమె ఎస్టేట్‌లో పని చేస్తున్న అతని కూతురే. ఆ పిల్ల అక్కడ పూలు ఏరు

కుంటున్నది. తాను అక్కడ ఉండగా నీటి ఒడ్డున మెక్‌కార్తీ, ఆయన కొడుకు కనిపించారని, వాళ్లు తగవులాడుకుంటున్నట్టు కనిపించిందని ఆ అమ్మాయి చెప్పింది. తండ్రి కొడుకును మరీ తీవ్రంగా తిడుతున్నాడని, కొడుకు ఇంచుమించు కొట్టబోతున్నట్టు చెయ్యి ఎత్తాడని చెప్పింది. ఏం జరుగు తుందోనని భయపడి అమ్మాయి అక్కడి నుంచి పరుగెత్తుకెళ్లి ఇల్లు చేరి విషయం తల్లికి చెప్పింది. ఆ తండ్రీకొడుకులు పోట్లాడుకుంటారని భయపడింది. అమ్మాయి ఆ మాటలు చెప్పిందో లేదో, జేమ్ మెక్‌కార్తీ పరుగున అక్కడికి వచ్చాడు. తన తండ్రి చెట్లలో చచ్చిపడి ఉన్నాడని, లాడ్జ్ కీపర్‌ని సాయం అడగడానికి వచ్చానని అన్నాడతను. అతను చాలా కదిలిపోయి ఉన్నాడు. చేతిలో తుపాకీ కానీ, తలమీద టోపీకానీ లేవు. కుడిచేతికి రక్తం అంటి ఉంది. అదింకా తడిగా ఉంది. అందరూ అతని వెంట వెళ్లారు. పూల్‌కి దగ్గరలో గడ్డిలో మృతదేహం పడి ఉండడం గమనించారు. తలమీద దేనితోనో కొట్టినట్టు బలమయిన గాయం కనపడింది. కొడుకు తుపాకీ మడమ తిప్పి కొట్టి ఉండవచ్చునని కూడా అనుమాన వచ్చేలాగా ఆ గాయాలు ఉన్నాయి. తుపాకీ ఆ పక్కనే గడ్డిలో పడిఉంది. ఆ పరిస్థితుల్లో వెంటనే కుర్రవాడిని అరెస్ట్ చేశారు. బుద్ధిపూర్వకంగా హత్య చేశాడన్నారు. మరుసటి నాడు రాస్‌లో మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. ఆయన కేసును పైవారికి రెఫర్ చేశాడు. పోలీస్ కోర్టుకు కేసు గురించి అందిన వివరాలు ఇవన్న మాట.”

“ఇంతకంటే పిచ్చికేసు ఇంకొకటి ఉండదు. సిద్ధంగా సాక్ష్యాలు దొరకడం ఇంతకన్నా సులభంగా జరగదు” అన్నాను నేను.

“సందర్భంగా దొరికే సాక్ష్యాలు తికమక పెడతాయి. అవి నేరుగా ఒక విషయాన్ని సూచించవచ్చు. మనం ఆలో చనను కొంచెం పక్కకు మళ్లిస్తే పూర్తి వేరే విషయాలు కూడా కనపడవచ్చు. కుర్రవాడి మీద కేసు నిజంగా బలంగా చుట్టుకుందని ఒప్పుకోక తప్పదు. అతనే నేరస్థుడు అయి ఉండవచ్చు



కూడా. చుట్టుపక్కల ఉన్న చాలా మంది, ముఖ్యంగా టర్నర్ కూతురు మాత్రం అతను అలాంటి వాడు కాదని బలంగా చెపుతున్నారు. ఆ అమ్మాయే లెస్ట్రేడ్‌ని ఈ కేసులోకి పిలిచింది. 'ఎ స్టడీ ఇన్ స్కార్లెట్' కేస్‌లో లెస్ట్రేడ్‌ని కలిశాం. నీకు గుర్తుండే ఉంటుంది. అతను నన్ను పిలిపించాడు. కనుక ఇద్దరు నడివయసు పెద్ద మనుషులు, హాయిగా తిన్నది అరిగించుకోవడానికి బదులు, గంటకు యాభై మైళ్ల వేగంతో పడమటి వేపు ప్రయాణం చేస్తున్నారు" అన్నాడు హోమ్స్.

"నాకొక అనుమానం. కేసు ఇంత సులభంగా ఉంటే నీవు అక్కడికి వెళ్లి ఏమయినా సాధించగలవా అని."

"ఎదురుగా కనిపించే వాస్తవాల కంటే మోసపుచ్చేవి మరేవీ ఉండవు" అన్నాడతను హాయిగా నవ్వుతూ.

"పైగా లెస్ట్రేడ్‌కు కనబడని మరెన్నో సత్యాలు మనం చూడ గలుగుతామేమో! నా గురించి నేను గొప్ప చెప్పుకుంటున్నానని నీవనవు. మిగతా వాళ్లూ చూడలేని, అర్థం చేసుకోలేని సంగతులను ఎన్నింటినో నేను చూడగలను. వెంటనే ఉదాహరణ చెప్పాలంటే నీ బెడ్‌రూమ్‌లో కిటికీ కుడి

వేపున ఉంది. ఇంత చిన్న విషయాన్ని కూడా లెస్ట్రేడ్‌లాంటి వాళ్లు గమ నించరేమో."

"మా కిటికీ...."

"మిత్రమా! నీగురించి నాకు తెలుసు. నీదంతా మిలటరీ నీట్‌నెస్. నీవు నిత్యం పొద్దున్నే శుభ్రంగా గడ్డం గీసుకుంటావు. అందుకోసమని కిటికీ ముందు ఎండలో నిలబడతావు. నీ షేవింగ్ ఎడమవేపుకి వస్తున్న కొద్దీ అంత నునుపుగా రావడం లేదు. నీ ఎడమ దవడ కింద నునుపు అసలే లేదు. అంటే ఆ భాగంమీద వెలుగు అంతగా పడలేదని అర్ధం. నీలాంటి చక్కని అలవాట్లు గల మనిషి ఇలాంటి పనులతో సంతృప్తి పడతాడంటే నాకు నమ్మకం కుదరదు. నా పరిశీలన అందులోంచి నిజాలను రాబట్టే పద్ధతికి చిన్న ఉదాహరణగా మాత్రమే ఈ సంగతి చెప్పాను తప్ప, నిన్ను చిన్న చెయ్యాలని కాదు. నా పద్ధతులు మరి అలాగుంటాయి. ప్రస్తుతం మన ముందున్న కేసులో కూడా ఇలాంటివేవో చెప్పగలను. పరిశోధనలో బయటపడ్డ సంగతులు ఒకటి రెండున్నాయి. వాటిని నేను మరింత లోతుగా చూడదలిచాను."

"ఏమిటవి?"

"కుర్రవాడిని వెంటనే అరెస్ట్ చేయలేదట. హాదర్లీ ఫామ్స్‌కి తిరిగి వచ్చిన తరువాత మాత్రమే చేశారట. ఇన్‌స్పెక్టర్ ఆ వార్త చెప్పగానే అబ్బాయి, తనకేమీ ఆశ్చర్యం కలగలేదని, తనకది సమ్మతమేనని అన్నాడట. అతను అలా అనడంతో పరిశోధిస్తున్న వాళ్ల మనస్సులో ఉన్న అనుమానాలను తుడిచిపెట్టినట్టు అయ్యింది."

"అంటే అతను నేరం ఒప్పుకున్నాడా?" ఆత్రంగా అడిగాను నేను.

"లేదు. అతను వెంటనే నేను ఏ నేరమూ చేయలేదని కూడా అన్నాడు."

"ఏమయినా ఈ సందర్భంలో అతని మాటలతో అనుమానాలు పెరి గినట్టే ఉంది."

"ఏ మాత్రం లేదు. అతను అలా అనడంలో కొత్తేమీ లేదు. అతను ఎంత అమాయకుడయినా కనబడుతున్న సాక్ష్యాలు తనవేపే వేలెత్తి చూపిస్తున్నాయని అర్థం చేసుకున్నాడు. ఆశ్చర్యపడినట్టు, అవమానపడినట్టు ప్రవర్తించి ఉంటే అందరూ అతడిని అనుమానంగా చూచేవాళ్లు. ఆ పరిస్థితులలో ఆశ్చర్యానికి చోటులేదు. పైగా పథకం ప్రకారం హత్య చేసి ఉంటే, ఆశ్చర్యమూ ఆ పథకంలో భాగంగా కనబడుతుంది. అంత సులభంగా అరెస్టును ఒప్పుకున్నాడంటే అతను అమాయకుడయినా అయి ఉండాలి, మంచి దృఢచిత్తం గల మనిషయినా అయి ఉండాలి. తండ్రితో పోట్లాట పెట్టుకున్న మనిషి పారిపోకుండా, విధేయతతో అక్కడే ఉండి అందరికీ చెప్పి తంతు సాగించాడంటే అది ఎంతమాత్రం అసహజం కాదు. అమ్మాయి సాక్ష్యం చెప్పిందే, అతను తండ్రిని కొట్టబోతూ చేయి ఎత్తాడని, ఆ తరువాత అతను ఓపికగా ఉండి అదంతా చేశాడంటే నిజంగా ఆలోచనాపరుడని, దోషభావం లేనివాడని నాకనిపిస్తుంది."

"కొంచెంపాటి సాక్ష్యంతోనే చాలామంది ఉరికంబం ఎక్కారు" తల అడ్డంగా ఆడిస్తూ అన్నాను నేను.

"నిజమే. చాలామంది ఏ నేరమూ చేయకుండానే ఉరికంబం ఎక్కారు."

"ఇంతకూ యువకుడు ఏం చెపుతున్నాడు?"

"అతను చెపుతున్నది మద్దతుదారులకు సాయం చేసేదిగా లేదు. ఒకటి రెండు పాయింట్లు మాత్రం బాగున్నాయి. నేను చెప్పడం ఎందుకు? నీవే చదువు."

తాను తయారు చేసుకున్న నోట్సులోనుంచి ఒక కాగితాన్ని తీసి అందులోనుంచి ఒక పేరాగ్రాఫ్‌ను చూపించాడు హోమ్స్. అందులో యువకుని స్టేట్‌మెంట్ ఉంది. నేను మూలసీట్లో కూర్చుని దాన్ని జాగ్రత్తగా చదివాను. అది ఇలా సాగింది:

తరువాత మిస్టర్ జేమ్స్ మెక్‌కార్తీ అంటే మృతుని కుమారుడ్ని విచారణకు పిలిచారు, అతను ఇలా సాక్ష్యమిచ్చాడు. “నేను మూడు రోజులు ఇంట్లో లేను. బ్రిస్టల్ వెళ్లాను. సోమవారం అంటూ మూడవ తేదీన ఉదయాన్నే తిరిగి వచ్చాను. నేను వచ్చేసరికి నాన్న ఇంట్లో లేరు. ఆయన ఉదయం జాన్‌కాబ్‌తో రాస్ వెళ్లారని మెయిడ్ చెప్పింది. ఆ తరువాత కొంతసేపటికి బండి చప్పుడు వినిపించింది. కిటికీలోంచి చూస్తే నాన్న రావడమూ, వేగంగా ఎక్కడికో వెళ్లడమూ కనిపించింది. ఆయన బయట ఎటువేపు వెళ్లింది మాత్రం కనపడలేదు. నేను కుందేళ్లను వేటాడవచ్చునన్న ఆలోచనతో తుపాకీ అందుకుని బోస్కోంబ్ పూల్ వేపు బయలుదేరాను. దారిలో గేమ్‌కీపర్, విలియమ్ క్రౌడర్ కనిపించాడు. అతను సాక్ష్యంలో చెప్పింది పొరపాటు. నేను మా నాన్నను వెంబడించడం లేదు. అసలు నాన్న ముందువెళుతున్నారని నాకు తెలియదు. పూల్ నుంచి వందగజాల దూరంలో ఉండగా ‘కూయీ’ అనే కూత వినిపించింది. నిజానికి అది నాకూ నాన్నకు మాత్రమే తెలిసిన రహస్య సంకేతం. అందుకని నేను వేగంగా పూల్ వేపు వెళ్లాను. నాన్న అక్కడ నిలబడి ఉన్నారు. నన్ను చూచి ఆయన ఆశ్చర్యపడినట్టు కనిపించింది. ఇక్కడ ఏం చేస్తున్నావని నన్ను కోపంగా గద్దించి అడిగారు. తరువాత మాటమీద మాట వచ్చింది. వాదం ముదిరింది. నాన్న బాగా కోపిష్టి మనిషి. ఆయన మరీ రెచ్చిపోతున్నారని గమనించి నేను అక్కడి నుంచి బయలుదేరి హాదర్లీ ఫామ్స్‌వేపు తిరిగి రాసాగాను. 150 గజాలు నడిచానో

*లేదో వెనుక నుంచి దారుణమయిన కేక వినబడింది. నేను వెనక్కు తిరిగి పరుగెత్తాను. నాన్న పడిపోయి ఉన్నారు. తలకు బాగా గాయమయింది. నేను తుపాకీ కిందపడేసి ఆయనను చేతుల్లోకి తీసుకున్నాను. ఆయన ప్రాణం వదిలారు. నేనలాగే మోకాళ్లమీద వంగి కొంచెం పరిశీలించి టర్నర్‌గారి లాడ్జ్ కీపర్ ఇంటికేసి బయలుదేరాను. దగ్గరగా ఉండే ఇళ్లు ఆయనదే. సాయం అడుగుదామని వెళ్లాను. నేను తిరిగి వచ్చిన సమయానికి నాన్న పక్కన ఎవరూ లేరు. మరి ఆ గాయం ఎలాగయిందో అర్థం కాలేదు. నాన్న కొంచెం మొరటురకం మనిషే. అయినా ఆయనకు అంతటి శత్రువులున్నారని నేను అనుకోను. ఇంతకన్నా ఎక్కువ నాకేమీ తెలియదు."*

*ద కరోనర్ : ప్రాణం వదిలే ముందు తండ్రిగారు ఏమయినా స్టేట్‌మెంట్ చేశారా?*



*సాక్షి : ఏవో గొణిగారు. రాట్ అనే మాట తప్ప నాకేమీ అర్థం కాలేదు.*

*ద కరోనర్ : ఆ మాటలకు అర్థం ఏమిటి?*

*సాక్షి : నాకు తెలియదు. ఆయన అపస్మారకంలో ఏదో అన్నారని భావించాను.*

*ద కరోనర్ : మీరు, మీ తండ్రిగారు ఏ విషయం గురించి పేచీ పడ్డారు.*

*సాక్షి : జవాబు చెప్పకూడదని అనుకుంటున్నాను.*

*ద కరోనర్ : మిమ్మల్ని ఒత్తిడి చేయాల్సి ఉంటుంది.*

*సాక్షి : చెప్పడం కుదరదు. కానీ ఈ జరిగిన సంఘటనకు, మా మాటలకు సంబంధం లేదని మాత్రం గట్టిగా చెప్పగలను.*

*ద కరోనర్ : ఆ విషయం తేల్చవలసింది కోర్టు వారు. మీరు జవాబు చెప్పడానికి ఒప్పుకోలేదంటే మీ కేసు బలహీనమవుతుంది. మీకర్థమయ్యే ఉంటుంది.*

*సాక్షి :అయినా చెప్పను.*

*ద కరోనర్ : 'కూయీ' అనే శబ్దం మీ తండ్రీకొడుకుల మధ్య సంకేతమని నాకర్థమయింది.*

*సాక్షి : అవును అది మా సంకేతమే.*

*ద కరోనర్ : మీరు బ్రిస్టల్ నుంచి తిరిగి వచ్చారని గానీ, చుట్టుపక్కలే ఉన్నారని గానీ తెలియకుండానే ఆయన మరి ఆ సంకేతం ఎందుకు చేశారు?*

*సాక్షి (తికమకపడుతూ) : నాకు తెలియదు.*

*ఒక జ్యూరీమాన్ : తండ్రిగారి ఆర్తనాదం విని తిరిగి వచ్చిన తరువాత అక్కడ మీకు అనుమానకరంగా ఏమీ కనిపించలేదా?*

*సాక్షి : అంతగా ఏమీ కనిపించలేదు.*

*ద కరోనర్ : అంతగా అంటున్నారు! అంటే ఏమిటి?*

*సాక్షి : నేను అప్పటికే చాలా బెంబేలుగా ఉన్నాను. నాన్న గురించి తప్ప మరేమీ ఆలోచించే స్థితిలో లేను. అయినా పరిగెడుతుండగా ఆ పక్కన ఎడమచేతి వేపున ఏదో వస్తువు పడి ఉండడం గుర్తుంది. అది గ్రే రంగులో ఉంది. ఒక కోటు లేదా పైగుడ్డ లాంటిది అయి ఉండవచ్చు. నేను తరువాత దాని కోసం మళ్లీ చూచాను. కానీ అది కనిపించలేదు.*

*ద కరోనర్ : అంటే మీరు సాయం కోసం బయలుదేరే లోపల అది మాయమయిందంటారా?*

*సాక్షి : అంతేమరి.*

*ద కరోనర్ : ఇంతకూ అదేమిటో తెలియదంటారు.*

*సాక్షి : అవును. కానీ ఏదో ఉందని మాత్రం గమనించాను.*

*ద కరోనర్ : శరీరం నుంచి ఎంత దూరంలో?*

*సాక్షి : ఓ పది, పన్నెండు గజాలు.*

*ద కరోనర్ : చెట్ల గుంపునుంచి ఎంత దూరం?*

*సాక్షి : ఇంచుమించు అంతే.*

*ద కరోనర్ : అంటే మీరు అక్కడ ఉండగానే, అదేదో వస్తువు మాయమయిందంటారు.*

*సాక్షి : నిజమే, కానీ అది నా వెనక ఉంది.*

సాక్షి ఎగ్జామినేషన్ అంతటితో పూర్తయింది.

"కరోనర్ మెక్‌కార్తీ యువకుని మీద తీవ్రమయిన అభియోగాలే చేశారని నాకు అనిపిస్తుంది. తండ్రి అతనిని చూడకముందే సంకేతం చేయడం గురించీ, వాళ్లు మాట్లాడుకుంటున్న విషయం గురించి చెప్పకపోవడం గురించీ, తండ్రి చివరిమాటలను గురించీ కరోనర్ తీవ్రంగా రాశారు. అవన్నీ అబ్బాయికి వ్యతిరేకంగా ఉన్నాయి."

హెూమ్స్ తనలో తాను మెల్లగా నవ్వుకున్నాడు. తన సీటులో నిడుపుగా జారగిలపడ్డాడు. "నీవు, కరోనర్ ఇద్దరూ కుర్రవాడికి వ్యతిరేకంగా గట్టి పాయింట్లను లేవనెత్తాలని ప్రయత్నంలో ఉన్నారు. అతను తెలివికలవాడని, అంతగానూ తెలివి లేనివాడని మీరంటున్నారు, అర్థమయిందా? తండ్రితో వాదం పెట్టుకున్న సంగతి గురించి ఏదో ఒకటి చెప్పలేకపోయాడంటే,

తెలివి లేనివాడు. చనిపోతూ తండ్రి ఏదో అన్నాడని, అక్కడ ఒక గుడ్డ మాయమయిందని చెపుతున్నాడంటే, తెలివి కలవాడని, అంతేనా? అయ్యా, నేను కుర్రవాడు చెప్పేదంతా నిజం అన్న దృష్టితో ఈ కేసును పరిశీలిస్తాను. ఎటువంటి సిద్ధాంతం ఎదురవుతుందో చూద్దాం. ఇక ఇదుగో నా పుస్తకం, నేను మళ్లీ మాట్లాడేదాకా మరో మాట అనవద్దు. స్విండన్‌లో మనం లంచ్ తిద్దాం. మరో ఇరవయి నిమిషాల్లో అక్కడికి చేరతామని నాలెక్క."

అందమయిన లోయల గుండా, మెరిసిపోతుండే కొండలగుండా ఆ తరువాత రాస్ అనే పట్నం గుండా ప్రయాణిస్తూ గమ్యం చేరేసరికి సుమారు నాలుగయింది. సన్నగా చువ్వలాగా ఉన్న ఒక మనిషి అనుమానపు చూపులతో మాకు ఎదురువచ్చాడు. అతను వేసుకున్న బ్రౌన్ రంగు కోటు, లెదర్ లెగ్గింగ్స్ కలిపి చూస్తే అతను పల్లెటూరు వాడు కాదని, స్కాట్లాండ్ యార్డ్ ఆఫీసర్ లెస్ట్రేడ్ అని సులభంగానే గుర్తించగలిగాను. అతనితో మేము హియర్‌ఫోర్డ్ ఆర్మ్స్ చేరుకున్నాం. అక్కడ మా కోసం గదులు సిద్ధంగా ఉన్నాయి.

"నేను బండి ఏర్పాటు చేశాను. మీ హుషారుతనం గురించి నాకు బాగా తెలుసు. నేరం జరిగిన స్థలం చూచేదాకా మీరు సంతోషపడరనీ తెలుసు" అన్నాడు లెస్ట్రేడ్, మేము టీ తాగుతూ ఉండగా.

"మీ మాటలు అన్నీ సత్యమే. నాకు అంతా ఎప్పుడూ ఒత్తిడే" జవా బిచ్చాడు హోమ్స్.

లెస్ట్రేడ్ ఆశ్చర్యంగా చూచాడు. "నాకు అర్థం కాలేదు అన్నాడు."

"వేడి ఎంత ఉంది? ఇరవయి తొమ్మిది. పైగా గాలిలేదు. ఆకాశంలో మేఘాలు లేవు. ఇక్కడ నేను కాల్చవలసిన సిగరెట్లు పెట్టెనిండా ఉన్నాయి. సోఫా కూడా మామూలుగా పల్లె హోటెల్‌లో ఉండేరకం కన్నా బాగుంది. కనుక ఈ రాత్రి నేను మీ బండిని వాడుకునే సందర్భం రాదేమో." లెస్ట్రేడ్

హాయిగా నవ్వాడు. “అనుమానం లేదు. వార్తాపత్రికలలో చూచి మీరు ఈ కేసు గురించి ఒక నిర్ణయానికి వచ్చినట్టున్నారు. కేసు మరీ సులభంగా ఉంది. గమనించే కొద్దీ మరింత విడిపోతున్నది. అయినా ఒక స్త్రీ కోరికను కాదనలేము. అదీ మంచికోరిక. ఆవిడ మీ గురించి విన్నది. మీ అభిప్రాయం అడుగుతున్నది. మీరు చేయగలిగింది, నేను చేయనిది ఏమీ లేదని ఎంతగానో చెప్పాను. ఇది ఇంకా బాగుంది. అదిగో ఆవిడగారి బండి తలుపు ముందరికి రానే వచ్చింది” అన్నాడతను.

అతని మాట పూర్తయ్యేలోగా నిజంగా చాలా అందమయిన అమ్మాయి, ఒకావిడ మా గదిలోకి దూసుకువచ్చింది. ఆవిడ కళ్లు మెరుస్తున్నాయి. పెదవులు కొంచెం విప్పుకుని ఉన్నాయి. బుగ్గలు ఎర్రబారి ఉన్నాయి. అంటే ఆవిడ తొందరపాటుతనమూ, అందులోను కొంచెం నిలకడ కనబడుతున్నాయి.

ఆమె మా ఇద్దరినీ కొంచెం తికమకపడుతూ చూచింది. అయినా అమ్మాయిలకు ఉండే సహజమయిన ఊహాశక్తితో నా మిత్రుడిని పట్టేసింది. “ఓహ్, మిస్టర్ షెర్లక్ హెూమ్స్! మీరు రావడం ఎంత సంతోషం? అది చెప్పాలనే ఇంతదూరం వచ్చాను. జేమ్స్ ఈ పనిచేయలేదని నాకు తెలుసు. మీరు కూడా ఈ భావంతోనే పనిలోకి దిగాలి. అతనిమీద ఎంతమాత్రమూ అనుమానం కూడదు. మేము ఇద్దరమూ పిల్లలుగా ఉన్నప్పటి నుంచి కలిసి పెరిగాము. అతని గురించి అందరికన్నా ఎక్కువగా నాకే తెలుసు. ఒక పురుగుకు కూడా హాని చెయ్యని మెత్తని మనస్సుగలవాడు. అతనిమీద ఇంతటి నేరం మోపడం అన్యాయం” అన్నది ఆ అమ్మాయి.

“అతడిని ఇందులోనుంచి తప్పించగలమనే అనుకుందాం. అందుకు నాకు చేతనయిందంతా చేస్తాను, మిస్ టర్నర్” అన్నాడు షెర్లక్ హెూమ్స్.

“కానీ మీరు సాక్ష్యాలు చదివారు. ఏమయినా నిర్ణయానికి వచ్చారా? ఏదో లోపమూ, ఖాళీ కనిపించడం లేదా? జేమ్స్ తప్పు చేయలేదని మీకు



తోచలేదా?"

"అందుకు అవకాశం ఉంది."

"భలే.. భలే..'' అమ్మాయి గట్టిగా అరిచింది. తల వెనక్కు విసిరి లెస్ట్రేడ్ వేపు అదోరకంగా చూస్తూ, "విన్నారా? ఈయన నాకు నమ్మకం కలిగిస్తున్నారు" అన్నది.

లెస్ట్రేడ్ భుజాలు ఎగురవేశాడు. "నా మిత్రుడు కొంచెం తొందర పడినట్టున్నాడు" అన్నాడతను.

"ఆయన చెప్పిందే నిజం. నాకు గట్టి నమ్మకం ఉంది. జేమ్స్ ఈ హత్య చేయలేదు. ఇక తండ్రితో పడ్డ పేచీ సంగతి గురించి. అతను ఆ

విషయం బయటకు చెప్పకపోవడంలో నా ప్రమేయం కొంచెం ఉంది.”

“అదెట్లాగా?” అడిగాడు హెూమ్స్.

“ఇది నిజాలను దాచవలసిన సమయం కాదు. జేమ్స్‌కి, వాళ్ల నాన్నగారికి నా విషయంలో అభిప్రాయ భేదాలు ఉన్నాయి. మెక్‌కార్తీ గారు మా ఇద్దరికీ పెళ్లి జరిగితే బాగుంటుందన్నారు. కానీ నేను, జేమ్స్ అన్నా చెల్లెళ్లలా పెరిగాము. అతను చిన్నవాడు, జీవితాన్ని చూచింది తక్కువ, అప్పుడే పెళ్లి గురించి ఆలోచించినట్టు లేదు కూడా. కనుక పేచీలు వచ్చాయి. ఈసారి కూడా ఈ ప్రసక్తే వచ్చి ఉంటుంది.”

“మరి మీ నాన్నగారి అభిప్రాయం ఏమిటి? ఆయన ఈ పెళ్లికి ఒప్పుకున్నారా?”

“ఒప్పుకోలేదు. ఆయనకు ఇష్టం లేదు. మెక్‌కార్తీగారు తప్ప ఎవరికీ ఈ సంగతి ఇష్టం లేదు.” హెూమ్స్ ఒక్కసారి ప్రశ్న చూపులతో ఆమె ముఖంలోకి గుచ్చి చూచాడు. అమ్మాయి ముఖం సిగ్గుతో కందింది.



"ఈ విషయం చెప్పినందుకు థ్యాంక్స్. రేపు మీ ఇంటికి వచ్చి నాన్నగారిని కలవడానికి వీలుంటుందా?"

"డాక్టర్‌గారు అందుకు ఒప్పుకోరేమో?"

"డాక్టరా?"

"మీరు వినలేదా? నాన్నకు చాలాకాలంగా ఒంట్లో బాగుండడం లేదు. ఇక ఈ సంఘటనతో ఆయన మరింత కృంగిపోయారు. మంచం పట్టారు. ఆయన పరిస్థితి బాగుండలేదని డాక్టర్‌గారు అంటున్నారు. నాన్నగారిని విక్టోరియా రోజుల నుంచి ఎరిగిన మనిషి మిస్టర్ మెక్‌కార్తీ ఒకరే."

"హా! విక్టోరియాలో! ఇది చాలా ముఖ్యమయినది."

"అవును, అక్కడి గనుల్లో."

"అనుకున్నాను. బంగారు గనులు. టర్నర్‌గారు సంపాదించినదంతా అక్కడే."

"అవును నిజమే."

"థాంక్యూ, మిస్ టర్నర్, మీ వల్ల చాలా సాయం దొరికింది."

"కొత్త సమాచారం ఏమన్నా ఉంటే నాకు చెప్పండి. జేమ్స్‌ను చూడ డానికి మీరు జైలుకు వెళతారు మిస్టర్ హోమ్స్. అతను నిర్దోషి అని నాకు తెలుసని తనతో చెప్పండి."

"తప్పకుండా, మిస్ టర్నర్."

"ఇక ఇంటికి వెళ్లాలి. నాన్నగారికి బాగుండలేదు. నేను లేకుంటే చాలా దిగులుపడతారు. ఇక ఉంటాను. మీ ప్రయత్నంలో దేవుడు మేలు చేయుగాక." వచ్చినంత వేగంగాను ఆ అమ్మాయి గదిలోనుంచి వెళ్లిపోయింది. వీధిలో బండిచక్రాల చప్పుడు వినిపించింది.

"హెూమ్స్! ఇదేమి అన్యాయం? ఆ అమ్మాయి మనస్సులో ఆశలు రేకెత్తించావు ఎందుకు? ఇది క్రూరత్వం కాదా?" కొన్ని నిమిషాల తరువాత గంభీరంగా అడిగాడు లెస్ట్రేడ్.

"జేమ్స్ మెక్కార్తీని నిర్దోషిగా నిరూపించడానికి తోవ దొరికిందని నా భావం. అతడిని చూడడానికి ఆర్డర్ సంపాదించావా?" హెూమ్స్ అడిగాడు.

"ఆర్డర్లు నీకు ఒక్కడికి మాత్రమే, నాతోబాటు."

"అయితే బయటకు వెళ్లడం గురించి ఆలోచన మార్చుకుంటాను. మనం బయలుదేరి జైలుదాకా వెళ్లి అతడిని చూచే వ్యవధి ఉందా?"

"కావలసినంత"

"అయితే వెళదాం పద. వాట్సన్! ఈలోగా ఏం చేస్తావో మరి. రెండు గంటలు కన్నా ఎక్కువసేపు పట్టదు."

స్టేషన్దాకా నేను వాళ్లతోబాటు నడిచాను. తరువాత ఆ చిన్న పట్టణంలో వీధుల్లో తిరిగాను. తరువాత గదికి చేరుకుని సోఫాలో జారబడి ఓ పుస్తకంతో కుస్తీ పట్టాను. కథ ఏమంత బాగోలేదు. పైగా ఎదురుగా ఒక



కేసుతో కుస్తీ సాగుతన్నది. నా దృష్టి ఎంతసేపూ కథ నుంచి వాస్తవంలోకి మారుతున్నది. చివరకు పుస్తకం పడేసి ఆవేళ జరిగిన సంగతుల గురించి ఆలోచన మొదలు పెట్టాను. పాపం, ఆ కుర్రవాడు చెపుతున్నది నిజమే అయితే, అతను తండ్రి పక్కనుంచి కదిలి కొంతదూరం పోయి తిరిగి వచ్చేలోగా ఏదో ఘాతుకం జరిగింది. ఏమిటది? ఆ గాయాలను చూస్తే వైద్యుడిగా నాకేమయినా తోస్తుందేమో, వెంటనే బెల్ మోగించి స్థానిక పత్రికల కోసం అడిగాను. వాటిలో విచారణ వివరాలు పూసగుచ్చినట్టు రాశారు. తలవెనుక పెరైటల్ బోన్‌కు ఆక్సిపిటల్ బోన్‌యొక్క ఎడమసగానికి కలిపి దెబ్బతగిలిందని, వాడినది వాడిలేని వస్తువని సర్జన్ రాశాడు. నేను తలమీద ఆ చోటును తడిమి చూచుకున్నాడు. అట్లాంటి దెబ్బ కొట్టడం వెనుకనుంచి మాత్రమే వీలవుతుంది. అంటే అది నిందితుడికి సాయం చేసే మాట. వాదిస్తున్నప్పుడు అతను తండ్రి ముందున్నాడని కదా! అంతమాత్రంతో సరిపోయిందేమీ లేదు. దెబ్బపడే లోపల ముసలతను వెనక్కు తిరిగి ఉండవచ్చు. అయినా ఈ విషయం హోమ్స్‌కి చెపితే బాగుంటుంది. ఇక చనిపోతూ అన్న మాటలు మరోవేపు. వాటి అర్థం ఏమిటి? అపస్మారకం మాటలు మాత్రం కావు. దెబ్బ తగిలిన మనిషి అపస్మారకంలోకి జారడు. తనకు జరిగిన దాన్నిగురించి ఆయనేదో చెప్పడానికి ప్రయత్నించాడు. ఇంతకూ ఏమిటది? అర్థం చేసుకోవాలని బుర్రనంతా వెతికాను. ఇక కుర్రవాడు గమనించిన గ్రే రంగు గుడ్డ సంగతి. అదే నిజమయితే హంతకుడు పారిపోతూ ఏ ఓవర్‌కోట్‌నో జారవిడుచుకుని అవకాశం దొరికినప్పుడు, దగ్గరే గనుక మళ్లీవచ్చి ఎత్తి తీసుకునిపోయాడు. తరిచి చూస్తే, ఎన్ని రహస్యాలు, ఎంతటి లోతు! లెస్ట్రేడ్ అభిప్రాయంతో నేను ఏకీభవించానేమో. అయినా షెర్లక్ హోమ్స్ పద్ధతుల్లో నాకు గట్టి నమ్మకం ఉంది. అతను ప్రతి విషయాన్ని తరచి చూచి కుర్రవాని అమాయకత్వాన్ని నిరూపించవచ్చు.

షెర్లక్ హోమ్స్ తిరిగి రావడానికి ఆలస్యం అయ్యింది. ఆయన

ఒంటరిగా వచ్చాడు. లెస్ట్రేడ్ లాడ్జింగ్‌కి వెళ్లి ఉంటాడు.

"వేడి ఇంకా బాగాఉంది. వర్షం పడకుంటే మేలు. లేకుంటే మనం ఘటనాస్థలానికి వెళ్లేసరికి అంతా గజిబిజి అవుతుంది. అయినా ఇంతదూరం ప్రయాణించి అలిసిపోయిన తరువాత పరిశోధనకు దిగడం నాకు నచ్చలేదు. నేను చిన్న మెక్‌కార్తీని కలిశాను."

"ఇంతకూ ఏమి అర్ధమయింది?"

"ఏమీ లేదు."

"అతను ఏమయినా చెప్పగలిగాడా?"

"ఏమీలేదు. ఒక సందర్భంలో, హంతకుడెవరో అతనికి తెలుసని, విషయం దాచుతున్నాడని నాకు అనిపించింది. కానీ అందరిలాగే అతనూ తికమకలో పడ్డాడని తరువాత అర్ధమయింది. అతనేమంత చురుకు కుర్రవాడు కాదు. చూడడానికి బాగానే ఉంటాడు. మనస్సు మంచిదనిపిస్తుంది."

"అతని పద్ధతి నాకేమీ నచ్చలేదు. అంత అందమయిన అమ్మాయితో పెళ్లి ఇష్టంలేని పక్షంలో ఆ మాటేదో చెప్పి ఉండొచ్చు కదా?" నేనన్నాను.

"అదేమరి చిక్కు. ఈ కుర్రవాడు ఆ అమ్మాయిని పిచ్చిగా ప్రేమిస్తున్నాడు. కానీ రెండు సంవత్సరాల క్రితం వరకు ఆ అమ్మాయి సంగతి తెలియదు. ఆమె మరి ఐదు సంవత్సరాల పాట చదువు పేరున బోర్డింగ్ స్కూల్లో ఉండిపోయింది. ఈ పిచ్చివాడు బ్రిస్టల్‌లో ఒక బార్ మెయిడ్‌కు చిక్కుకుని రహస్యంగా రిజిస్ట్రీ ఆఫీసులో పెళ్లికూడా చేసుకున్నాడు. ఈ సంగతి మరెవ్వరికీ తెలియదు. ఇప్పుడు పరిస్థితి గందరగోళంగా మారింది. తన మనస్సుకు వచ్చిన పని చేయడానికి లేదు. ఆ తికమకలో అతను పిచ్చిగా ప్రవర్తిస్తూ తండ్రిమీదికి చేతులెత్తేదాకా వచ్చాడు. ఆ తండ్రి పాపం మిస్ టర్నర్‌ని పెళ్లి చేసుకోమని బలవంత పెడుతున్నాడు. కుర్రవానికి సొంత ఆదాయమంటూ లేదు. తండ్రి గట్టిరకం మనిషి. నిజం తెలిస్తే వీడిని

ఇంట్లోంచి తరిమేస్తాడు. గడిచిన మూడు రోజులు ఈ కుర్రవాడు బ్రిస్టల్‌లో పెళ్లాంతో అంటే ఆ బార్‌మేడ్‌తో గడిపాడు. తండ్రికి ఆ సంగతి తెలియదు. ఒకటి గమనించు.. ఇది చాలా ముఖ్యమయిన విషయం. చెడులోనుంచి మంచి పుడుతూ ఉంటుంది. పేపర్‌లలో ఈ కుర్రవాని వార్త చదివి ఉరికంబం ఎక్కేలా ఉన్నాడని తెలిసి ఆ భార్యామణి వీడికొక ఉత్తరం రాసింది. తనకు అంతకుముందే బెర్ముడా డాక్ యార్డ్‌లో మరో మొగుడున్నాడని, ఇకమీద తనను పలకరించవద్దు, అంటూను. ఈ వార్త కుర్రవాడికి చాలాబాగా కనిపించింది. పడిన కష్టం అంతా పక్కకు జరిగినట్టుంది."

"ఇంతకూ అతను అమాయకుడయితే, హత్య చేసిందెవరు?"

"అవును ఎవరు? నీవిక్కడ రెండు విషయాల గురించి గట్టిగా ఆలోచించాలి. హతుడికి పూల్ పక్కన ఒక మనిషి ఎవరితోనో అపాయింట్‌మెంట్ ఉంది. అది ఈ అబ్బాయి మాత్రం కాదు. అబ్బాయి ఎప్పుడు తిరిగి వస్తాడన్నది తండ్రికి తెలియనే తెలియదు. ఇక రెండో విషయం ఏమిటంటే, ఆ కొడుకు తిరిగి రాకముందే, హతుడు 'కూయి' అని కూశాడు. ఈ కేసు మొత్తంగా ఈ రెండు విషయాలమీద ఆధారపడి ఉంది. ఇక మనం మరేదయినా సంగతి మాట్లాడుకుందామయ్యా! ఈ చిన్న చిన్న సంగతులను రేపటికి వాయిదా వేద్దాం."

హోమ్స్ ముందుగా చెప్పినట్లే వర్షం రాలేదు. మరురోజు ఉదయం మబ్బులు కూడా లేవు. మంచి వెలుగు ఉంది. తొమ్మిది అవుతుండగా లెస్ట్రేడ్ బండితోపాటు మా దగ్గరకు వచ్చేశాడు. అందరమూ హాదర్లీ ఫామ్, ఇంకా బోస్కోంబ్ పూల్ వేపు బయలుదేరాము.

"ఇవాళ ఒక ముఖ్యమయిన వార్త వచ్చింది. మిస్టర్ టర్నర్ గారికి ఆరోగ్యం మరీ బాగుండలేదట." అన్నాడు లెస్ట్రేడ్.

"మరీ పెద్ద వయస్సు మనిషి అనుకుంటాను" అన్నాడు హోమ్స్.

“అరవయి ఏళ్లు ఉంటాయి. కానీ విదేశాల్లో జీవనంతో శరీరం బాగా అలిసిపోయింది. కొంతకాలంగా ఆయన అనారోగ్యంగా ఉంటున్నాడు. ఇప్పుడు జరిగిన వ్యవహారంతో మరింత కృంగిపోయాడు. మెక్‌కార్తీ, ఇతను మొదటినుంచి మంచి స్నేహితులు. టర్నర్ గారు మెక్‌కార్తీకి చాలా సాయంకూడా చేశాడు అనవచ్చు. ఈ హాదర్లీ ఫామ్‌ని బాడుగ ఏదీ లేకుండానే ఇచ్చేశాడని చెపుతుంటారు.”

“నిజంగానా? చాలా ఆసక్తికరంగా ఉందే” అన్నాడు హెూమ్స్.

“అవునండి. ఆయన మరో వంద రకాలుగా సాయం చేసి ఉంటాడు. ఇక్కడ అందరూ ఆయన మంచితనం గురించి చెప్పేవాళ్లే. ”

“అవునా? ఈ పరిస్థితిలో తనకంటూ అంతగా ఆస్తిలేని మెక్‌కార్తీ టర్నర్‌తో ఉన్న సంబంధాల ప్రకారం కూడా తన కొడుకు ఆ అమ్మాయిని పెళ్లి చేసుకోవాలి అనడం కొంచెం విచిత్రంగా కనబడడం లేదు. ఆ అమ్మాయి టర్నర్ ఆస్తికంతా వారసురాలు. ఇప్పుడు పెళ్లి జరిగితే ఏమవుతుందో తెలుసుకదా? టర్నర్‌కు ఈ పెళ్లి ఇష్టం లేకపోవడం మరింత విచిత్రమయిన సంగతి. ఆ సంగతి ఆ కూతురు చెప్పనే చెప్పింది మనకు. వీటన్నిటిని బట్టి నీకు ఏమనిపిస్తున్నది?”

“మన పరిస్థితి ఈ అనిపించడాలు, అందులోనుంచి కూపీలు తీయడాల వరకు వచ్చింది” అన్నాడు లెస్ట్రేడ్ నావేపు కన్ను గీటుతూ. “నాకు ఉన్న విషయాలను పట్టించుకోవడమే చేతకాదు. ఇక సిద్ధాంతాలను, చిత్రీ కరణలను ఎక్కడ పట్టించుకోను?”

“నిజం చెప్పావు. సత్యాలే నిన్ను తికమక పెడుతుంటాయి కదూ.” అడిగాడు హెూమ్స్ అమాయకంగా.

“అయినా సరే, నీకు కష్టంగా ఉండే ఒక విషయాన్ని మాత్రం నేను సులభంగా పట్టుకున్నాను” అన్నాడు లెస్ట్రేడ్ కొంచెం సరదాగా.

"ఏమిటో అది?"

"సీనియర్ మెక్‌కార్తీ అనే మనిషి అతని కొడుకు చేతుల్లోనే హతు డయ్యాడని, మిగతా ఆలోచలన్నీ గాలి కబుర్లనీ"

"సరే, గాలి పొగమంచుకంటే చిక్కగా ఉంటుందా? తెలియదు గానీ మనం హాదర్లీ ఫామ్‌కు చేరుకున్నట్టున్నాం."

"అవునవును" ఆ పక్కన ఉన్నది విశాలమయిన, సదుపాయంగా కనిపిస్తున్న రెండు అంతస్తుల భవనం. పైకప్పు పలకలతో పేర్చి ఉంది. పాత గోడలమీద నాచు పెరిగిన మరకలు ఉన్నాయి. కిటికీలు మూసి ఉన్నాయి. చిమ్నీలోంచి పొగ రావడం లేదు. అక్కడంతా నిర్మానుష్యంగా ఉంది. జరిగిన సంఘటన ప్రభావం బలంగా కనబడుతున్నది. మేము తలుపు తట్టాము. ఒక మెయిడ్ వచ్చింది. హోమ్స్ అడిగిన తరువాత, మరణించిన సందర్భంలో యజమాని వేసుకున్న బూట్లను తెచ్చి చూపించింది. హోమ్స్ కొడుకు బూట్ల కోసం కూడా అడిగాడు. అవి అతను హత్య సమయంలో వేసుకున్నవి కాకపోవచ్చు. హోమ్స్ వాటిని రకరకాలుగా కొలతలు తీశాడు. తరువాత అందరమూ బయలుదేరి బోస్కోంబ్ పూల్ వేపు నడిచాము.

ఇలాంటి సందర్భాలలో షెర్లక్ హోమ్స్ పూర్తిగా మారిపోతాడు. బేకర్ స్ట్రీట్‌లో నిశ్శబ్దంగా ఆలోచిస్తూ గడిపే పెద్ద మనిషితో మాత్రమే పరి చయం ఉన్నవారు ఇక్కడ అతడిని గుర్తించలేరు. అతని ముఖం కందినట్లు ఉంది. కనుబొమ్మలు ముడిపడి సన్నని గీతలుగా కనబడుతున్నాయి. కళ్లు మాత్రం మిలమిలా మెరుస్తున్నాయి. ముఖం కిందకు వంచి, భుజాలను కూడా వంచి, పెదవులను బిగించి అతను గమనిస్తుంటే మెడలో నరాలు గట్టిపడి కనబడుతున్నాయి. వేటను వెంటాడుతున్న మృగంలాగా అతని ముక్కులు వెడల్పుగా మారాయి. అతని ధ్యాసంతా ఒకే విషయం మీద చేరి ఉంది. మరేమాట అతనికి వినిపించదు. ఒక ముక్క వినిపించినా ఒక



ముక్కే జవాబుగా వస్తుంది. నిశ్శబ్దంగా అతను మైదానంలోని దారివెంట ముందుకు వెళుతాడు. అక్కడి నుంచి చెట్ల దగ్గరికి, మళ్లీ పూల్ దగ్గరికి అట్లా తిరుగుతున్నాడు. నేలంతా చిత్తడిగా ఉంది. రకరకాల అడుగుజాడలు బురదలో కనబడుతున్నాయి. హోమ్స్ ఒక్కొక్కసారి వేగంగా నడుస్తున్నాడు. ఒక్కోసారి ఆగిపోతున్నాడు. ఉన్నట్టుండి మళ్లీ పచ్చికలోకి ఎక్కడికో నడుస్తాడు. లెస్ట్రేడ్, నేను అతని వెనుక నడుస్తున్నాము. డిటెక్టివ్ ముఖంలో ఓపికలేనితనం కనబడుతున్నది. నేను మాత్రం నా మిత్రుని పట్టుదలను, పద్ధతులను ఆసక్తిగా గమనిస్తున్నాను. అతను తప్పకుండా ఒక నిర్ణయానికి వచ్చేస్తాడు.

బోస్కోంబ్ పూల్ అంటే ఒక చిన్న మడుగు మాత్రమే. యాభయి గజాల కన్నా ఎక్కువ లేదు. నిండా నీటితుంగ పెరిగి ఉంది. అది హాదర్లీ ఫామ్‌కు, టర్నర్‌గారి స్వంత పార్క్‌కు మధ్యన ఉన్నది. పక్కనే దట్టంగా

చెట్లున్నాయి. అక్కడి నుంచి టర్నర్ భవనం పైభాగాలు ఎరుపు రంగులో కనబడుతున్నాయి. పూల్‌కు ఇటువేపున కొంతదూరం వరకు గడ్డి పెరిగి ఉంది. అందులో హతుడు పడిఉన్న చోటును లెస్ట్రేడ్ మాకు చూపించాడు. అక్కడ నేల మరీ తేమగా ఉంది. మనిషి కిందపడిన గుర్తులు బాగా కనబడుతున్నాయి. హోమ్స్ అక్కడ నేలను, నలిగిన గడ్డిని పరిశీలించి ఎన్నో సంగతులను ఊహిస్తున్నాడని అతని ముఖాన్ని, కళ్లను చూస్తే తెలిసిపోతున్నది. వాసన పసిగడుతున్న కుక్కలాగా అతను చుట్టూ తిరిగాడు.

"లెస్ట్రేడ్, ఇంతకూ నీవు నీటి మడుగులోకి ఎందుకు వెళ్లావు?" అతను అడిగాడు.

"ఓ కర్రతో కాస్త కెలికి చూచాను. అక్కడ ఆయుధ మేమన్నా దొరుకుతుందేమోనని. కానీ ఇంతకూ ఈ సంగతి......"



"ఆగు.. ఆగు.. నాకు టైమ్ లేదు. వంకర తిరిగిన నీ ఎడమకాలి గుర్తులు ఇక్కడ నిండా కనబడుతున్నాయి. అవి తుంగల్లోదాకా సాగాయి. ఇక్కడికి దున్నపోతుల్లాగా అందరూ వచ్చి బురదలో కసాపిసా తిరిగేకన్నా ముందే నేను వచ్చి ఉంటే ఎంత బాగుండేది. ఇదిగో లాడ్జ్ కీపర్ వచ్చిన గుర్తులు. మృతదేహానికి ఆరు నుంచి ఎనిమిది అడుగుల చుట్టూ కన బడుతున్నాయి. ఒక మనిషి నడిచిన గుర్తులు మాత్రం మూడు రకాలుగా ఉన్నాయి."

అతను తన జేబులోనుంచి ఒక లెన్స్‌ను బయటకు తీసి కాలిగుర్తులను తీవ్రంగా గమనించసాగాడు. అంతసేపూ మాతో చెపుతున్నట్టు కాక తనలోతానే గొణుక్కుంటున్నాడు. "ఇవి కుర్ర మెక్‌కార్తీ అడుగులు. రెండుసార్లు నడిచాడు. ఒకసారి పరుగుపెట్టాడు. ఆ సంగతి చక్కగా కన బడుతున్నది. అంటే అతను చెపుతున్న కథ నిజమనిపిస్తున్నది. తండ్రి శరీరాన్ని చూడగానే అతను పరుగు పెట్టాడు. ఇక అతని తండ్రి అటూఇటూ తిరిగిన గుర్తులు కూడా ఉన్నాయి. మరి ఇదేమిటి? తండ్రి మాటలు వింటూ నిలబడ్డప్పుడు కుర్రవాడు కింద నిలబెట్టిన తుపాకీ మడమ. మరి ఇదీ. హా! హా!! ఇదేమిటి? ఎవరో మునివేళ్ల మీద నడిచారు. విచిత్రమయిన బూట్స్. అవి వచ్చాయి, వెళ్లాయి, మళ్లీ వచ్చాయి. ఆ కోట్ కోసమా? ఇంతకూ ఎక్కడి నుంచి వచ్చాయి ఇవి?" అతను అటూఇటూ పరుగులు పెట్టాడు. అడుగులు దొరుకుతున్నాయి. అప్పుడప్పుడు తప్పుతున్నాయి. చివరికి అవి అడవి మొదట్లో ఒక పెద్ద చెట్టుకిందికి చేరాయి. అది ఆ చుట్టుపక్కల అన్నిటికన్నా పెద్ద చెట్టు. హెూమ్స్ అక్కడిదాకా వెళ్లాడు. మళ్లీ బోర్లాపడుకుని పరిశీలించి గట్టిగా ఒక కేక వేశాడు. అందులో సంతృప్తి వినిపించింది. అతను అక్కడే కొంతకాలం ఉండి ఆకులను, ఎండుపుల్లలను పక్కకు కదిలిస్తున్నాడు. ఏదో పదార్థాన్ని ఒక కవర్‌లోనికి ఎత్తి లెన్స్‌తో పరి శీలించాడు. చెట్టు బెరడును కూడా అందినంత ఎత్తువరకూ పరిశీలించాడు. అక్కడ నాచులో ఒక రాయి పడి ఉంది. దాన్ని అతను జాగ్రత్తగా గమనించి చేతిలోకి తీసుకున్నాడు. చెట్ల మధ్యగా నడుస్తూ హైరోడ్ దాకా వెళ్లాడు. ఆ తరువాత ఏ జాడలూ కనపించలేదు.

"ఈ కేసు కావలిసినంత ఆసక్తికరంగా ఉంది" అన్నాడతను మళ్లీ మామూలుగా మారుతూ. "ఈ పక్కన ఉన్నది లాడ్జ్ అనుకుంటాను. నేను అక్కడికి వెళ్లి మోరాన్‌తో కాసేపు మాట్లాడతాను. ఒక చిన్న నోట్ కూడా రాస్తాను. ఆ పని ముగిస్తే మనమంతా భోజనానికి వెళ్లవచ్చు. మీరు బండివేపు నడుస్తూ ఉండండి, నేను వచ్చి కలుస్తాను" అన్నాడతను.



పది నిమిషాల తరువాత మేమంతా కలిసి రాస్‌కి బయలుదేరాము. చెట్టు దగ్గర తీసుకున్న రాయి మాత్రం ఇంకా హోమ్స్ చేతిలోనే ఉంది.

"ఇది నీకు బాగా పనికి వస్తుంది, లెస్ట్రేడ్! ఇదే హత్యాయుధం" అన్నాడు హోమ్స్ రాతిని అందిస్తూ.

"దీనిమీద ఏ గుర్తులూ లేవే."

"అవును గుర్తులు లేవు."

"మరి ఎలా తెలిసింది ఇదే ఆయుధమని ?"

"దీనికింద గడ్డి పెరుగుతోంది. రాయి అక్కడ కొన్ని దినాలుగా మాత్రమే పడి ఉంది. దాన్ని ఎక్కడ నుంచి తీశారన్నది మాత్రం తెలియలేదు. గాయం సరిగ్గా దీని కొలతలకు కుదురుతుంది. పైగా మరొక ఆయుధం ఏదీ కనబడలేదు."

"మరి హంతకుడెవరు?"

"ఒక పొడగరి మనిషి, ఎడమచేతి వాటంగల వాడు, కుడికాలు కొంచెం కుంటుతాడు. వేటబూట్లు వేసుకుని ఉన్నాడు. గ్రేరంగు కోటు కూడా వేసుకున్నాడు. ఇండియన్ సిగర్స్ కాలుస్తాడు. ఒక సిగర్ హోల్డర్‌ని కూడా

వాడతాడు. అతని జేబులో అంతవాడిగా లేని ఒక చిన్న కత్తి ఉంటుంది. మరెన్నో సూచనలు ఉన్నాయి. కానీ అతడిని వెతకడానికి ఇవి చాలనుకుంటాను.”

లెస్ట్రేడ్ నవ్వాడు. “నాకింకా నమ్మకం కుదరలేదు. సిద్ధాంతాల సంగతి బాగానే ఉంది. కానీ బ్రిటిష్ న్యాయవ్యవస్థను గుర్తుంచుకోవాలి” అన్నాడతను.

“ఎవరిదారి వారిది. నీ పద్ధతిలో నీవు ముందుకు వెళ్లు. నా పని నేను చూస్తాను. ఈ మధ్యాహ్నం కొంచెం బిజీగా ఉంటాను. బహుశా సాయంత్రం ట్రయిన్‌కి లండన్ వెళ్లిపోతాను” అన్నాడు హోమ్స్ ప్రశాంతంగా.

“ఏమిటి, కేసు ముగియకుండానే?”

“ముగుస్తుంది”

“ఏమిటి రహస్యం?”

“ఇంకెక్కడి రహస్యం?”

“అయితే హంతకుడు ఎవరు?”

“నేను వర్ణించిన మనిషి.”

“ఇంతకూ ఎవరతను?”

“కనుగొనడం అంత కష్టం కాదనుకుంటాను. ఇక్కడ మరీ అంతగా జనాభా కూడా లేదు.”

లెస్ట్రేడ్ భుజాలు ఎగరేశాడు. “నేను ప్రాక్టికల్ మనిషిని. ఎడమ చేతివాటం, కుంటికాలు కల మనిషిని వెతుకుతూ తిరగలేను. స్కాట్లాండ్ యార్డ్‌లో అందరూ నన్ను చూచి నవ్వుతారు” అన్నాడతను.

“సరే మరి, నీ అవకాశం నీకిచ్చాను. ఇదిగో నీ లాడ్జింగ్స్. నేను వెళ్లిపోయేలోపు నీకు కబురుపెడానులే” అన్నాడు హోమ్స్ ప్రశాంతంగా.

లెస్ట్రేడ్‌ని అతని బస దగ్గర వదిలేసి మేము హోటల్‌కు చేరుకునే

సరికి మా భోజనం సిద్ధంగా ఉంది. ముఖం మీద కొంచెం బాధ కనబడుతూ ఉండగా హోమ్స్ ఆలోచనల్లో మునిగి నిశ్శబ్దంగా ఉన్నాడు. ఏదో తీవ్రంగా, లోలోపలే చర్చించుకుంటున్నాడు.

"ఇటు చూడు వాట్సన్, ఈ కుర్చీలో కూర్చుని నేను చెప్పేదంతా జాగ్రత్తగా విను. ఏం చెయ్యాలో నాకు నిజంగా అర్థం కావడం లేదు. నీ సలహా నాకిప్పుడు ఎంతో విలువయినది. ఒక చుట్ట వెలిగించుకో. నేను చెప్పేది విను."

"తమరి దయ."

"చూడు, ఈ కేసును గురించి ఆలోచిస్తే జేమ్స్ మెక్‌కార్తీ చెప్పిన విషయాలు మనకు ఇద్దరికీ సులభంగా తలకు ఎక్కాయనవచ్చు. అయితే అది రెండు రకాలుగా జరిగింది. నేను అతడిని నిర్దోషి అనుకున్నాను. నీవు మరోలా అనుకున్నావు. తండ్రి తాను వచ్చింది తెలియకుండానే 'కూయి' అని అరిచాడన్నది అతను చెప్పిన ముఖ్య విషయం. ఇక రెండవ విషయం, హతుడు ప్రాణం వదిలేముందు అన్న మాటలు. అతనేవో చాలా మాటలు గొణిగాడు. కానీ ఒకటి రెండు మాత్రమే కొడుకు పట్టుకోగలిగాడు. ఈ రెండు విషయాలను ఆధారంగా మన పరిశోధన ముందుకు సాగాలి. అయితే కుర్రవాడు చెపుతున్నదంతా నిజమే అనుకుని మనం ముందుకు సాగుదాం."

"మరి ఆ 'కూయీ' సంగతి ఏమిటి?"

"అవును, అది కొడుకు కొరకు చేసిన సంకేతం మాత్రం కానేరదు. అతని దృష్టిలో కొడుకు ఇంకా బ్రిస్టల్‌లోనే ఉన్నాడు. అతనికి ఆ సంకేతం వినిపించడం అనుకోకుండా జరిగింది. సంకేతం మాత్రం కలవదలుచుకున్న మరొక మనిషి కోసం చేసినది. 'కూయి' అన్న అరుపు అసలయిన ఆస్ట్రేలియా పద్ధతి. అక్కడివాళ్లు మాత్రమే దాన్ని వాడతారు. అంటే బోస్కోంబ్ పూల్ దగ్గర మెక్‌కార్తీ కలవదలుచుకున్న వ్యక్తి తప్పకుండా ఆస్ట్రేలియాతో సంబంధం కలిగిన వాడయి ఉండాలి."

"మరి ఆ గొణుగుడు సంగతి!"

షెర్లక్ హెూమ్స్ తన జేబులోనుంచి మడత పెట్టిన ఒక కాగితాన్ని తీసి టేబుల్ మీద పెట్టి చదును చేశాడు. వేలితో దానిమీద చూపుతూ, "ఇది విక్టోరియా కాలనీకి సంబంధించిన చిత్రపటం. బ్రిస్టల్ నుంచి రాత్రి తెప్పించాను. ఇక్కడ ఏమని ఉంది?"

"అరాట్ అని" నేనన్నాను.

"మరి ఇప్పుడు?" చెయ్యి పక్కకు తీసి అడిగాడు.

"బలరాట్"

"కదూ! హతుడు ఈ మాటే అన్నాడు. అబ్బాయికి చివరి రెండు అక్షరాలు మాత్రం వినిపించాయి. తండ్రి ఫలానా మనిషి, బలరాట్ వాసి, అని చెప్పాడు."

"అద్భుతంగా ఉందే!" ఆశ్చర్యంగా అన్నాను నేను.

"తెలిసిపోతూనే ఉంది. అంటే, నేను కేసులో మరికొంచెం ముందుకు వెళ్లానని అర్థం. ఇక గ్రే కోట్ ఉందన్నది మరొక సంగతి. జేమ్స్ చెప్పింది నిజమే అయితే ఈ మాట స్థిరమయింది. అంటే మనం ఏదో ఉజ్జాయింపుల లోనుంచి విషయంలోకి వచ్చేశాం. బలరాట్ వాసి అయిన గ్రే కోట్ వేసుకున్న మనిషివేపు అన్నమాట."

"ఖచ్చితంగానూ"

"ఇక పూల్ దగ్గరికి కొత్త వాళ్లెవరూ వెళ్లడానికి వీల్లేదన్న సంగతి కూడా ముఖ్యమయినది."

"నిస్సందేహంగా"

"ఇక ఇవాళ మనం గమనించిన సంగతులు. అక్కడి నేలను పరిశీలించి నేను కొన్ని విశేషాలు పట్టుకున్నాను. హంతకుడి గురించి ఆ మట్టిబుర్ర

లెస్ట్రేడ్‌తో చెప్పనే చెప్పాను."

"వాటిని నువ్వు ఎలా పట్టావు?"

"నీకు నా పద్ధతుల గురించి తెలుసు. చిన్న చిన్న విషయాలను గమనించి ఎన్నో పట్టవచ్చు."

"మనిషి వేసిన అడుగుల ప్రకారం అతని ఎత్తును లెక్కవేయవచ్చునన్నది ఒకటి. ఇక అతని బూట్స్‌ని వర్ణించడం మరొకటి."

"నిజంగానే, ఆ బూట్స్ విచిత్రంగా ఉన్నాయి. మరి ఆ కుంటితనం?"

"ఎడమకాలితో పోలిస్తే అతని కుడికాలి గుర్తులు సమానంగా లోతుగా లేవు. అంటే అతను బరువు ఒక కాలిమీద ఎక్కువగా వేస్తాడని అర్థం. అంటే కుంటుతాడనే కదా!"

"ఇక ఎడమచేతి వాటం?"

"సర్జన్ తన రిపోర్ట్‌లో గాయం గురించి రాసిన విషయాలను చూచి నీవు కూడా కాసేపు ఆలోచించావు. గాయం వెనకనుంచి తగిలింది. అయినా ఎడమవేపు తగిలింది. ఎడమచేతి వాటం కాకుంటే అట్లా జరగడానికి వీల్లేదు. తండ్రీ కొడుకులు మాట్లాడుతూ ఉండగా ఆ వ్యక్తి ఆ చెట్టు వెనుక నిలబడ్డాడు. అతను అక్కడ చుట్ట కూడా కాల్చాడు. నాకు చుట్ట బూడిద దొరికింది. చుట్టల గురించీ, బూడిదల గురించీ నాకు తెలిసిన సంగతులను బట్టి, అది ఇండియన్ సిగర్ అని చెప్పగలను. నేను ఈ విషయంగా ఎంతో పరిశోధించానని నీకు తెలుసు. 140 రకాల పైప్‌లు, సిగర్స్, సిగరెట్‌ల పొగాకు గురించి నేను ఒక చిన్న మోనగ్రాఫ్ కూడా రాశాను. బూడిద దొరికిన తరువాత చుట్టూ వెతికితే నాకు చుట్ట పీక కూడా కనిపించింది. ఆ రకం ఇండియన్ సిగర్స్‌ను రోటర్‌డామ్‌లో మాత్రమే తయారు చేస్తారు."

"సిగర్ హోల్డర్ ఎక్కడిది?"

"చుట్టపీక నోట్లో పెట్టుకోలేదని గమనించగలిగాను. అంటే హోల్డర్



వాడారు. చివరను కొరకడం కాక, కత్తితో కోశారు. ఆ కోయడం వాడిగా లేదు. అంటే వాడిన కత్తి బండగా ఉందని ఊహించాను.”

“హోమ్స్, నీవు ఈ మనిషి చుట్టూ తప్పించుకోలేకుండా ఉచ్చు బిగించావు. మరొక అమాయకప్రాణి మెడచుట్టూ బిగుసుకుంటున్న ఉరి తాటిని తెంచేశావు. ఇదంతా ఎటు దారితీస్తున్నదో నాకు స్పష్టంగా కన బడుతున్నది. ఇక హంతకుడు.....”

“మిస్టర్ జాన్ టర్నర్” హోటల్ వెయిటర్ గట్టిగా అన్నాడు, తలుపు తెరుస్తూ. అతని వెనుక ఒక పెద్దమనిషి వచ్చాడు. వచ్చిన వ్యక్తి విచిత్రంగా ఉన్నాడు. కుంటుతూ నడుస్తున్నాడు. భుజాలు ముందుకు వంగిఉన్నాయి. శరీరం మాత్రం బాగా మొరటుతేలి ఉంది. ఆ భారీ శరీరంలో దాగి ఉన్న బలం స్పష్టంగా కనబడుతున్నది. పెరిగిన గడ్డం గజిబిజిగా ఉంది. తలజుట్టు కూడా అలాగే ఉంది. దట్టమయిన కనుబొమ్మలు, ముఖం తీరు కలిసి పెద్దమనిషి తనాన్ని కనబరుస్తు న్నాయి. ముఖం రంగు వెలిసిన ట్టుంది. ముక్కు, పెదవులు మాత్రం కొంతనీలం రంగులో కనబడు తున్నాయి. అతని ఆరోగ్యం బాగుండలేదని, పెద్ద వ్యాధితో బాధ పడుతున్నాడని చూడగానే నాకు అర్థమయింది.

“దయచేసి సోఫాలో కూర్చోండి. నా చీటి అందింది కదూ?” గౌరవం గా అడిగాడు హోమ్స్.

“లాడ్జ్ కీపర్ తెచ్చి ఇచ్చాడు. విషయం బయట పొక్కకుండా మీరు నన్ను ఇక్కడికి రమ్మన్నారని అర్థమయింది.”



"నేను మీ ఇంటికి వస్తే అందరూ తలో రకంగా అనుకుంటారు."

''ఇంతకూ నన్ను మీరు ఎందుకు కలవాలనుకున్నారు?'' అతను నా మిత్రుని వేపు అలసి పోయిన కళ్లలో ఏదో బాధ కనబడు తుండగా అడిగాడు. ప్రశ్నకు జవాబు తెలిసినట్టు ఉంది అతని చూపు.

''అవును అవును. నాకు మెక్‌కార్తీ వ్యవహారం అంతా తెలుసు" అన్నాడు హొమ్స్ అతని చూపులకు జవాబు చెపుతున్నట్టు.

పెద్దమనిషి తన ముఖాన్ని రెండు చేతుల్లోను దాచుకున్నాడు. "భగవంతుడా!" అని గట్టిగా అన్నాడు. "కానీ, నాకు ఆ కుర్ర వాడికి హాని కలిగించ కూడదని మాత్రం నిండుగా ఉంది. అతనికి శిక్షకానీ పడి ఉంటే సరయిన సమయంలో నేను తప్పకుండా నిజం చెప్పేవాడినే."

"మీరు ఈ మాట అనడం నాకు సంతోషంగా ఉంది" అన్నాడు హొమ్స్ గంభీరంగా.

"నేను నిజం చెప్పేవాడినే. నా కూతురికి సంగతి తెలిస్తే దాని గుండె పగులుతుంది. నేను అరెస్ట్ అయ్యానంటే అది మరింత కృంగిపోతుంది."

"విషయం అంతదాకా రాదులెండి" అన్నాడు హొమ్స్.

"అదెట్లా?"

"నేను పోలీస్‌ను కాదు. ఇక్కడికి నన్ను పిలిపించింది మీ అమ్మాయేనని నాకు అర్థమయింది. నేను ఆవిడకు సాయం చేయడానికి వచ్చాను. ఇక జేమ్స్ మెక్‌కార్తీకి శిక్ష పడకూడదు."

"నేను చివరి రోజులకు దగ్గరవుతున్నాను. సంవత్సరాలుగా చక్కెర వ్యాధి ఉంది. మరో నెలపాటు బతికితే గొప్ప అంటాడు డాక్టర్. ఆ చావు ఏదో జైల్లో బదులు ఇంట్లో వస్తే సంతోషంగా ఉంటుంది."

హెూమ్స్ లేచి టేబుల్ దగ్గరకు వెళ్లాడు. కలం, కాగితంతో అక్కడ కూర్చున్నాడు. "జరిగిందంతా నిజంగా చెప్పండి. నేను కొంత నోట్ చేసుకుంటాను. దానిమీద మీరు సంతకం పెట్టండి. వాట్సన్ సాక్షి సంతకం చేస్తాడు. మెక్‌కార్తీని కాపాడడానికి నేను అవసరమయితే చివరిదశలో ఈ కాగితాన్ని వాడుకుంటాను. లేదంటే దీని సంగతి బయటకు రాదు" అన్నాడతను.

"ఇదే బాగుంది. కేసు ముగిసే వరకు నేను మిగులుతానా అన్నది ప్రశ్న. కనుక నాకు భయం లేదు. కానీ అమ్మాయికి ఎటువంటి షాక్ తగలకూడదు. ఉన్న విషయం మీకు తేటతెల్లంగా చెపుతాను. అదంత ఎక్కువగా ఉండదులెండి.

"ఈ చచ్చిన మనిషి మెక్‌కార్తీ గురించి మీకు తెలియదు. వాడొక నరరూప రాక్షసుడు. నన్ను నమ్మండి. అటువంటి మనుషుల నుంచి దేవుడు మిమ్మల్ని రక్షించాలి. ఇరవయి ఏళ్లుగా వాడి గుప్పిట్లో చిక్కి బతికాను. బతుకు బండలయింది. అసలు వాడికి ఎట్లా చిక్కానో ముందు చెపుతాను.

"అది అరవై దశకంలో గనులు తవ్వుతున్న కాలం. అప్పుడు నేను మంచి హుషారుగా, నిర్లక్ష్యంగా ఉండే కుర్రవాడిని. దేనికయినా సిద్ధంగా ఉండే వాడిని. చెడ్డ సహవాసంలో పడ్డాను. తాగుడు అలవాటయింది. దొంగల గుంపులో కూడా చేరాల్సి వచ్చింది. మొత్తం ఆరుగురం ఉండేవాళ్లం.

మొరటుగా, హాయిగా బతుకుతూ ఉండేవాళ్లం. గనుల దారిలో వచ్చేవారిని దోచుకుంటూ ఉండేవాళ్లం. అప్పట్లో నా పేరు బ్లాక్ జాక్ ఆఫ్ బలరాట్. బలరాట్ గ్యాంగ్ అనే పేరుతో మా గురించి ఇప్పటికీ అక్కడ చెప్పుకుంటారు.

"ఒక రోజున మెల్బోర్న్ నుంచి బంగారు ఉండే బండ్లు పోతున్నాయి. మేము వాటి కోసం కాపుకాసి దాడి చేశాము. ఆరుగురు ట్రూపర్‌లు, మేము ఆరుగురము ఉన్నాము. మొదటి దెబ్బతోనే నలుగురిని కిందపడేశాము. మాలో ముగ్గురు చచ్చారు. నేను వ్యాగన్ డ్రైవర్ తలకి తుపాకీ తగిలించి భయపెట్టాను. అదుగో అతనే ఈ మెక్‌కార్తీ. వాడిని అక్కడే చంపి ఉంటే బాగుండేది. ఎందుకో వదిలేశాను. వాడు తన క్రూరమయిన కళ్లతో నన్ను బాగా చూస్తున్నాడు. కలకాలం గుర్తుంచుకునే ప్రయత్నంలాగా. మేము బంగారంతో పారిపోయాము, ధనవంతులము అయ్యాము. గుట్టుచప్పుడు కాకుండా ఇంగ్లండ్‌కు జారుకున్నాము. అక్కడ నేను నాతోటి వారినుంచి తప్పించుకొని ప్రశాంతంగా, గౌరవంగా బతకసాగాను. ఇదిగో ఈ ఎస్టేట్ కొన్నాను. ఉన్న డబ్బుతో చేతనయిన మంచి పనులు చేయసాగాను. అది ప్రాయశ్చిత్తంగా భావించాను. నాకు పెళ్లయింది. కానీ నా భార్య చనిపోయింది. కూతురు ఆలిస్ మిగిలింది. చిన్నపాపగా ఉండగా కూడా ఆమె నన్ను చెయ్యి పట్టి మంచిదారిన నడిపించింది. ఒక్కమాటలో చెప్పాలంటే నేను పూర్తిగా మారిపోయాను. గత జీవితాన్ని మరచిపోయాను. అంతా సవ్యంగా ఉండగా మెక్‌కార్తీ ఎదుటకు వచ్చాడు.

"ఏదో పెట్టుబడి విషయంలో నేను నగరానికి వెళ్లాను. అక్కడ రీజెంట్ స్ట్రీట్‌లో వీడు ఎదురయ్యాడు. ఒంటిమీద దుస్తులు కూడా సరిగా లేవు.

" 'జాక్, నన్ను నీతో రానివ్వు. నాతోబాటు నా కొడుకు ఉన్నాడు. మమ్మల్ని నీతో ఉండనివ్వు. కాదన్నావనుకో, చట్టం ఉండనే ఉంది. పిలిస్తే పలికే పోలీసులూ ఉన్నారు.' అన్నాడతను నాచేతిని చల్లగా తగులుతూ.

"ఆ రకంగా వాళ్లు ఇక్కడకు వచ్చారు. వదిలించుకునే వీలులేదు. కిరాయి అంటూ లేకుండా నా స్థలాన్ని అనుభవించసాగారు. నాకు మనశ్శాంతి కరువయింది. ఎక్కడికి వెళితే అక్కడ అతని మోసం నిండిన ముఖం నాకు ఎదురయ్యేది. అమ్మాయి పెరుగుతున్న కొద్దీ పరిస్థితి మరింత దారుణ మయింది. నా గతం నన్ను భయపెడుతున్నదని అతనికి మరింత ధైర్యం అడిగినదంతా నేను ఇవ్వాలి. మాట్లాడకుండా ఇవ్వాలి. పొలం, ఇళ్లు, డబ్బు, ఇక చివరికి నేను ఇవ్వజాలనిది ఏదో కూడా అడిగాడు. నా కూతుర్ని అడిగాడు.

"అతని కొడుకు పెద్ద వాడయ్యాడు. నా కూతురు కూడా పెరిగింది. నాకు ఆరోగ్యం బాగోలేదని తెలుసు. ఇక ఆస్తిని మొత్తంగా చేజిక్కించుకునే పద్ధతి అతనికి అర్థమయింది. నేను మాత్రం కుదరదు అన్నాను. ఈ రెండు అంశాలు ఒకటి అయ్యేది లేదు. నాకు ఆ కుర్రవాడి మీద ఎటువంటి కోపమూ లేదు. కానీ అతని శరీరంలో రక్తం సంగతి వేరు. అది చాలు నాకు. అందుకే కాదన్నాను. మెక్‌కార్తీ నన్ను భయపెట్టాడు. ఏం చేస్తాడో చూద్దామని నా పట్టు. ఈ సంగతి తేల్చుకోవడానికే ఆ రోజు పూల్ దగ్గర కలవాలి అను కున్నాం.

"నేను అక్కడికి వెళ్లేసరికి అతను కొడుకుతో ఏదో మాట్లాడుతున్నాడు. నేను చుట్ట కాలుస్తూ అతని కోసం ఎదురు చూస్తున్నాను. కానీ కాలం గడిచిన కొద్దీ నాలోపల కసి పెరగసాగింది. నా కూతురిని పెళ్లి చేసుకోమని అతను కొడుకును మరీ బలవంత పెడుతున్నాడు. అమ్మాయి ఇష్టాయిష్టాల సంగతి అతనికి పట్టిలేదు. ఇదంతా చూస్తుంటే నాకు పిచ్చి ముదిరింది. దీన్ని ఎక్కడో తెగతెంపులు చేయాలి. నేను చావుకు దగ్గరపడ్డ మనిషిని. అయినా కాళ్లూ చేతులు బలంగా ఉన్నాయి. అట్లాగని నేను బతికి బాగుపడేది లేదు. నా కూతురు, నా జ్ఞాపకాలు ఏమవుతాయి? ఈ వెధవ నోటిని మూయగలిగితే అంతా సర్దుకుంటుంది. ఆ పనే చేశాను మిస్టర్ హోమ్స్. కావాలంటే మళ్లీ చేస్తాను. నేను పశ్చాత్తాపంతో బతుకుతున్నాను. నా కూతురు



మళ్లీ విషవలయంలో చిక్కుతుందంటే తప్పించడానికి నేను ఏమయినా చేస్తాను. వాడిని ఒక విషజంతువును చంపినంత కసిగా చంపేశాను. అరుపు విని కొడుకు వెనుకకు వచ్చాడు. నేను చెట్లలో దాగి ఉన్నాను. కానీ పడిపోయిన నా కోట్‌ను తిరిగి తెచ్చుకోవాలి. అయ్యా, అదీ జరిగిన సంగతి."

"మీ గురించి న్యాయనిర్ణయం చేయడం నా పనికాదు. కానీ ఎవరూ ఇటువంటి పరిస్థితుల్లో ఇరుక్కోకూడదని ప్రార్థిస్తాను." అన్నాడు హోమ్స్. ముసలతను స్టేట్‌మెంట్ మీద సంతకం చేశాడు.

"నా బాధా అదేనండి. ఇంతకూ మీరు ఏం చేయబోతున్నారు?"

"మీ పరిస్థితి కారణంగా, ఏమీ చెయ్యను. మీరు, చేసిన దానికి సంజాయిషీని ఇక్కడి కోర్టు కన్నా పెద్ద మరొక కోర్టులో చెప్పుకోవాల్సి ఉందని ఎరుగుదురు. మీ వాంగ్మూలాన్ని నేను దాచి ఉంచుతాను. మెక్‌కార్తీ కుర్రవాడికి శిక్ష పడిన పక్షంలో తప్ప దాన్ని వాడను. లేదంటే, ఈ కాగితం మరో మనిషి కంటపడదు. ఇక మీ రహస్యం మీరు ఉన్నా, పోయినా,

మాలోనే ఉండిపోతుంది.”

“ఇక సెలవు మరి. మీరు నాకు చివరి రోజుల్లో ప్రసాదించిన ప్రశాంతత, మీ చివరి రోజుల్లో మీకు తప్పకుండా అందుతుంది. సెలవు మరి.” కుంటుతూ, శరీరమంతా కదిలిపోతూ, తడబడుతూ అతను గదిలోనుంచి వెళ్లిపోయాడు.

“దేవుడు ఇటువంటి బలహీనులను ఎందుకు పరీక్షిస్తుంటాడు? ఇటువంటి పరిస్థితులు నేను ఎక్కడా కనివినీ ఉండలేదు. బ్యాక్స్టర్ అన్నాడే ‘దేవుడి దయవల్ల షెర్లక్ హెూమ్స్ ఇలా ఉన్నాడు’ అని అది నిజం.”

షెర్లక్ హెూమ్స్ అందించిన రకరకాల సూచనలు, సలహాల బలంతో జేమ్స్ మెక్కార్తీ నిర్దోషిగా బయటపడ్డాడు. మాతో మాట్లాడిన తరువాత ఏడు నెలలకు టర్నర్ చనిపోయాడు. అతను పోయాడు కానీ, అతని అమ్మాయి, ఈ అబ్బాయితో కలిసి హాయిగా బతికే అవకాశాలు కనబడుతున్నాయి. గతకాలపు నీలిమేఘాల సంగతి వాళ్లకు ఎంతమాత్రమూ తెలియదు.





5

# ది ఫైవ్ ఆరెంజ్ పిప్స్

షెర్లక్ హెూమ్స్ 1882 నుంచి 90 మధ్యన సాధించిన కేసుల గురించి వివరాలన్నీ నా దగ్గర ఉన్నాయి. వాటిని గమనిస్తూ ఉంటే చిత్ర విచిత్రమయిన విశేషాలు ముందుకు వస్తాయి. వాటిల్లో దేన్ని ఎంచుకోవాలి, దేన్ని వదలాలి అన్నది సమస్యే అవుతుంది. కొన్ని కేసులు వార్తాపత్రికల ద్వారా ఇప్పటికే అందరికీ తెలిసిపోయాయి. కొన్నింటి విషయంలో నా మిత్రుడు ప్రదర్శించిన గొప్ప చాకచక్యం నిజంగా బయటపడదు. నా నోట్స్‌లో ఆ వివరాలన్నీ ఉన్నాయి. కొన్ని కేసులు అతడిని కూడా తికమక పెట్టాయి. వాటి గురించి చెప్పడం మొదలు పెడితే అంతే ఉండదు. కొన్నింటిని కొంతవరకు మాత్రమే అతను విడదీయగలిగాడు. వాటిలో ఎక్కువగా ఊహలు, ఉజ్జాయింపులు లాంటి కుంటిబలంతోనే వ్యవహారం ముందుకు నడిచింది. మరి అతనికేమో అసలుసిసలయిన నిరూపణలంటే ఎంతో ఇష్టం. ఇలాంటి ఒక కేసు ఎన్నెన్నో వివరాలతో సిద్ధంగా ఉంది. అందులోని ఫలితాలు అందరినీ ఆశ్చర్యపరుస్తాయి. నిజానికి ఆ వివరాలను నిస్సందేహంగా బయటపెట్టడం ఎవరికీ వీలుకాదేమోగానీ, ఆ వ్యవహారం గురించి చెప్పాలని నాకు కోరికగా ఉంది.

87 సంవత్సరంలో వరుసపెట్టి మంచి ఆసక్తిగల కేసులు ఎన్నో

వచ్చాయి. వాటి వివరాలన్నీ నా రికార్డులలో ఉన్నాయి. ఈ పన్నెండు నెలల కాలంలో నేను రాసుకున్న శీర్షికలలో ద అడ్వెంచర్ ఆఫ్ ద పారడోల్ ఛేంబర్, అమెచ్యూర్ మెండికంట్ సొసైటీ లాంటివి ఆసక్తికరమయినవి. ఈ సొసైటీ ఒక నేలమాలిగలో ఫర్నిచర్‌ల వేర్‌హౌస్‌ని నిర్వహించేది. ఇక ఉఫా దీవులలోని గ్రైస్ పాటర్సన్స్ అడ్వెంచర్ ఎంతో ప్రత్యేకమయినది. చివరిది కాంబెర్‌వెల్ విషప్రయోగం వ్యవహారం. ఈ చివరి కేసులో షెర్లక్ హెూమ్స్ మృతుడి చేతి గడియారాన్ని గమనించి దానికి సరిగ్గా రెండు గంటలకు ముందే దానికి కీ ఇచ్చారని, కనుక హతుడు ఆ రెండు గంటల సమయంలోనే నిద్రకు ఉపక్రమించాడని చెప్పాడు. కేసును విడదీయడంలో ఈ విషయం బాగా ఉపకరించింది. ఇవన్నీ ముందు ఎప్పుడో చెపుతాను కానీ, నేను ఇప్పుడు రాయదల్చుకున్న కేసులాంటిది మాత్రం అంత సులభంగా ఎక్కడా కనిపించదు. ఇందులో మరెక్కడాలేని రకం విషయాలున్నాయి.

అవి సెప్టెంబర్ నెల రెండోభాగంలోని రోజులు. పెనుగాలులు భయంకరంగా వీస్తున్నాయి. దినమంతా గాలి అరుస్తూనే ఉంది. వర్షం కిటికీలను కొడుతూనే ఉంది. చివరకు మనిషి తయారు చేసిన ఈ లండన్ నగరంలో కూడా బతుకుసాగే తీరు గురించి అందరికీ ఆలోచనలు మొదలయినయి. ప్రకృతి అంటూ చాలాబలం గలది ఒకటి ఉందని, అందులోని పంచభూతాలు మనలను తాకుతాయని, అందరికీ తోచసాగింది. వాటి ముందు బోనులోని మృగంలాగా మనం గిలగిలలాడతామని అందరూ అనుకున్నారు. సాయంత్రం దగ్గర పడింది. తుఫాను మరింత ఉధృతమయింది. గాలి, చిమ్నీలో చిక్కుకున్న పిల్లవాడిలాగా అరుస్తూ, ఏడుస్తూ ఉంది. షెర్లక్ హెూమ్స్ ఫైర్ ప్లేస్ ముందు ఒకపక్కన కూర్చుని నేర పరిశోధన రికార్డులను లెక్క చూచుకుంటున్నాడు. నేను మరొకపక్కన కూర్చుని క్లార్క్ రస్సెల్ రాసిన సముద్రపు కథలను చదువుతున్నాను. బయటి గాలి కథలోని గాలితో కలిసి పోతున్నది. బయటి వర్షం కథలోని సముద్ర తరంగాలలాగా కనిపిస్తున్నది.

నా భార్య వాళ్ల అమ్మవాళ్లింటికి వెళ్లింది. కనుక కొన్ని రోజుల పాటు నేను మళ్లీ బేకర్స్ స్ట్రీట్‌లోని నా పాత చిరునామాలోనే బతుకుతున్నాను.

"అదుగో బెల్ మోగింది తప్పకుండా. ఇంత రాత్రి ఎవరయి ఉంటారు. నీ మిత్రులను ఎవరినన్నా పిలిచావా?" నా మిత్రుని వేపు చూస్తూ నేను అన్నాను.

"నీవు తప్ప నాకు మిత్రులెవరూ లేరు. విజిటర్స్ అంటే నాకు నచ్చదు" అతను జవాబిచ్చాడు.

"క్లయంట్ అయి ఉండవచ్చు మరి."

"అదే నిజమయితే సీరియస్ కేస్ అయి ఉంటుంది. ఇటువంటి రోజున, ఈ సమయంలో ఒక మనిషి బయటకు వచ్చాడంటే తప్పకుండా సీరియస్ వ్యవహారం అయి ఉంటుంది. కానీ వచ్చింది ఇల్లుగల వారి మనిషి ఎవర న్నానేమో?"

షెర్లక్ హెూమ్స్ ఆలోచన ఈసారి తప్పింది. ఎందుకంటే కొంత సేపట్లోనే మెట్లమీద చప్పుడు, తరువాత తలుపు తట్టడం జరిగాయి. అతను తన పొడుగాటి చేతిని చాచి దీపాన్ని తననుంచి దూరంగా ఖాళీ కుర్చీవేపు జరిపాడు. వచ్చిన మనిషి అందులో కూచుంటాడని అర్థం. "రండి, లోపలికి" అన్నాడతను.

వచ్చిన మనిషి యువకుడు. మరీ ఎక్కువయితే ఇరవయిరెండు సంవత్సరాలు ఉంటాయి. చక్కగా తయారయ్యాడు. మంచి దుస్తులు వేసు కున్నాడు. అతని తీరులో ఒక మృదుత్వం ఉంది. చేతిలో పట్టుకున్న గొడుగు నించి నీళ్లు కారుతున్నాయి. వేసుకున్న వాటర్‌ప్రూఫ్ కూడా బయటి వాతా వరణం గురించి చెపుతున్నది. దీపం వెలుతురులో అతను, తనను తాను ఆత్రంగా చూచుకున్నాడు. అతని ముఖం పాలిపోయి ఉండడం, కళ్లు బరు వుగా ఉండడం నేను గమనించాను. అతనేదో గొప్ప సమస్యలో ఉన్నాడు.



"నేను మీకు క్షమాపణలు చెప్పు కోవాలి. మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్నాను. అందమయిన మీ గదిలోకి బయటి తుఫాను, వాన తాలూకు కొంతభాగాన్ని నేను తెచ్చానని నా భయం" అన్నాడతను బంగారు కళ్లజోడును పైకి ఎత్తుతు.

''మీ కోటు, గొడుగు నాకివ్వండి. వాటిని ఇక్కడ పెడతాను. ఆరుతూ ఉంటాయి. మీరు ఈశాన్య భాగం నుంచి వచ్చారు కదూ'' అన్నాడు హెూమ్స్.

"అవును, హెూర్షామ్ నుంచి."

"మీ బూట్స్ చివరన ఉన్న మట్టి, సుద్ద చూస్తే సంగతి తెలిసిపోయింది."

"నేను మీ సలహా కోసం వచ్చాను."

"అది సులభంగానే అందుతుంది."

"మరి సహాయం."

"అది అంత సులభం కాదేమో."

"మిస్టర్ హెూమ్స్, మీ గురించి విన్నాను. మేజర్ ప్రెండర్‌గాస్ట్ గారికి టాంకర్‌విల్ క్లబ్ వ్యవహారంలో మీరు చేసిన సాయం గురించి ఆయన ఎంతో చెప్పారు."

"అవునవును, పేకాటలో అతను మోసం చేస్తున్నాడని అన్యాయంగా

నింద వేశారు.”

“మీరు ఎటువంటి చిక్కునయినా విడదీస్తారని ఆయన చెప్పారు.”

“కొంచెం ఎక్కువే చెప్పారాయన.”

“మీకు ఓటమే లేదన్నారు.”

“నేను నాలుగుసార్లు ఓడిపోయాను. మూడుసార్లు మగవాళ్ల చేతిలో, ఒకసారి ఆడమనిషి చేతిలో.”

“మీరు సాధించిన విజయాల ముందు ఆ సంఖ్య ఎంతటిది?”

“నేను మామూలుగా విజయం సాధిస్తానన్నది మాత్రం నిజమే.”

“నా విషయంలో కూడా అంతే జరగవచ్చు.”

“అసలు ముందు కుర్చీ లాక్కుని మంటకు దగ్గరగా కూచోండి. అసలు మీ కేసు వివరాలు చెప్పండి.”

“ఇది అంత మామూలు వ్యవహారం కాదు.”

“నా దగ్గరకు వచ్చేవి ఏవీ మామూలువి కావు. అప్పీల్ కోర్టులలో నేనే చివరివాడిని.”

“అయినా నాదొక ప్రశ్న. మీ అనుభవంలో ఇంత గూఢంగా వరుసపెట్టి మా కుటుంబంలో జరిగిన సంఘటనల వంటివి మీకు ఎక్కడయినా ఎదురయినయా అని.”

“మీరు నాకు నిండా ఆసక్తి కలిగిస్తున్నారు. మొదటి నుంచి జరిగిన వివరాలను, నిజాలను చెప్పండి. నాకు ముఖ్యం అనిపించిన వాటి గురించి తరువాత నేను అడుగుతాను.”

యువకుడు తన కుర్చీని ముందుకు లాక్కున్నాడు. కాళ్లను మంటవేపు చాస్తూ చెప్పడం మొదలు పెట్టాడు.

“నా పేరు జాన్ ఓపెన్‌షా. అయితే నా సొంత వ్యవహారాలకూ ఈ

జరుగుతున్న దానికి అంత సంబంధం లేదు. ఇది వంశగతంగా వస్తున్న సంగతి. నిజాలను గురించి మీకు ఆలోచన రావాలంటే నేను కొంచెం వెనకకు వెళ్లి కథను మొదలు పెట్టాలి.

"మా తాతగారికి ఇద్దరు కుమారులని మీకు తెలియవలసి ఉంది. ఒకరు మా అంకుల్ ఎలియాస్, తరువాత నా తండ్రి జోసెఫ్. మా నాన్నకు కోవెంట్రీలో ఒక ఫ్యాక్టరీ ఉండేది. బైసికిల్‌ను కనుగొన్న తరువాత దాన్ని ఆయన విస్తరించాడు. ఓపెన్‌షా అన్‌బ్రేకబుల్ టయర్లకు పేటెంట్ తీసు కున్నాడు. వ్యాపారం బాగా పెరిగింది. తరువాత దాన్ని అమ్మేసి ఆయన హాయిగా రిటైర్ అయ్యారు.

"మా అంకుల్ ఎలియాస్ అమెరికాకు వెళ్లిపోయారు. అక్కడ ఫ్లోరిడాలో చెట్ల పెంపకం చేపట్టారు. అది బాగా జరిగిందని చెప్పేవారు. యుద్ధం సమయంలో ఆయన జాక్సన్ ఆర్మీలో పని చేశారు. తరువాత హుడ్‌కాలన్‌లో కల్నల్ స్థాయికి ఎదిగారు. లీ తన సేనలను లేడౌన్ చేసిన తరువాత అంకుల్ తిరిగి చెట్ల పెంపకంలోకి వచ్చేశారు. అట్లా మూడు నాలుగు సంవత్సరాలు ఉన్నారు. 1869 ప్రాంతంలో ఆయన తిరిగి యూరప్ వచ్చి ససెక్స్‌లో హొర్షామ్ ప్రాంతంలో చిన్న ఎస్టేట్ కొన్నారు. స్టేట్స్‌లో ఉండగా ఆయన బాగా సంపాదించారు. నీగ్రోల పట్ల ఏవగింపు కారణంగా, రిపబ్లికన్ పాలసీలు నచ్చక ఆయన తిరిగి వచ్చారు. ఆయన చాలా విచిత్రమయిన మనిషి, కోపిష్టి. కోపం వచ్చిందంటే నోటికి అడ్డు ఉండేది కాదు. హొర్షామ్‌లో బ్రతికినంత కాలంలోను ఆయన ఎప్పుడన్నా నగరంలోకి వచ్చారా అన్నది అనుమానమే. ఆయనకు ఒక తోట, ఆ పక్కనే రెండు మూడు పొలాలు ఉండేవి. ఆయన వాటిలోనే తిరిగుతుండే వారు. నిజానికి కొన్ని వారాల పాటు గది విడిచి బయటకు వచ్చేవారే కాదు. బాగా బ్రాండీ తాగేవారు. ఎక్కువగా స్మోకింగ్ కూడా. ఆయనకు పదిమందిలో తిరగడం, మిత్రులు నచ్చరు. చివరికి సొంత సోదరుడు కూడా.

“అయితే నా విషయం వేరు. ఆయన ఎందుకో నన్ను ఇష్టపడ్డారు. మొట్టమొదటిసారి ఆయన నన్ను చూచినప్పుడు నేను పన్నెండేళ్ల వాడిని. అంటే అది 1878 సంవత్సరం. ఆయన ఇంగ్లాండ్‌కు వచ్చిన తరువాత ఎనిమిది తొమ్మిది సంవత్సరాలు అయిందన్నమాట. ఆయన మా నాన్న గారిని అడుక్కుని నన్ను తన దగ్గర ఉండనిమ్మన్నారు. నామీద ఎంతో దయతో ఉండేవారు. మామూలు పరిస్థితిలో ఉన్నప్పుడు నాతో ఆయన బాక్‌గామన్, డ్రాట్స్ లాంటి ఆటలు ఆడేవారు. ఇంట్లో పనిమనుషలయినా బయట వ్యాపారం వారయినా ఆయన ప్రతినిధిగా నేనే మాట్లాడాలి. పదహారు సంవత్సరాల వయస్సు వచ్చేసరికి నేను ఇంచుమించు ఇంటికి యజమానిని అయ్యాను. తాళంచెవులు అన్నీ నా దగ్గరే ఉండేవి. నా ఇష్టం వచ్చిన చోటికి వెళ్లగలిగే వాడిని. అయితే ఆయనను మాత్రం చికాకు పెట్టకూడదు. ఒక్కటి మాత్రం చెప్పుకోవలసి ఉంది. ఆయనకు ఒక సింగిల్ రూమ్, మరో లంబర్ రూమ్ ఉండేవి. ఈ రెండవ గది ఎప్పుడూ తాళం పెట్టి ఉండేది. అందులోకి నన్నుగానీ, మరెవ్వరినిగానీ ఆయన వెళ్లనిచ్చే వారు కాదు. కుర్రవాడిని కనుక కుతూహలంగా నేను తాళంచెవి రంధ్రంలోనుంచి ఆ గదిలోకి తొంగి చూచాను. అందులో పాత పెట్టెలు, మరెవో మూటలు తప్ప ఇంకేమీ కనిపించలేదు.

“ఒకరోజు, 1883 మార్చ్ నెలలో, విదేశీ స్టాంపులు ఉన్న ఒక ఉత్తరం కల్నల్‌గారి ప్లేట్‌తోబాటు బల్లమీద ఉంది. ఆయనకు ఉత్తరాలు రావడం అరుదు. బిల్లులన్నీ నేరుగా చెల్లించే వాళ్లం. ఇక ఆయనకు నేస్తాలెవరూ లేరు. “భారతదేశం నుంచి! పాండిచ్చేరి పోస్ట్ మార్క్!! ఏమయి ఉంటుంది.” అన్నారాయన ఆత్రంగా దాన్ని విప్పుతూ. అందులోంచి ఆరిపోయిన నారింజ తొనలు అయిదు జారికింద ఆయన ప్లేటుమీద పడ్డాయి. అది చూచి నేను నవ్వసాగాను. కానీ ఆయన ముఖం చూస్తే నా నవ్వు పెదవుల మీదే ఆగి పోయింది. ఆయన నోరు వెళ్లబెట్టారు. కళ్లు పొడుచుకు వచ్చాయి. చర్మం

రంగు మారింది. చేతులు వణుకుతుండగా కవర్ వేపు చూశారు. “కె.కె.కె” కీచుగా చదివారాయన. “దేవుడా, దేవుడా, నా పాపం పండినట్టుంది!” అన్నారాయన.

“ఏం జరిగింది అంకుల్?” నేను అడిగాను.

“చావు మూడింది” అన్నారాయన. లేచి తన గదిలోకి వెళ్లిపోయారు. నాకు భయం మొదలయింది. ఎన్వలోప్‌ను చేతిలోకి తీసుకున్నాను. మడత లోపల ఎర్రని సిరాతో, జిగురుకింద కె అనే అక్షరం మూడుసార్లు రాసి ఉంది. కవర్‌లో ఆ నారింజ తొనలు తప్ప మరేమీ లేవు. దాన్ని చూచి పట్ట రాని భయం ఎందుకు కలిగింది? టేబుల్ నుంచి బయలుదేరి మెట్లు ఎక్కు తుండగా ఆయన చేతిలో కిలుము పట్టిన ఒక తాళంచెవితో కిందకు వస్తూ ఉన్నారు. అది బహుశా అటకమీద గదిది అయి ఉంటుంది. ఆయన మరో చేతిలో చిన్న బ్రాస్ పెట్టె ఒకటి ఉంది. అది క్యాష్ బాక్స్‌లాగా ఉంది.

“వాళ్ల ఇష్టం వచ్చినట్టు చేయినీ. నేను ఎదుర్కొంటాను” అన్నారాయన కోపంగా. “నా గదిలో కాస్త మంట ఏర్పాటు చేయమని మేరీకి చెప్పు. మనిషిని పంపించి హెూర్షామ్ లాయర్‌గారిని రప్పించు.”

“ఆయన చెప్పినట్టే చేశాను. లాయర్ వచ్చారు. ఆయనను గదిలోకి తీసుకురమ్మన్నారు. మంట బాగా వెలుగుతున్నది. అందులో కాలిన కాగితాల బూడిద ఎగురుతున్నది. బ్రాస్ బాక్స్ ఖాళీగా ఉండడం కనిపించింది. అందులోకి చూస్తే నాకు పట్టరాని ఆశ్చర్యం కలిగింది. దాని మూత లోపల కె అనే అక్షరం మూడుసార్లు అచ్చువేసి ఉంది. అచ్చంగా పొద్దున చూచిన కవర్‌లోలాగే.

“ ‘జాన్, నా వీలునామా సంగతి చూడు. నా మొత్తం ఎస్టేట్‌ను, లాభనష్టాలతో సహా మా తమ్ముడు అంటే మీ తండ్రికి రాసి ఇస్తున్నాను. సమయం వచ్చినప్పుడు, నిస్సందేహంగా, అది నీదే అవుతుంది. నీవు దాన్ని ప్రశాంతంగా అనుభవించగలిగితే చాలా బాగుంటుంది. అట్లా జరగని

పక్షంలో, బాబూ, నా సలహా విను. అప్పుడు సంగతిని నీ శత్రువులకు వదిలెయ్యి. ఇది రెండువేపుల వాడిగల కత్తి. దీన్ని నీకివ్వడం నాకూ కష్టంగానే ఉంది. ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేను. లాయర్‌గారు చూపిన చోట నీవు కూడా సంతకాలు చెయ్యి.'

"చెప్పినట్లు నేను సంతకాలు చేశాను. కాగితాలను లాయర్ తనతో తీసుకువెళ్లారు. ఆ ఒక్క సంఘటనతో, మీరనుకున్నట్లే నామీద ఎంత ప్రభావం పడింది. దాన్ని గురించి ఎంతో ఆలోచించాను. నాకు మాత్రం ఏమీ తోచలేదు. ఎందుకోగానీ, భయం అన్న భావనను పక్కన పెట్టలేకపోయాను. వారాలు గడుస్తున్న కొద్దీ అది కొంచెం తగ్గింది. మా జీవితాలను ప్రభావితం చేయగలిగిన సంఘటన మరేదీ జరగలేదు. అంకుల్‌లో నేను ఎంతో మార్పును గమనించాను. అంతకుముందు కంటే ఎక్కువగా తాగుతున్నారు. ఎవరితోనూ కలవడం లేదు. ఎక్కువ కాలం తలుపులు మూసి లోపలినుంచి గడియ పెట్టుకుని గడుపుతున్నారు. అప్పుడప్పుడు తాగుడు ప్రభావంతో బయటకు వచ్చి, రివాల్వర్ చేతిలో పట్టుకుని ఇంటిలోను, తోటలోను రభసగా తిరుగుతారు. ఎవరికీ భయపడను అంటూ కేకలు వేస్తారు. తాను గొర్రెను కానని, తనను ఎవ్వరూ, మనిషిగానీ, దెయ్యంగానీ మూలకు నెట్టజాలరని అనే వాడాయన. ఆ మూడ్ మారగానే మళ్లీ ఆయన గదిలోకి వెళ్లి తలుపు పెట్టుకుని దానికి రకరకాల అడ్డంకులు కూడా ఏర్పాటు చేసుకుంటారు. ఆయన మనస్సులో మూలన భయమేదో నక్కి ఉంది. అటువంటి సంద ర్భాలలో ఆయన ముఖం మీద, చల్లని రోజుల్లో కూడా చెమట పట్టడం నేను గమనించాను.

"ఇక సంగతి చివరికి రావాలంటే, మిస్టర్ హోమ్స్ నేను మీ ఓపికను పరీక్షించదలుచుకోలేదు. ఒకానొక నాడు రాత్రి ఆయన మళ్లీ ఉధృతంగా బయటకు వచ్చారు. అందులోనుంచి ఆయన తిరిగి బయటపడలేదు. వెతు కుతూ బయలుదేరిన మాకు, తోట పక్కన నాచుపట్టిన ఒక నీటి మడుగు



దగ్గర, ఆయన బోర్లాపడి ఉండడం కనిపించింది. అక్కడ దాడి జరిగిన గుర్తులేవీ లేవు. మడుగులో నీళ్లు రెండు అడుగుల కన్నా ఎక్కువ లోతు లేవు. ఆయన వ్యవహారం తెలిసిన జూరీ వాళ్లు, ఆత్మహత్య అని తేల్చారు. నాకు మాత్రం చావు గురించి ఆయనకున్న భావాలు తెలుసు. చావ డానికి ఆయన కొంచెం ఎక్కువే కష్టపడి ఉంటారు అనిపించింది. అంతా గడిచిపోయింది. ఎస్టేట్ నాన్నగారి చేతికి వచ్చింది. పద్నాలుగువేల పౌండ్లు ఉన్న బ్యాంకు ఖాతా కూడా చేజిక్కింది."

"ఒక్క నిమిషం." హోమ్స్ అడ్డు వచ్చాడు. మీరు చెప్పేదంతా చాలా ప్రత్యేకంగా ఉందని నేను చూడగలను. మీ అంకుల్‌కి ఉత్తరం వచ్చిన తేదీ, అలాగే ఆయన చనిపోయిన తేదీ చెప్పగలరా?" అన్నాడు.

"ఉత్తరం 1883 మార్చ్ 10న వచ్చింది. ఏడు వారాల తరువాత అంటే మే 2న ఆయన పోయారు."

"సరే. ఇక కొనసాగించండి."

"నాన్నగారు హొర్షామ్ ఆస్తిని చేతికి తీసుకున్నారు. నేను చెప్పిన మీదట అటక గదిని జాగ్రత్తగా పరిశీలించాము. అక్కడ మాకు బ్రాస్ బాక్స్ కనిపించింది. అందులోని కాగితాలు మాత్రం కాల్చివేయబడ్డాయని తెలుసు. పెట్టె లోపల ఒక కాగితం లేబుల్ మీద కె.కె.కె అని రాసి ఉంది. దానికింద ఉత్తరాలు, రసీదులు, మెమోరాండా ఇంకా ఒక రిజిస్టర్ అని కూడా రాసి

ఉంది. అంటే కల్నల్ ఓపెన్‌షాగారు వీటన్నింటినీ కాల్చివేశారని మాకు అర్థమయింది. ఇక గదిలో గమనించదగ్గ వస్తువులు మరేవీ లేవు. బోలెడన్ని కాగితాలు, నోటు పుస్తకాలు చిందరవందరగా పడి ఉన్నాయి. వాటిలో పెదనాన్నగారి అమెరికా జీవితం వివరాలు ఉన్నాయి. సైన్యంలో ఆయనకు ధైర్యంగల సైనికుడిగా పేరు ఉండేదని అర్థమయింది. మరికొన్ని కాగితాలు సదరన్ స్టేట్స్‌లో వ్యవహారానికి సంబంధించినవి. అప్పట్లో ఆయన రాజకీయంలో కూడా వేలుపెట్టిన వివరాలు కనిపించాయి.

"సరే, 84 మొదట్లోనే నాన్న కూడా హెూర్షామ్‌లో ఉండిపోవడానికి వచ్చారు. జనవరి 85 వరకు అంతబాగానే గడిచింది. కొత్త సంవత్సరం తరువాత నాలుగు నాళ్లకు ఆ ఉదయాన నాన్న భోజనం బల్లదగ్గర కూర్చుని పెద్ద కేక వేయడం వినిపించింది. ఆయన ఒక చేతిలో తెరిచిన ఎన్వలోప్, మరొక చేతిలో అయిదు ఎండిన నారింజతొనలు ఉన్నాయి. నేను అంతకు ముందు చెప్పిన వివరాలను విని ఆయన గేలి చేశారు. ఇప్పుడు మాత్రం చాలా భయంగాను, తికమకగాను కనిపించారు.

" 'జాన్, ఏమిటిదంతా' అనుమానంగా అడిగారాయన.

"నా గుండె ఆగినంత పనయింది. 'కె.కె.కె.' అన్నాను.

"ఆయన కవర్‌లోకి తొంగిచూచి 'అవును అక్షరాలు ఉన్నాయి. మరేదో కూడా రాసి ఉంది.' అన్నారు.

" 'కాగితాలను సన్ డయల్ మీద పెట్టండి' అని రాసి ఉండడం నేను గమనించాను. అదే చది వాను.

" 'ఏం కాగితాలు? ఏం సన్ డయల్?' నాన్న అడిగారు.

" 'తోటలో సన్ డయల్ ఉంది. మరిం కెక్కడా లేదు. ఇక కాగితాలంటే పెదనాన్న కాల్చినవి అనుకుంటాను.'

" 'ఓహెూ! ఇది నాగరిక ప్రపంచమేనా? ఏమిటి ఈ పిచ్చి వ్యవహారం?



ఇంతకూ ఉత్తరం ఎక్కడి నుంచి వచ్చింది?' అడిగారాయన ధైర్యం కూడ గట్టుకుంటూ.

" 'డుండీ నుంచి' పోస్ట్ మార్క్ చూచి నేను చెప్పాను.

" 'అంతా ఏదో ప్రాక్టికల్ జోక్‌లాగా ఉంది. సన్ డయల్ ఏమిటి, కాగితాలు ఏమిటి, నాకేమీ తెలియదు. ఇదంతా నేను పట్టించుకోను.' అన్నా రాయన.

" 'తప్పకుండా పోలీసులతో మాట్లాడాలి' నేను అన్నాను.

" 'అందరూ నవ్వడానికా? అదంతా ఏమీ అవసరం లేదు'

" 'ఆ పనేదో నేనే చేస్తాను.'

" 'వద్దంటున్నాను. ఈ చిన్న సంగతి గురించి గోల అవసరం లేదు.'

"ఆయనతో వాదించి లాభం లేదు. చాలా పట్టుదల మనిషి. నా మనస్సులో మాత్రం అనుమానాలు నిండుకున్నాయి.

"ఉత్తరం వచ్చిన తరువాత మూడవనాడు నాన్న ఆయన మిత్రులు, మేజర్ ఫ్రీబాడీ గారిని కలవడానికి బయటకు వెళ్లారు. అలా వెళ్లడమే మంచిదనిపించింది నాకు. ఇంటిలోనే అపాయం ఉన్నట్టుంది. కానీ నా అభిప్రాయం తప్పని తలిసింది. రెండు రోజులు ఆయన కనిపించలేదు. కానీ ఒక టెలిగ్రామ్ వచ్చింది. నాన్నగారు ఒక సుద్దగుంటలో పడిపోయారని, స్మారకం లేకుండా ఉన్నారని తలకు దెబ్బలు తగిలాయని, మేజర్‌గారి నుంచి

టెలిగ్రామ్ వచ్చింది. నేను ఆదరాబాదరాగా అక్కడికి వెళ్లాను. నాన్నగారు మళ్లీ కోలుకోకుండానే గతించారు. ఒక సాయంత్రం మసక వెలుగులో, కొత్తచోట ఆయన తిరుగుతూ కంచె ఏదీలేని సుద్దగుంటలోకి జారిపడ్డారని, కనుక ప్రమాదవశాత్తూ మరణించారని, అక్కడ తేల్చారు. నేను చాలా జాగ్రత్తగానే వివరాలను పరీక్షించాను. హత్య అని చెప్పడానికి ఏ ఆధారమూ దొరకలేదు. దాడి జరిగిన జాడలేవీ లేవు. కాలిగుర్తులు లేవు. చుట్టుపక్కల కొత్త వాళ్లెవ్వరూ కనిపించలేదు. అయినా సరే నా మనస్సులో ఏదో సదేహం మిగిలి ఉందని మీకు నేను చెప్పనవసరం లేదు. మా చుట్టూ ఏదో పెద్ద పథకం బిగుసుకుంటున్నదన్న భావన నాకు ఉంది.

"ఆ రకంగా ఆస్తి మొత్తం నా చేతికి వచ్చింది. నీవు దాన్ని అమ్మి ఉండవచ్చుగదా అని మీరు నన్ను అడగవచ్చు. జరిగిన సంఘటనలకు పెదనాన్నగారి గతజీవితంతో సంబంధం ఉంది. కనుక వచ్చే ఆపద ఏ ఇంట్లో ఉన్నా రావచ్చు, అని నా జవాబు.

"పాపం, నాన్నగారు పోయింది 85 జనవరిలో. అంటే రెండు సంవత్సరాల ఎనిమిది మాసాలు గడిచాయి. ఇంతకాలమూ నేను హోర్షామ్‌లో సుఖంగా బతుకుతున్నాను. ఆ శాపమేదో కుటుంబం నుంచి పక్కకు పోయిందని, నాన్న తరంతోనే ముగిసిందని నేను అనుకోసాగాను. కొంచెం తొందరగానే ఈ ఆలోచనలోకి వచ్చినట్టున్నాను. ఎందుకంటే, మొన్నటి ఉదయం నా తండ్రులకు తగిలిన దెబ్బే నాకు కూడా తగిలింది."

యువకుడు తన వెయిస్ట్ కోట్ జేబులోనుంచి నలిగిన ఒక ఎన్వలోప్‌ను తీశాడు. అందులోనుంచి అయిదు ఎండిన నారింజ తొనలను టేబుల్‌మీదికి జార్చాడు.

"ఇదేనండీ ఎన్వలోప్. లండన్– తూర్పు డివిజన్ పోస్ట్‌మార్క్ ఉంది. నాన్నగారికి వచ్చిన ఉత్తరంలో లాగే కవర్ లోపల 'కె.కె.కె' అక్షరాలు, 'కాగితాలను సన్ డయల్ మీద పెట్టండి' అన్న సందేశమూ ఉన్నాయి."

"మీరేం చేశారు?" అడిగాడు హోమ్స్.

"ఏమీ లేదు"

"ఏమీ లేదా?"

"నిజం చెప్పాలంటే, ఎంతో నిస్సహాయుడిగా ఫీలయ్యాను. పాము తన మీదకు దాడి చేస్తుంటే కుందేలుకు కలిగినలాంటి భయం. ఏదో పెద్ద ఆపద నామీదకు చెప్పకుండా ముంచుకు వస్తున్న భావన." ముఖం చేతుల్లో దాచుకుంటూ అన్నాడు యువకుడు.

"తప్పు, తప్పు, బాబూ, మీరేదో చెయ్యాలి. మీరు పట్టించుకోవడం లేదు. గుండె బలం మాత్రమే మిమ్ము కాపాడుతుంది. భయపడుతూ కూచునే సమయం కాదిది." గట్టిగా అన్నాడు షెర్లక్ హోమ్స్.

"పోలీసులను కలిశాను."

"అవునా!"



"వాళ్లు నా కథ విని నవ్వారు. వచ్చిన ఉత్తరాలన్నీ సరదాకు రాసినవని, గతించిన వాళ్ల మరణాలు ప్రమాద కారణంగా జరిగాయని, రెంటి మధ్యన ఎటువంటి సంబంధమూ లేదని వాళ్లు అభిప్రాయ పడ్డారు."

హోమ్స్ పిడికిలి బిగించి చెయ్యి ఎత్తి గాలిలో ఆడించాడు. "అర్ధంలేని మొండి తనం?" గట్టిగా అన్నాడతను.

"పోతే, వాళ్లు నాకు కాపలాగా ఒక పోలీస్‌ను పంపించారు. అతను కొంతకాలం నాతోనే ఉంటాడు."

"ఇప్పుడు మరి అతను మీతో వచ్చాడా?"

"లేదు. అతనికి ఇంటిలో మాత్రమే కాపలా ఉండమని చెప్పారు."

హోమ్స్ మళ్లీ ఇంతకుముందులాగే చెయ్యి కదిలించాడు.

"మీరు ఇప్పుడు ఎందుకు వచ్చినట్టు? అదిపోతే ఇంతకుముందే ఎందుకు రాలేదు?"

"నాకు తెలియదు, ఇవాళే నా కష్టాల గురించి మేజర్ ప్రెండర్‌గాస్ట్‌తో మాట్లాడాను. మిమ్మల్ని కలవమని ఆయన నాకు సలహా ఇచ్చాడు."

"ఉత్తరం వచ్చి నిజానికి రెండు దినాలయింది. దీన్ని గురించి ఇప్పటికే ఏదో చేసి ఉండవలసింది. మాకు చెప్పిన వాటిని మించి ఇంకే రకమయిన సాక్ష్యాలు లేవని అనుకుంటున్నాను. సాయం చేయగల వివరాలు మరేవయినా ఉన్నాయా?"

"ఒక్క సంగతి ఉంది" అన్నాడు జాన్ ఓపెన్‌షా. కోట్ జేబుల్లో వెతికి రంగు వెలిసిన నీలి కాగితాన్ని బయటకు తీసి బల్లమీద పెట్టాడు. "పెదనాన్నగారు కాగితాలను కాల్చిన తరువాత నేను గమనించినట్టు, ఆ కాగితాలు ఈ రంగులోనే ఉన్నట్టు బాగా గుర్తుంది. ఈ ఒక్క కాగితం నాకు అక్కడే దొరికింది. అంటే ఇది కూడా వాటిల్లో ఒకటి, గాలిలో ఎగిరి కాలకుండా బయట పడిందని అనుకుంటున్నాను. దీనిమీద తొనల గురించి తప్ప మరేమీ రాసిలేదు. ఇది ఒక వ్యక్తి డయరీలో కాగితంలాగా కనబడుతున్నది. రాత పెదనాన్నగారిదేనని చెప్పగలను."

హోమ్స్ దీపాన్ని దగ్గరగా జరిపాడు. ఇద్దరమూ వంగి కాగితాన్ని పరిశీలించాము. అది ఒక నోటు పుస్తకంలోనుంచి చించిన కాగితం. పై అంచున 'మార్చ్, 1869' అని రాసి ఉంది. కింద కొన్ని పొడిమాటలు రాసి

ఉన్నాయి.

*నాల్గవ తేదీ : హడ్సన్ వచ్చాడు. అదే పాత ప్లాట్‌ఫామ్.*

*ఏడవ తేదీ : తొనలను పారమోర్‌లోని మెక్‌కాలీకి, సెయింట్ అగస్టీన్‌లోని జాన్ స్వెయిన్‌లకు పంపించాము.*

*తొమ్మిదవ తేదీ : మెక్‌కాలీ క్లియర్డ్.*

*పదవ తేదీ : జాన్ స్వెయిన్ క్లియర్డ్.*

*పన్నెండవ తేదీ : పారమోర్ వెళ్లాము. అంతా బాగుంది.*

"థాంక్యూ" అన్నాడు హోమ్స్. కాగితాన్ని మడతపెట్టి యువకుడి చేతికి ఇచ్చాడు. "ఇక మీరు ఒక్క క్షణం కూడా ఆలస్యం చెయ్యకూడదు. మనకు ఇప్పుడు చర్చించే సమయం కూడా లేదు. మీరు వెంటనే ఇంటికి వెళ్లి పనిలోకి దూకాలి." అన్నాడతను.

"ఏం చెయ్యమంటారు?"

"చెయ్యవలసింది ఒక్కటే మిగిలింది. అదేదో వెంటనే చెయ్యాలి. మీరు మాకు చూపించిన ఈ కాగితం ముక్కను, అంతకుముందు వర్ణించిన బ్రాస్‌బాక్స్‌లో పెట్టాలి. మిగతా కాగితాలను మీ పెదనాన్నగారు నాశనం చేశారని, ఈ ఒక్కటే మిగిలిందని ఒక నోట్‌కూడా రాసి పెట్టాలి. ఆ మాటలు స్ఫుటంగా రాయాలి. ఆ తరువాత బాక్స్‌ను బయట, వాళ్లు చెప్పినట్టే సన్ డయల్‌మీద పెట్టాలి. అర్థమయిందా?"

"పూర్తిగానూ."

"ప్రతీకారం గురించి ఆలోచించవద్దు. కనీసం ప్రస్తుతానికి. ఆ సంగతి చూడడానికి చట్టం ఉంది. కానీ మనం మన వలను విసరాలి. వాళ్లు తమ వలను ఎప్పుడో విసిరారు. ముందుగా మీ మీదకు కమ్ముకుంటున్న ఆపదను అడ్డుకోవాలి. ఆ తరువాత రహస్యాన్ని ఛేదించడం, దోషులను పట్టుకోవడం, శిక్షించడం లాంటివి వస్తాయి."

"చాలా ధన్యవాదాలు. నాకు కొత్త జీవితం, నమ్మకం అందజేశారు. తప్పకుండా మీరు చెప్పినట్టే చేస్తాను." అన్నాడు యువకుడు లేచి నిలబడి ఓవర్‌కోట్ తొడుక్కుంటూ.

"ఒక్క క్షణం ఆలస్యం చెయ్యకండి. ఈలోగా చాలా జాగ్రత్తగా ఉండండి. మీకు గట్టి ఆపద ముంచుకు వస్తున్నదనడంలో నాకు ఏ మాత్రమూ సందేహం లేదు. ఇంటికి తిరిగి ఎట్లా వెళతారు?"

"వాటర్‌లూ నుంచి ట్రెయిన్‌లో."

"ఇంకా తొమ్మిది కాలేదు. వీధుల్లో జనం బాగా ఉంటారు. అంటే మీరు క్షేమం అని అర్థం. అయినా మీరు జాగ్రత్తగా ఉండాలి."

"నా దగ్గర ఆయుధం ఉంది."

"చాలా మంచిది. కేసు గురించి పనిని నేను రేపు ఆరంభిస్తాను."

"అయితే రేపు నేను మిమ్మల్ని హెూర్షామ్‌లో కలుస్తాను."



"లేదు, మీ రహస్యం లండన్‌లో దాగి ఉంది. నేను దాన్ని అక్కడే పట్టుకుంటాను."

"అయితే నేను ఒకటి రెండు రోజుల్లో మీతో మాట్లాడతాను. బాక్స్, కాగితాల గురించి చెపుతాను. అన్ని విధాలా మీ సలహా కావాలి." అతను మాతో చేతులు కలిపి వీడ్కోలు చెపుతూ వెళ్లిపోయాడు. బయట గాలి గీ పెడుతూనే ఉన్నది. వాన కిటికీలమీద



బాదుతూనే ఉన్నది. ఈ వింత వ్యవహారం మొత్తంగానూ, మొరటు ప్రకృతి శక్తు లలో నుంచి, తుఫానులో ఎగిరి వచ్చిన సముద్రపు తుప్పలాగా మా ముందుకు వచ్చింది. మేము మొత్తంగా వ్యవహారం లోకి మునిగి పోయాము.

షెర్లక్ హెూమ్స్ కొంత సేపు నిశ్శబ్దంగా కూర్చు న్నాడు. తల ముందుకు వంచుకుని ఎర్రని మంటవేపు అదేపనిగా చూస్తున్నాడు. అతను పైపు ముట్టించాడు. కుర్చీలో వెనక్కు చేరబడి నీలిపొగను మేఘాలుగా ఊదుతూ పైకప్పును చూడసాగాడు.

"వాట్సన్, ఇప్పటివరకు మనకు వచ్చిన కేసుల్లో ఇంతకంటే ఆశ్చర్యకరంగా మరొకటి లేదని నాకు అనిపిస్తున్నది." చివరకు అన్నాడతను.

"బహుశా ద సైన్ ఆఫ్ ఫోర్ తప్ప"

"అవును, నిజమే. బహుశా అది ఒక్కటి తప్ప. అయితే ఈ జాన్ ఓపెన్‌షా మరింత పెద్ద ఆపదలో చిక్కుకున్నాడని నాకు అనిపిస్తున్నది.

"ఇంతకూ ఆ ఆపదలేమిటో గట్టిగా ఊహించగలిగావా?" నేను అడిగాను.

"వాటి గురించి సందేహమే లేదు" అతను జవాబిచ్చాడు.

"అయితే ఏమిటవి? ఈ కె.కె.కె ఎవరు? ఈ కుటుంబం చుట్టే

ఎందుకు తిరుగుతున్నారు?”

షెర్లక్ హెూమ్స్ కళ్లు మూసుకున్నాడు. మోచేతులను కుర్చీ చేతులమీద ఆన్చి మామూలుగా రెండుచేతుల వేళ్ల చివరలను తగిలించి పట్టుకున్నాడు. “నిజంగా కార్యకారణాలు ఆలోచించగలిగిన వ్యక్తి ఒక విషయం గురించి వివరాలన్నీ ముందుకు వస్తే, అందులోనుంచి వరుసపెట్టి సంఘటనలన్నింటినీ చూడగలుగుతాడు. అక్కడితో ఆగక తరువాత ఏం జరుగుతుందో కూడా చెప్పగలుగుతాడు. ఒక్క ఎముకను పట్టుకుని కూవియర్ మొత్తం జంతువును ఖచ్చితంగా వర్ణించినట్టు, వరుస సంఘటనల్లోనుంచి ఏ ఒక్క లింక్ దొరికినా అర్థం చేసుకుని, దానికి ముందు, తరువాత జరిగిన వాటన్నింటినీ పొల్లు పోకుండా చెప్పగలుగుతాడు. కేవలం తమ తెలివితో మాత్రమే సమస్యలకు సమాధానాలు వెతికే వాళ్లను తికమక పెట్టిన సమస్యలు కూడా ఈ పద్ధతితో విడిపోతాయి. అయితే ఈ కళను తారస్థాయికి చేర్చాలంటే, ఈ మనిషి తన ముందుకు వచ్చిన వాస్తవాలన్నింటినీ కలిపి వాడుకోవలసి ఉంటుంది. అంటే చాలా విషయాలు తెలియవలసి ఉంటుందని అర్థమయ్యే ఉంటుంది. ఎన్సైక్లోపీడియాలు, ఉచితవిద్య లాంటివన్నీ పెరుగుతున్న ఈ కాలంలో ఇంత తెలివి ఎవరి దగ్గరా మిగలలేదేమో. ఒక మనిషికి తన పనిలో ఉపకరించే తెలివి మొత్తం ఉండడం అసాధ్యమేమీ కాదు. నేను నాకేసులలో అదే పని చేస్తున్నాను. ఒకప్పుడు, మొదట్లో పరిచయమయిన కాలంలో, నువ్వు నా తెలివి గురించి ఒక చర్చ చేశావని నాకు గుర్తుంది.”

“అవును, అది ఒక ప్రత్యేకమయిన పత్రం. ఫిలాసఫీ, ఆస్ట్రానమీ, రాజకీయాలకు నీకు సున్నా మార్కులు వేశాను. బాటనీ గురించి కొంత తెలుసునన్నాను. జియాలజీ గురించి తెలుసునన్నాను. నగరానికి యాభయి మైళ్ల చుట్టుపక్కల ఉండే మట్టి మొత్తం గురించి నీకు తెలుసు మరి. ఇక కెమిస్ట్రీ కొంచెంగాను, అనాటమీ కొంతకొంత తెలుసునన్నాను. సంచలనాత్మక సాహిత్యం, నేర చరిత్ర గురించి నీకు తెలిసినంతగా మరెవ్వరికీ తెలియ

దన్నాను. వయోలిన్ వాయించడం, బాక్సింగ్, కత్తి యుద్ధం, వకీలు పని, కొకెయిన్, పొగాకులకు లొంగిపోవడం లాంటివి కూడా నీకు వచ్చునన్నాను. నా విశ్లేషణలో ఇవే ముఖ్య విషయాలుగా వచ్చినట్టు అనుకుంటున్నాను" అన్నాను నవ్వుతూ.

హోమ్స్ నవ్వాడు. నా చివరి మాటలకు మరీమరీ నవ్వాడు. "బాగుంది, అప్పుడు అన్నట్టే, మనిషి తన బుర్ర అనే అటకమీద తనకు అవసరమయ్యే వస్తువులను మాత్రమే పెట్టుకోవాలని, మిగతావి లైబ్రరీ అనే మరో గదిలో పెట్టాలని ఇప్పుడూ అంటున్నాను. అవసరమయిన వస్తువులను అవసరం కొద్దీ తెచ్చుకోవచ్చు. ఈ రాత్రి మన ముందుకు వచ్చిన ఈ కేసు విషయంలో మనం చాలా సంగతులను ఆ రకంగా తెచ్చుకోవలసి ఉంది. నీ పక్కన షెల్ఫ్‌మీద అమెరికన్ ఎన్‌సైక్లోపీడియా ఉంది. అందులో నుంచి కె అక్షరం ఉన్న భాగాన్ని నాకు అందించు. థాంక్యూ. ఇప్పుడు మనం పరిస్థితి ప్రకారం ఏం తెలుస్తుందో చూద్దాం. మొట్టమొదట కల్నల్ ఓపెన్‌షా అమెరికా వదిలి రావడానికి గట్టి కారణం ఉందని అనుకుందాం. అప్పటికాలంలో వారు ఫ్లోరిడాలాంటి అందమయిన వాతావరణాన్ని వదిలి అంత సులభంగా ఇంగ్లీష్ దేశంలో ఒక మారుమూలకు వచ్చి ఏకాంత జీవితం గడపాలనుకుంటే దాని వెనుక ఏదో కారణం ఉండి ఉంటుంది. ఇంగ్లాండ్‌లో అతను భయపడుతూ ఏకాంతంగా బతికాడు. అంటే దేని గురించో భయపడ్డాడు. కేవలం సిద్ధాంతం కొరకు మనం, అతడిని అమెరికా నుంచి పంపించిన కారణమే ఇక్కడ భయానికీ కారణ మైందని అనుకుందాం. ఇంతకూ ఏమిటా కారణం అన్నది మనం ఊహించ వచ్చు. అతనికీ, తరువాతి వారికీ వచ్చిన ఉత్తరాలు మనకు ఆధారం. ఉత్తరాల మీద పోస్టుమార్కులను నువ్వు గమనించావా?"

"మొదటిది పాండిచ్చేరి నుంచి, రెండవది డుండి, ఇక మూడవది లండన్ నుంచి వచ్చాయి."

"ఈస్ట్ లండన్. అంటే నీకు ఏమి అర్ధమవుతున్నది?"

"అవన్నీ రేవు పట్టణాలు. అంటే ఉత్తరాలు రాసిన వ్యక్తి ఓడమీద ఉన్నాడని అర్థం."

"ఎక్సలెంట్, మనకొక క్లూ దొరికింది. అంటే ఉత్తరాలు రాసిన వ్యక్తి ఓడమీద ఉన్నాడని, ఒక సంభావ్యత. అది గట్టి సంభావ్యత మన ముందుకు వచ్చింది. ఇప్పుడు మరో సంగతి చూద్దాం. పాండిచ్చేరి విషయంలో ఉత్తరానికీ, దాని పర్యవసానానికీ మధ్య ఏడు వారాల కాలం గడిచింది. డుండీలో ఆ వ్యవధి మూడు నాలుగు రోజులే. అంటే ఏమయినా అర్ధమయిందా?"

"చాలా దూరం ప్రయాణించవలసి వచ్చిందని"

"మరి ఉత్తరం కూడా అంతకాలమూ ప్రయాణించాలి."

"అయితే మరి నాకు అర్థం కానట్టే."

"ఒకటి చెప్పవచ్చు. ఈ మనిషీ లేదా మనుషులు ఒక సెయిలింగ్ షిప్ మీద ఉన్నారని, ఉత్తరాలను తాము బయలుదేరక ముందే పంపించారని అనుకోవచ్చు. డుండీకి వచ్చేసరికి వ్యవధి ఎంత తగ్గిపోయిందో చూడవచ్చు. పాండిచ్చేరి నుంచి స్టీమర్ మీద వచ్చిఉంటే ఉత్తరంతో పాటే వాళ్లూ వచ్చి ఉండేవాళ్లు. కానీ నిజానికి ఏడు వారాలు పట్టింది. ఆ సమయం మెయిల్ బోట్ వేగానికి, మామూలు ఓడ వేగానికి ఉన్న తేడా."

"ఇది బాగానే ఉంది."

"అంతేకాదు, అలా జరిగి ఉండవచ్చు. ఇక ఈ కొత్త వ్యవహారంలో వేగాన్ని గమనించు. అందుకే నేను ఓపెన్‌షా కుర్రవాడిని అంతగా హెచ్చరించి పంపించాను. ఉత్తరం పంపిన వారు రాగానే పనిలోకి దిగారు. ఈ మూడవ ఉత్తరం లండన్ నుంచే వచ్చింది. అంటే ఆపద జరిగేందుకు వ్యవధి లేదు."

"భగవంతుడా! ఎందుకు ఈ రకంగా తరుముతున్నారు?"

"ఓపెన్‌షా తన వెంట తెచ్చిన కాగితాలు ఓడలోని మనిషి లేదా మనుషులకు చాలా అవసరమయినవి. అక్కడ ఒకే వ్యక్తి కాదని, కొంతమంది ఉన్నారని నేను అనుకుంటున్నాను. ఒక వ్యక్తి, చట్టానికి పట్టుబడకుండా అంత పకడ్బందీగా హత్యచేయడం సులభం కాదు. అందుకే మంచి వెసులుబాటు, మద్దతు ఉన్న మనుషులు కొందరు ఇందులో ఉన్నారని అనుకుంటున్నాను. వాళ్ల కాగితాలు వాళ్లకు కావాలి. అంటే కె.కె.కె అనే పొడి అక్షరాలు ఒక మనిషి పేరును సూచించేవి కావు. అది ఒక సంఘానికి పేరు."

"అదేమి సంఘం?"

"నీవు ఎప్పుడూ కూ క్లక్స్ క్లాన్ గురించి విని ఉండలేదా?" షెర్లక్ హోమ్స్ ముందుకు వంగి గొంతు తగ్గించి అడిగాడు.

"అబ్బే, లేదు."

హోమ్స్ తన మోకాళ్ల మీద ఉన్న పుస్తకాన్ని విప్పి చూపించాడు.

> *"కూ క్లక్స్ క్లాన్. ఈ పేరు ఒక రైఫిల్‌ను వాడే ముందు వచ్చే చప్పుడులో నుంచి తీసినట్టు చెపుతారు. ఇదొక సంఘం. దీన్ని సివిల్ వార్ తరువాత దక్షిణ రాష్ట్రాలలోని మాజీ సైనికులు కొంతమంది ఏర్పాటు చేశారంటారు. తరువాత దీని శాఖలు టెనెసీ, లూయిజియానా, కరోలినాస్, జార్జియా ఇంకా ఫ్లోరిడా లాంటి వేరువేరు చోట్ల తలెత్తాయి. నీగ్రో ఓటర్లను భయపెట్టి రాజకీయ బలాన్ని చేజిక్కించుకోవాలని, తమ సిద్ధాంతానికి ఎదురు వచ్చిన వారిని అంతం చేయాలని వీళ్ల ముఖ్య ఉద్దేశ్యం. వీళ్లు తమ ఘాతుకాలు జరిపే ముందు చిత్ర విచిత్రమయిన పద్ధతుల్లో సంబంధిత వ్యక్తులకు సందేశాలు పంపేవారు. అది కొన్ని సందర్భాల్లో ఓక్ చెట్టు ఆకులు కావచ్చు, మరొకసారి మెలన్ విత్తులు*

*కావచ్చు, ఇంకొక సందర్భంలో నారింజ తొనలు కావచ్చు. సందేశం అందిన వెంటనే ఆ వ్యక్తి తన పద్ధతులను మార్చుకోవాలి లేదా దేశాన్ని వదిలి పారిపోవాలి. పట్టించుకోకుండా ఉంటే మాత్రం నిస్సంశయంగా ప్రాణం వదులుతాడు. అది కూడా ఎవరూ ఊహించని వింత పరిస్థితుల్లో చనిపోతాడు. ఈ సంఘం వారి పద్ధతులు, పనితీరు ఏ లోపమూ లేకుండా సాగాయని పేరు. వీరిమీద పరిశోధనలు జరిపి పట్టుకున్న సందర్భాలు నేర చరిత్రలో లేకపోవడం అందుకు ఉదాహరణ. యునైటెడ్ స్టేట్స్ ప్రభుత్వం చాలాకాలం పాటు ప్రయత్నించినా సరే వీరి కార్యక్రమాలు అడ్డులేకుండా సాగుతూ వచ్చాయి. దక్షిణ రాష్ట్రాలలోని ఉన్నత వర్గాలు కూడా వీరి శోషణకు గుర య్యాయి. చివరకు 1869లో ఈ ఉద్యమం ఒక్కసారిగా కుప్పకూలింది. ఆ తరువాత ఆ రకం సంఘటనలు అక్కడక్కడ మాత్రమే తలెత్తాయి.*

“ఓపెన్‌షా కొన్ని కాగితాలతో పాటు అమెరికా నుంచి వచ్చేసిన సమయం, ఈ సంఘం పనులు మానుకున్న కాలమేనని నీవు గమనించి ఉంటావు. ఇందులో కార్యకారణాలు కనబడుతున్నాయి. కనుకనే ఆయన కుటుంబం వెంట కొన్ని దుష్టశక్తులు తరుముతూ వస్తున్నాయి. అతని వద్ద ఉన్న కాగితాలు పాత విషయాలను వెలికితీసి కొందరికి శిక్షలు పడేందుకు కారణం కాగలవని, వాటిని చేజిక్కించుకునే వరకు కొంతమందికి నిద్రపట్టదని సులభంగానే ఊహించవచ్చు.” అన్నాడు హోమ్స్ పుస్తకాన్ని మూస్తూ.

“అంటే మనం చూచిన కాగితం....”

“అనుకుంటున్న సంగతే. అందులో ఫలానా వారికి తొనలు పంపించాము.... అని రాసి ఉండడం గుర్తుంది కదా. అంటే సంఘం వారి

హెచ్చరికలు వారికి పంపారని అర్థం. ఆ తరువాత ఫలానా వారిని క్లియర్ చేశామని రాసుకున్నారు. చివరికి ఒకరి దగ్గరికి వెళ్లివచ్చినట్టు రాసుకున్నారు. అక్కడ తప్పకుండా ఘాతుకం జరిగి ఉంటుందని నా ఊహ. ఇక డాక్టర్, ఈ చీకటిలోకి మనం కొంత వెలుగును నింపవలసి ఉంది. ఓపెన్‌షా కుర్ర వాడికి మనం చెప్పింది చెయ్యడం కన్నా మరొక మంచిమార్గం లేదు. ఈ రాత్రి ఇక చెప్పవలసింది, చెయ్యవలసింది మరొకటి లేదు. నా వయోలిన్ అందివ్వు. అరగంట పాటు ఈ భయంకరమయిన గాలివానను, మనుషుల భయంకరమయిన మనస్తత్వాలను మరిచిపోయి గడిపే ప్రయత్నం చేద్దాం."

మరుసటి ఉదయానికి వాతావరణం తేరుకున్నది. సూర్యుడు అంత వెలుగు లేకున్నా బాగానే వెలుగుతున్నాడు. నగరం మీద ఏదో ముసుగు వేసినట్టుంది. నేను కిందకు వచ్చేసరికి షెర్లక్ హోమ్స్ బ్రేక్‌ఫాస్ట్ బల్ల దగ్గర సిద్ధంగా ఉన్నాడు.

"నీ కోసం వేచి ఉండలేదు నేను, క్షమించాలి. ఓపెన్‌షా వ్యవహారం గురించి జరూర్‌గా చేయవలసింది చాలా ఉంది నాకు." అన్నాడతను నన్ను చూచి.



"అయితే ఏం చెయ్య బోతున్నావు?" నేను అడిగాను.

"నా ప్రయత్నాలకు వచ్చే జవాబులను బట్టి నా పని నిర్ణయమవుతుంది. బహుశా హొర్షామ్ పోవలసివస్తుందేమో."

"అంటే ముందుకు అక్కడికి వెళ్లవా?"

"లేదు, నగరానికి

ముందు వెళతాను. ఏదీ బెల్ మోగించు. నీ కాఫీ వస్తుంది.”

నేను బల్లమీద పడి ఉన్న దిన పత్రికను తెరిచి అందులోకి చూడ సాగాను. అక్కడ ఒక విషయం చూడగానే నా గుండె ఒక్కసారి గెంతింది.

“హోమ్స్, ఇప్పటికే ఆలస్యమయింది” గట్టిగా అరిచాను.

“ఆహా! అనుకున్నాను, ఎలా జరిగింది?” అతను ప్రశాంతంగా అడిగాడు. కానీ అతనిలోని భావాలను నేను చూడగలిగాను.

“ఓపెన్‌షా పేరు కనిపించింది. ‘వాటర్‌లూ బ్రిడ్జ్ వద్ద మరణం’ అని ఒక శీర్షిక ఉంది. వివరాలు ఇలాగున్నాయి.

> *గడిచిన రాత్రి తొమ్మిది, పది గంటల మధ్యన ఎచ్ డివిజన్ కానిస్టేబుల్, కుక్ అనే పేరుగల అతను వాటర్‌లూ బ్రిడ్జ్ ప్రాంతంలో గస్తీ తిరుగుతూ ఉండగా ఎవరో సాయం కోసం అరవడమూ, నీళ్లలో పడిన చప్పుడూ విన్నాడు. చాలా చీకటిగా ఉంది. గాలి వాన భయంకరంగా ఉంది. ఎంతమంది సాయం వచ్చినా నీళ్లలో పడిన వ్యక్తిని కాపాడడం కుదరలేదు. చివరికి వాటర్ పోలీస్ వారి సాయంతో శరీరాన్ని బయటకు తేగలిగారు. అది ఒక యువకునికి సంబంధించినది. అతని జేబులో దొరికిన ఒక ఎన్వలోప్ ఆధారంగా పేరు జాన్ ఓపెన్‌షా అని, అతను హోర్షామ్‌లో ఉంటాడని తెలిసింది. వాటర్‌లూ స్టేషన్ నుంచి చివరి ట్రయిన్‌ను పట్టుకోవడానికి అతను వేగంగా పోతున్నాడు. ఆ తొందరలో చీకటిలో దారి తప్పాడు. బ్రిడ్జ్ మీద ఒక అంచుకు వచ్చి రివర్ బోట్‌లు నిలబడే చోటికి చేరాడని అర్ధమవుతుంది. శరీరం మీద దాడి జరిగిన గుర్తులేవీ లేవు. మరణం కేవలం అనుకోకుండా జరిగిన అపాయమని తేలింది. ఆ ప్రాంతంలో మరింత మంచి*

*కట్టుదిట్టాలు చేయవలసిన అవసరముందని ఈ సంఘటనతో బయటపడింది.*

మేము కొన్ని నిమిషాల పాటు నిశ్శబ్దంగా కూర్చున్నాము. హెూమ్స్ చాలా క్రుంగిపోయాడు. అతను అంతగా కదిలిపోవడం నేను ఎప్పుడూ చూడలేదు.

"ఇది నా గౌరవానికే భంగం, వాట్సన్. చాలా చిన్న విషయమే. కానీ



నాకు ఎందుకో బాధగా ఉంది. ఇప్పుడు ఇది నా స్వంత వ్యవహారంగా మారింది. దేవుడు మేలుచేస్తే ఈ గ్యాంగ్‌ను నేను పట్టుకుంటాను. అతను నా దగ్గరికి రావడమేమిటి, నేను అతనిని నేరుగా మృత్యువు చేతులలోకి పంపడమేమిటి...!" అన్నాడు హెూమ్స్ చివరకు. అతను కుర్చీలోనుంచి ఒక్కసారిగా లేచి గదిలో అటూఇటూ తిరగసాగాడు. ముఖం బాగా ఎరుపెక్కి ఉంది. పిడికిళ్లను మాటిమాటికి తెరుస్తున్నాడు, మూస్తున్నాడు. అంటే ఎంతో మానసిక వ్యధకు గురవుతున్నాడని అర్థం.

"జిత్తులమారి దయ్యాలయి ఉండాలి. కుర్రవాడిని అక్కడకు ఎట్లా తీసుకుపోయారు. ఆ ఒడ్డు స్టేషన్‌కు వెళ్లే దారిలో లేనేలేదు. ఇక వంతెన మీద, అంతరాత్రి కూడా చాలామంది జనం ఉంటారనడంలో సందేహం లేదు అన్యాయం. ఇక వాట్సన్, చివరకు ఎవరు గెలుస్తారో చూద్దాం. నేను ఇప్పుడు బయటకు వెళుతున్నాను."

"పోలీసుల దగ్గరకా?"

"లేదు, నాకు నేనే పోలీస్‌ని. వల నేను పన్నుతాను, పడిన వాటిని వాళ్లు పట్టుకుంటారు. ముందే రారు."

తరువాత రోజంతా నేను నా వైద్యం పనిలో ఉండిపోయాను. సాయంత్రం, బేకర్ స్ట్రీట్‌కి తిరిగి వచ్చేసరికి ఆలస్యమయింది. అప్పటికి షెర్లక్ హెూమ్స్ ఇంకా తిరిగి రాలేదు. షుమారు పది గంటల ప్రాంతంలో వచ్చాడతను. బాగా అలిసిపోయి ఉన్నాడు. సైడ్ బోర్డ్ దగ్గరకు వెళ్లి రొట్టెలో నుంచి ఒక ముక్క తీసుకుని ఆబగా తిని గుక్కెడు నీళ్లు తాగాడు.

"బాగా ఆకలి అయినట్టుంది." నేనన్నాను

"కొంచెం కాదు, నాకు గుర్తే లేదు. బ్రేక్‌ఫాస్ట్ తరువాత నేను అసలు ఏమీ తిననేలేదు."

"ఏమీ తినలేదా?"

"ఒక ముక్క కూడా. నాకు ఆ ఆలోచనే రాలేదు."

"ఇంతకూ పని జరిగిందా?"

"వెల్"

"క్లూ ఏమయినా దొరికిందా?"

"వాళ్లు నా అరచేతిలో ఉన్నారు. ఓపెన్‌షా యువకుని మరణానికి ప్రతీకారం జరగకుండా ఉండదు. వాళ్ల పద్ధతులను వాళ్లమీదే తిప్పి కొడదాం. నేను బాగా ఆలోచించాను!"

"ఇంతకూ ఏమంటున్నావు?"

అతను కప్‌బోర్డు నుంచి ఒక ఆరెంజ్ పండును తెచ్చాడు. తొక్క వలచి తొనలను బల్లమీద పడేశాడు. అందులో నుంచి అయిదింటిని తీసుకుని ఒక ఎన్వలోప్‌లో పెట్టాడు. దాని ఫ్లాప్ లోపలివేపు 'ఎస్.ఎచ్. ఫర్ జె.ఓ.' అని రాశాడు. కవర్‌ని సీల్ చేసి దానిమీద 'కెప్టెన్ జేమ్స్ కాల్‌హూన్, బార్క్ లోన్ స్టార్, సవానా, జార్జియా' అని రాశాడు.

"అతను పోర్ట్‌కి చేరేసరికి ఇది ఎదురు చూస్తూ ఉంటుంది. కొన్నాళ్లు అతనికి నిద్రపట్టదు. తన అదృష్టం గురించి, ఓపెన్‌షాలలాగే అతనూ కొంత కాలం వేచి చూడవలసి ఉంటుంది." అన్నాడతను నవ్వుతూ.

"ఇంతకూ ఎవరు ఈ కెప్టెన్ కాల్‌హూన్?'

"అతనే గ్యాంగ్‌లీడర్. మిగతావాళ్లూ దొరుకుతారు. ముందుగా ఇతను."

"ఎట్లా పట్టుకున్నావు వాళ్లని?'

అతను జేబులో నుంచి ఒక పెద్ద కాగితం షీట్ తీశాడు. దానిమీద పేర్లు, తేదీలు రాసి ఉన్నాయి.

"రోజంతా దీనితోనే గడిచింది. లాయిడ్స్ రిజిస్టర్‌లో పాత ఫైళ్లు,

పేపర్లు వెతికి పాండిచ్చేరికి, 83 జనవరి, ఫిబ్రవరిలలో వెళ్లిన పడవలన్నింటి వివరాలను తీశాను. మొత్తం 36 పడవలు, చాలా పెద్దవే ఆ రేవుకు వెళ్లాయి. అందులోనుంచి ఒకటి, ప్లెయిన్ లోన్ స్టార్ అనేది నా దృష్టిని ఆకర్షించింది. అది లండన్ నుంచి వచ్చిందని రాశారు. కానీ ఆ పేరు మాత్రం ఒకానొక స్టేట్‌కు సంబంధించినది."

"టెక్సస్ అనుకుంటాను."

"ఏ స్టేట్ అయ్యిందీ నాకు తెలియదు. ఆ పడవ మాత్రం అమెరికాకు చెందినదని తెలుసు."

"ఆ తరువాత?"

"ఇక డుండీ రికార్డ్ వెతికాను. 85 జనవరిలో బార్క్ లోన్ స్టార్ అక్కడికి వచ్చిందని గమనించాను. ఇక నా అనుమానం గట్టి పడింది. లండన్ పోర్ట్‌లో ప్రస్తుతం నిలిచి ఉన్న ఓడల వివరాలు తీశాను."

"భలే"

"ద లోన్ స్టార్ అక్కడికి గత వారమే వచ్చింది. నేను ఆల్బర్ట్ డాక్‌కు వెళ్లాను. కానీ ఓడ ఉదయాన్నే అలలు లేవకముందే సవానా వేపు బయలుదేరిందని చెప్పారు. గ్రేవ్స్‌ఎండ్‌కు టెలిగ్రామ్ చేస్తే ఓడ అప్పుడే దాటిపోయిందన్నారు. గాలి బాగా బలంగా ఉంది కనుక అది గుడ్‌విన్స్ దాటి ఐల్ ఆఫ్ వైట్ ప్రాంతాలకు చేరి ఉంటుందని అనుకుంటున్నాను."

"ఇంతకూ ఏం చేస్తావు?"

"వాళ్లు నా చేతికి చిక్కారు. అతను మరొక ఇద్దరు మాత్రమే, ఆ ఓడలో ఉన్న అసలయిన అమెరికన్‌లు. మిగతా వారంతా ఫిన్లాండ్, జర్మనీ వాళ్లు. వాళ్లు ముగ్గురూ రాత్రి ఓడ దిగి బయటకు వచ్చారని కూడా తెలుసుకున్నాను. వాళ్ల సామానులను ఎక్కించిన స్టీవ్‌డోర్ ఆ సంగతి చెప్పాడు. వాళ్ల సెయిలింగ్ షిప్ సవానాకు చేరకముందే మెయిల్ బోట్ ఈ ఉత్తరంతో

పాటు అక్కడికి చేరుకుంటుంది. ఈలోగానే అక్కడి పోలీసులకు ఈ ముగ్గురు పెద్ద మనుషులు ఒక హత్య కేసు విషయంలో ఇక్కడ అవసరమన్న వర్తమానం చేరుకుంటుంది.”

మనుషులు వేసిన పథకాలలో అప్పుడప్పుడు లోపాలు రావడం తప్పదు. జాన్ ఓపెన్‌షాను హత్య చేసిన వారు ఆ నారింజ తొనలను చూడనేలేదు. తమలాగే స్థిరనిర్ణయం, జిత్తులమారితనం ఉన్నవాళ్లు మరికొందరు తమను తరుముతున్నారన్న సూచన వాళ్లకు అందనేలేదు. ఆ సంవత్సరం వీచిన పెనుగాలులు మరీ బలమయినవి. మేం చాలాకాలం వేచి చూచిన మీదట, సవానాకు వెళ్లవలసిన లోన్ స్టార్ ఓడ అక్కడకు చేరనే లేదని తెలిసింది. అట్లాంటిక్‌లో ఎక్కడో ఒకచోట పడవ తాలూకు భాగాలు నీళ్లలో కొట్టుకువచ్చినట్టు, వాటిమీద ‘ఎల్.ఎస్’ అన్న పొడి అక్షరాలు చెక్కి ఉన్నట్లు తెలిసింది. లోన్ స్టార్ ఏమయిన సంగతి ఎవరికీ తెలియలేదు.





6

# వంకర పెదవి మనిషి

థియలాజికల్ కాలేజ్ ప్రిన్సిపల్ ఎలియాస్ విట్నీగారి తమ్ముడు ఐజా విట్నీ గంజాయికి బానిస అయ్యాడు. అలవాటు మరీ ముదిరింది. అది అతనికి కాలేజ్‌లో నేస్తాలనుంచి అంటింది. అక్కడ అతను డాక్టర్ క్విన్సీగారు వర్ణించిన కలలు, భావాలను గురించి చదివి అదే పద్ధతిలో తన పొగాకు మీద లాడనమ్ అనే రసాయనాన్ని పోసి దాని ప్రభావాలను గురించి పరి శీలించసాగాడు. చాలా మందిలాగే అతనికి ఆ దురలవాటు అలవడడం ఎంత సులభమో వదిలించుకోవడం అంతే కష్టమని అర్ధమయింది. అతను మత్తుకు బానిసగా కొనసాగాడు. బంధుమిత్రులంతా అతనిని ఏవగించుకునే వరకూ వచ్చింది. పెద్ద ఇంటి మనిషి సర్వనాశనం అయ్యాడు. పచ్చబడి ముద్దగట్టిన ముఖం, జారుతున్న కనురెప్పలు, చుక్కలా చిన్నవయిన కంటిపాపలూ, కుర్చీలో ముడుచుకుని కూర్చున్న అతడిని చూస్తే జాలి పుడుతుంది.

ఒక రాత్రి – అది జూన్, 89 – నా కాలింగ్‌బెల్ మోగింది. అది ఎవరయినా సరే ఆవులిస్తూ గడియారం వేపు చూసే సమయం. నేను కుర్చీలో కూర్చున్నాను. మా ఆవిడ తన అల్లిక ఊలును ఒళ్లో వేసుకుని చికాకుగా నావేపు చూచింది.

"ఎవరో పేషంట్. ఇక మీరు వెళ్లక తప్పదు" అన్నదామె. నేను విసుగుగా మూలిగాను. దినమంతా పనిచేసి అప్పుడే వచ్చాను మరి.

తలుపు తెరుచుకున్న చప్పుడయింది. ఎవరో గబగబా మాట్లాడుతున్నారు. మెట్లమీద వేగంగా నడుస్తున్న చప్పుడు. మా ఇంటి తలుపు తెరుచుకున్నది. ముదురురంగు దుస్తులు వేసుకున్న ఒక మహిళ, నల్లని ముసుగుతో లోపలికి వచ్చింది.

"ఇంత పొద్దుపోయి వచ్చినందుకు మీరు నన్ను క్షమించాలి" అన్నదామె. వెంటనే ఆమె ముందుకు పరుగెత్తి చేతులు రెండు నా భార్య మెడ చుట్టూ వేసి భుజం మీద తలపెట్టి ఏడవసాగింది. "నాకు ఎంత కష్టం వచ్చిందో తెలుసా, మీరు కొంచెం సాయం చేయాలి!" అన్నదామె.

ఎదుటి మనిషి ముసుగు తొలగిస్తూ "ఇదేమిటి? కేట్ విట్నీయా? ఎంత భయపెట్టావు కేట్, నువ్వు వస్తున్నప్పుడు అసలు గుర్తించలేకపోయాను తెలుసా?" అన్నది నా భార్య.

"ఏం చెయ్యాలో అర్థం కాలేదు. నేరుగా మీ వద్దకు వచ్చాను." ఎప్పుడూ అదే పద్ధతి. దు:ఖం కలిగిన వాళ్లంతా లైట్ హౌస్‌కు చేరుకునే పక్షుల్లాగా మా ఆవిడ వద్దకు వస్తుంటారు.

"వచ్చి మంచి పని చేశావు. కొంచెం వైన్ అండ్ వాటర్ పుచ్చుకో. తీరికగా కూర్చుని విషయమేమిటో వివరంగా చెప్పు. జేమ్స్‌ని పడక గదిలోకి వెళ్లిపొమ్మననా?"

"వద్దు, వద్దు! నాకు డాక్టర్‌గారి సాయమూ, సలహా కూడా కావాలి, ఐజా గురించి. ఆయన రెండు రోజులుగా ఇంటికి రాలేదు. నాకు చాలా భయంగా ఉంది."

భర్త పరిస్థితి గురించి ఆమె మాతో మాట్లాడడం మొదటిసారి మాత్రం కానేకాదు. వైద్యునిగా నాతో, చిన్నప్పటి నేస్తంగా నా భార్యతో ఆమె తరచూ

చెపుతూనే ఉంటుంది. మాకు చేతనయిన మంచిమాటలు మేము చెపుతుంటాము. భర్త ఎక్కడ ఉన్నాడో ఆమెకు తెలుసా? అతడిని ఇంటికి తీసుకు రావడం మావల్లనవుతుందా?

అవుతుందనే అనిపించింది. ఈ మధ్యన అతను ఎక్కువగా నగరంలోని తూర్పు ప్రాంతంలో ఒక ఓపీయమ్ డెన్‌లో గడుపుతున్నాడని ఆమెకు గట్టిగా తెలుసు. ఇంతకుముందు ఆ రకంగా ఒక రోజు మాత్రమే వెళ్లేవాడు. సాయంత్రానికి తడబడుతూ ఇళ్లు చేరుకుంటాడు. ఈసారి మాత్రం 48 గంటలయింది. అతను అక్కడే పడి ఉంటాడు. విష వాయువులు పీలుస్తూ, మగత నిద్రలో ఆ గంజాయి భాయిల మధ్య పడి ఉంటాడు. అక్కడే దొరుకుతాడు. స్వాండామ్ లేన్‌లో, బార్ ఆఫ్ గోల్డ్ అనే చోట అతను ఉన్నాడని ఆమె గట్టిగా చెప్పింది. కానీ ఒక ఆడమనిషి, అందునా ధైర్యం లేని మనిషి ఆ స్థలానికి వెళ్లి, ఆ భడవల మధ్య నుండి తన భర్తను ఎట్లా తెస్తుంది.

అదీ వ్యవహారం. అందులోనుంచి బయటపడడానికి ఒకటే మార్గం. నేను ఆమె వెంట అక్కడికి వెళ్లవచ్చు. మరో ఆలోచనగా అసలు ఆమె అక్కడికి ఎందుకు రావడం? ఐజా నా చేత వైద్యం చేయించుకుంటాడు. నేను చెప్పింది వింటాడు. నేను ఒంటరిగా వెళితేనే పని సులభం అవుతుంది. రెండు గంటలలోపల భర్తను ఇంటికి పంపిస్తానని ఆమెకు మాట ఇచ్చాను. అయితే ఆయన, ఆమె చెప్పిన స్థలంలో ఉన్న పక్షంలోనే. పది నిమిషాలలో నా కుర్చీ వదిలేసి గుర్రంబండి ఎక్కాను. అప్పటికి నాకు అర్థం లేనిదిగా తోచిన నాది కాని పనిమీద పరుగు పెట్టసాగాను. మునుముందు ఈ వ్యవహారం వింతగా మారుతుందని నాకు అప్పటికి తెలియదు.

నా సాహసయాత్రలో మొదటి భాగం ఏ కష్టం లేకుండానే గడిచింది. అప్పర్ స్వాండామ్ లేన్ అనేది లండన్ బ్రిడ్జ్‌కి తూర్పుగా, నదికి ఉత్తరపు తీరాన గట్ల మధ్యన ఉన్న ఒక భాగం. అక్కడ సారాయి కొట్ల మధ్యన ఇరుకుగా ఉన్న మెట్ల మీద నుంచి పోతే గుహ ద్వారంలాంటిది ఒకటి ఉంది. నేను వెతు

కుతున్న డెన్ అదేనని తెలిసింది. గుర్రంబండిని ఆగమని చెప్పాను. మెట్లు దిగుతూ ఒక కూపంలోకి చేరుకున్నాను. అక్కడ అంతా మత్తుతో జోగుతున్న వారే. తలుపుమీద నూనె దీపం ఒకటి మిణుకుమిణుకు మంటున్నది. ఆ వెలుగులో ఒక ఇరుకు గదిలోకి వెళ్లాను. లోపల గంజాయి పొగ నిండుకుని ఉంది. ఓడలో లాగా గోడల మీద మనుషులు పడుకునేందుకు బెర్త్‌లు ఉన్నాయి.

ఆ గుడ్డి వెలుగులో, మనుషులు అస్తవ్యస్తంగా ఎక్కడికక్కడ పడి ఉండడం కనిపించింది. కుంగిన భుజాలు, మడిచిన మోకాళ్లు, వెనక్కు వాల్చిన తలలు, శూన్యంలోకి చూస్తున్న ముఖాల మధ్యన అక్కడక్కడ వెలుగు లేని కళ్లు. కొత్త మనిషిని పట్టించుకునే వారు లేరు. నల్లని నీడల్లో అక్కడక్కడ వలయాకారంలో ఎర్రని వెలుగు అప్పుడప్పుడు కనబడుతున్నది. చిలుము గొట్టాల చివరలలో వెలుగు అది. చాలామంది నిశ్శబ్దంగానే ఉన్నారు. కొందరు మాత్రం తమలో తాము వింతగా గొణుగుతున్నారు. కాసేపు మాటలు, వెంటనే నిశ్శబ్దం. మెదడులోని ఆలోచనలను పక్కవారి గురించి పట్టకుండానే బయటకు చెపుతున్నారు. గది చివరలో ఒక బొగ్గుల కుంపటి మండుతున్నది. పక్కనున్న మూడు కాళ్ల పీటమీద ఒక ముసలతను కూర్చుని ఉన్నాడు. మోచేతు లను మోకాళ్లమీద పెట్టి రెండు అరచేతులను గడ్డం కింద ఆనించి మంటలోకి చూస్తున్నాడు.

నేను లోపలికి వెళుతుంటే ఒక చామనచాయ దేహంగల మలయ్ మనిషి ఒక పైపుతో నావేపు వేగంగా వచ్చాడు. ఖాళీగా ఉన్న ఒక బెర్త్‌ను చూపించాడు.

“లేదు, నేను ఉండడానికి రాలేదు. నా మిత్రుడు ఒకాయన ఇక్కడ ఉన్నాడు. పేరు ఐజా విట్నీ. అతనితో మాట్లాడాలి” అన్నాను. నా కుడి పక్కన ఏదో కదలిక తెలిసింది. అక్కడ పాలిపోయి, సోలి ఉన్న విట్నీ కని పించాడు. అతని పరిస్థితి అన్యాయంగా ఉంది.



"మైగాడ్! వాట్సన్" అన్నాడతను. అతని పరిస్థితి దయనీయంగా కనిపించింది.

"వాట్సన్, పొద్దు ఎంతయింది?" అడిగాడతను.

"పదకొండు దగ్గర పడుతున్నది."

"ఇవాళ ఏ వారం?"

"శుక్రవారం, జూన్ 19"

"అవునా, ఇంకా బుధవారం అనుకుంటున్నాను. కాదు బుధవారమే. ఎందుకు నన్ను భయపెడతావు?" అతను ముఖాన్ని చేతులలో దాచుకుని కీచుగొంతుతో ఏడవసాగాడు.

"ఇవాళ శుక్రవారమయ్యా! నీ భార్య రెండు రోజులుగా నీకోసం ఎదురు చూస్తున్నది. నీకు సిగ్గుందా?"

"నిజమే, కానీ వాట్సన్, నీవు పొరపడుతున్నావు. నేను వచ్చి కొన్ని గంటలు కూడా కాలేదు. మూడు నాలుగు పైప్‌లు, ఎన్నో మరిచిపోయాను, కాల్చి ఉంటాను. ఇక నీవెంట ఇంటికి వస్తాను. పాపం కేట్. తనను భయపెట్టకూడదు. ఏదీ చెయ్యి అందించు. బయట నీ బండి ఉందా?"

"బండి సిద్ధంగా ఉంది."

"అయితే అందులోనే వస్తాను. కానీ వీళ్లకు నేను డబ్బులు ఇవ్వాలి. ఎంతయిందో చూడు, వాట్సన్. నాకేమీ తెలియడం లేదు. నాకుగా నేను ఏ పనీ చెయ్యలేను."

పడుకున్న వాళ్ల మధ్యలోనుంచి నడుస్తుంటే ఊపిరి బిగించవలసి

వచ్చింది. మత్తుపొగలు అంత దట్టంగా ఉన్నాయి. అక్కడ మేనేజర్ కోసం చూచాను. కుంపటి పక్కన ఉన్న పెద్ద మనిషిని చూస్తుంటే ఒక్కసారిగా ఎవరో నా కోట్‌ను పట్టి లాగారు. “ముందుకు నడు, అప్పుడు వెనక్కు చూడు” గుసగుసగా అన్నారు. మాటలు నాకేదో గుర్తు చేశాయి. కిందకు చూచాను. మాటలను అన్నది తప్పకుండా పక్కన కూచున్న ముసలతనే. అతను మాత్రం కదలకుండా ఉన్నాడు. బక్క పలుచగా, ముడతలు పడ్డ దేహంతో, వయస్సుతో వంగిన శరీరంతో కనిపించాడు. చేతినుంచి జారి పడ్డట్టు ఒక ఓపియమ్ పైప్ అతని ఒళ్లో పడి ఉంది. నేను రెండడుగులు ముందుకు వేసి తిరిగి చూచాను. ఆశ్చర్యంతో అరవకుండా ఉండడానికి చాలా కష్టపడవలసి వచ్చింది. ముసలతను నాకు మాత్రమే కనిపించే విధంగా నా వేపు తిరిగాడు. రూపం పూర్తిగా కనిపించింది. ముడతలు లేవు. కళ్లలో వెలుగు ఉంది. నా ఆశ్చర్యానికి అంతంలేదు. మంట పక్కన కూర్చున్న మనిషి మరెవరో కాదు. నా మిత్రుడు షెర్లక్ హోమ్స్. అతను సైగచేసి నన్ను దగ్గరకు రమ్మన్నాడు. వెంటనే మామూలుగా మారి ఏదో గొణగ సాగాడు.

“హోమ్స్! ఈ డెన్‌లో ఏం చేస్తున్నావు?” గుసగుసగా అడిగాను.

“మెల్లగా మాట్లాడు. నా చెవులు బాగా పని చేస్తాయి. దయచేసి నీ స్కాటిష్ మిత్రుడిని వదిలించుకుని వచ్చేసెయ్. అప్పుడు నీతో మాట్లాడడానికి సంతోషంగా ఇష్టపడతాను.”

“బయట క్యాబ్ సిద్ధంగా ఉంది.”

“అయితే అతడిని వెంటనే ఇంటికి పంపించు. మధ్య దారిలో మరేదో గొడవ చేసే పరిస్థితిలో అతను లేడు. బండి మనిషితో మీ ఆవిడకు కూడా కబురు పంపించు. నీవు నాతో ఉన్నావని ఆమెకు తెలియాలి. బయట అయిదు నిమిషాలు వేచి ఉంటే నేను వచ్చేస్తాను.”

“షెర్లక్ హోమ్స్ అడిగిన తరువాత లేదనడం కష్టం. అతను చాలా



ఖచ్చితమయిన మనిషి. చెప్పేది సాధికారంగా చెపుతాడు. విట్నీని బండిలో ఎక్కించితే అంత టితో నా బాధ్యత తీరినట్టే. ఇక ఆ తరువాత నా మిత్రుడితో చేరి అతని సాహసకృత్యాలలో భాగం పంచుకోవడం కన్నా కావలసింది ఉండదు. ఈ పరిస్థితులు చూస్తే తప్పకుండా అటువంటిది ఏదో ఉంది. ఒక నోట్ రాశాను. విట్నీ బిల్లు చెల్లించాను. అతడిని బండిలో ఎక్కించి సాగనంపాను. చూస్తుండగానే ఓపియమ్ డెన్‌లో నుంచి ఒక ఆకారం బయటకు వచ్చింది. క్షణాలలో నేను షెర్లక్ హెూమ్స్‌తో నడుస్తున్నాను. రెండు వీధుల వరకు అతను కుంటుతూ ముందుకు వంగి నడిచాడు. అక్కడ ఒక్కసారి చుట్టూ చూచి నిటారుగా నిలబడి గట్టిగా నవ్వసాగాడు.

“వాట్సన్ కొకెయిన్ ఇంజక్షన్‌లతోబాటు ఓపియమ్ పీల్చడం కూడా నా బలహీనతల్లో ఒకటిగా మారిందని అనుకుంటున్నావు కదూ” అన్నాడతను.

“నిన్ను అక్కడ చూడడం మాత్రం తప్పకుండా ఆశ్చర్యంగా ఉంది.”

“నీ సంగతి మాత్రం అంతేకదా.”

“నేను ఒక మిత్రుడిని వెతుకుతూ వచ్చాను.”

“ఇక నేను శత్రువు కోసం”

“శత్రువా?”

“అవును, నా సహజ శత్రువుల్లో ఒకరు. కాదంటే నా వేట జంతువు.

ఒక్కమాటలో చెప్పాలంటే వాట్సన్, నేనొక ముఖ్యమయిన పరిశోధనలో ఉన్నాను. మత్తు భాయీల మాటల్లో నాకేమన్నా సూచనలు దొరుకుతాయేమోనని కాపు కాశాను. అక్కడ నన్ను ఎవరన్నా గుర్తించారంటే అంతటితో నా పని ముగుస్తుంది. మునుపు ఎప్పుడో కూడా అక్కడ తచ్చాడి అనుమానాలకు గురయ్యాను. డెన్ మనిషి లాస్కర్ నామీద పగబట్టి ఉన్నాడు. బిల్డింగ్ వెనుక ఒక ట్రాప్ డోర్ ఉంది. అది నది పక్కకు దారితీస్తుంది. చీకటి రాత్రుల్లో ఆ ప్రాంతంలో జరిగే చిత్రాలను గురించి ఎంత చెప్పినా తక్కువే."

"ఏమిటి? హత్యలా"

"అవును, శరీరాలు వాట్సన్! డెన్‌లో చావుకు గురయి అక్కడకు చేరిన ఒక్కొక్క మనిషికి వెయ్యి గిట్టితే ఇప్పటికి మనం చాలా ధనవంతులమయి ఉండేవాళ్లం. ఈ నది ప్రాంతంలో ఇంతకంటే అన్యాయం చోట మరొకటి లేదు. ఇక్కడికి వచ్చిన వాళ్లు బయట పడడం కష్టం. ఇక్కడే మనం కాపు కాయాలి." అతను తన రెండు చూపుడు వేళ్లను నోట్లో పెట్టుకుని కీచుగా ఈలవేశాడు. కొంతదూరం నుంచి అదేరకం ఈల జవాబుగా వినిపించింది. వెంటనే గుర్రంబండి ఒకటి ప్రత్యక్షమయింది.

బండి పక్కదీపాలు ఆ చీకటిలో బంగారు దారులను తయారు చేశాయి. "వాట్సన్, మరి నావెంట వస్తావు కదూ?" అన్నాడు హోమ్స్.

"నా వల్ల ఏదన్నా పని జరుగుతుందంటే వస్తాను."

"ఓహ్, నీవంటి మిత్రుడి వల్ల ఎప్పటికీ ఉపయోగమే. అందునా నా కథలు రాసే వాడయితే మరింతగా! ద సీడర్స్‌లో నేను ఉండేది డబుల్ బెడెడ్ రూమ్"

"ద సీడర్స్‌లోనా?"

"అవును. అది మిస్టర్ సెయింట్ క్లెయిర్‌గారి నివాసం. విచారణ



సమయంలో నేను అక్కడే ఉంటున్నాను.”

“ఏ ప్రాంతంలో ఉంది అది?”

“కెంట్‌లో లీ దగ్గర. అంటే మనం ఏడు మైళ్లు వెళ్లాలి.”

“నాకు సంగతి తెలియలేదు.”

“నిజమే, ఇప్పుడే చెపుతాను. బండి ఎక్కు ముందు. జాన్, నీవు రానవసరం లేదు. ఇదిగో ఒక క్రౌన్. రేపు పదకొండు ప్రాంతాల నాకోసం చూడు. ఇవాళటికి మమ్మల్ని వదిలెయ్.”

అతను కొరడాతో గుర్రాన్ని ఒకసారి అదిలించాడు. ఎవరూ లేని ఆ వీధుల్లో మా బండి పరుగెత్తసాగింది. వీధి రానురాను వెడల్పు అయ్యింది. కొంతసేపటికి మేము ఒక వంతెన మీద ఉన్నాము. కింద నదిలో మురికినీరు నెమ్మదిగా పారుతున్నది. అటు పక్కన పాత ఇళ్లు ఉన్నాయి. అంతా నిశ్శబ్దంగా ఉంది. పోలీస్ వాళ్లు తిరుగుతున్న చప్పుడు, తాగుబోతుల పాటలు తప్ప మరే శబ్దమూ లేదు. ఆకాశం కూడా నిర్మలంగా ఉంది. మేఘాలలో నుంచి అక్కడక్కడ ఒకటి రెండు నక్షత్రాలు మిణుకుమిణుకుమంటున్నాయి. తలను ఎదమీదకు వంచుకుని హొమ్స్ బండిని నిశ్శబ్దంగా నడిపిస్తున్నాడు. ఆలోచనలో మునిగి ఉన్నాడు. అతనిని అంతగా ఆలోచింప చేస్తున్న ఈ కొత్త విషయం ఏమిటా అని తెలుసుకోవాలనే ఆశతో నేనూ ఊరికే కూచుని

ఉన్నాను. చాలా మైళ్లు పయనించాము. ఊరి చివరన ఉండే విల్లాల మధ్యకు చేరుకున్నాము. హోమ్స్ ఒక్కసారి కుదిపినట్టు కదిలాడు. భుజాలు ఎగురవేసి, చాలా సంతృప్తిగా ఉన్న మనిషి మాదిరి పైప్ అంటించాడు.

"నీకు నిశ్శబ్దంగా ఉండే శక్తి చాలా బలంగా ఉంది, వాట్సన్. ఇటు వంటి సహచరుడు ఉండడం చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఏదో చెప్పవలసి వచ్చినప్పుడు మాట్లాడడానికి ఒకరు ఉండడం బాగుంటుంది. మనం వెళుతున్న ఇంట్లో ఇల్లుగల ఆవిడ ఇప్పుడు ఎదురు వస్తే ఏం చెప్పాలా అని ఆలోచిస్తున్నాను" అన్నాడతను.

"నాకీ వ్యవహారం గురించి ఏమాత్రం తెలియదని నీవు మరచి పోతు న్నావు."

"లీ చేరుకునే లోగా కేసుకు సంబంధించిన వాస్తవాలను నీకు చెప్పడానికి టైమ్ ఉంది. చూడడానికి అంతా సులభంగానే ఉంది. కానీ నాకు ఏమాత్రం లోతు అందడం లేదు. సూత్రాలు మాత్రం ఉన్నాయనడంలో అనుమానం లేదు. వాటి చివర ఎక్కడ ఉందో చేతికి చిక్కడం లేదు. సూక్ష్మంగా విషయాలు నీకు చెపుతాను. నేను గమనించలేనిది నీవేమయినా చూడగలుగుతావేమో!"

"కానీ మరి"

"కొన్ని సంవత్సరాల క్రితం – ఖచ్చితంగా చెప్పాలంటే, 1884 మే మాసంలో – లీ ప్రాంతానికి, నెవిల్ సెయింట్ క్లేర్ అనే పెద్దమనిషి వచ్చాడు. అతను చాలా డబ్బు ఉన్నవాడిలా కనిపించాడు. పెద్ద విల్లా కొన్నాడు. చుట్టూ చక్కని తోట ఏర్పాటు చేసుకుని మంచి హోదాతో బతుకుతున్నాడు. రానురాను చుట్టుపక్కల వారితో నేస్తం కట్టాడు. 1887లో అక్కడి ఒక వ్యాపారి కూతురిని పెళ్లి చేసుకున్నాడు. ఇప్పుడు అతనికి ఇద్దరు పిల్లలు కూడా. అతనికంటూ ఒక పనిలేదు. చాలా కంపెనీలలో పెట్టుబడి ఉన్నట్లుంది, కానీ ప్రతినిత్యం తప్పకుండా పొద్దున్నే నగరంలోకి వెళతాడు. సాయంత్రం 5:14 కానన్ స్ట్రీట్ రైల్‌కు తప్పకుండా ఇల్లు చేరుకుంటాడు. మిస్టర్ సెయింట్

క్లేర్‌కి 37 సంవత్సరాలు ఉంటాయి. మామూలు అలవాట్లు కలవాడు. మంచి భర్త, పిల్లల మీద బోలెడు ప్రేమ. అతడితో పరిచయం ఉన్న వాళ్లంతా మంచివాడనే అంటారు. ప్రస్తుతం అతని ఆస్తి, మనకు తెలిసినంతవరకు 88 పౌండ్ల 10 షిల్లింగ్‌లు. ఇక కాపిటల్ అండ్ కౌంటీస్ బ్యాంకులో 220 పౌండ్లు ఉన్నాయి. కనుక అతనికి డబ్బువలన చిక్కులేవీ లేవని సులభంగానే చెప్పవచ్చు.

"గడిచిన సోమవారం నెవిల్ సెయింట్ క్లేర్ మామూలు కంటే కొంచెం ముందే నగరంలోకి వెళ్లాడు. వెళ్లేముందు, తనకు ఏవో ముఖ్యమయిన పనులు రెండు ఉన్నాయని, తిరిగి వచ్చే సమయంలో పిల్లల కొరకు బ్రిక్స్ పెట్టె తెస్తానని చెప్పాడు. సరిగ్గా ఆ సోమవారం నాడే అతను వెళ్లిన కొంత సమయానికి, భార్యకు ఒక టెలిగ్రామ్ వచ్చింది. ఆమె ఎదురు చూస్తున్న ఒక విలువయిన పార్శిల్ వచ్చిందని, అది ఆబర్డీన్ షిప్పింగ్ కంపెనీ వారి ఆఫీస్ నుండి తీసుకోవచ్చని అందులో ఉంది. లండన్ గురించి నీకు బాగా తెలుసుకదా, ఆ కంపెనీ ఆఫీస్ ఫ్రెస్నో వీధిలో ఉంది. అది అప్పర్ స్వాండామ్ లేన్‌కు పక్కనే ఉంటుంది. రాత్రి నీకు నేను కనిపించింది అక్కడే కదా. సెయింట్ క్లేర్ భార్య భోజనం తరువాత నగరంలోకి బయలుదేరింది. కొంత షాపింగ్ చేసి, కంపెనీ ఆఫీస్‌కు వెళ్లి పార్శిల్ తీసుకుంది. సరిగ్గా 4:35 ప్రాంతాన స్వాండామ్ లేన్‌లో స్టేషన్ వేపు నడుస్తూ ఉన్నది. ఇప్పటివరకు చెప్పింది అర్ధమయిందా?"

"శుభ్రంగా అర్ధమయింది."

"సోమవారం చాలా వేడిగా ఉందని నీకు గుర్తు ఉండి ఉంటుంది. మిసెస్ సెయింట్ క్లేర్ నెమ్మదిగా నడుస్తూ క్యాబ్ దొరుకుతుందని అటుఇటూ చూస్తున్నది. ఆమెకు ఆ ప్రాంతం తీరు నచ్చలేదు. స్వాండామ్ లేన్‌లో అలా నడుస్తూ ఉండగా ఎవరో ఆశ్చర్యంగా అరవడం విని పించింది. తల పైకెత్తి చూస్తే పక్కన ఒక ఇంటి రెండవ అంతస్తు కిటికీలో తన భర్త ముఖం

కనిపించింది. ఆయన తనను పిలుస్తున్నట్టు తోచింది. కిటికీ తెరిచి ఉంది. అతని ముఖం స్ఫుటంగా కనించింది. అయితే అతను ఏదో గాబరాగా ఉన్నట్టు తోచింది. అతను చేతులెత్తి కదిలించాడు. కానీ మరుక్షణం అక్కడి నుంచి మాయమయ్యాడు. వెనుకనుంచి ఎవరో బలంగా లాగినట్టు కనిపించింది. ఆమె సహజంగా గమనించి ఒక విషయం మాత్రం చూడగలిగింది. భర్త కోట్ వేసుకున్నాడు, కానీ కాలర్, నెక్ టై మాత్రం లేవు.

“జరగకూడనిది ఏదో జరిగిందనిపించి ఆమె ఆ ఇంటి వేపు పరుగెత్తింది. అది ఇల్లు కాదు, రాత్రి నీవు చూచిన ఓపియమ్ డెన్. ముందు గదిలోనుంచి ఆమె మెట్ల దగ్గరకు చేరుకుని పై ఫ్లోర్‌లోకి వెళ్లడానికి



ప్రయత్నించింది. కానీ నేను చెప్పిన లాస్కర్ భడవ ఉన్నాడే, వాడు ఆమెకు ఎదురు వచ్చి ఆపాడు. వాడికి సహాయకుడిగా మరొకడు కూడా వచ్చి ఆమెను బయటకు పంపించారు. మనస్సులో భయం, అను మానాలు నిండుకుని ఉండగా ఆమె వీధిలో పరుగెత్తింది. అదృష్టంగా ఫ్రెస్నో వీధిలో కొంతమంది కానిస్టేబుల్స్, ఒక ఇన్స్‌పెక్టర్ కనిపించారు. వాళ్లంతా డ్యూటీకి వెళుతున్నారు. ఇద్దరు పోలీసులతో ఇన్స్‌పెక్టర్ ఆమె వెంటవచ్చాడు. డెన్ యజమాని అడ్డుకుంటున్నా

వాళ్లంతా మిస్టర్ సెయింట్ క్లేర్ కనిపించిన గదిలోకి దూసుకు వెళ్లారు. అక్కడ అతని జాడలేదు. అతనే కాదు, ఒక్క బిచ్చగాడిలా కనిపించే వ్యక్తి తప్ప ఆ ఫ్లోర్‌లో మరెవ్వరూ లేరు. ఆ దిక్కులేని మనిషి మాత్రం ఎప్పుడూ అక్కడే ఉంటాడట. అతను, లాస్కర్ ఇద్దరూ ఆ గదిలోకి ఎవరూ రాలేదని గట్టిగా చెప్పారు. ఇన్స్‌పెక్టర్‌కు కూడా అనుమానం మొదలయింది. మిసెస్ సెయింట్ క్లేర్ ఏదో భ్రమలో పడి ఉంటారని అనుకోసాగాడు. అంతలోనే ఆమె గట్టిగా అరిచింది. బల్లమీద పెట్టి ఉన్న ఒక పెట్టెను చూపించి దాన్ని అందుకుంది. అందులోనుంచి పిల్లలు ఆడుకునే బ్రిక్స్ కిందకు జారిపడ్డాయి. తన పిల్లలకు తండ్రి తెస్తానన్న ఆట వస్తువులు అవే.

"ఆ వస్తువులు కనిపించడం, బికారి మనిషి కనపరిచిన అస్తవ్యస్త ధోరణి, కలిసి ఇన్స్‌పెక్టర్‌కు అనుమానం కలిగించాయి. అతను గదిని పరి శీలించసాగాడు. అక్కడ ఏదో గొప్ప నేరం జరిగిందన్న దాఖలాలు ఎదు రయ్యాయి. ముందు గది చాలా మామూలుగా ఉంది. లోపలికి ఒక చిన్న పడక గది ఉంది. అక్కడ కిటికీలోనుంచి చూస్తే నది అంచు, రేవులు కన బడతాయి. నదికి, గోడకు మధ్యన కొంత నేల ఉంది. అది అలలు ఎక్కువగా వచ్చినప్పుడు తడిగా మారుతుంది. కనీసం నాలుగు అడుగుల ఎత్తు నీళ్లు వస్తాయి. పడక గదిలో కిటికీ బాగా పెద్దది. అది కింద నుంచి పైకి తెరిచే రకం. పరీక్షగా చూచిన తరువాత ఆ కిటికీ కిందవేపున రక్తం మరకలు కనిపించాయి. రక్తం బెడ్‌రూమ్‌లోని నేలమీద కూడా అక్కడక్కడ చుక్కలుగా పడి ఉంది. ముందు గదిలో ఒక తెర వెనుక నెవిల్ దుస్తులు అన్నీ ఉన్నాయి. ఏదో నేరం, పెనుగులాట జరిగిన సాక్ష్యాలు మాత్రం ఆ దుస్తుల మీద లేవు. ఇక నెవిల్ తాలూకు మరే వస్తువులూ అక్కడ కనిపించలేదు. అతను తప్పకుండా ఈ కిటికీలోనుంచే బయటకు పోయి ఉంటాడు. బయటకు వెళ్లడానికి గదిలోనుంచి మరో దారిలేదు. రక్తం మరకలు, అనుమానాలను మరింత ఎక్కువ చేస్తున్నాయి. అనుకోని దారణమేదయినా

జరిగి ఉండవచ్చునని.

"ఇక ముందుగా అనుమానానికి ఆస్కారమిస్తున్న మనుషుల సంగతి. లాస్కర్ అన్ని రకాలా దుర్మార్గుడు. కానీ మిసెస్ క్లేర్ చెప్పిన దాన్ని బట్టి అతడు ఆమె వచ్చిన మరుక్షణం మెట్ల దగ్గర కనిపించాడు. కనుక తన భర్త మాయం కావడంలో అతని హస్తం ఉండడానికి వీల్లేదని ఆమె అంటుంది. హ్యూ బూన్ గురించి తనకేమీ తెలియదని లాస్కర్ చెపుతాడు. ఒక మనిషి దుస్తులు ఆ గదిలోకి ఎట్లా వచ్చాయన్నది కూడా తనకు తెలియదంటాడు.

"మేనేజర్ సంగతి అది. ఇక గదిలో ఉండే వికారరూపం గల బికారి సంగతి. నెవిల్ సెయింట్ క్లేర్‌ని అతను తప్ప మరొకరు చూచే అవకాశం లేదు. ఆ అవకరాల మనిషి పేరు హ్యూ బూన్. నగరంలో తిరిగే వారికి అందరికీ అతని వికారమయిన ముఖం బాగా తెలుసు. అతనొక బిచ్చగాడు. కానీ పోలీసులు పట్టుకుంటారని చిన్న వ్యాపారిలాగా నటిస్తుంటాడు. అగ్గిపెట్టెలు అమ్ముతున్నానంటాడు. థ్రెడ్ నీడిల్ స్ట్రీట్‌లో ఎడమ చేతి పక్కన ఒక గోడమూలన అతను ఎప్పుడూ కూచుని ఉంటాడు. ఎప్పుడూ అక్కడే అగ్గిపెట్టెలు ముందు పెట్టుకుని, వికారంగా అరుస్తూ కనపడతాడు. మకిలి పట్టిన లెదర్ క్యాప్ ముందు పెట్టి ఉంటుంది. అటుగా వచ్చేవారు ఒక నాణెం ఏదో అందులో



వేస్తుంటారు. అతనిని నేను కూడా చాలాసార్లే చూచాను. అతని ముందు రాలిన నాణాలు చూచి ఆశ్చర్యపోయాను కూడా. అతని రూపం చాలా వికారంగా ఉంటుంది. గమనించకుండా ఎవరూ ముందుకు కదలరు. జుట్టు నారింజరంగు, ముఖం మీద ఒక పెద్ద గాయపు గుర్తు, దాని కారణంగా అతని పైపెదవి పైకి ఎత్తినట్టు ఉంటుంది. గడ్డం బాగా ముందుకు వచ్చినట్టు ఉంటుంది. కళ్లు మరీ నల్లనివి. మొత్తానికి ఇవన్నీ కలిపి అతను ప్రత్యేకంగా కనబడతాడు. అతని మాటలు అంతకన్నా చిత్రంగా ఉంటాయి. ఎవరేమన్నా, అనకున్నా అతను ఏవో చిత్రమయిన మాటలు అంటూ ఉంటాడు. అదుగో అతనే, ఓపియమ్ డెన్ రెండవ అంతస్తు గదిలో ఉండే బికారి. నెవిల్‌ని చివరగా చూచే అవకాశం ఉన్న మనిషి అతనే.”

“కానీ, అవకరాలు ఉన్నా యని అంటున్నావు. కాలూ చెయ్యి సరిగ్గా లేని మనిషి, ఆరోగ్యంగా ఉన్న మరో మనిషి మీద దాడి ఎట్లా చేశాడు?”



“అవకరం అంటే, అతను కొంత కుంటుతాడు, అంతే. మరి ఏ రకంగా చూచినా మంచి ఆరోగ్యం కలవాడే. పుష్టిగలవాడు కూడా. నీవు డాక్టర్‌వి కదా. శరీరంలో ఒక భాగంలో లోపం ఉంటే, మరో దాంట్లో దానికి బదులు ఎక్కువ శక్తి ఉంటుందని ఒప్పుకుంటావేమో.”

“చెప్పే విషయం పూర్తిగా చెప్పు.”

“కిటికీలో రక్తం చూచిన తరువాత నెవిల్ భార్య మూర్ఛ పోయింది. పోలీసులు ఆమెను బండిలో ఇంటికి పంపించారు. పరిశోధనలో ఆమె చేయగలిగింది కూడా ఏమీలేదు. ఇన్స్పెక్టర్ బార్టన్ కేసు బాధ్యతలను తీసుకుని మొత్తం ప్రదేశాన్ని బాగా పరిశీలించాడు. కానీ ఏమీ దొరకలేదు. వెంటనే బూన్‌ని అరెస్ట్ చేయకపోవడం మాత్రం పెద్ద తప్పయింది. ఈ పరిశీలన జరుగుతున్న సమయంలో అతను లాస్కర్‌తో ఏవో చర్చలు చేసినట్టున్నాడు. పొరపాటు దిద్దుకుని బూన్‌ని అరెస్ట్ చేశారు, పరీక్షించారు. అతని దగ్గర నేరానికి సంబంధించిన ఆధారాలేవీ కనిపించలేదు. అతని చొక్కా కుడిచేతి మీద చిన్న రక్తపు మరకలు ఉన్నాయి. అడిగితే ఉంగరపు వేలు చివరన గోటిదగ్గర ఉన్న గాయాన్ని చూపించాడు. దానివల్లే రక్తం వచ్చిందన్నాడు. తాను కిటికీ దగ్గరకు కూడా వెళ్లానని, అక్కడి రక్తంచుక్కలు తనవే అయ్యుండవచ్చునని కూడా అన్నాడు. తాను నెవిల్ సెయింట్ క్లేర్‌ని మాత్రం చూడనే చూడలేదని, అతని దుస్తులు గదిలో కనిపించడం పోలీసులకు లాగానే తనకు కూడా అంతుపట్టకుండా ఉందని అన్నాడు. ఇక నెవిల్ భార్య కిటికీలో తన భర్త ముఖాన్ని చూడడం కేవలం ఒక భ్రమ అయ్యుండవచ్చునని కూడా అన్నాడు. నీళ్లు వెనక్కు తగ్గిన తరువాత ఏమయినా కనిపించవచ్చునని ఇన్స్పెక్టర్ కొంతసేపు అక్కడే వేచి ఉన్నాడు.

“నిజంగానే అక్కడేదో దొరికింది. అది నెవిల్ సెయింట్ క్లేర్ వేసుకున్న కోట్. క్లేర్ మాత్రం కనిపించలేదు. ఆ కోట్‌లో ఏమున్నాయో ఊహించ గలవా?”

“నాకేం తెలుసు?”

“నిజమే, ఎవరూ ఊహించలేరు. ప్రతి జేబులోను నాణాలు ఉన్నాయి. మొత్తం కలిసి 421 పెన్నీలు, 270 అరపెన్నీలు. కనుకనే కోట్ నీటిలో కొట్టుకుని పోలేదు. నిజానికి అక్కడ నీళ్లు ఉధృతంగానే ఉంటాయి. బరువు ఉన్నందుకు కోట్ మిగిలిపోయి, శరీరం కొట్టుకుపోవడానికి కూడా అవకాశం

ఉంది.”

“అతని మిగతా దుస్తులన్నీ గదిలో కనిపించాయన్నారు కదా! ఒక్క కోట్‌తో మాత్రమే అతను కిందకు వెళ్లాడా?”

“లేదు, అన్ని విషయాలను తరచి ఆలోచించాలి కదా. బూన్ అనే ఈ బికారి నెవిల్‌ని కిటికీలోనుంచి కిందకు తోశాడు అనుకుందాం. మరో మనిషికి ఆ సంగతి కనిపించదు. అప్పుడు అతను ఏం చేస్తాడు? సాక్ష్యాలను వదిలించుకోవాలని అనుకుంటాడు. ముందుగా కోట్ దొరికింది. దాన్ని బయటపడేయాలి, అది నీటిలో తేలుతుందని తెలుసు. కింద గొడవ జరుగుతున్నదని, అతని భార్య పైకి వచ్చే ప్రయత్నం చేస్తున్నదని తెలుసు. సహచరుడు లాస్కర్ ఆమెతో పేచీ పెట్టుకుంటున్నాడు. పోలీసులు కూడా వచ్చేశారు. కనుక ఒక్క క్షణం ఆలస్యం చెయ్యడానికి లేదు. తన రహస్య స్థలానికి వెళ్లి తాను బిచ్చమెత్తి సంపాదించిన డబ్బులను కోట్ జేబుల్లో కుక్కాడు. దాన్ని ఇప్పుడు బయటపడేస్తే అది మునిగిపోతుంది. మిగతా దుస్తులను బయట పడేసే లోపల పోలీసులు వచ్చేశారు. అతనికి కిటికీ మూసి కూర్చునేందుకు మాత్రమే సమయం మిగిలింది.”

“అలా కూడా జరిగే అవకాశం ఉంది.”

“మరో ఆలోచన ఏదీ లేదు కనుక ఈ సిద్ధాంతంతో ముందుకు వెళదాం. బూన్‌ని అరెస్ట్ చేశారని చెప్పాను కదా. కానీ, అతను చేసిన నేరమేమిటో మాత్రం ఎవరూ చెప్పలేరు. అతను చాలాకాలంగా, బిచ్చమెత్తడమే వృత్తిగా బతుకుతున్నాడని, కనుక అమాయకుడని చాలామంది చెపుతారు. ఇదీ పరిస్థితి. ఇక నెవిల్ సెయింట్ క్లేర్, ఓపీయమ్ డెన్‌మీద గదిలో ఏం చేస్తున్నాడు, మరి ఏమయ్యాడు, ఇప్పుడు ఎక్కడ ఉన్నాడు, అతను మాయమవడానికి, బూన్‌కి సంబంధం ఏమిటి – ఇవన్నీ ప్రశ్నలు. జవాబులు లేని ప్రశ్నలు. మొదటి చూపులోనే ఇంత గజిబిజిగా కనిపించిన కేసు నా అనుభవంలో మరొకటి లేదు. ఇంత కష్టమయినదీ లేదు.”

షెర్లక్ హోమ్స్ ఈ వివరాలన్నీ చెపుతుండగా మేము నగరం అంచుల దాకా వచ్చాము. గుంపులుగా ఉన్న ఇళ్లు పోయి విశాలమయిన ప్రాంతాలలో కట్టుకున్న పెద్దపెద్ద ఇళ్లు కనపడసాగాయి. ఆ తరువాత రెండు చిన్నచిన్న పల్లెలు దాటాము. అక్కడ కొన్ని కిటికీలలో దీపాలు మినుకుమినుకు మంటున్నాయి.

"మనం లీ చేరుకుంటున్నాం. ఈ కొద్ది సేపట్లోనే మూడు కౌంటీలు దాటాము. మిడిల్‌సెక్స్, తరువాత సర్రే, ఆ తరువాత కెంట్ దాటాము. అక్కడ చెట్లలో వెలుగు కనపడుతున్నది కదూ. అది ద సీడార్స్. అక్కడ దీపం పక్కన కూర్చున్న అమ్మగారు తప్పకుండా, ఇప్పటికే గుర్రం గిట్టల చప్పుడు వినిఉంటారని నా అభిప్రాయం."

"నీవు ఈ కేసును బేకర్ స్ట్రీట్‌లో ఉండి ఎందుకు పరిశోధించడం లేదు?" నేను అడిగాను.

"చాలా వ్యవహారాలలో అక్కడే ఉండి పరిశోధనలు సాగించడం మంచి పద్ధతి. మిసెస్ సెయింట్ క్లేర్, దయతో రెండు గదులను నాకు వదిలేశారు. నాతో పాటు ఒక మిత్రుడు, సహచరుడు వచ్చాడంటే ఆమె తప్పకుండా స్వాగతిస్తుంది. వాట్సన్, ఇప్పుడు నాకు ఆమెను కలవాలని లేదు. ఆమె భర్త గురించి కొత్తగా ఒక్క సంగతి కూడా తెలియలేదు." అంటూ గుర్రాన్ని అదిలించి బండి ఆపాడు.

మేము ఒక పెద్ద విల్లా ముందు దిగాము. చుట్టూ విశాలమయిన ఆవరణ ఉంది. ఒక అబ్బాయి వచ్చి గుర్రం పగ్గాలను పట్టుకున్నాడు. నేను కూడా కిందకు దూకి హోమ్స్ వెంట నడుస్తూ వెళ్లాను. మేము అక్కడికి చేరకముందే తలుపు తెరుచుకుంది. ఒక ఆవిడ తలుపు తెరిచి నిలబడింది. వెనక నుంచి వస్తున్న వెలుతురులో ఆమె ఆకారం బొమ్మ గీసినట్టు కనపడింది. ఒక చేతిని తలుపుమీద పెట్టి మరొక దాన్ని పైకి ఎత్తి కుతూహలంగా తల ముందుకు వంచి ఆమె ఒక ప్రశ్నలా నిలుచుంది.

"వచ్చారా?" అన్నదామె. ఇద్దరు మనుషులు ఉండడం గమనించి ఆమె గొంతు తగ్గించింది. నా సహచరుడు తల పంకిస్తు ముందుకు చూచాడు.

"మంచివార్త ఏమీ లేదా?"

"ఏమీ లేనట్టే."

"చెడువార్త కూడా లేదు కదా?"

"లేదు."

"దేవుడు కరుణించాడు. ముందు లోపలికి రండి. బాగా అలిసి ఉంటారు. రోజంతా పనిలో ఉన్నారు."

"ఈయన నా మిత్రుడు, డాక్టర్ వాట్సన్. నా కేసుల్లో చాలా సందర్భాలలో గొప్ప సహాయం చేస్తుంటాడు. ఈ పరిశోధనలో కూడా వెంట ఉంటాడని అతనిని ఇక్కడికి తీసుకురావడం అదృష్టవశాత్తూ వీలయింది."

"సంతోషం, ఇక్కడ ఏర్పాట్లలో ఏమయినా లోపాలుంటే క్షమించాలి. మేము మామూలు పరిస్థితులలో లేమని తెలిసే ఉంటుంది." నా చేతిని నెమ్మదిగా నొక్కుతూ అన్నదామె.

"మై డియర్ మేడమ్, నేను సైన్యంలో పనిచేశాను. మీరు ఎటువంటి క్షమాపణలు చెప్పనవసరం లేదు. మీకు గానీ, నా మిత్రునికి గానీ నా వల్ల ఏదయినా సాయం వీలయితే అంతకంటే సంతోషం లేదు."

మేమంతా దీపాలతో నిండిన ఒక డయినింగ్ రూమ్‌లోకి ప్రవే శించాము. అక్కడ బల్లమీద చల్లబడిన భోజనం సిద్ధంగా ఉంది. "మిస్టర్ షెర్లక్ హోమ్స్ ఒకటి రెండు మామూలు ప్రశ్నలు అడగాలని ఉంది. సూటిగా సమాధానాలు చెప్పమని వేడుకుంటున్నాను" అన్నదామె.

"తప్పకుండా, మేడమ్."

"నా పరిస్థితిని గురించి మీరేమీ గాభరా పడవద్దు. నేను గోల చేసి

మూర్ఛపోయే రకం కాదు. నిజం తెలుసుకోవాలనుకుంటున్నాను. మీ నిజమయిన అభిప్రాయం కావాలి.”

“దేని గురించి?”

“నిజంగా చెప్పండి, నెవిల్ ఇంకా బతికే ఉన్నారని మీరనుకుంటు న్నారా?”

ప్రశ్నతో షెర్లక్ హెూమ్స్ కొంచెం తికమకపడినట్టు కనిపించింది. ఆమె పక్కనే నిలబడి హెూమ్స్ వేపు చూస్తూ “నిజంగా చెప్పండి” అని అడిగింది.

“ఉన్నమాట చెప్పాలంటే, మేడమ్, అతను ఉన్నాడని నేను అనుకోవడం లేదు.”



"అయితే, పోయారంటారా?"

"అవును."

"చంపబడ్డారా?"

"బహుశా, అది నేను చెప్పలేను."

"ఏ రోజున పోయి ఉండవచ్చునంటారు?"

"సోమవారం నాడు."

"అయితే మరి, మిస్టర్ హెూమ్స్, ఆయన దగ్గర నుంచి ఇవాళ నాకు ఒక ఉత్తరం రావడం ఎట్లా వీలయింది, మీరే చెప్పాలి."

షెర్లక్ హెూమ్స్ ఒక్కసారిగా ఎగిరి లేచినిలబడ్డాడు.

"ఏమిటది!" గట్టిగా అడిగాడు.

"అవునండి, నిజంగానే." ఆమె చేతిలోని ఒక కాగితాన్ని ఆడిస్తూ చూపించింది.

"ఏదీ, ఇటు ఇవ్వండి."

అతను ఆత్రంగా కాగితాన్ని లాక్కున్నాడు. బల్లమీద పెట్టి చదును చేసి దీపం వెలుతురులో దాన్ని పరిశీలించసాగాడు. నేనూ లేచి అతని భుజాలమీదుగా దాన్నే చూడసాగాను. ఎన్వలోప్ చాలా మొరటుగా ఉంది. దానిమీద గ్రేవ్స్ ఎండ్ పోస్ట్‌మార్క్ ఉంది. అందులో ఇవాళటి తేదీయే ఉంది. నిన్నటిది అనాలి. అప్పుడు సమయం పన్నెండు దాటింది మరి.

"రాత మొరటుగా ఉంది. ఇది మీ భర్త చేతిరాత అయి ఉండదు." గొణిగాడు హెూమ్స్.

"కాదు, కవర్ మాత్రం ఆయనదే."

"కవర్‌మీద అడ్రస్సు రాసిన వాళ్లకు మీ చిరునామా వివరాలు తెలియవని కూడా చెప్పగలను."



"అదెట్లాగ?'

"మీరు గమనిస్తే, పేరు నల్లని అక్షరాల్లో రాసి ఉంది. అది బాగా ఆరింది కూడా. మిగతా రాత మాత్రం అంత నల్లగా లేదు. దానిమీద బ్లాటింగ్ పేపర్ అద్దినట్లు కూడా కనపడుతున్నది. అంటే ముందు పేరు రాశారు, పూర్తి చిరునామా రాసే లోపల కొంతకాలం పట్టింది. అంటే పేరు రాసిన మనిషికి చిరునామా తెలియదనే కదా. ఇది నిజానికి చాలా చిన్న విషయం. కానీ చిన్న విషయాలకన్నా ముఖ్యమయినవి వేరే ఉండవు. ఇక ఉత్తరం చూద్దాం. హో! లోపల ఇంకేదో ఉంది!"

"అవును, ఒక ఉంగరం ఉంది. అతని సిగ్నెట్ రింగ్."

"ఇది తప్పకుండా మీ ఆయనగారి చేతిరాతేనా?"

"సందేహం లేదు. ఒక చేతిమీదిది."

"అంటే ఏమిటి?"

"ఆయన వేగంగా రాస్తే ఇల్లాగే ఉంటుంది. మామూలు రాత మరోరకంగా ఉంటుంది. కానీ నాకు రెండూ తెలుసు."

> *"ప్రియతమా, నీవు దిగులు పడవద్దు. అంతా సర్దుకుంటుంది. ఒక పెద్ద పొరపాటు జరిగింది. దిద్దు కోవడానికి కొంత సమయం పడుతుంది. అంతవరకు ఓపికగా వేచి ఉండాలి.*
>
> *నెవిల్.*

"ఒక పుస్తకంలోనుంచి చించిన కాగితం మీద పెన్సిల్‌తో అక్షరాలు రాసి ఉన్నాయి. వాటర్ మార్క్ కూడా ఏదీ లేదు. ఇవాళే గ్రేవ్స్ ఎండ్‌లో పోస్ట్ చేశారు. ఆ పని చేసిన మనిషి వేళ్లు మురికిగా ఉన్నాయి. అతను పొగాకు నములుతాడని కూడా చెప్పగలను. ఇప్పుడు చెప్పండి, నిజంగా ఇది మీ భర్త చేతిరాతేనా?"

"ఏమాత్రం అనుమానం లేదు. అది తప్పకుండా నెవిల్ రాత."

"గ్రేవ్స్ ఎండ్‌లో ఇవాళే ఉత్తరాన్ని పోస్ట్ చేశారు. అంటే మబ్బులు విచ్చుకుంటున్నాయి, మిసెస్ సెయింట్ క్లేర్! అయినా ప్రమాదమేమీ జరగలేదని మాత్రం చెప్పలేను."

"కానీ అతను బతికి ఉన్నాడని మాత్రం రుజువయింది కదా!"

"ఈ రాత ఫోర్జరీ అయితే తప్ప. ఉంగరం కూడా అంత గట్టి రుజువు కాదు. దొంగిలించారేమో!"

"లేదు, లేదు. రాత మాత్రం తప్పకుండా ఆయనదే."

"బాగుంది, కానీ ఉత్తరాన్ని సోమవారం నాడు రాసి ఇవాళ పోస్ట్ చేసి ఉండవచ్చు కదా!"

"అలా జరిగే వీలుంది."

"అదే నిజమయితే, ఆ తరువాత ఎంతయినా జరిగి ఉండవచ్చు."

"మిస్టర్ హోమ్స్, మీరు నన్నిలా అధైర్యపరచకండి. ఆయనకు ఏమీ కాలేదని నాకు నమ్మకంగా ఉంది. మా ఇద్దరికీ మధ్య చాలామంచి పొంతన ఉంది. ఆయనకు ఏమయినా జరిగితే నాకు తెలిసిపోతుంది. సోమవారం నాడు ఆయన బెడ్‌రూమ్‌లో ఉన్నారు. డైనింగ్ రూమ్‌లో ఉన్న నేను వేగంగా పైకి పరుగెత్తాను. ఆయనకు ఏదో జరిగిందని నాకు తోచింది. వెళ్లి చూస్తే ఆయన వేలు తెగింది. ఇంత చిన్న విషయాన్నే తెలుసుకున్న నేను, ఆయన మరణాన్ని పసిగట్టలేకపోతానా?"

"ఒక మహిళ అభిప్రాయాలకన్నా, పరిశోధకుడు చేసే విశ్లేషణ ముఖ్యమయినదని చెప్పడానికి నాకు ఎన్నో ఆధారాలు ఉన్నాయి. అయినా మీ మాటలు నిజమనడానికి ఈ ఉత్తరంలో ఆధారాలు ఉన్నాయి. మీ భర్త జీవించి ఉండి ఉత్తరం రాసే పరిస్థితిలో ఉంటే, మీ దగ్గరకు రాకుండా ఎందుకు ఉండిపోయారు?"

"నేను ఊహించలేను. నాకేమీ తోచడం లేదు."

"సోమవారంనాడు బయలుదేరే ముందు ఆయన మీకు ఏమయినా చెప్పరా?"

"లేదు"

"స్వాండామ్ లేన్‌లో ఆయనను చూచి మీరు ఆశ్చర్యపోయారు, అంతేనా?"

"పూర్తిగా."

"ఆ కిటికీ తెరిచి ఉందా?"

"అవును."

"ఆయన మిమ్మల్ని పిలిచి ఉంటారు."

"ఉండవచ్చు."

"వినిపించిన అరుపు ఆయనదేనా?"

"అవును."

"సాయంకోసం పిలిచారని అనుకున్నారు కదూ?"

"అవును, ఆయన చేతులు ఆడించారు."

"ఆయనకూడా ఆశ్చర్యంగా అరిచి ఉండవచ్చు. మీరు అక్కడ కనిపించే సరికి ఆశ్చర్యంతో అరిచి చేతులు ఆడించి ఉండవచ్చు."

"అయి ఉండవచ్చు."

"ఆయనను ఎవరో వెనక్కు లాగారని మీరు అనుకున్నారు"

"ఆయన ఒక్కసారిగా మాయమయ్యారు."

"వెనక్కు గెంతి ఉండవచ్చు, మీకు అక్కడ మరెవరయినా కనిపించారా?"

"లేదు, ఆ వికారి మనిషి అక్కడే ఉన్నానన్నాడు. లాస్కర్ కూడా మెట్ల మొదట్లోనే ఉన్నాడు."

"అవును. ఇక మీభర్త మామూలు దుస్తులు వేసుకుని ఉన్నారని మీరు గమనించారు కదూ?"

"అయితే కాలర్ గానీ, టై గానీ లేవు. ఆయన గొంతు నాకు శుభ్రంగా కనిపించింది."

"ఆయన ఎప్పుడయినా స్వాండామ్ లేన్ గురించి మాట్లాడారా?"

"ఎప్పుడూ లేదు."

"ఆయన ఓపియమ్ తీసుకుంటున్న లక్షణాలేమయినా కని పించాయా?"

"లేదే!"

"థాంక్యూ, మిసెస్ సెయింట్ క్లేర్. ఈ విషయాలను వివరంగా తెలుసుకోవాలని అనుకున్నాను. ఇప్పుడు ఇక కొంచెం ఏదయినా తిని పడుకుంటాను. రేపు జరగవలసింది చాలా ఉంది."

బెడ్‌రూమ్ చాలా పెద్దది. అందులో రెండు మంచాలు ఉన్నాయి. నేను వెంటనే దుప్పట్లోకి దూరిపోయాను. అప్పటికే చాలా అలసి ఉన్నాను మరి. షెర్లక్ హెూమ్స్ పద్ధతి అట్లా ఉండదు. మెదడులో జవాబు దొరకని ఒక విషయం గురించి మధనం జరుగుతూ ఉంటే రోజుల తరబడి, ఒక్కోసారి వారాల పాటు విరామం లేకుండా దొర్లుతూ ఉంటాడు వాస్తవాలను అటూ ఇటూ పేరుస్తూ లోతు తెలిసేదాకా అతను వాటిని తరచి చూస్తూ ఉంటాడు. అతను ఈ రాత్రి నిద్రపోడని, కూర్చునే ఉంటాడని నాకు సులభంగానే అర్థమయింది. కోట్, వెయిస్ట్ కోట్ విప్పేశాడు. పెద్ద నీలిరంగు డ్రెస్సింగ్ గౌన్ వేసుకున్నాడు. గదిలో అటూఇటూ తిరిగి తలగడలను, కుషన్‌లను తెచ్చుకుని ఒక దీవాన్‌లాంటి ఏర్పాటు చేసుకున్నాడు. వాటిమీద చేరబడి పద్మాసనంలో కూచున్నాడు. ముందు పొగాకు కుప్ప, అగ్గిపెట్టె ఉన్నాయి. ఆ మసక వెలుతురులో అతను తన పాత బ్రైయర్ పైప్‌ను వెలిగించుకుని పైకప్పు వేపు చూస్తూ నీలిపొగలను సుడులుగా వదులుతున్నాడని చూడ గలిగాను. నిశ్శబ్దంగా, కదలకుండా కూర్చుని ఉన్న అతని శిల్పంలాంటి ఆకారం, చుట్ట వెలుగులో వింతగా కనపడుతున్నది. అతను అలా కూచుని ఉండగానే నేను నిద్రలోకి జారుకున్నాను. ఒక్క కేకతో నాకు మెలుకువ వచ్చింది. బయటకు చూస్తే వేసవి సూర్యుడు కనిపించాడు. అతని పెదవుల్లో

మాత్రం ఇంకా పైప్ నిలబడే ఉంది. పొగలు పైకి ఎగుస్తూనే ఉన్నాయి. గది నిండా పొగ నిండి ఉంది. తన ముందున్న పొగాకు మాత్రం కనిపించలేదు.

"లేచావా, వాట్సన్?" అడిగాడు అతను.

"అవును"

"ఇంత పొద్దున్నే నాతో వస్తావా?"

"తప్పకుండా."

"అయితే బట్టలు వేసుకో. ఎవరూ మెదలడం లేదు. అయినా గుర్రపుశాల మనిషి ఎక్కడ పడుకుంటాడో నాకు తెలుసు. వెంటనే బయలుదేరవచ్చు."

అతని కళ్లు మెరుస్తున్నాయి. తనలో తానే నవ్వుతున్నాడు. గత రాత్రి ఆలోచనలో మునిగిన మనిషి కానే కాదితను.

దుస్తులు వేసుకుంటూ గడియారం వేపు చూచాను. ఎవరూ మెదలడం లేదంటే ఆశ్చర్యం లేదు. నాలుగు గంటల ఇరవయి అయిదు నిమిషాలయింది. నేను తయారయ్యే లోగానే బండి సిద్ధమవుతున్న దంటూ హెూమ్స్ వచ్చేశాడు.



"ఒక సిద్ధాంతాన్ని పరీక్షించాలి. వాట్సన్, నీవు యూరోప్ లోకెల్లా పెద్ద దద్దమ్మ ముందు

నిలబడి ఉన్నావని నాకు అనిపిస్తుంది. నన్ను నాలుగు తన్నాలి. అయినా సరే, నాకు ఈ వ్యవహారంలోకి మార్గం దొరికింది.”

“ఏమిటి కిటుకు?” నేను నవ్వుతూ అడిగాను.

“కిటుకు బాత్రూమ్‌లో ఉంది. నేను జోక్ చేయడం లేదు.” అతను జవాబిచ్చాడు. “కిటుకుని తీసుకువచ్చాను. ఇదిగో, ఈసంచీలో ఉంది. రా మిత్రమా, ఇది పని చేస్తుందో లేదో చూద్దాం.” అన్నాడతను నా ముఖం మీది అనుమానాన్ని చూస్తూ.

చప్పుడు చేయకుండా మేము మెట్లు దిగాము. నిదానంగా ఉదయపు సూర్యుని వెలుగులోకి వచ్చాము. గుర్రం బండి అక్కడ నిలిచి ఉంది. దుస్తులు సరిగా లేని ఒక కుర్రవాడు అక్కడే వేచి ఉన్నాడు. మేమిద్దరమూ బండిలోకి ఎక్కాము. లండన్ దారి మీద ప్రయాణం మొదలయింది. అక్కడక్కడ కొన్ని పల్లెబండ్లు కూరగాయలతో నగరం వేపు వెళుతున్నాయి. దారి పక్కన ఉన్న భవంతులలో మాత్రం కదలిక లేదు. వాతావరణం కలలో లాగా ఉంది.

“ఒక రకంగా చూస్తే ఇది సాటిలేని కేస్. నేను విషయం చూడలేక పోయాను. ఆలస్యంగా అయినా తెలివి పనిచేస్తే అది చాలుగదా!” అన్నాడతను గుర్రాన్ని అదిలిస్తూ.

నగరంలో అప్పుడప్పుడే నిద్రలేచిన వాళ్లు కిటికీల్లోనుంచి బద్ధకంగా బయటకు చూస్తున్నారు. మేము సర్రే ప్రాంతంగుండా పోతున్నాము. వాటర్‌లూ బ్రిడ్జ్ రోడ్ మీదుగా నది దాటాము. వెల్లింగ్టన్ స్ట్రీట్‌లో సాగి కుడికి మళ్లితే బౌ స్ట్రీట్ వచ్చింది. షెర్లక్ హెూమ్స్, పోలీస్ బలగానికి బాగా తెలిసిన మనిషి. అక్కడ ఇద్దరు కానిస్టేబుల్స్ అతనికి నమస్కారం పెట్టారు. ఒకతను గుర్రాన్ని పట్టుకున్నాడు. మరొకతను మమ్మల్ని పోలీస్ స్టేషన్ లోపలికి తీసుకువెళ్లాడు.

“డ్యూటీలో ఎవరున్నారు?” అడిగాడు హెూమ్స్.

“ఇన్స్‌పెక్టర్ బ్రాడ్‌స్ట్రీట్, సర్”

"ఆహా! బ్రాడ్‌స్ట్రీట్, బాగున్నావా?" ఒక ఎత్తరి స్థూలకాయుడు మాకు ఎదురు వచ్చాడు. ఎత్తయిన టోపీ పెట్టుకుని ఉన్నాడు. జాకెట్ కూడా ఉంది. "బ్రాడ్‌స్ట్రీట్, నీతో కొంచెం మాట్లాడవలసి ఉంది." అన్నాడు హోమ్స్.

"తప్పకుండా, మిస్టర్ హోమ్స్. నా గదిలోకి రండి."

అది ఒక చిన్న ఆఫీస్‌లాంటి గది. టేబుల్ మీద ఒక పెద్ద లెడ్జర్ పెట్టి ఉంది. గోడమీద టెలిఫోన్ ఉంది. ఇన్స్‌పెక్టర్ తన స్థానంలో కూచున్నాడు.

"ఏం చెయ్యమంటారు, మిస్టర్ హోమ్స్?"

"నేను ఆ బికారి, బూన్ గురించి మాట్లాడానుగదా. మిస్టర్ నెవిల్ సెయింట్ క్లేర్ అదృశ్యమయిన కేసు విషయంలో అరెస్ట్ చేసిన మనిషి గురించి."

"అవును, అతడిని పట్టి తెచ్చి విచారణ కోసం రిమాండ్ చేశాము."

"అదే విన్నాను. అతనిప్పుడు ఇక్కడే ఉన్నాడా?"

"సెల్‌లో ఉన్నాడు."

"ప్రశాంతంగా ఉన్నాడా?"

"గొడవేమీ చెయ్యలేదు. కానీ, మహా మురికిమనిషి."

"అదేమిటి?"

"కనీసం చేతులు కూడా కడిగించలేకపోయాము. అతని ముఖం మసి పట్టిన మూకుడులాగ ఉంది. కేస్ సెటిలయితే జైల్లో అతనికి శుభ్రంగా స్నానం పోస్తారు. ఒకసారి చూస్తే, అది ఎంత అవసరమో మీరే ఒప్పు కుంటారు."

"నేను అతడిని చూడాలి."

"నిజమా? అది చాలా సులభం. నాతో రండి. మీసంచి ఇక్కడే పెట్టండి."

"కాదు. అది నాతోనే ఉండాలి."

"సరే, అయితే నాతో రండి మరి." అతని వెంట ఒక నడవలో ముందుకు వెళ్లాము. ఒక చువ్వల ద్వారంలో నుంచి ప్రవేశించి మెట్లు దిగి ఒక కారిడార్‌లోకి వెళ్లాము. అక్కడ గోడలకు సున్నం వేసి ఉంది. అన్ని వేపులా గదులు ఉన్నాయి.

"కుడివేపున మూడవ గది. ఇదిగో, ఇదే!" అన్నాడు ఇన్స్‌పెక్టర్. తలుపులోని పైభాగంలో ఒక చెక్కను అతను పైకెత్తాడు.

"పడుకుని ఉన్నాడు. చూడండి." అన్నాడతను.

మేమిద్దరమూ కటకటాల్లోనుంచి తొంగి చూచాము. బందీ ముఖం మా వేపే ఉంది. అతను గాఢనిద్రలో ఉన్నాడు. ప్రశాంతంగా శ్వాస పీలుస్తున్నాడు. మధ్యరకం దేహంగల ఆ మనిషి దుస్తులు అతని వృత్తికి తగినట్టు మొరటుగా ఉన్నాయి. చిరిగిన కోట్ లోపలినుంచి రంగుచొక్కా కనబడుతున్నది. అతను, ఇన్స్‌పెక్టర్ చెప్పినట్టే చాలా మురికిగా ఉన్నాడు. అంత మురికికూడా ముఖంలోని స్వంత వికార రూపాన్ని దాచలేక పోయింది. ఒక కంటినుంచి గడ్డందాకా పాత గాయంతాలూకు మచ్చ ఒకటి ఉంది. దాని కారణంగా పైపెదవి ఒకవేపు పైకి లాగినట్టు ఉంది. ఆ ఖాళీలో నుంచి మూడు పళ్లు కనబడుతున్నాయి. అతను ఏదో వెక్కిరింతగా చూస్తున్నట్టు ఉందది. తలజుట్టు మరీ ఎర్రగా ఉంది. అదుపు లేకుండా పెరిగి నుదిటి మీదికి, కళ్లమీదికి పడు తున్నది.

"భలేగా ఉన్నాడు కదూ!" అన్నాడు ఇన్స్‌పెక్టర్.

"ఇతనికి నిజంగానే స్నానం అవసరం. నేను కూడా అదే అనుకున్నాను. అందుకు కావలసిన సరం జామా కూడా వెంట తెచ్చాను" అన్నాడు హోమ్స్. మాట్లాడుతూనే చేతిలోని సంచినుంచి, ఆశ్చర్యంగా ఒక పెద్ద బాత్ స్పాంజ్ బయటకు తీశాడు.



"హే.. హే! భలేగా ఉంది" నవ్వుతూ అన్నాడు ఇన్స్‌పెక్టర్.

"ఇక నీవు దయచేసి చప్పుడుకాకుండా ఆ కటకటాల తలుపులు తెరిస్తే మీకొక గౌరవనీయుడయిన పెద్దమనిషిని చూపిస్తాను."

"మీరు చెప్పినట్లే చేస్తాను. ఈ మనిషి ఇక్కడ ఉన్నందుకు మాకు ప్రత్యేకంగా పేరు రావలసింది ఏదీ లేదు." అన్నాడు ఇన్స్‌పెక్టర్. తాళంచెవిని నెమ్మదిగా తీసి తలుపు తీశాడు. మేమంతా నిశ్శబ్దంగా సెల్‌లోకి వెళ్లాము. పడుకున్న మనిషి కొంచెంగా కదిలాడు. సర్దుకుని గాఢనిద్రలో కొనసాగాడు. హోమ్స్ నీళ్లపాత్ర దగ్గరకు వెళ్లాడు. స్పాంజ్‌ని నీటితో బాగా తడిపాడు. దాన్ని తెచ్చి బందీ ముఖంమీద గట్టిగా రెండుసార్లు రుద్దాడు.

"ఇదుగో, ఇతనే మిస్టర్ నెవిల్ సెయింట్ క్లేర్ ఆఫ్ లీ. ఈయనను మీరు ఎరుగుదురా?" అంటూ గట్టిగా అరిచాడతను.

జీవితంలో ఎప్పుడూ అటువంటి దృశ్యం నేను చూడలేదు. స్పాంజ్ రుద్దినందుకు, చెట్టు నుంచి బెరడు ఊడినట్టు ఆ వ్యక్తి ముఖం నుంచి ఒక పొర ఊడివచ్చింది. ఆ రంగు, మురికి లేదు. ముఖంమీద గాటు కూడా లేదు. వంకర పెదవి, దాంతోబాటే కనబడిన ముఖ కవళిక అన్నీ మాయ

మయినయి. ఒక్క ఊపుతో దుబ్బుగా పెరిగిన ఎర్రని జుట్టు ఊడివచ్చింది. మంచంలో ఇప్పుడు పాలిపోయిన దు:ఖపు ముఖంతో నాగరికుడయిన ఒక మనిషి కూచుని ఉన్నాడు. నల్లని జుట్టు, ఆరోగ్యవంతమయిన చర్మంగల ఆ మనిషి కళ్లు నులుముకుంటున్నాడు. జరిగింది ఏమిటో అర్ధంకాక తికమకగా చూస్తున్నాడు. క్షణాల్లో అతనికి విషయం అర్ధమయింది. గట్టిగా అరిచి ముఖాన్ని తలగడలో దాచుకున్నాడు.

"గ్రేట్ హెవెన్స్! కనిపించకుండా పోయిన మనిషి ఇతనే. ఫొటోగ్రాఫ్‌ల్లో చూచాంకదా" అరిచాడు ఇన్స్‌పెక్టర్.

బందీ నిర్లక్ష్యంగా అసలేమీ పట్టనట్టు మా వేపు చూస్తూ "అయితే ఏమిటి? నేను చేసిన నేరం ఏమిటో, ఎందుకు అరెస్ట్ చేశారో చెప్పగలరా?" అన్నాడు.

"మిస్టర్ నెవిల్ సెయింట్ క్లేర్‌ని మాయం.... బాబోయ్, అతను ఆత్మహత్య ప్రయత్నం చేసుకున్నాడని కేసుపెడితే తప్ప ఆ నేరం కూడా మోపడానికి లేదు. 27 సంవత్సరాల నుంచి పోలీస్ ఉద్యోగం చేస్తున్నాను.



ఇటువంటి పరిస్థితి ఎన్నడూ చూచింది లేదు" అన్నాడు ఇన్స్‌పెక్టర్ నవ్వుతూ.

"నేనే నెవిల్ సెయింట్ క్లేర్ అయితే, అసలు ఏ నేరమూ జరగనట్టే. కనుక నన్ను మీరు అన్యాయంగా, చట్టవిరుద్ధంగా అరెస్ట్ చేసి పెట్టినట్టు లెక్క."

"నేరం జరగలేదు. పెద్ద పొరపాటు మాత్రం చేశావు. విషయాన్ని మీ ఆవిడతో పంచుకుని ఉంటే ఆమెకు నమ్మకద్రోహం జరిగి ఉండేది కాదు" అన్నాడు హోమ్స్.

"మా ఆవిడతో ఫరవాలేదు, పిల్లలను మోసం చేశాను" తగ్గు గొంతు తో అన్నాడు బందీ. "భగవంతుడా! నేను వాళ్ల తండ్రినని వాళ్లు చెప్పుకోగలరా? ఎంత భయంకరమయిన పరిస్థితి? నేను ఎందుకు ఇరుక్కున్నాను."

షెర్లక్ హోమ్స్ స్నేహభావంతో అతని పక్కనే కూచుని చెయ్యి భుజం మీద వేశాడు.

"ఈ వ్యవహారాన్ని చట్టం ముందుకు, అంటే కోర్టులోకి తీసుకుపోతే పెద్ద ప్రచారం జరగడం తప్పదు. ఇకపోతే, పోలీసు అధికారులను మీకు వ్యతిరేకంగా కేసు ఏదీలేదని ఒప్పించగలిగితే ఈ వ్యవహారం వార్తా పత్రిక లకయినా ఎందుకు ఎక్కాలో నాకు అర్థం కావడం లేదు. మన ఇన్స్‌పెక్టర్ బ్రాడ్‌స్ట్రీట్, మీరు చెప్పే వివరాలను రాసుకుని పై అధికారులకు పంపిస్తాడు. కేస్ కోర్టుదాకా వెళ్లవలసిన అవసరమే ఉండదు." అన్నాడతను.

"దేవుడు మీకు మేలు చేస్తాడు. నన్ను జీవితాంతం జైల్లో పెట్టినా భరించేవాడిని. ఉరికంభం ఎక్కించినా ఊరుకునే వాడిని. కానీ నా ఈ దరిద్రపు రహస్యాన్ని నా కుటుంబానికి, పిల్లలకు మాత్రం తెలియకుండా ఉండాలి." అతను చాలా బాధగా అన్నాడు.

"నా గతం గురించి మీకు తప్ప మరెవరికి నేను తెలియపరచలేదు. నాన్నగారు ఛెస్టర్‌ఫీల్డ్‌లో స్కూల్ మాస్టర్‌గా ఉండేవారు. అక్కడే నేను కూడా

బాగా చదువుకున్నాను. యువకుడుగా ఉండగా దేశమంతా తిరిగాను, నాటకాలలో పనిచేశాను, చివరకు లండన్‌లో ఒక సాయంకాలం పత్రికకు రిపోర్టర్‌గా చేరాను. ఒకనాడు మా ఎడిటర్ నన్ను నగరంలోని బిచ్చగాళ్ల గురించి వరుసగా వ్యాసాలు రాయమని అడిగాడు. నేను సంతోషంగా ఒప్పు కున్నాను. కథ అంతా అక్కడే మొదలయింది. వ్యాసాలకు తగిన సమాచారం సంపాదించే పేరున నేను కొంతకాలం బిచ్చగాడిగా నటించాను. ముందే రంగస్థలం అనుభవం ఉంది కనుక మేకప్ చేసుకోవడం, డైలాగ్‌లులాంటి కళలు బాగా తెలుసు. అవి ఇప్పుడు నా ప్రయత్నంలో బాగా పనికి వచ్చాయి. నన్ను చూస్తే అందరికీ జాలి కలిగే విధంగా ముఖంమీద కత్తిగాటు, వంకర పెదవి లాంటి లక్షణాలతో సహా ఒక వికారమయిన రూపాన్ని తయారు చేసుకున్నాను. ఎర్రజుట్టు, వేషానికి తగిన దుస్తులు అన్నీ ఏర్పాటు చేసుకుని నగరంలో పనిలోకి దిగాను. అప్పుడు కూడా అగ్గిపెట్టెలు అమ్మేవాడిలాగా నటించాను. ఏడు గంటలపాటు నా వ్యాపారం సాగింది. సాయంత్రం గమనిస్తే, ఆశ్చర్యంగా, నా ఆదాయంగా ఇరవయి ఆరు షిల్లింగ్‌లు, నాలుగు డైమ్స్ గిట్టినట్టు తెలిసింది.

"నేను వ్యాసాలు రాశాను. ఆ తరువాత సంగతిని మరిచేపోయాను. కానీ కొంతకాలానికి ఒక మిత్రుని అప్పు విషయంలో పూచీగా ఉన్నందుకు నాకు ఇరవయి అయిదు పౌండ్లు చెల్లించమని నోటీసు వచ్చింది. అంత డబ్బు ఎక్కడ తేవాలో అర్థం కాలేదు. చటుక్కున ఒక ఆలోచన వచ్చింది. అప్పు ఇచ్చిన వారి దగ్గర రెండు వారాల గడువు అడిగాను. అంతకాలమూ ఆఫీస్‌లో సెలవు అడిగాను. మళ్లీ మారువేషం వేసుకుని నగరంలో బిచ్చ మెత్తుతూ గడిపాను. నాకు కావలసిన సొమ్ము పది రోజుల్లోనే గిట్టింది. అప్పు తీర్చేశాను.

"ఇక, వారానికి రెండు పౌండ్ల ఉద్యోగంలో ఉండడం ఎంత కష్టంగా తోచిందో మీకు అర్థమయ్యే ఉంటుంది. ముఖానికి కొంత రంగు

పులుముకుని, ముందు ఒక టోపీ పడేసి, కదలకుండా కూచుని ఉంటే కావలసినంత డబ్బు వస్తుంది. ఒకటే బాధ. డబ్బు ముఖ్యమా లేక ఆత్మగౌరవమా అన్నది. చివరికి డబ్బు గెలిచింది. ఉద్యోగం వదిలేశాను. నేను మొదట్లో ఎంచుకున్న గోడమూల మీదనే నిత్యమూ కూచో సాగాను. అందరూ దయదలచి డబ్బులు వేస్తున్నారు. నా జేబులు నిండుతున్నాయి. ఒక్క మనిషికి మాత్రం నా రహస్యం తెలుసు. అతనే స్వాండామ్ లేన్‌లోని డెన్ యజమాని. అక్కడికి ప్రతినిత్యం వెళతాను. మురికి బికారి బయటకు వస్తాడు. పని ముగిసిన తరువాత సాయంత్రం అక్కడి నుంచే పెద్దమనిషిగా మారి మంచి దుస్తులతో తిరిగి వెళ్లిపోతాడు. డెన్‌లో లాస్కర్‌కి బాగా డబ్బులు ఇచ్చేవాడిని కనుక నా రహస్యం, రహస్యంగానే ఉండిపోయింది.

"త్వరలోనే నా సంపాదన బాగా సాగుతున్నదని అర్థమయింది. అంటే లండన్‌లోని బిచ్చగాళ్లందరూ సంవత్సరానికి ఏడు వందల పౌండ్లు సంపాదించగలరని నేను అనడం లేదు. నాకు మాత్రం ఎక్కువే గిట్టింది. అందులో నా శక్తియుక్తులకు కూడా ప్రమేయం ఉంది. నేను బాగా సరదాగా మాట్లాడగలను. కనుక నాకు నగరంలోనే మంచి గుర్తింపు వచ్చింది. దినమంతా పెన్నీలు వానగా కురిశాయి. ఒకనాడు రెండు పౌండ్లు గిట్టలేదంటే వ్యాపారం బాగా సాగనట్టు లెక్క.

"ధనవంతుడిని అయ్యాను. ఆశలూ పెరగసాగాయి. నగరం వెలుపల మంచి ఇళ్లు కొన్నాను. పెళ్లి కూడా చేసుకున్నాను. నా పని గురించి మాత్రం ఎవరికీ అనుమానాలు రాలేదు. నాకు నగరంలో ఏదో వ్యాపారం ఉందని మాత్రం నా భార్య అనుకున్నది. వివరాలు ఆమెకు తెలియవు.

"గడచిన సోమవారం నా పని ముగించుకుని ఓపియమ్ డెన్ పైనున్న గదిలో బట్టలు మార్చుకుంటున్నాను. అనుకోకుండా కిటికీలోనుంచి బయటకు చూచాను. ఆశ్చర్యంగా వీధిలో నిలబడి నా భార్య నా వేపే చూస్తూ ఉండడం

కనిపించింది. ఆశ్చర్యంగా ఒక కేక వేశాను. ముఖం మూసుకునే ప్రయత్నంలో చేతులు పైకెత్తాను. నా మిత్రుడు లాస్కర్ దగ్గరకు పరుగెత్తి, ఎవరయినా పైకి రావడానికి ప్రయత్నిస్తే ఆపమని గట్టిగా చెప్పాను. కిందనుంచి మాటలు వినబడుతున్నాయి. ఆమె పైకి రాదని నాకు తెలుసు. నేను వేగంగా బికారి దుస్తులు వేసుకున్నాను. ముఖం తొడుగు, విగ్ కూడా పెట్టుకున్నాను. నా భార్య కూడా గుర్తించలేనంతగా నా రూపం మారిపోయింది. కానీ గది వెతుకుతారని అనుమానం కలిగింది. నా దుస్తులు కనబడితే నేను దొరికిపోతాను. కనుక కిటికీ తెరిచాను. ఆ తొందరలో, ఉదయం కోసుకున్న నా వేలికి మళ్లీ గాయమయింది. నా కోట్ అందుకున్నాను. సంచీలోనుంచి కాయిన్స్ అన్నీ దాని జేబుల్లోకి మార్చాను. కిటికీలోనుంచి బయటకు విసిరాను. అది థేమ్స్ నీటిలో మునిగింది. మిగతా దుస్తులను కూడా బయట పడేసి ఉండేవాడిని. అంతలోనే మెట్లమీద పోలీసులు వస్తున్న చప్పుడు వినిపించింది. వాళ్లు రానే వచ్చారు. నన్ను నెవిల్ సెయింట్ క్లేర్‌గా గుర్తించకపోవడానికి బదులు, అరెస్ట్ చేసి హంతకుడు అన్నారు.

"ఇక నేను చెప్పవలసింది ఏమీ మిగిలిలేదని అనుకుంటున్నాను. నేను నా మారువేషాన్ని వీలయినంత కాలం కొనసాగించాలనే అనుకున్నాను. కనుకనే మురికి రూపాన్ని కొనసాగించాను. నా భార్య ఎదురు చూస్తూ బాధలో గడుపుతుందని నా ఉంగరాన్ని తీసి ఎవరూ చూడకుండా లాస్కర్‌కి అందించాను. భయంలేదంటూ ఒక ఉత్తరం కూడా గిలికి దానితోబాటే పంపించాను."

"ఆ చీటి నిన్ననే మీ ఆవిడకు అందింది" అన్నాడు హోమ్స్.

"భగవంతుడా! అయితే వారంరోజులపాటు తనకు నరకయాతన తప్పలేదన్నమాట!"

"లాస్కర్‌మీద పోలీస్ వాళ్ల నిఘా ఉందికదా. అతను వాళ్లకంట

పడకుండా ఉత్తరం పోస్ట్ చేయడం కుదిరే పనికాదు. అతను దాన్ని మరెవరో సెయిలర్ కస్టమర్‌కు ఇచ్చి ఉంటాడు. ఆ మనిషి విషయం మరిచిపోయి నాలుగునాళ్ల తరువాత చేసి ఉంటాడు" అన్నాడు ఇన్‌స్పెక్టర్ బ్రాడ్‌స్ట్రీట్.

"అదే జరిగింది. ఏమాత్రం అనుమానం లేదు. కానీ నెవిల్, బిచ్చ మెత్తుతున్నందుకు ఎప్పుడూ నిన్ను పోలీసులు పట్టుకోలేదా?" అడిగాడు హెూమ్స్.

"చాలాసార్లు పట్టుకున్నారు. నాలుగు డబ్బులిస్తే నాకు పోయిందేమిటి?"

"కానీ కథ ఇక్కడితో ముగిసిపోవాలి. పోలీసులు ఈ కథను మరిచి పోవాలంటే హ్యూ బూన్ అనే మనిషి మళ్లీ కనపడగూడదు" అన్నాడు బ్రాడ్‌స్ట్రీట్.

"ఈ విషయం గురించి నేను ఎప్పుడో చాలా సీరియస్‌గా నిర్ణయించు కున్నాను."

"అట్లాగయితే ఇక కేసు విషయంలో చేయవలసింది మరేమీ లేదు. కానీ దొంగవేషంలో మళ్లీ కనబడితే మాత్రం, అంతా బయటకు వస్తుంది. మిస్టర్ హెూమ్స్, ఈ కేసును సులభంగా విడదీసినందుకు మేమంతా మీకు రుణపడి ఉంటాము. ఇంతకూ రహస్యాన్ని మీరు ఎట్లా పసిగట్టారో తెలిస్తే బాగుండును."

"అయిదు తలగడలు వేసుకుని కూచుని ఔన్స్ పొగాకుని కాల్చేసి నిర్ణయానికి వచ్చాను. ఇక వాట్సన్, మనం నేరుగా బేకర్‌స్ట్రీట్ వెళితే బ్రేక్‌ఫాస్ట్ తినవచ్చు" అన్నాడు నా మిత్రుడు.





**షెర్లక్ హోమ్స్ గురించి...**

షెర్లక్ హోమ్స్ గురించి అతని మిత్రుడు డా॥ వాట్సన్ గురించి ఇవాళ కొత్తగా చెప్పవలసిన అవసరం లేదు. తనదయిన తీరులో టోపీ, పైప్‌లతో హోమ్స్ పేరు వినగానే అతని రూపం కళ్లముందు మెదులుతుంది. ఆలోచన, చాకచక్యం లాంటి లక్షణాల సాయంతో ఎంతటి చిక్కు సమస్యనయినా హోమ్స్ సులభంగా విడదీస్తాడు.

వంద సంవత్సరాలు గడిచిన తర్వాత కూడా హోమ్స్ పేరు ప్రఖ్యాతలు పెరుగుతున్నాయే తప్ప తరగడం లేదు. నిజంగానే హోమ్స్, వాట్సన్‌లు బేకర్స్ స్ట్రీట్‌లో బ్రతికారని అనుకునే వాళ్లు ఈ ప్రపంచంలో చాలా మంది ఉన్నారు. అందుకే తరతరాలుగా హోమ్స్ నవలలు, కథలను ప్రపంచమంతటా ఇష్టంగా చదువుతున్నారు.

షెర్లక్ హోమ్స్ పాత్రను సృష్టించిన కానన్ డాయ్‌ల్ కన్నా అతని పాత్రలకు ఎక్కువ పేరు వచ్చిందంటే ఆశ్చర్యం లేదు.

**ఈ వరుసలో ..**

- **ఎ స్టడీ ఇన్ స్కార్లెట్,**
- **ద సైన్ ఆఫ్ ఫోర్ (నవలలు)**
- **అడ్వెంచర్స్ ఆఫ్ షెర్లక్ హోమ్స్ (చివరి ఆరు కథలు)**

a **Creative Links Publication, 2016**

₹ **100/-**